
'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 | సంచిక: 78

SUNDAY Special | ఆదివారం 3-12-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కాపాడే కన్నీరు పాడిబారితే..!

కన్ను పొడిబారే సమస్యను వైద్య పరిభాషలో 'కెరటో కంజంక్టివైటిస్ సిక్కా' (డ్రై ఐ) అని చెబుతారు. దీనిపై అవగాహన పెంచుకుని, కంటిని ఎలా కాపాడుకోవాలో తెలియజేసే కథనం.


- వివరాలు 11లో



'గ్రాండ్‌మాస్టర్' వైశాలి రమేశ్‌బాబు

భారత చెస్ క్రీడాకారిణి వైశాలి రమేశ్‌బాబు తన కెరీర్‌లో కీలక మైలురాయిని అందుకుంది. తమిళనాడుకు చెందిన 22 ఏళ్ల వైశాలి శుక్రవారం 'గ్రాండ్‌మాస్టర్' హోదాను అందుకుంది.

- వివరాలు 12లో



ఏ క్షణమైనా కుప్పకూలొచ్చు!

ఇటలీలోని బొలోగ్నాలో ఉన్న గారిసెండా టవర్ నానాటికీ ఓ పక్కకు వాలిపోతోంది. ఇప్పటిదాకా 4 డిగ్రీల కోణంలో ఒరిగింది.


వివరాలు 6లో ▸



మెలోనీ 'మెలోడీ'కి మోదీ ఫిదా

ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ చేసిన 'మెలోడీ'కి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు నెటిజన్లంతా ఫిదా అయ్యారు.

వివరాలు 6లో ▸



'బహిష్కరణ'పై చర్చ జరగాల్సిందే

తృణమూల్ ఎంపీ మొయిత్రాను లోక్‌సభ నుంచి బహిష్కరించాలన్న కమిటీ సిఫార్సులు అఖిలపక్ష భేటీలో వేడిపుట్టించాయి.

వివరాలు 6లో ▸



వాట్సాప్ స్టేటస్‌గా డెడ్‌బాడీ

గర్ల్ ఫ్రెండ్‌ను గొంతు పిసికి చంపేసిన ఓ యువకుడు, ఆమె మృతదేహం ఫొటోను తీసి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నాడు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

అవి అప్పులు కాదు.. డిస్కంలకు ఆస్తులే.!

- విద్యుత్ సంస్థలపై 'ఈనాడు' వక్రరాతలు
- స్థిరాస్తుల కల్పనకు రుణాల సేకరణ సహజమైన విషయం
- ఆస్తుల నుంచి వచ్చే రాబడితో డిస్కంలు అప్పులు తీరుస్తాయి
- 25% మంది వినియోగదారులకే స్మార్ట్ మీటర్ల బిగింపు
- తక్కువ వడ్డీకి కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి రుణం సేకరణ
- వడ్డీ మిగులు రూపంలో రూ.వందల కోట్లు ఆదా

2 లో

కరెంట్ పేరుతో శ్రీశైలం ఖాళీ

వాటా జలాలు, తాగు నీరు అడిగినా తెలంగాణ నుంచి స్పందన లేదు

ఎడమ గట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి ద్వారా సాగర్‌కు జలాల తరలింపు


- మా హక్కుల పరిరక్షణకే ముందుకు కదిలాం
- సాగర్ స్పిల్‌వేలో సగం, హెడ్ రెగ్యులేటర్ స్వాధీనం చేసుకున్నాం
- మా భూభాగంలోని కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్ మా ఆధీనంలోనే కొనసాగుతుంది.. ఏపీ ప్రభుత్వం తరఫున కేంద్రానికి నివేదించిన సీఎస్
- ఇరు రాష్ట్రాల సీఎస్‌లతో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్
- ఓట్ల లెక్కింపు నేపథ్యంలో తెలంగాణ సీఎస్ గైర్హాజరు.. తిరిగి 6న సమావేశం
- 'సాగర్' బాధ్యతను కృష్ణా బోర్డుకు అప్పగించాలని ఏపీకి సూచన
- కుడి కాలువకు 5 టీఎంసీలు విడుదల చేయాలని కృష్ణా బోర్డుకు ప్రతిపాదన పంపినట్లు వెల్లడి
- రేపటిలోగా నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని కృష్ణా బోర్డుకు కేంద్రం ఆదేశం



సాక్షి, అమరావతి: 'కృష్ణా బోర్డు అనుమతి లేకున్నా అక్రమంగా వాటాకు మించి నీటిని వినియోగించి తెలంగాణ రాష్ట్రం విద్యుదుత్పత్తి చేస్తూ.. నాగార్జున సాగర్‌కు తరలిస్తోంది. సాగర్ ఎడమ కాలువ రెగ్యులేటర్‌తోపాటు ఏపీ భూభాగంలో ఉన్న సాగర్ కుడి కాలువ రెగ్యులేటర్‌ను తన అధీనంలో ఉంచుకుంది. ఏపీకి హక్కుగా దక్కాల్సిన వాటా జలాలను దక్కనివ్వకుండా అడ్డుకుంటోంది. గత తొమ్మిదేళ్లుగా ఇదే రీతిలో తెలంగాణ సర్కార్ ఏపీ హక్కులను హరిస్తోంది. దీనిపై కృష్ణా బోర్డుకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం ఉండటం లేదు' అని ఆంధ్రప్రదేశ్ సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. కృష్ణా బోర్డు పరిధి నిర్దేశిస్తూ 2021 జూలై 15న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ అమలుకు ఏపీ ప్రభుత్వం అంగీకరించిందని, ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్‌లను బోర్డుకు అప్పగించడానికి ఒప్పుకున్నామని గుర్తు చేశారు. విభజన చట్టం, కృష్ణా బోర్డు ఆదేశాల మేరకు శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతను కర్నూలు సీఈ.. నాగార్జున సాగర్ నిర్వహణ బాధ్యతను ఆ రాష్ట్ర సీఈ 2014 నుంచి నిర్వహిస్తున్నారని చెప్పారు. శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్కేంద్రం తన భూభాగంలో ఉందని చెబుతూ.. దాన్ని తన అధీనంలోకి తీసుకుని

మిగతా 14వ పేజీలో ▶

ముంచుకొస్తున్న మిచాంగ్



తుపాను గమనాన్ని తెలిపే సైక్లోన్ ట్రాక్

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం

నేడు తుపానుగా బలపడే అవకాశం

- దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ నుంచి అతిభారీ వర్షాలు
- దక్షిణ కోస్తా తీరానికి సమాంతరంగా పయనించనున్న తుపాను
- ప్రస్తుతం నెల్లూరుకు 520, బాపట్ల, మచిలీపట్నానికి 620 కిమీ దూరంలో కేంద్రీకృతం
- బాపట్ల–మచిలీపట్నం మధ్య 5న తీరం దాటే అవకాశం
- అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం
- కోస్తా జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించే ఛాన్స్
- స్టేట్ కంట్రోల్ రూమ్ నుంచి విపత్తుల నిర్వహణ సంస్థ పర్యవేక్షణ
- జిల్లా కలెక్టర్లు, యంత్రాంగాలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు, అవసరమైన చర్యలకు ఆదేశాలు
- నెల్లూరు జిల్లాలో వర్షాలు ప్రారంభం.. కోనసీమలో భారీ గాలులు

- వివరాలు 10లో

న్యూస్‌రీల్

మన్యం నుంచి అంతర్రాష్ట్ర బస్సు సర్వీస్



అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరు నుంచి తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మితో కలిసి శనివారం కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రారంభించారు. ఈ బస్సు ప్రతిరోజు ఉదయం 11.30 గంటలకు పాడేరులో బయలుదేరి రాత్రి 11 గంటలకు భద్రాచలం చేరుకుంటుంది.

వివరాలు 3లో ▸


పని మొదలెట్టిన ఆదిత్య-ఎల్ 1



సూర్యుడిని అధ్యయనం చేసేందుకు రోదసిలోకి దూసుకెళ్లిన ఆదిత్య-ఎల్ 1 తన ప్రయాణంలో మరో మైలురాయిని అందుకుంది. ఈ ఉపగ్రహంలోని ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్ అనే పరికరం తన కార్యకలాపాలను మొదలుపెట్టిందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ప్రకటించింది. ఈ పరికరంలోని 2 విభిన్న భాగాలు తమ పరిశోధనలను విజయవంతంగా కొనసాగిస్తున్నాయని పేర్కొంది.

వివరాలు 6లో ▸

ఇదండీ సంగతి



గ్యారెంటీగా గెలుస్తారని జోస్యం చెప్పాడట!

4 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

నేడే విడుదల

తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌ల్లో ఓట్ల లెక్కింపు

- ఏర్పాట్లన్నీ పూర్తి, కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత
- ఉదయం 8 గంటలకు పోస్టల్ ఓట్ల లెక్కింపు.. 11 గంటలకల్లా ఫలితాల సరళిపై స్పష్టత వచ్చే అవకాశం
- మిజోరంలో ఓట్ల లెక్కింపు, ఫలితాలు రేపు

6 లో



కాంగ్రెస్.. 'మిషన్ తెలంగాణ'

- అనుసరించాల్సిన వ్యూహాలకు పదును
- హైదరాబాద్‌కు డీకే సహా పలువురు కర్ణాటక మంత్రులు



బీఆర్‌ఎస్‌లో ఎడతెగని మథనం!

- ప్రగతిభవన్‌లో కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్, ఇతర కీలక నేతల భేటీ

- వివరాలు 10లో

రాజమహేంద్రవరంలో విద్యా సాధికార ర్యాలీ



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం చేపట్టిన 'విద్యా సాధికారత జగనన్నతోనే సాధ్యం' అనే కార్యక్రమంలో భారీగా విద్యార్థులు పాల్గొన్నారు.

3 లో

స్టార్టప్‌లకు రూ.కోటి ఫండింగ్

- లీప్ ఎహెడ్ పేరిట ఎస్‌టీపీఐ స్టార్టప్ ప్రోత్సాహక కార్యక్రమం
- దరఖాస్తులకు ఈ నెల 10 వరకు అవకాశం
- రాష్ట్రం నుంచి ఇప్పటివరకు 75 దరఖాస్తులు
- వీటిలో ఎంపికైన 15 స్టార్టప్స్‌కు ఆర్థిక సాయం
- ఈ అవకాశాన్ని స్టార్టప్స్ వినియోగించుకోవాలని ఎస్‌టీపీఐ పిలుపు

3 లో



క్లుప్తంగా...

లెజెండ్స్ లీగ్ క్రికెట్ టీ20లో టైగర్స్ విజయం



విశాఖ స్పోర్ట్స్: లెజెండ్స్ లీగ్ క్రికెట్ టీ20లో భాగంగా శనివారం ఇండియా క్యాపిటల్స్, మణిపాల్ టైగర్స్ మధ్య విశాఖలోని వైఎస్సార్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో మణిపాల్ టైగర్స్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన మణిపాల్ టైగర్స్ కెప్టెన్ హర్భజన్ సింగ్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. క్యాపిటల్స్ కెప్టెన్, ఓపెనర్ గౌతమ్ గంభీర్(17) తొలి ఓవర్ చివరి మూడు బంతుల్ని బౌండరీకి తరలించి ధీటుగా ఇన్నింగ్స్ ప్రారంభించాడు. మరో ఓపెనర్ పావెల్ 14పరుగులు చేశాడు. భరత్ చిప్లి 65 పరుగులతో అజేయంగా నిలవగా బెన్ డంక్ 33, అష్లే 26 పరుగులతో సహకరించారు. దీంతో ఇండియా క్యాపిటల్స్ తొమ్మిది వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. పంకజ్, ప్రవీణ్, ఇమ్రాన్ రెండేసి వికెట్లు తీసుకున్నారు. ప్రతిగా టైగర్స్ జట్టు తరపున గ్రాండ్‌హోమీ (58) హాఫ్ సెంచరీ నమోదు చేయగా, వాల్టన్ (23 పరుగులు) అమిత్(48) పరుగులతో సహకరించారు. చివరి మూడు ఓవర్లలో 33పరుగులు చేయాల్సిన స్థితిలో పెరీరా చెలరేగి ఆడాడు.

బీఎల్‌వోలపై మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ ఒత్తిడి

ఊళ్లో లేనివారి ఓట్ల తొలగింపుపై ఆగ్రహం



దుగ్గిరాల పోలింగ్ కేంద్రంలో బీఎల్‌వోలను ఒత్తిడి చేస్తున్న నిమ్మగడ్డ రమేష్, టీడీపీ కార్యకర్తలు

తాడేపల్లిరూరల్ : మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ టీడీపీ కార్యకర్తలతో కలిసి దుగ్గిరాల గ్రామ పరిధిలోని ఓటు నమోదు కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి బీఎల్‌వోలపై ఆయన మండిపడ్డారు. దుగ్గిరాల గ్రామంలోని 253వ పోలింగ్ కేంద్రం పరిధిలో గ్రామంలో లేని వారి ఓట్లు తొలగించారు. కొందరు మూడేళ్ల నుంచి గ్రామంలో నివాసం ఉండటం లేదు. దీంతో స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు బీఎల్‌వోలు ఆ ఓట్లు తొలగించారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన రమేష్.. వారు ఓటు హక్కు ఇక్కడే వినియోగించుకుంటారు, వారి గ్యాస్ కనెక్షన్ అన్నీ ఇక్కడే ఉన్నాయి, వారి ఓటు ఇక్కడే ఉండాలంటూ బీఎల్‌వోలపై ఒత్తిడి తెచ్చారు.

జనం లేక 'యువగళం' బహిరంగ సభ రద్దు



లోకేశ్ పాదయాత్రలో అరకొర జనం

పిఠాపురం: టీడీపీ నేత లోకేశ్ యువగళం పాదయాత్ర శనివారం కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోకి ప్రవేశించింది. శుక్రవారం రాత్రి తిమ్మాపురంలో ఆగిన పాదయాత్ర శనివారం ఉదయం పిఠాపురం నియోజకవర్గంలో చిత్రాడలో ప్రారంభమయ్యింది. సాయంత్రం పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో బహిరంగ సభ ఉన్నట్లు టీడీపీ ప్రచారం చేసింది. కానీ చివరి నిమిషంలో సభను అర్ధాంతరంగా రద్దు చేసింది. లోకేశ్ గొంతు బాగోలేనందున సభ రద్దు చేసినట్లుగా ప్రకటించింది. పిఠాపురంలో జనం లేరన్న ముందస్తు సమాచారంతో సభను రద్దు చేసినట్లుగా టీడీపీ నేతలే చెప్పుకుంటున్నారు. సాయంత్రం పిఠాపురంలో ప్రారంభమైన పాదయాత్ర రాత్రికి కొత్తపల్లిలో ముగిసింది. లోకేశ్ పాదయాత్రకు మాజీ ఎమ్మెల్యే టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో స్వాగత ఏర్పాట్లు చేశారు. మిత్రపక్షంగా చెప్పుకుంటున్న జనసేన నేతలు వేరుగా పిఠాపురంలో స్వాగతం పలికారు. పిఠాపురంలో జనసేన ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను, వర్మను కలిపి చూపిస్తూ అభివాదం చేసి ఏమీ మాట్లాడకుండానే లోకేశ్ వెళ్లిపోయారు.

ఓట్ల కోసం టీడీపీ కుట్ర రాజకీయం!

నిజాంపేట(హైదరాబాద్): ఏపీలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచే సత్తా లేకపోవడంతో టీడీపీ నాయకులు కుట్ర రాజకీయాలకు తెరలేపారు. మొన్నటివరకు ఏపీలో పెద్ద ఎత్తున దొంగ ఓట్లు నమోదయ్యాయంటూ అనవసర రాద్ధాంతం చేసిన ఆ పార్టీ నేతలు ప్రస్తుతం తెలంగాణలోని ఓటర్లను ఏపీలో చేర్పించి లబ్ధి పొందేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 30న ముగియడంతో ఆ ఓటర్లను ఏపీలో ఓటర్లుగా చేర్పించేందుకు కుటిల ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం శనివారం నిజాంపేటలోని ఓ పాఠశాలలో ఏకంగా కౌంటర్ ఏర్పాటు చేశారు. 'ఏపీ కొత్త ఓటర్ల రిజిస్ట్రేషన్, ఓటర్ వెరిఫికేషన్ డ్రైవ్' అంటూ బ్యానర్ సైతం కట్టారు. తమ పార్టీకి అనుకూలంగా ఉండే వారందరినీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరుతున్నారు. ఈ కుట్రకు మణికొండలో ఉన్న ఓ కుల సంఘం భవనం వేదికగా ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..



శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండల కేంద్రంలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



చిత్తూరు జిల్లా కుప్పం మండలం గరిగచీనేపల్లిలో అభివృద్ధి పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ భరత్, నాయకులు



పశ్చిమగోదావరి జిల్లా తిరుపతిపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అవి అప్పులు కాదు.. డిస్కంలకు ఆస్తులే.!

విద్యుత్ సంస్థలపై ఈనాడు వక్రరాతలు

- స్థిరాస్తుల కల్పనకు రుణాల సేకరణ సహజమైన విషయం
- ఆస్తుల నుంచి వచ్చే రాబడితో డిస్కంలు అప్పులు తీరుస్తాయి
- 25 శాతం మంది వినియోగదారులకు మాత్రమే స్మార్ట్ మీటర్ల బిగింపు
- తక్కువ వడ్డీకి కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి రుణం సేకరణ
- వడ్డీ మిగులు రూపంలో రూ. వందల కోట్లు ఆదా



సాక్షి, అమరావతి: ఎవరైనా స్థిరాస్తులు ఏర్పరుచుకునే సమయంలో రుణం తీసుకోవడం సహజం. అలాగే ఆస్తుల కల్పనకు విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు కూడా తీసుకుంటాయి. వాటితో విద్యుత్ సరఫరా సాఫీగా జరగడానికి సబ్ స్టేషన్లు, కార్యాలయ భవనాలు, స్థలాలు, విద్యుత్ లైన్లు వంటి స్థిరాస్తులు ఏర్పరుచుకుంటాయి. ఆ తర్వాత బిల్లుల ద్వారా ఆదాయాన్ని ఆర్జించి అప్పులు తీరుస్తాయి. అలాగే విద్యుత్ కొనుగోలు కోసం బ్యాంకుల వద్ద కన్నా తక్కువ వడ్డీకి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంస్థల నుంచి రుణం సేకరించి ఉత్పత్తి సంస్థలకు చెల్లిస్తుంటాయి. దీనివల్ల వడ్డీ మిగులు రూపంలో రూ. వందల కోట్లు ఆదా అవుతుంటే.. ఏమాత్రం అవగాహన లేకుండా 'కరెంటోళ్ల నెత్తిన అప్పుల కుప్ప' శీర్షికన ఈనాడు మంగళవారం ఓ కట్టుకథను అచ్చేసింది. దీనిపై నిజాలను ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మాజనార్దనరెడ్డి, కె.సంతోషరావు 'సాక్షి'కి వివరించారు.

రుణాల ద్వారా ఆస్తుల సృష్టి

అభివృద్ధి పనులు, వ్యవస్థ బలోపేతం కోసం చేసే పనుల ప్రాజెక్టుల వ్యయంలో దాదాపు 80 శాతం నుంచి ఒక్కోసారి 100 శాతం వరకూ ఆర్థిక సంస్థల నుంచి విద్యుత్‌రంగ సంస్థలు రుణాలు తీసుకుంటాయి. కొత్త ఆస్తుల సృష్టి రుణాల ద్వారానే సాధ్యమవుతుంది. వాటి ద్వారా వచ్చే రాబడితో అప్పులు కూడా తీరతాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) కూడా ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలకు బహుళ వార్షిక విద్యుత్ టారిఫ్ నిబంధనలు నిర్దేశిస్తుంది. డిస్కంలు ఏటా అవసరాలకు అనుగుణంగా సబ్ స్టేషన్లు, లైన్లు నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు చేపడతాయి. వీటికి కావలసిన ఆర్థిక అవసరాలలో ఎక్కువ భాగం రుణాల ద్వారా సేకరిస్తాయి. ఖర్చులను నిబంధనల ప్రకారం టారిఫ్ నుంచి రాబట్టుకోవడానికి కమిషన్ అనుమతి తీసుకుంటాయి.

పెట్టుబడిలో 40 శాతం రాయితీ

కేంద్ర ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రతిపాదిత పంపిణీ వ్యవస్థ పునరుద్ధీకరణ పథకం (ఆర్‌డీఎస్ఎస్)లో భాగంగా వినియోగదారులకు స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియ జరుగుతోంది. ఇప్పుడు ఉన్న దాదాపు 1.80 కోట్ల మంది (వ్యవసాయేతర) వినియోగదారులలో నెలకు 200 యూనిట్ల వరకు వినియోగించే వారిని మినహాయించి మిగిలిన వారికి స్మార్ట్ మీటర్లు బిగించాలని ప్రతిపాదించడం జరిగింది. ఇది కేవలం 25 శాతం మంది వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుంది. దీనివల్ల సమయానుసార (టైం ఆఫ్ డే) టారిఫ్ విధానంలో పాల్గొనే అవకాశం వస్తుంది. విద్యుత్ కొనుగోలు ధరలు తక్కువగా ఉండే ఆఫ్ పీక్ సమయంలో వారి వినియోగాన్ని పెంచుకుని టారిఫ్ లాభం పొందే అవకాశం ఉంది. విద్యుత్ మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం అధిక విద్యుత్ వాడే వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల బిగింపు తప్పనిసరి. ఈ మీటర్ల పెట్టుబడిలో దాదాపు 40 శాతం వరకూ రాయితీ లభిస్తుంది. ఈ ఆర్‌డీఎస్ఎస్ పథకంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఒక భాగం మాత్రమే.

వడ్డీ మిగులు

ఈ సంవత్సరం పెరిగిన రుణాలలో ఎక్కువ భాగం విద్యుత్ ఉత్పత్తి సంస్థల బకాయిలు తీర్చడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఆలస్య చెల్లింపుల సర్‌చార్జీ నిబంధనల ప్రకారం పంపిణీ సంస్థలు చెల్లించాయి. బ్యాంకుల వద్ద కన్నా తక్కువ వడ్డీకి, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలలో ఉన్న ఆలస్య చెల్లింపు సర్ చార్జీకన్నా చాలా తక్కువ వడ్డీ రేటుకు, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంస్థల నుంచి రుణం సేకరించి ఉత్పత్తి సంస్థలకు డిస్కంలు చెల్లించాయి. దీనివల్ల వడ్డీ మిగులు రూపంలో రూ. వందల కోట్లు మిగిల్చాయి. వాస్తవాలు ఇలా ఉంటే ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఈనాడు వక్రరాతలు రాయడం విడ్డూరంగా ఉంది.

రైతుకు డిమాండ్ చేసే హక్కు

ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం వినియోగంలో వ్యవసాయ రంగానికి 18 శాతం నుంచి 20 శాతం అవుతోంది. కచ్చితత్వంతో ఈ విద్యుత్‌ను లెక్కించలేకపోవడం వల్ల రాష్ట్రంలో ఇంధన ఆడిట్ కష్టం అవుతోంది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ కఠిన నిబంధనల ప్రకారం వ్యవసాయ వినియోగదారులకు కూడా మీటర్లు బిగించాలి. వ్యవసాయ రంగంలో ఉచిత విద్యుత్ పథకం ద్వారా అయ్యే కరెంట్ వినియోగం తెలుసుకోవడానికి, ఉచిత విద్యుత్ లబ్ధిదారులకు నగదు బదిలీ లెక్కకు వ్యవసాయ కనెక్షన్లకు బిగించే స్మార్ట్ మీటర్లు ఉపయోగపడతాయి. దీనికయ్యే ఖర్చు మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. ప్రతి నెల వ్యవసాయ విద్యుత్ వినియోగదారుడు కూడా బిల్లు చెల్లించే వెసులుబాటు ఉండడంతో రైతులకు నాణ్యమైన, అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా కోసం డిస్కంలను డిమాండ్ చేసే హక్కు లభిస్తుంది.

జనసేన పతనం ఆనాడే మొదలైంది

- టీడీపీతో కలిసి పనిచేయాలన్న పవన్ ప్రకటనతోనే జనసేన పతనం మొదలు
- పవన్‌కు దూరమైన జనసేన కేడర్
- బాబు కోసమే అయితే పార్టీ ఎందుకు పెట్టావ్ పవన్?
- సీఎం జగన్ సంస్కరణలకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోంది
- సీఎం జగన్‌పై, వైఎస్సార్‌సీపీపై చేసిన వ్యాఖ్యలకు పవన్ సిగ్గుపడాలి
- జగన్ పేరెత్తే అర్హత పవన్‌కు లేదు
- మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్



సాక్షి, అమరావతి: పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని టీడీపీతో కలిసి పనిచేయాలని చెప్పిన నాడే జనసేన పార్టీ పతనం మొదలైందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ చెప్పారు. పవన్‌కు జనసేన కేడర్ కూడా దూరమయ్యారని తెలిపారు. ఆయన శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబుకు అధికారాన్ని కట్టబెట్టేందుకే పవన్ పని చేసేటట్లయితే, జనసేన పార్టీ పెట్టుకోవడం ఎందుకని నిలదీశారు. చంద్రబాబు సొంత సామాజికవర్గం బలోపేతానికే పని చేయాలని పవన్ భావిస్తే జనసేన పేరిట ఒక మెజార్టీ సామాజికవర్గ బలాన్ని కూడగట్టాలనుకోవడం ఎందుకని అన్నారు. ఇప్పుడున్న పార్టీలకంటే భిన్నమైన భావజాలంతో జనసేన పని చేస్తుందనే మాటతో పార్టీ పెట్టిన పవన్.. ఆ మాటకు న్యాయం చేస్తున్నారా అనేది ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణల్లో సీఎం వైఎస్ జగన్ ఆలోచనా విధానానికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోందని చెప్పారు. సీఎం జగన్ నాడు-నేడు పేరిట ప్రభుత్వ విద్య, వైద్యంలో విప్లవాత్మక మార్పులు తేవడం, హార్బర్లు, పోర్టుల నిర్మాణం, ఐటీ కంపెనీలతో పాటు భారీ పరిశ్రమలను తేవడం, పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వాన్ని ఇంటి గడపలోకి తేవడం అందరూ అంగీకరించాల్సిన సుభిక్షమైన పరిపాలన అని తెలిపారు. ఇంత పెద్ద స్థాయిలో సంస్కరణలు చేపట్టిన ముఖ్యమంత్రి జగన్ పార్టీకి భావజాలం లేదని వ్యాఖ్యానించినందుకు పవన్ సిగ్గుపడాలని చెప్పారు. పవన్ ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో మార్పులను అవగతం చేసుకుని వైఎస్సార్‌సీపీపైన, సీఎం జగన్ పైన చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని చెప్పారు.

రాజకీయాలపై అవగాహన లేకే..

సీఎం వైఎస్ జగన్ పేరును ఉచ్చరించే అర్హత పవన్‌కు లేదని, ఆయన ముఖ్యమంత్రి అవుతారా లేదా అనేది చెప్పడానికి పవన్ ఎవరని నిలదీశారు. జనసేనలా వైఎస్సార్‌సీపీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకోదని, ఎన్నికల్లో సింగిల్‌గానే పోరాడి విజయం సాధిస్తుందని స్పష్టంచేశారు. వైఎస్ఆర్ పాలనకు కొనసాగింపే వైఎస్ఆర్‌సీపీ పాలనని, అలాంటి పార్టీ భావజాలంపై పవన్ వ్యాఖ్యలు చేయటమేమిటని అన్నారు. రాజకీయాలపై అవగాహన లేనివారు ఇలాగే మాట్లాడతారని. రాజమండ్రి సెంట్రల్ జైలుకెళ్లి చంద్రబాబును కలిసి టీడీపీకి సపోర్టు చేస్తానని ఏకపక్ష నిర్ణయం తీసుకోరని అన్నారు. అందుకే పవన్ జనసేన కోర్ కమిటీతో పాటు కేడర్ మద్దతును కూడా కోల్పోయారని తెలిపారు. పవన్ నిర్ణయాలకి భిన్నంగా ఆయన పార్టీ వ్యవస్థ ఉందని, ఇన్నాళ్లు కిందిస్థాయిలో మద్దతిచ్చిన వారంతా దూరమయ్యారనే ఆందోళన పవన్‌లో స్పష్టంగా కనపడుతోందని ఆయన వ్యాఖ్యలే చెబుతున్నాయన్నారు.

రాజకీయాల్ని బంధుత్వంతో ముడిపెట్టడమా?

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఒక జాతీయ పార్టీ నేత హోదాలోనే మాట్లాడాలి గానీ, చిల్లర మాటలు కాదని అన్నారు. ఆమె కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు చంద్రబాబుపై చేసిన విమర్శలను ప్రజలు మరిచిపోలేదని చెప్పారు. రాజకీయాల్ని బంధుత్వంతో ముడిపెట్టి, చంద్రబాబు కోసం సీఎం జగన్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు పురందేశ్వరి పూనుకోవడం దారుణమైన తప్పు అని అన్నారు. ఇప్పటికైనా ఆమె వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించేటప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. అవినీతికి పాల్పడి ఆధారాలతో అడ్డంగా దొరికి జైలుపాలైన చంద్రబాబు.. వైద్యం పేరుతో బెయిలు పొంది కూడా తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సపోర్టు చేశారనేది అందరికీ తెలిసిన విషయమన్నారు. ఇలాంటి కుట్ర రాజకీయాలు బాబుకు అలవాటేనని చెప్పారు.

తింగరోడు.. తిరునాళ్ళకు వెళ్ళినట్టు

- లోకేశ్ పాదయాత్రపై మాజీ మంత్రి కన్నబాబు వ్యాఖ్య
- సంస్కారం లేని మనిషి లోకేశ్
- ఎవడో రాసిచ్చిన రాతలతో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడు
- అవినీతిపై ఏ శాఖపైనైనా చర్చకు రావాలని లోకేశ్‌కు సవాల్



కాకినాడ రూరల్: తింగరోడు.. తిరునాళ్లకు వెళ్ళినట్టుగా నారా లోకేశ్ పాదయాత్రకు వచ్చాడు, వెళ్లిపోయాడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు వ్యాఖ్యానించారు. ఆయన శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అతనే జనాలను తీసుకువచ్చి, అతనే జెండాలు తెచ్చుకుని, అతనే తిట్టేసి, శాపనార్థాలు పెట్టుకుంటూ పోయాడని అన్నారు. లోకేశ్ యాత్ర పరమార్థమేమిటో, ఎందుకు వచ్చాడో ఎవరికీ తెలియదన్నారు. తండ్రిని జైలులో వేశాక 89 రోజులు పారిపోయి ఢిల్లీలో కూర్చుని, మళ్ళీ ఇప్పుడు వచ్చి సీఎం జగన్‌కు భయమేమిటో పరిచయం చేస్తానంటున్నాడని, ఇంతకన్నా కామెడీ ఉంటుందా అని ఎద్దేవా చేశారు. మనిషన్న వాడికి సంస్కారం, మానవత్వం ఉండాలని, లోకేశ్‌కు ఈ రెండూ లేవని అన్నారు. ఎవడో రాసిచ్చిన రాతలను పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడన్నారు. చంద్రబాబు కొడుకు అనే అర్హతే తప్ప అతనిలో లీడర్ లక్షణాలే లేవని, బుర్ర పెరగలేదని ఎద్దేవా చేశారు. 2014–19 మధ్య చంద్రబాబు సీఎంగా ఉండగా హెరిటేజ్ మజ్జిగ, అనకాపల్లి బెల్లం మొదలుకుని, అమరావతి భూముల వరకు అడ్డగోలుగా తిని, పోలవరం ప్రాజెక్ట్‌ను ఏటీఎంగా మార్చేశారని, ఇప్పుడు ఎమ్మెల్యేలు అవినీతిపరులు అన్నట్టు బిల్డప్ ఇస్తూ తిరుగుతున్నాడన్నారు. ఒరేగిరే.. సైకో అంటే అతన్ని తాము ఏమనాలని అన్నారు. సైకో అనే సర్టిఫికెట్ లోకేశ్‌కు పిల్లనిచ్చిన మామకు ఉందన్నారు. ఆడుదాం .. ఆంధ్రాకు పేరు పెడతావా అని నిలదీశారు. అమ్మ ఒడి సొమ్ములు రూ.15 వేలు సీఎం జగన్ వేస్తే.. డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారని చెప్పిన వ్యక్తి ఇప్పుడు తల్లికి వందనమని ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ వేస్తారంట అని అన్నారు. పేదలకు ఇళ్ళ పట్టాల భూములు కేంద్ర ప్రభుత్వం, దళితుల అసైన్డ్ భూములు, ఏపీఐఐసీ నుంచి కొంటే నాపైనే ఆరోపణలు చేస్తావా అని నిలదీశారు. ఏ శాఖపైనైనా అవినీతిపై చర్చకు సిద్ధమని లోకేశ్‌కు సవాల్ విసిరారు. కాకినాడ రూరల్‌లో శిల్పారామం నుంచి బీచ్ అభివృద్ధి చేశానన్నారు. ఎత్తిపోతల పథకాలు మేమే చేశామని, రూ.98 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు పనులు చేపడుతున్నామని తెలిపారు. తాను 18 ఏళ్ళు జర్నలిస్టుగా పని చేసి ఎన్నో పరిశోధనాత్మక వార్తలు రాశానని, ఏలేరు కుంభకోణంపై తాను రాసిన వార్తలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మీ తండ్రిని 6 గంటల పాటు కూర్చోపెట్టినప్పుడు కవర్ చేసిన జర్నలిస్టునని అన్నారు. విలువలతో వచ్చిన తనపై అవినీతి ముద్ర వేయాలని చూస్తే జనాలు నమ్మరని కన్నబాబు చెప్పారు.

లోకేశ్.. నీవా సీఎం జగన్‌ని విమర్శించేది?

- నువ్వెంత?.. నీ బతుకెంత?
- వార్డు మెంబర్‌గా కూడా గెలవలేవు
- సీఎం జగన్‌కు 151 మంది ఎమ్మెల్యేలు, 30 మంది ఎంపీలున్నారు
- సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్
- ఆయన గురించి నువ్వా మాట్లాడేది?
- ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే బుద్ధి చెబుతాం
- లోకేశ్‌పై ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు ధ్వజం



సాక్షి, అమరావతి: 'వేస్ట్ ఫెలో నారా లోకేశ్.. నువ్వెంత, నీ బతుకెంత? నీవా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విమర్శలు చేసేది' అంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు మండిపడ్డారు. ఆయన శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్‌ని విమర్శించే ముందు లోకేశ్ స్థాయి ఏమిటో తెలుసుకోవాలన్నారు. 'విదేశాల్లో మద్యం సేవిస్తూ, అమ్మాయిలతో తిరిగిన నువ్వా మాట్లాడేది? ఎవరో డబ్బులు కడితే చదువుకున్న దద్దమ్మవి. కార్పొరేటర్‌గా, కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని నువ్వు 151 మంది ఎమ్మెల్యేలు, 30 మంది ఎంపీలతో దమ్మూ ధైర్యంతో సుపరిపాలన అందిస్తున్న నాయకుడు వైఎస్ జగన్ గురించి మాట్లాడటమేమిటి?' అంటూ మండిపడ్డారు. 'కండకావరంతో బలిసి కొట్టుకుంటున్న నిన్ను ఇంట్లో భరించలేక చంద్రబాబు రోడ్ల మీదకు వదిలేశారు. నీవల్ల పార్టీకి ఏ ఉపయోగం లేదని, ఒక్క ఓటు రాకపోగా, పార్టీని నాశనం చేస్తున్నావని మీ పార్టీ కార్యకర్తలే తిడుతున్నారు తెలుసుకో' అని అన్నారు. అచ్చోసిన ఆంబోతులా తిరుగుతూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే బుద్ధి చెబుతామని హెచ్చరించారు. 'మరో అచ్చోసిన ఆంబోతు అచ్చెన్న పార్టీ లేదు, బొక్కా లేదంటే ఈ రోజు వరకు చర్య తీసుకోలేని అసమర్థ పార్టీ మీది. నువ్వు మా గురించి మాట్లాడతావా?' అంటూ ధ్వజమెత్తారు. 'మీది దండుపాళ్యం ముఠా. మాజీ మంత్రి దేవినేని ఉమా పోలవరం ప్రాజెక్టు డబ్బు దోచుకున్న దొంగ. ఇసుక దొంగ చింతమనేని ప్రభాకర్. మహిళా ఆఫీసర్లను కొట్టారు. రింగ్ రోడ్డు స్కాం మీదే, స్కిల్ స్కాం మీదే, ఫైబర్ నెట్ స్కాం మీదే. స్కామ్ వీరులు మీరు., దొంగలే వచ్చి దొంగ.. దొంగ.. అని అరిచి ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు' అని అన్నారు.

దేని మీదనైనా చర్చిద్దాం రండి

'ఏ అంశం మీదనైనా మేం చర్చకు సిద్ధం. కానీ బుద్ధికి పనిపెట్టాల్సిన లోకేష్ నోటికి పనిపెడుతున్నారు. అది నోరా? మున్సిపాలిటీ చెత్తబుట్టా? లోకేశ్ నోటిని ఎన్ని ఫినాయిల్ బాటిళ్లతో కడిగినా శుద్ధి కాదని పదే పదే ఆయనే నిరూపించుకుంటున్నారు. అసలు టీడీపీ హయాంలో ఏం చేశారని, మీ దగ్గర ఏముంది చెప్పుకోవడానికి? లోకేశ్ అన్నట్లే వ్యవసాయ రంగం మీదే చర్చిద్దాం. గంట కాదు.. రోజంతా మాట్లాడదాం. 2014–2019 వరకు టీడీపీ హయాంలో వ్యవసాయానికి బాబు ఏం వెలగపెట్టారో, సీఎం జగన్ హయాంలో వ్యవసాయానికి మేం ఎన్ని మేళ్ళు చేశామో చర్చిద్దాం' అని సవాల్ విసిరారు.

టిక్కెట్లు అమ్ముకోవడానికే..

లోకేశ్, ప్యాకేజీ స్టార్ పవన్ టికెట్లు అమ్ముకోవడానికే రాష్ట్రంలో అలజడి సృష్టిస్తున్నారు. కులాల్ని, ప్రాంతాల్ని, వ్యక్తుల్ని, రెచ్చగొట్టి ఏదో రకంగా అధికారంలోకి రావాలనే ఆరాటం వీరిది. అధికార ఆరాటం టీడీపీదైతే.. ప్రజా పోరాటం వైఎస్సార్‌సీపీది. వెన్నుపోటు వీరుడు, స్కిల్ దొంగ చంద్రబాబు. కాబట్టే కోర్టు రిమాండ్ విధించి, జైల్లో పెట్టింది. బాబును జైల్లో పెట్టాల్సిన పైశాచిక ఆనందం మాకు లేదు. మా పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులందరం సీఎం జగన్ అడుగుజాడల్లో నిజాయితీగా, ప్రజలకు సుపరిపాలన అందించడం కోసం క్షణం తీరిక లేకుండా గడపగడపకు, సురక్ష, ఆరోగ్య సురక్ష, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలతో పూర్తిగా ప్రజల మధ్య ఉన్నాము. బాబులా ఏసీ రూముల్లో, జైల్లో లేము. లోకేశ్‌లా ఢిల్లీలో దాక్కోలేదు' అని చెప్పారు.

వైఎస్సార్‌సీపీకి మరో చాన్స్ ఇవ్వకూడదనే...

- టీడీపీతో పొత్తు పెట్టుకున్నాం
- అవినీతి విషయంలో మనిషి ఆలోచన మారింది
- మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్ కళ్యాణ్



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీకి మరో ఛాన్స్ ఇవ్వకూడదనే బలమైన సంకల్పంతోనే టీడీపీతో పొత్తు పెట్టుకున్నామని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆయన శనివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. అవినీతి విషయంలో సగటు మనిషి ఆలోచన మారిపోయిందని పవన్ అన్నారు. జగన్ దోపిడీ మీద కేంద్ర పెద్దలకు ఫిర్యాదు చేద్దామంటే వారికి ఈ విషయం తెలీదా అనే సందేహం కలుగుతుందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో ఎన్నికల్లో నిలబడటానికి డబ్బు లేని పరిస్థితి నుంచి అధికారం వచ్చిన తరువాత సాక్షి లాంటి పత్రికలు నడిపే స్థాయికి వచ్చారంటే ఏం జరిగిందో అర్థమవుతుందన్నారు. తాను బీసీలు, ఎస్సీల గురించి ఆలోచించే సమయంలో జగన్ బెంగళూరు అవినీతి లెక్కల్లో ఉండేవాడన్నారు. 2009లో ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబడతామని ప్రజలకు మాట ఇచ్చామని, దాన్ని నిలబెట్టుకోలేకపోయామనే బాధ చాలా కాలం వెంటాడిందని అన్నారు. 2009 రాజకీయ ప్రస్థానంలో ఆ తప్పు చేయకుంటే ఈ రోజు స్వతంత్రంగా అధికారంలోకి వచ్చేవాళ్లమని చెప్పారు. 2004 నుంచే తాను దళిత, బీసీ సంఘాల నాయకులతో ఎన్నో విషయాలపై చర్చించానని అన్నారు. 2014లో ప్రతికూల పరిస్థితుల్లో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించానన్నారు. రాష్ట్ర విభజన సమయం, ఎలాంటి పొలిటికల్ స్పేస్ లేని సమయంలో వచ్చామన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో తన గొంతును బలంగా వినిపించలేకపోవడానికి అప్పటి పరిస్థితులే కారణమని అన్నారు. వామపక్ష భావజాలంతో సనాతన ధర్మానికి తగిన గౌరవం ఇచ్చేలా కలగలిపిన భావజాలంతో ముందుకు వెళ్లాలన్నదే తన తాపత్రయమన్నారు.

వెలంపల్లి శ్రీనివాస్‌పై దుష్ప్రచారం తగదు

ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్



ఒంగోలు : దేవదాయ శాఖ మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌పై ఇష్టం వచ్చినట్లు దుర్మార్గంగా టీడీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ పాలనలో ఆర్యవైశ్యులకు పెద్దపీట లభించిందని, టీడీపీ తమ మనోభావాలతో ఆడుకుందన్నారు. కోలగట్ల వీరభద్రస్వామికి ఎమ్మెల్సీతో పాటు డిప్యూటీ స్పీకర్ పదవిని ఇచ్చారని, టీటీడీ పాలకవర్గంలో మూడు సార్లు ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. కానీ చంద్రబాబు మాత్రం సీఎంగా చెప్పుకోదగ్గ ఒక్క మంచి పనీ చేయలేకపోయారని దుయ్యబట్టారు. వాసవీ అమ్మవారి ఆలయాల ఆస్తులను దేవదాయ శాఖ పరం కాకుండా వాటిని ఆర్యవైశ్యులే నిర్వహించుకునేలా వైఎస్సార్ చర్యలు చేపడితే, ఆయన తనయుడు వైఎస్ జగన్ నేడు పొట్టి శ్రీరాములు త్యాగానికి గుర్తుగా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నవంబర్ 1న నిర్వహించడం గర్వించదగ్గ అంశమన్నారు. వెలంపల్లి ఆర్యవైశ్యులకు మంచి పనులు చేశారని, దీనిపై ప్రతిపక్ష నాయకులు ఎవరైనా అమ్మవారి ఆలయానికి వస్తే ప్రమాణం చేసేందుకు తాము సిద్ధమని కుప్పం ప్రసాద్ స్పష్టం చేశారు.

సీఎం జగన్ చొరవతో ఉపాధి అవకాశాలు

- ఎంపీ మిథున్‌రెడ్డి



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

రాయచోటి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తూ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని లోక్‌సభ ప్యానల్ స్పీకర్, రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. నిరుద్యోగ యువత చిన్న ఉద్యోగమైనా నిరాశ చెందకుండా చేరి అంచెలంచెలుగా ఎదగాలన్నారు. మెగా జాబ్‌మేళాకు 120 కంపెనీల ప్రతినిధులు రాగా.. సుమారు 6వేల మంది మేళాకు హాజరయ్యారు. 1,880 మందికి అక్కడికక్కడే నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మేళాకు జిల్లా కలెక్టర్ గిరీశా పీఎస్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ బాషా, నైపుణ్యాభివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్ హరిప్రసాద్, జిల్లా అధికారి హరికృష్ణ, మునిసిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా హాజరయ్యారు.

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఇది మా సొంతిల్లు



వర్షాకాలం వస్తుందంటే చాలు.. ఇంటిల్లిపాదీ భయంతో వణికిపోయేవాళ్లం. ఎలా తలదాచుకోవాలని ఒకటే బెంగ. చిన్న ఇంటిలో 20 మంది ఉంటున్నామంటే మాటలు కాదు. పిల్లలు నరకయాతన అనుభవించేవారు. ఆ నాలుగు నెలలూ దిక్కుతోచేది కాదు. ఇంట్లో ఏదైనా శుభకార్యం నిర్వహించాలన్నా భయమే.. వచ్చే బంధువులను ఎక్కడ కూర్చోబెట్టాలని. 20 ఏళ్లుగా ఇల్లు కట్టుకోవాలని మా అన్నదమ్ములం చేయని ప్రయత్నం లేదు. కానీ సెంటు భూమి కూడా కొనలేకపోయాము. ఆ దిగులుతో మా తల్లిదండ్రులు అనారోగ్యం పాలయ్యారు. చిన్న ఇల్లు కావడం వల్ల నలుగురిలో మేము పలచబడిపోయాం. సొంతంగా ఇల్లు కట్టుకునే స్థోమత లేక అనేక నిద్రలేని రాత్రుళ్లు గడిపేవాళ్లం. ప్రకాశం జిల్లా పొదిలి మండలం మాదాలవారిపాలెంలో ఉండే మాకు సెంటు జాగా కూడా లేదు. నేను ఆటో డ్రైవర్‌ను. నా భార్య రమణ రోజువారి కూలీ. మాకు ఇద్దరు సంతానం. మొదటి నుంచి మాది ఉమ్మడి కుటుంబం. మా నలుగురు అన్నదమ్ముల భార్యా, పిల్లలు, మా అమ్మ, నాన్న అందరం కలిసి 20 మందిమి ఒకే ఇంట్లో ఉండేవాళ్లం. చిన్న ఇల్లు కావడం వల్ల ఇరుకుతో ఇబ్బందులకు గురయ్యేవాళ్లం. ఈ నేపథ్యంలో జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత నాకు, మా అన్నదమ్ములకు ఇంటి స్థలంతోపాటు పక్కా ఇళ్లు మంజూరయ్యాయి. ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలతో పాటు మేము కూడబెట్టుకున్న పైసాపైసా డబ్బు కలుపుకొని ఆ స్థలంలో నేను ఇల్లు కట్టుకున్నాను. మా ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి స్వయంగా వచ్చి మా ఇల్లు ప్రారంభించారు. ఇప్పుడు సొంతింట్లో కుటుంబంతో హాయిగా ఉంటున్నాము. సీఎం జగన్ పుణ్యమా అని నా సొంతింటి కల తీరింది.

– కామునూరి తిరుపతిరావు, మాదాలవారిపాలెం (మోరా శ్రీనివాసరెడ్డి, విలేకరి, పొదిలి రూరల్)

పింఛన్ నడుచుకుంటూ ఇంటికొస్తోంది..



నాకు పాత కాలం నాటి చిన్న ఇల్లు తప్ప ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. వివాహం కూడా కాలేదు. నా అనేవారు ఎవరూ లేరు. అంగవైకల్యానికి తోడు పక్షవాతం వచ్చింది. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం బండపల్లెలో ఉంటున్నాను. ఇదివరకు నాకు వికలాంగుల పింఛన్ కింద రూ.3 వేలు వచ్చేది. వైఎస్ జగన్ సీఎం అయ్యాక పెరాలసిస్ బాధితుడి కింద రూ.5 వేలకు పెరిగింది. నేను అడగకపోయినా 3 వేల నుంచి ఒకేసారి 5 వేలకు పెంచారు. అదీ ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. నాలా నడవలేని వారికి ఇదొక వరం. ఈ మనసున్న సీఎం ఉన్నంత వరకు మాలాంటోళ్లకు భయం లేదు. ఒంటరిగా జీవిస్తున్న నాకు ఈ పింఛనే జీవనాధారం. ఇంటి నుంచి బయటకు వెళ్లలేను. ఇరుగుపొరుగు వారి సాయంతో వంట సరుకులు తెప్పించుకుంటాను. పాక్కుంటూ వెళ్లి ఎలాగోలా వంట చేసుకుంటాను. పెరిగిన పింఛనే లేకుంటే నా జీవితం ఏమయ్యేదో.. అడగంది అమ్మైనా అన్నం పెట్టదంటారు.. ఈ ప్రభుత్వం అడగకుండానే మాలాంటోళ్లకు మేలు చేస్తోంది.

– తలారి కదిరప్ప, బండపల్లె (సిద్దల కోదండరామిరెడ్డి, విలేకరి, కురబలకోట)

నా పొలం సస్యశ్యామలం



మాది పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం మరుపెంట గ్రామం. మాకు కొద్దిపాటి సాగు భూమి ఉంది. దాంట్లో వ్యవసాయం చేసేందుకు సాగునీటికి ఇబ్బందిగా ఉండేది. మా పొలానికి గతంలో తోటపల్లి రెగ్యులేటర్ ద్వారా సాగునీరు అందేది. నాగావళి నదీ పరీవాహక ప్రాంతంలో వర్షాలు బాగా కురిస్తేనే మా పంటలకు సాగునీరు అందేది. నీటి నిల్వ చేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో పంట సాగు దైవాధీనంగా మారింది. సాగుకోసం చేసిన అప్పు తీర్చలేక సతమతం అయ్యేవాళ్లం. ఆ సమయంలో నాకున్న ఇద్దరు మగపిల్లల చదువు కూడా కష్టతరంగా మారింది. కానీ వైఎస్సార్ తోటపల్లి ప్రాజెక్టును నిర్మించి ఇబ్బంది లేకుండా చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక కాలువలు నిర్మించి ఆ నీటిని పొలాలకు అందిస్తోంది. ఫలితంగా నీరు పుష్కలంగా పంట పొలాలకు అందుతోంది. ఈ ప్రభుత్వం ప్రాజెక్టు ఆధునికీకరణ పనులకు అధిక ప్రాధాన్యమిస్తుండడంతో సాగునీటి కష్టాలు గట్టెక్కుతున్నాయి. ఇప్పుడు మా ప్రాంతమంతా సస్యశ్యామలం అవుతోంది. ఖరీఫ్‌లో వరి, రబీలో ఆరుతడి పంటలు, అపరాలు వేసుకుంటూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకున్నాం.

– గంట శంకరరావు, మరుపెంట (దత్తి మహందాత నాయుడు, విలేకరి, పార్వతీపురం)

స్టార్టప్‌లకు రూ. కోటి ఫండింగ్

లీప్ ఎహెడ్ పేరిట ఎస్‌టీపీఐ స్టార్టప్ ప్రోత్సాహక కార్యక్రమం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో యువతను నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) "లీప్ ఎహెడ్" పేరిట ప్రత్యేక పథకాన్ని చేపట్టింది. ఈ పథకం ద్వారా ప్రారంభ దశలో (స్కేలింగ్) ఉన్న స్టార్టప్‌లతో పాటు గ్రోత్ స్టేజ్, ప్రోడక్ట్ డైవర్సిఫికేషన్, కొత్త ప్రాంతాలకు విస్తరించే ప్రణాళికలో ఉన్న స్టార్టప్‌లకు కోటి రూపాయల వరకు నిధులు సమకూర్చనుంది. ఈ పథకం కింద ఎంపికైన స్టార్టప్‌లకు మూడు నెలల పాటు హైబ్రీడ్ మోడల్‌లో శిక్షణ ఇచ్చి మెంటారింగ్ చేస్తూ మార్కెటింగ్, ఫండ్ రైజింగ్ వంటి అవకాశాలను కల్పిస్తుంది. ఇందు కోసం డిసెంబర్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌టీపీఐ కోరింది. ఇప్పటివరకు రాష్ట్రం నుంచి 75 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 15 స్టార్టప్‌లను ఎంపిక చేసి ఆర్థిక సాయం అందిస్తారు.

ఎన్‌జీఐఎస్ కింద 95 స్టార్టప్స్ నమోదు

స్టార్టప్‌లను ప్రోత్సహించే నెక్ట్స్ జనరేషన్ ఇంక్యుబేషన్ స్కీం (ఎన్‌జీఐఎస్) కింద రాష్ట్రంలో 95 స్టార్టప్‌లు నమోదు చేసుకున్నట్లు వినయ్‌కుమార్ తెలిపారు. ఇందులో 28 స్టార్టప్స్‌కు రూ.25 లక్షల చొప్పున సీడ్ ఫండింగ్ అందించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్టార్టప్స్‌కు ప్రోత్సాహం అందిస్తుండటంతో పలు కాలేజీల్లో ఇంక్యుబేషన్ సెంటర్లలో యువత స్టార్టప్స్‌పై ప్రయోగాలు చేస్తున్నారన్నారు. విశాఖలో నాలుగో తరం సాంకేతిక పరిజ్ఞానం పెంచేలా ఏర్పాటు చేసిన కల్పతరువు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ, ఆంధ్రా విశ్వవిద్యాలయంలో నాస్కామ్ ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలు స్టార్టప్స్‌కు మంచి వేదికలుగా మారాయని ఆయన వివరించారు.

6న విజయవాడలో ఔట్‌రీచ్ కార్యక్రమం

లీప్ ఎహెడ్ కార్యక్రమంపై విద్యార్థులు, ఔత్సాహిక స్టార్టప్స్‌కు అవగాహన కల్పించడానికి ఈ నెల 6న విజయవాడలో ఔట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్‌టీపీఐ విజయవాడ జాయింట్ డైరెక్టర్ బి.వినయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్లు ఉన్న పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో కూడా సదస్సులు నిర్వహిస్తామన్నారు.

ప్రభుత్వ బడులకు అంతర్జాతీయ నైపుణ్యాలు

భవిష్యత్‌లో విద్యార్థులు ప్రపంచ స్థాయి అవకాశాలను అందుకునేలా తీర్చిదిద్దనున్న ప్రభుత్వం

- పాఠశాలల్లో రూ.2,400 కోట్లతో డిజిటల్ వసతులు
- 6 నుంచి ఇంటర్ విద్యార్థులకు టెక్నాలజీపై ప్రాథమిక పాఠాలు
- ఏఐ, ఐవోటీ, డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, గేమింగ్ సహా వివిధ సబ్జెక్టుల్లో బోధన
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి 6,200 హైస్కూళ్లలో అమలు
- ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇంజనీరింగ్ నిపుణులతో తర్ఫీదు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు భవిష్యత్తులో ప్రపంచ స్థాయిలో అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్ర ప్రభుత్వం వారిని తీర్చిదిద్దనుంది. ఈ నేపథ్యంలో ఆరో తరగతి నుంచే వివిధ టెక్ పాఠాలను బోధించనుంది. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను భవిష్యత్ టెక్ నిపుణులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. వచ్చే ఏడాది (2024–25) నుంచి మొత్తం 6,200 హైస్కూళ్లలో ఫ్యూచర్ స్కిల్స్‌ను అందించనుంది. ఇంటర్నెట్ ఆఫ్ థింకింగ్స్ (ఐవోటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), బ్లాక్‌చైన్ టెక్నాలజీ, వర్చువల్ రియాలిటీ (వీఆర్)– ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), మెటావర్స్/ వెబ్ 3.0, 3డీ మోడలింగ్ అండ్ ప్రింటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా/డేటా అనలిస్ట్, రోబోటిక్స్, గేమింగ్ వంటి విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. రాబోయే కాలంలో ఈ కోర్సులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉండడంతో స్కూల్ స్థాయిలోనే వీటిపై పూర్తి అవగాహన కల్పించనున్నారు. ప్రస్తుతం విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సైన్స్, సోషల్, మ్యాథ్స్ (6) సబ్జెక్టులను చదువుతుండగా, ఇకపై ఏడో సబ్జెక్టుగా టెక్ పాఠాలు చదువుతారు. వచ్చే ఏడాది ఆరు, 9 తరగతి విద్యార్థులకు టెక్ పాఠాలను బోధించనున్నారు. 2025–26లో 7, 10 తరగతులకు, 2026–27లో ఎనిమిది, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్‌పై శిక్షణ అందించనున్నారు. ఇలా 2028 నాటికి మొత్తం ఆరు నుంచి +2 వరకు ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నారు.

డిజిటల్ వసతుల కోసం రూ.2,400 కోట్ల ఖర్చు..

ఇప్పటికే పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీలు), స్మార్ట్ టీవీలు, ట్యాబ్స్, ఇంగ్లిష్–మ్యాథ్స్ – పాల్ – కంప్యూటర్ ల్యాబ్స్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ లెర్నింగ్ కోసమే దాదాపు రూ.2,400 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇకపై టెక్ అంశాల్లో విద్యార్థుల ఆలోచన శక్తిని పెంపొందించడంతోపాటు విజ్ఞానంలో ముందుండేలా శిక్షణనివ్వనున్నారు. నాస్కామ్, జేఎన్‌టీయూ నిపుణులు, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఏపీఎస్‌ఈఆర్‌టీ), స్వతంత్ర నిపుణులు రూపొందించిన ఫ్యూచర్ స్కిల్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దీంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఈ కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకురావడానికి అధికారులు సిద్ధమయ్యారు.

ఏడో సబ్జెక్టుగా టెక్ పాఠాలు..

6,200 ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు టెక్నాలజీ నైపుణ్యాలను నేర్పించేందుకు కంప్యూటర్ సైన్స్ లేదా ఎలక్ట్రానిక్స్‌లో ఎంటెక్/ఎంసీఏ/బీటెక్ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. తమ ప్రాజెక్టులో భాగంగా వీరు ఫ్యూచర్ స్కిల్స్ ఫెసిలిటేటర్స్‌గా ప్రభుత్వ పాఠశాలల్లో సేవలు అందిస్తారు. విద్యార్థులకు టెక్ పాఠాలు బోధించే ఉపాధ్యాయులకు వీరు 'టెక్నాలజీ లీడ్' శిక్షణ ఇస్తారు. ఏటా డిసెంబర్/ఏప్రిల్ నెలల్లో విద్యార్థులకు ప్రత్యేకంగా ఇండక్షన్ శిక్షణ ఇస్తారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో డిసెంబర్ 15 నాటికి ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తరగతిని బట్టి టెక్ కరిక్యులమ్..

విద్యార్థులకు అనువుగా ఎంపిక చేసిన అంశాలకు ప్రత్యేక కరిక్యులమ్‌ను సైతం రూపొందించారు. 6–8 తరగతులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కాన్సెప్ట్స్, అల్గారిథమ్, డేటా ఎనాలసిస్, ఏఐ ఎథిక్స్ అండ్ సోషల్ ఇంపాక్ట్స్, మ్యాథ్స్ అండ్ స్టాటిస్టిక్స్ అంశాల్లో ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పిస్తారు.

▲ 9–10 తరగతులకు 'ఏఐ' టెక్నాలజీ, మెషీన్ లెర్నింగ్‌పై ప్రాథమిక అవగాహన, అప్లికేషన్స్, అల్గారిథమ్ అండ్ డేటా ఎనాలసిస్, ఆర్టిఫిషియల్ ఎథిక్స్, సోషల్ ఇంపాక్ట్, మ్యాథ్స్ అండ్ స్టాటిస్టిక్స్‌ను నేర్పిస్తారు.

▲ 11–12 తరగతుల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అడ్వాన్స్‌డ్ అంశాలను బోధిస్తారు.

ఈ అంశాల్లో అన్ని పాఠశాలల్లోనూ ఒకేసారి ఒకే పాఠాన్ని బోధించనున్నారు. దీనివల్ల విద్యార్థులు ఒక స్కూలు నుంచి మరో స్కూలుకు మారినా టెక్ అంశాల బోధనలో మార్పు ఉండదు. దీంతో విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడడంతో పాటు అంతర్జాతీయ అవకాశాలను అందుకునే నైపుణ్యాలు నేర్చుకుంటారు.

సిలబస్ సిద్ధం చేస్తున్నాం..

ఎంపిక చేసిన 10 మాడ్యూల్స్ బోధనకు సిలబస్‌ను సిద్ధం చేస్తున్నాం. డిసెంబర్ నాటికి అన్ని స్కూళ్లకు ఐఎఫ్‌పీలు నూరు శాతం అందుబాటులోకి వస్తాయి. ఫ్యూచర్ స్కిల్స్ ఫెసిలిటేటర్స్ నియామకానికి అనుమతి లభించింది. వచ్చే నెల రోజుల్లో వీరి నియామకం పూర్తవుతుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 6,200 హైస్కూళ్లలో ఫ్యూచర్ స్కిల్స్‌పై బోధన ప్రారంభమవుతుంది.

– కాటమనేని భాస్కర్, కమిషనర్, పాఠశాల విద్యాశాఖ మౌలిక వసతులు

టెలీమెడిసిన్ సేవల్లో ఏపీనే టాప్

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 18.3 కోట్ల కన్సల్టేషన్లు

- అందులో 25%.. అంటే 4.6 కోట్ల కన్సల్టేషన్లు ఏపీ నుంచే
- రాష్ట్రం నుంచి రోజుకు సగటున 70 వేల కన్సల్టేషన్లు
- 27 హబ్‌ల ద్వారా ప్రజలకు టెలీ మెడిసిన్ సేవలు అందిస్తున్న ప్రభుత్వం



సాక్షి, అమరావతి: ప్రజలకు వ్యయప్రయాసలు లేకుండా ఇంటికి చేరువలోనే వైద్య సేవల కల్పనలో సీఎం జగన్ ప్రభుత్వం సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం.. వైద్య, ఆరోగ్య శాఖలో పలు సంస్కరణలు తెచ్చింది. పీహెచ్‌సీల నుంచి జిల్లా ప్రధాన ఆస్పత్రులు, బోధనాస్పత్రుల వరకు అన్ని ఆస్పత్రులను అధునాతనంగా తీర్చి దిద్దుతోంది. ప్రజలకు అత్యంత అధునాతన వైద్యాన్ని అందుబాటులోకి తెస్తోంది. దీంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్యులనే గ్రామాలకు పంపి, ప్రజల ముంగిటకే వైద్య సేవలను తీసుకెళ్లింది. టెలీమెడిసిన్‌లోనూ అధునాతన వైద్యాన్ని ప్రజలకు అందించడంలోనూ ఏపీ అగ్రస్థానంలో ఉంది. ఈ–సంజీవని టెలిమెడిసిన్ సేవలను 2019 నవంబర్‌లో దేశవ్యాప్తంగా ప్రారంభించారు. ఈ విధానంలో ప్రజలకు స్పెషలిస్టు వైద్యుల ద్వారా అత్యంత వేగంగా, సమర్థవంతమైన సేవలు అందించడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో రాష్ట్రం తొలి స్థానంలో నిలుస్తోంది. ఏపీ స్థానాన్ని మరే రాష్ట్రం అధిగమించలేకపోతోంది.

నాలుగో వంతు ఏపీ నుంచే

2019 నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 18.3 కోట్ల టెలికన్సల్టేషన్లు నమోదు కాగా, వీటిలో 25 శాతం ఒక్క ఏపీ నుంచే ఉన్నాయి. ఏపీ 4,61,01,963 కన్సల్టేషన్లు నమోదయ్యాయి. 2.60 కోట్లతో పశ్చిమ బెంగాల్ రెండో స్థానంలో ఉంది. మన రాష్ట్రం నుంచి సగటున రోజుకు 70 వేల కన్సల్టేషన్లు నమోదవుతున్నాయి. ఇలా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ 1.64 కోట్ల కన్సల్టేషన్లు నమోదయ్యాయి.

మూడు రకాల స్పెషలిస్ట్ వైద్యులు

రాష్ట్రంలో టెలిమెడిసిన్ సేవలు అందించడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం 26 జిల్లాల్లోని వైద్య కళాశాలలు, జిల్లా ఆస్పత్రుల్లో 27 హబ్‌లను చేసింది. ఈ హబ్‌లకు పీహెచ్‌సీలు, వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను అనుసంధానం చేసింది. ప్రతి హబ్‌లో ఇద్దరు జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పీడియాట్రిక్స్ స్పెషలిస్ట్ వైద్యులతో పాటు, ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు సేవలందిస్తున్నారు. పీహెచ్‌సీ, విలేజ్ క్లినిక్‌కు వచ్చిన రోగులకు స్పెషాలిటీ వైద్యుల సేవలు అవసరమున్న సందర్భాల్లో టెలీమెడిసిన్ ద్వారా హబ్‌లోని వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు చికిత్స చేస్తున్నారు. హబ్‌లోని వైద్యులు ఆడియో, వీడియో కాల్ రూపంలో రోగులతో మాట్లాడి వారికి సలహాలు, సూచనలు తెలియజేయడంతో పాటు మందులు సూచిస్తారు. ఆ మందులను పీహెచ్‌సీ, విలేజ్ క్లినిక్‌లోని వైద్య సిబ్బంది రోగులకు అందజేస్తున్నారు.

మన్యం నుంచి అంతర్రాష్ట్ర బస్సు సర్వీస్

పాడేరు– భద్రాచలం బస్సు సర్వీస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): జిల్లా కేంద్రమైన పాడేరు నుంచి తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మితో కలిసి శనివారం కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం 11.30 గంటలకు బస్సు పాడేరులో బయలుదేరి 12.40 గంటలకు అరకు చేరుకుంటుంది. అక్కడి నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి పాడేరు, చింతపల్లి, సీలేరు, డొంకరాయి, చింతూరు, కూనవరం, నెల్లిపాక మీదుగా రాత్రి 11 గంటలకు భద్రాచలం చేరుకుంటుందని డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. అదే బస్సు మరుసటి రోజు ఉదయం 7 గంటలకు భద్రాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బయలుదేరి మధ్యాహ్నం 3.45 గంటలకు పాడేరుకు చేరుకుంటుందనివివరించారు.

రాజమహేంద్రవరంలో విద్యా సాధికార ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ : రాష్ట్రంలో సంపూర్ణ విద్యా సాధికారత జగనన్నతోనే సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. రాజమహేంద్రవరంలో వైఎస్సార్‌సీపీ ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థి సంఘం రీజనల్ కోఆర్డినేటర్ నీలిఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం సుమారు 12 వేల మంది విద్యార్థులతో చేపట్టిన 'విద్యా సాధికారత జగనన్నతోనే సాధ్యం' అనే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జక్కంపూడి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అనేక సంక్షేమ పథకాల ద్వారా విద్యా వ్యవస్థను పటిష్ట పరిచేందుకు అమ్మఒడి లాంటి పథకాలను తీసుకొచ్చి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత జగనన్నదేనన్నారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జేఎన్‌రోడ్ రామాలయం సెంటర్ వరకూ నిర్వహించిన ర్యాలీలో రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు పొన్న గంటి చైతన్య, తూర్పుగోదావరి జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షుడు చంద్రబాబు, కోనసీమ జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షుడు శిరీష్, కాకినాడ జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షుడు అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాయామం.. క్యాన్సర్ దూరం



యుక్త వయసులో వ్యాయామం, శారీరక శ్రమతో ఆరోగ్యకర జీవనం

- అత్యధిక కార్డియోస్పిరేటరీ ఫిట్‌నెస్‌తో క్యాన్సర్ల ప్రమాదం తగ్గుదల
- 9 రకాల క్యాన్సర్ల ముప్పు 40 శాతం నియంత్రణ
- బ్రిటిష్ జర్నల్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్‌లో ప్రచురించిన ఓ కొత్త అధ్యయనంలో వెల్లడి
- వారానికి 150-300 నిమిషాల వ్యాయామాన్ని సిఫారసు చేస్తున్న అమెరికన్ క్యాన్సర్ సొసైటీ

సాక్షి, అమరావతి : యుక్త వయసులో నిత్య వ్యాయామం.. శారీరక శ్రమ ద్వారా ఆరోగ్యకర జీవన శైలిని అలవర్చుకుంటే క్యాన్సర్ల ముప్పు తగ్గుతుంది. దినచర్యలో భాగంగా రన్నింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్, మెట్లు ఎక్కడం, ఏరోబిక్స్ వ్యాయామం చేసే వ్యక్తుల్లో కార్డియోస్పిరేటరీ (గుండె, ఊపిరితిత్తుల ఆరోగ్యం) ఫిట్‌నెస్ సామర్థ్యం పెరుగుతుంది. ఫలితంగా ఆరోగ్యవంతమైన కార్డియోస్పిరేటరీ వ్యవస్థ కలిగిన వారిలో 9 రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం దాదాపు 40 శాతం నిరోధించవచ్చని పరిశోధకులు గుర్తించారు. బ్రిటిష్ జర్నల్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్‌లో ప్రచురించిన ఓ కొత్త అధ్యయనంలో ఫిట్‌నెస్ స్థాయిలు అనేక జీవనశైలి మార్పులకు మంచి సూచికలని, నిర్దిష్ట క్యాన్సర్ల నుంచి మరింత రక్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

వారానికి 150-300 నిమిషాల వ్యాయామం

దీర్ఘకాలిక అధ్యయనంలో భాగంగా పరిశోధకులు 10 లక్షల మంది పురుషుల ఆరోగ్య డేటాను విశ్లేషించారు. ఇందులో అత్యల్ప కార్డియోస్పిరేటరీ ఫిట్‌నెస్ ఉన్న వ్యక్తులతో పోలిస్తే అధిక ఫిట్‌నెస్ స్థాయిలు కలిగిన వ్యక్తుల్లో తల, మెదడు (19 శాతం), కడుపు (21శాతం), పాంక్రియాస్ (12 శాతం), కాలేయం (40 శాతం), పేగు (18 శాతం), రెక్టల్ (5 శాతం), అన్నవాహిక (39 శాతం), మూత్రపిండాలు (20 శాతం), ఊపిరితిత్తుల(42 శాతం) క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుందని ధ్రువీకరించారు. ఫిట్‌నెస్, క్యాన్సర్ల మధ్య సంబంధాన్ని జీర్ణాశయ క్యాన్సర్ల విషయంలో స్పష్టంగా తెలుసుకోవచ్చని సూచిస్తున్నారు. ఇందులో భాగంగానే అమెరికన్ క్యాన్సర్ సొసైటీ ప్రతి వారం పెద్దలకు 150–300 నిమిషాల వ్యాయామాన్ని సిఫారసు చేస్తోంది.

మరో రెండు రకాల క్యాన్సర్ల పెరుగుదల

అధిక కార్డియోస్పిరేటరీ ఫిట్‌నెస్ కలిగిన వ్యక్తుల్లో ఆశ్చర్యకరంగా చర్మ (31శాతం), ప్రోస్టేట్ (7శాతం) క్యాన్సర్లు వచ్చే ప్రమాదాన్ని పెంచుతోంది. దీనికి అధ్యయనంలో పరిశోధకులు కచ్చితమైన సమాధానాలు ఇవ్వలేదు. శారీరకంగా మరింత దృఢంగా ఉన్న వ్యక్తులు ఎండలో ఎక్కువ సమయం గడపడంతో చర్మ క్యాన్సర్లు వస్తున్నట్టు భావిస్తున్నారు. ఊబకాయులుగా ఉండటంతో పాటు మద్యపానం, ధూమపానం, మాదకద్రవ్యాల వినియోగించే వ్యక్తుల్లో తక్కువ కార్డియోస్పిరేటరీ ఫిట్‌నెస్‌కు ఒక కారణంగా చెబుతున్నారు. ఇక్కడ తల్లిదండ్రుల విద్యార్హతలు కూడా యుక్త వయసులో వ్యక్తుల ప్రవర్తన, జీవన శైలిని ప్రభావితం చేస్తున్నట్టు గుర్తించారు. చిన్నారులు, యుక్తవయస్కులు టీవీలు, వీడియో గేమ్స్, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ రోజూ గంటపాటు మైదానాల్లో ఆటల్లో తీవ్రంగా శ్రమించాలని అధ్యయనం సూచిస్తోంది.

తగ్గిన నిరుద్యోగం

2020-21లో 4.2 శాతం నుంచి 2022-23లో 3.2 శాతానికి తగ్గుదల

- ప్రాథమిక విద్య అభ్యసించినవారిలో తక్కువ
- ఉన్నత విద్యావంతుల్లోనే ఎక్కువ.. అయితే గత మూడేళ్లలో తక్కువే
- 2020-21లో సెకండరీ, ఉన్నత విద్యలో నిరుద్యోగిత రేటు 9.1 శాతం
- 2022-23లో 7.3 శాతానికి పరిమితం
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: గత మూడేళ్లలో దేశంలో నిరుద్యోగిత రేటు తగ్గిపోయిందని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక స్పష్టం చేసింది. ప్రాథమిక విద్య అభ్యసించినవారిలో నిరుద్యోగిత రేటు తక్కువగా ఉందని వెల్లడించింది. ఉన్నత చదువుల చదివిన వారిలో ఎక్కువగా ఉందని వెల్లడించింది. అయినప్పటికీ గత మూడేళ్లలో ఉన్నత విద్యనభ్యసించిన వారిలోనూ నిరుద్యోగిత రేటు తగ్గిందని నివేదిక విశ్లేషించింది. దేశంలో అసలు చదువుకోని వారిలో నిరుద్యోగిత రేటు చాలా తక్కువగా ఉండగా ఈ రేటు గత మూడేళ్లలో మరింత తగ్గిందని పేర్కొంది. అలాగే మధ్యస్థంగా చదువుకున్న వారిలోనూ తగ్గుముఖం పట్టిందని స్పష్టం చేసింది. తక్కువ చదివిన వారిలో కంటే సెకండరీ విద్య, ఆ పై చదివిన వారిలో నిరుద్యోగిత రేటు ఎక్కువగా ఉందని వెల్లడించింది. అయితే వీరిలో కూడా గత మూడేళ్లుగా తగ్గిందని తెలిపింది. దేశం మొత్తం మీద 2020–21లో నిరుద్యోగిత రేటు 4.2 శాతం ఉండగా 2021–22లో 4.1 శాతానికి తగ్గిపోయిందని పేర్కొంది. ఇక 2022–23లో 3.2 శాతానికి తగ్గిందని వెల్లడించింది. వివిధ కేంద్ర పథకాల కింద స్వయం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య పెరుగుతోందని నివేదిక స్పష్టం చేసింది. తద్వారా నిరుద్యోగిత తగ్గుతోందని వివరించింది.

15 ఏళ్లు పైబడిన వారిలో చదువుల వారీగా నిరుద్యోగిత రేటు..

కేటగిరీ	2020-21	2021-22	2022-23
నిరక్షరాస్యులు	0.4 శాతం	0.4 శాతం	0.2 శాతం
ప్రాథమిక విద్య	1.4 శాతం	1.0 శాతం	0.5 శాతం
మధ్యస్థ చదువు	2.5 శాతం	2.6 శాతం	1.7 శాతం
సెకండరీ అంతకంటే ఎక్కువ విద్య	9.1 శాతం	8.6 శాతం	7.3 శాతం





మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, **తిథి:** బ.షష్ఠి సా.6.23 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** ఆశ్లేష రా.9.24 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ఉ.9.08 నుండి 10.52 వరకు, **దుర్ముహూర్తం:** ప.3.56 నుండి 4.44 వరకు, **అమృతఘడియలు:** రా.7.38 నుండి 9.23 వరకు.

సూర్యోదయం : 6.18
సూర్యాస్తమయం : 5.20
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

రాహుల్ గాంధీ (కాంగ్రెస్ ఎంపీ)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

కౌంటింగ్ మొదలైంది.

ముందే తెలిసిపోయిన ఎన్నికల ఫలితాల కోసం టీవీ ముందు కూర్చోవడంలో మజా ఏం ఉంటుంది?

కానీ ఖర్గేజీ అంటారూ... కొన్నిసార్లు తెలిసిన విషయాన్నే మళ్లీ మళ్లీ తెలుసుకోవడంలో కూడా మజా ఉంటుందని!!

"అలా నాకేమీ అనిపించదు ఖర్గేజీ! ఒకసారి చూసిన ప్రదేశాన్ని చూడటంలో నాకెలాంటి ఆసక్తీ ఉండదు. ఎందుకంటే దాని గురించి నాకు తెలిసిపోయి ఉంటుంది కనుక..." అన్నాను.

"ప్రదేశాలు వేరు, ఫలితాలు వేరు రాహుల్‌బాబు..." అన్నారు ఖర్గేజీ.

"నేను ప్రదేశాల గురించి, ఫలితాల గురించి మాట్లాడ్డం లేదు ఖర్గేజీ! ప్రదేశాలైనా, ఫలితాలైనా... అవి 'ముందే తెలిసి ఉండటం' గురించి మాట్లాడుతున్నాను" అన్నాను.

నేను ఆ మాట అన్న తర్వాత ఆయన మరేమీ మాట్లాడలేదు!

ఐదు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ ఆధిక్యంలో ఉన్నట్లు ఫలితాలు వస్తున్నాయి. ఆ ఫలితాలను



ఖర్గేజీ నిశితంగా గమనిస్తున్నారు! నాకైతే బయటికి వెళ్లి తృప్తిగా ఏదైనా తిని రావాలని, స్వేచ్ఛగా ఎక్కడైనా ఎగిరి రావాలని ఉంది.

"ఖర్గేజీ... కాకరకాయలు, పచ్చి బఠాణీలు, పాలకూర మీకు ఇష్టమేనా?" అని అడిగాను.

"బాగుంటాయి కదా..." అన్నారు నవ్వుతూ ఆయన!

"ఆ మూడూ తప్ప ఈ లోకంలో తయారయ్యే ఏ పదార్థాన్నైనా నేను ఇష్టంగా తింటాను ఖర్గేజీ! మీ నిశితమైన గమనింపు టీవీలో వస్తున్న ఫలితాల మీద కాకుండా నా మీద ఉండి ఉంటే కనుక మీరొక సంగతిని కనిపెట్టి ఉండేవారు. డైనింగ్ టేబుల్ మీద ఇష్టం లేని కూరల్ని చూస్తూ కూర్చున్నట్లుగా, టీవీలో కౌంటింగ్ ఫలితాలను నేను ఇష్టం లేకుండా చూస్తూ కూర్చున్నానని..." అన్నాను.

ఖర్గేజీ నవ్వారు.

"మరి అలా వెళ్లొస్తారా రాహుల్ బాబూ! మరీ దూరంగా వెళ్లిపోకుండా త్వరగా వచ్చేయండి. దగ్గర మీరుండాలి..." అన్నారు.

బయటికి వచ్చాక ఒక్కక్షణం నిలబడ్డాను. నిలబడి ఆలోచించాను.

'మరీ దూరంగా వెళ్లిపోకండి. దగ్గర మీరుండాలి...' అని ఖర్గేజీ ఎందుకు అన్నట్లు?!

సీఎంల సర్దుబాటు కోసమా?!

రాజస్థాన్‌లో ఎలాగూ మళ్లీ కాంగ్రెస్సే వస్తుంది. ఆ వెంటనే.. సీఎంగా అశోక్ గెహ్లోతా, సచిన్ పైలటా అనే సమస్య వస్తుంది.

తెలంగాణలో తొలిసారి కాంగ్రెస్ రాబోతోంది. దాంతోపాటే సీఎంగా రేవంత్ రెడ్డా, భట్టి విక్రమార్కా, వాళ్లిద్దరూ కాకుండా టి. జీవన్‌రెడ్డా అనేది సమస్య కాబోతుంది.

మధ్యప్రదేశ్‌లో సగం టర్మ్‌లో జ్యోతిరాదిత్య కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వెళ్లిపోయి కమల్‌నాథ్ ప్రభుత్వాన్ని అక్రమంగా పడగొట్టాడన్న కోపంతో రగిలిపోతున్న ప్రజలంతా మొన్న ఓట్లన్నీ కాంగ్రెస్‌కే వేసి ఉంటారు. కనుక కమల్‌నాథే సీఎం అవుతారు. ఒకవేళ జ్యోతిరాదిత్య, ఆయన టీమ్ తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చేస్తామంటే మాత్రం వాళ్లను తీసుకోవాలా, వద్దా అనేది సమస్య కావచ్చు.

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ కాంగ్రెస్సే వస్తుంది. బాఘేల్‌కు ముందు పదిహేనేళ్లు బీజేపీ సీఎంగా ఉన్న రమణ్‌సింగ్ ఛత్తీస్‌గఢ్‌కు చేసిందేమీ లేదు కనుక కాంగ్రెస్‌దే విజయం. సీఎంగా మళ్లీ బాఘేలేనా, లేక టీఎస్ సింగ్‌దేవా అనే సమస్యైతే వస్తుంది.

మిజోరమ్‌లో బీజేపీ ఎప్పుడూ లేదు. ఇప్పుడూ ఉండదు. ఉంటే కాంగ్రెస్. లేకుంటే మిజో నేషనల్ ఫ్రంట్. జోరంతంగాపై కేసులున్నాయి. కరప్షన్ ఛార్జ్‌లున్నాయి. కాబట్టి ఈసారి కాంగ్రెస్‌దే గవర్నమెంట్. సీఎం లాల్సవతానా, లేక రాల్టేనా అన్నది సమస్య కావచ్చు.

ఐదు రాష్ట్రాల విజయాలతో పాటుగా వచ్చే ఐదు రాష్ట్రాల సమస్యల్ని పరిష్కరించడానికే 'దగ్గర మీరుండాలి' అని ఖర్గేజీ అన్నారా?

చేసిన బాసలు చెదిరిపోతే ఎలా?

విశ్లేషణ



లావణ్యా రాజమణి

'కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్' (కాప్) సమావేశాలు దుబాయ్‌లో ప్రారంభమయ్యాయి. భూమిని వాతావరణ మార్పుల ప్రభావం నుంచి రక్షించుకునే ఉద్దేశంతో నిర్వహిస్తున్న సమావేశాలు ఇవి. ఈ మధ్యే విడుదలైన 'యూఎన్‌ఈపీ గ్యాప్ రిపోర్ట్' సైతం ప్యారిస్ ఒప్పందంలో భాగంగా దేశాలు చేసిన వాగ్దానాలన్నీ నెరవేరినా పుడమి సగటు ఉష్ణోగ్రతలు లక్ష్యంగా నిర్ణయించుకున్న 1.5 డిగ్రీ సెల్సియస్‌గా కాకుండా 2.9 డిగ్రీ సెల్సియస్‌కు చేరతాయని చెప్పడం ఆందోళనకరం. అంత స్థాయికి చేరడం భూమిని కాష్ఠం చేసినట్లే. ప్రకృతి వ్యవస్థలు చిన్నాభిన్నమవుతాయి. ఫలితంగా ఎన్నో ప్రకృతి ఉపద్రవాలకు బీజం పడుతుంది. పైగా రికార్డుల్లో ఎన్నడూ లేనంత ఎక్కువ ఉష్ణోగ్రతలు ఈ ఏడాదే నమోదయ్యాయి. ఈ పరిస్థితులన్నింటి నేపథ్యంలోనే మొదలైన కాప్–28కు ప్రాధాన్యం మరింత పెరిగింది. పరిస్థితిని చక్కదిద్దేందుకు ఏదైనా శంఖనాదం చేస్తుందా అని ప్రపంచం ఎదురు చూస్తోంది.

వాతావరణం విషయంలో ఎన్నో రికార్డులు బద్దలైన సంవత్సరం ఇది. ఇంకో నెల మాత్రమే ఉన్న 2023లో వాతావరణ మార్పుల ప్రభావం నుంచి భూమిని రక్షించుకునేందుకు ఉద్దేశించిన 'కాప్–28' సమావేశాలూ మొదలయ్యాయి. అంతర్జాతీయ సమాజం ఏదో ఒక అత్యవసర చర్య తీసుకోకపోతే పరిస్థితి చేయి దాటిపోతుందన్న ప్రమాద ఘంటికలూ వినిపిస్తున్న తరుణమిది!

ఐక్యరాజ్య సమితి సమావేశం (కాప్–28) ఇంకోటి దుబాయ్‌లో నవంబరు 30వ తేదీ మొదలైంది. 'కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్' (కాప్) అని పిలుస్తున్న ఈ సమావేశాలు భూమిని వాతావరణ మార్పుల ప్రభావం నుంచి రక్షించుకునే ఉద్దేశంతో నిర్వహిస్తున్నవి. ఇప్పటివరకూ తీసుకున్న నిర్ణయాలూ, వాటి అమలు వంటి అంశాలపై ప్రపంచదేశాలన్నీ కూర్చుని సమీక్షిస్తారిక్కడ. మూడు దశాబ్దాలుగా వాతావరణ మార్పులపై జరుగుతున్న చర్చల పుణ్యమా అని ఇప్పటివరకూ మూడు అంతర్జాతీయ చట్టాలు ఏర్పాటయ్యాయి. ఇందులో ఒకటి 2015 నాటి 'ప్యారిస్ ఒప్పందం'. అత్యవసరంగా పరిష్కార చర్యలు తీసుకోవాలన్న నిర్ణయాలు కోకొల్లలు. అన్నింటి లక్ష్యం మాత్రం ఒక్కటే. సురక్షితమైన భూమి! ఈ అంతర్జాతీయ నిర్ణయాలు, చట్టాలు లేకపోయి ఉంటే భూమి సగటు ఉష్ణోగ్రతలు 2,100 నాటికి కనీసం నాలుగు డిగ్రీ సెల్సియస్ వరకూ పెరిగి పోతాయి. అయితే ఇప్పుడేదో చాలా గొప్పగా జరిగిపోతుందని కాదు. ఎందుకంటే భూమి ఇప్పటికీ ప్రమాదం నుంచి బయటపడలేదు మరి!

ఈ మధ్యే విడుదలైన 'యూఎన్‌ఈపీ గ్యాప్ రిపోర్ట్' కూడా ప్యారిస్ ఒప్పందంలో భాగంగా దేశాలు చేసిన వాగ్దానాలన్నీ నెరవేరినా భూమి సగటు ఉష్ణోగ్రతలు లక్ష్యంగా నిర్ణయించుకున్న 1.5 డిగ్రీ సెల్సియస్‌గా కాకుండా 2.9 డిగ్రీ సెల్సియస్‌కు చేరతాయని చెప్పడం ఆందోళనకరం. 2021 నాటి 'గ్లాస్ గో' సమావేశాల్లోనూ సగటు ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీ సెల్సియస్‌కు పరిమితం చేస్తామని ప్రపంచం ప్రతిన బూనింది! షరతుల్లేని వాగ్దానాల విషయానికి వస్తే... ఇవి కూడా పూర్తిస్థాయిలో అమలైన పక్షంలో ఉష్ణోగ్రత పెరుగుదల అనేది 2.5 డిగ్రీ సెల్సియస్‌కు పరిమితమయ్యే అవకాశం ఉంది. ఐపీసీసీ 2022 నాటి నివేదిక కూడా దేశాల ఆర్థికసాయంలో మూడు నుంచి ఆరు రెట్లు తక్కువగా అందినట్లు చెప్పడం ఇక్కడ ప్రస్తావించాల్సిన అంశం.

భూమి సగటు ఉష్ణోగ్రతలు 2.9 డిగ్రీ సెల్సియస్‌కు పెరగడమంటే భూమిని కాష్ఠం చేసినట్లే! ప్రకృతి వ్యవస్థలు చిన్నాభిన్నమవుతాయి. ఫలితంగా ఎన్నో ప్రకృతి ఉపద్రవాలకు బీజం పడుతుంది. గోరుచుట్టుపై రోకటిపోటు చందంగా మనిషిపై వీటి ప్రభావం కూడా అంతకంతకూ ఎక్కువ అవుతూ ఉంటుంది. ఊహించుకుంటేనే ఉలిక్కిపడాల్సిన పరిస్థితి ఇది. పైగా రికార్డుల్లో ఎన్నడూ లేనంత ఎక్కువ ఉష్ణోగ్రతలు ఈ ఏడాదే నమోదయ్యాయి. ఈ పరిస్థితులన్నింటి నేపథ్యంలోనే దుబాయ్‌లో మొదలైన కాప్–28కు ప్రాధాన్యం మరింత పెరిగింది. పరిస్థితిని చక్కదిద్దేందుకు ఏదైనా శంఖనాదం చేస్తుందా అని ప్రపంచం ఎదురు చూస్తోంది.

ఐరాస వాతావరణ చర్చలే సరిపోవు...

వాతావరణ మార్పులను ఎదుర్కోవాలంటే కేవలం చర్చలు సరిపోవు. ప్యారిస్ ఒప్పందం ఏకాభిప్రాయంపై ఏర్పడని కారణంగా... నిర్ణయాలు తీసుకునే విషయంలో సరైన వ్యవస్థ లేకపోవడం వల్ల మనం అనుకున్నంత వేగంగా పురోగతి సాధించలేకపోయాం. ఈ ఒప్పందంలో కేవలం కొన్ని వాగ్దానాలూ, ఒప్పందాలు మాత్రమే ఉన్నాయి. కొంత వినూత్నంగా ఆలోచించగలిగితే ఇంతకంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చునని అప్పట్లోనే చాలామంది నిపుణులు చెప్పుకొచ్చారు కానీ పట్టించుకున్నది కొందరే! ఏదో ప్రజల ఆందోళనను కొంత నెమ్మదింపజేసేందుకా అన్నట్లు గొప్ప గొప్ప ప్రకటనలైతే జారీ అయ్యాయి. ఈ ప్రకటనలు మఖలో వచ్చి పుబ్బలో పోయే రకాలు.



2021లో జరిగిన గ్లాస్‌గో సమావేశాల్లో... 'దశల వారీగా బొగ్గు వాడకాన్ని తగ్గించాలి' అని ఒక నిర్ణయం తీసుకున్నారు. మొత్తంగా తొలగించాలన్న విషయానికి భారత్ అభ్యంతరం తెలిపింది. ఫలితంగా దశలవారీగా అన్న పదం వచ్చి చేరింది. అయితే భారత్‌లోనే కాదు... చాలా దేశాల్లోనూ బొగ్గు వాడకం తగ్గనూ లేదు. పూర్తిగా నిలిచిపోనూ లేదు.

వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకునే చర్యలు ప్రభావవంతంగా ఉండాలంటే దానికి సర్వతోముఖ ప్రయత్నాలు అవసరం. భాగస్వాములందరూ కలిసికట్టుగా పని చేయాల్సి ఉంటుంది. కాబట్టి ఐరాస చర్చలు ఈ అంశంపై నియమ నిబంధనలను ఖరారు చేయడంపై దృష్టి పెట్టడం మంచిది. దుబాయ్‌లో జరిగే చర్చలు మన లక్ష్యానికి సంబంధించిన స్పష్టమైన మార్గాన్ని నిర్దేశించాలి. అలాగే దేశాలు తగిన చర్యలు తీసుకునేలా చేయాలి. కాప్–28 లక్ష్యం ఇదే కావాలి.

తొలిసారి ప్రపంచస్థాయి సమీక్ష...

దుబాయ్‌లో జరుగుతున్న కాప్–28 సమావేశాల్లో మొట్టమొదటిసారి ప్రపంచవ్యాప్త వాతావరణ పరిస్థితిపై తాజా సమీక్ష ఒకటి చేపట్టనున్నారు. 'గ్లోబల్ స్టాక్ టేక్' ద్వారా ప్యారిస్ ఒప్పందం అమలు విషయంలో ఇప్పటికి మనం సాధించింది ఏమిటి? సాధించాల్సింది ఏమిటన్న స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందన్నమాట. ఈ ఏడాది సెప్టెంబరులో దీనికి సంబంధించిన నివేదికలు సిద్ధమయ్యాయి. ఆశయాలకు, ఆచరణకు మధ్య అంతరాన్ని విస్పష్టంగా ఈ నివేదికల్లో పేర్కొన్నారు.



కాప్–28 ఇంకో ముందడుగు వేసి ప్రపంచం నిర్దేశిత లక్ష్యానికి దూరంగా ఉన్న విషయాన్ని స్పష్టం చేయాలి. ప్రస్తుత వాగ్దానాలు సరిపోవని, ఆర్థిక సహకారం తగినంత అందని నేపథ్యంలో వీటి అమలు కూడా అసాధ్యమన్న విషయాన్ని సుస్పష్టం చేయాలి.

కాప్–28 ద్వారా ప్రపంచానికి అందించాల్సిన సందేశం ఇంకోటి కూడా ఉంది. కర్బన ఉద్గారాల తగ్గింపు, అందుకు సంబంధించిన లక్ష్యాలను నిర్దేశించడంపై ఎక్కువ దృష్టి పెట్టక పోవడం మంచిది. ఎందుకంటే గతంలో కాప్ సమావేశాలు మిగిలిన విషయాలను పక్కనబెట్టి కేవలం ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకునేందుకన్నట్లు భారీ భారీ లక్ష్యాలు ప్రకటించి చతికిలబడ్డాయి కాబట్టి! ఈ రకమైన భారీ లక్ష్యాలు చాలాసార్లు ఆ యా దేశాల ఆశయాలను తప్పుగా అర్థం చేసుకునే అవకాశం కల్పిస్తుంది. జాతీయ రాజకీయాలు పరిస్థితులు (కొన్ని సందర్భాల్లో చట్టపరమైన అంశాల) అసలైన, ఆచరణ సాధ్యమైన లక్ష్యాలను నిర్దేశిస్తాయే కానీ.. అంతర్జాతీయ ఒత్తిడి కాదు.

ఈ లక్ష్యాలకు అంతర్జాతీయ ఆర్థిక, సాంకేతిక పరిజ్ఞాన, మానవ వనరుల పరమైన సాయం లభించినప్పుడు మాత్రమే వాస్తవంగా అమలు చేయడం సాధ్యమవుతుంది. తద్వారా మన విశ్వాసం మరింత పెరుగుతుంది. మరింత ఉన్నత స్థాయి లక్ష్యాల కోసం పనిచేసే స్థైర్యం లభిస్తుంది.

లక్ష్యాలకన్నా ఆచరణ మిన్న

వాతావరణ మార్పులను తట్టుకునేందుకు చేయాల్సిన పనుల విషయంలోనూ కొంచెం పట్టువిడుపు ధోరణి అవసరం. మరింత కఠినమైన లక్ష్యాలను నిర్దేశించుకోవడం కంటే సంప్రదాయేతర ఇంధన వనరుల వాడకాన్ని పెంచాలని, ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవాలని కాప్–28 వేదికగా పిలుపునివ్వాలి. దీనికీ శిలాజ ఇంధనాల వాడకం తగ్గేందుకూ మధ్య పొంతన కుదిరేలా చూడాలి. అంటే.. లక్ష్యాలను నిర్దేశించడం కాకుండా మార్పు జరిగేందుకు, సక్రమ అమలుకు పూనికగా నిలవాలి అని అర్థం.

దీనికి అదనంగా కాప్–28 బాధ్యతల పంపిణీ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. దేశాల అంతర్గత లక్ష్యాలు కావచ్చు. దేశాల మధ్య కావచ్చు అన్నింటి విషయంలో సమదృష్టి పాటించడం అవసరం. వాతావరణ మార్పుల సమస్యను పరిష్కరించాలంటే వ్యవస్థలకు వ్యవస్థలు మారాల్సి ఉంటుంది. ఇది కొంత విధ్వంసాన్నయితే సృష్టిస్తుంది. దీని ప్రభావం కూడా దిగువ వర్గాలపైనే ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఇటువంటి వారి ప్రయోజనాలు దెబ్బతినకుండా న్యాయమైన, అందరినీ కలుపుకొనిపోయే ఏర్పాట్లు అవసరం. ప్రత్యామ్నాయ జీవనోపాధులతో పాటు తమదన్న భావనను కల్పించడం కీలకమవుతుంది.

కాప్–28 సమావేశాల్లో ఏ నిర్ణయం తీసుకున్నా.. వాటి అమలును చురుకుగా పర్యవేక్షించడం ముందుకు తీసుకెళ్లడం ప్రస్తుత తక్షణ కర్తవ్యం కావాలి. ఐక్యరాజ్య సమితి పరిధిలో.. బయట కూడా చేసిన వాగ్దానాలు నెరవేరేలా చూసేందుకు ఒక ప్రణాళిక కూడా అవసరం. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నాలనేవి ప్రభుత్వాల్లోని అన్ని వర్గాల వారిని సమన్వయం చేసుకుని ఆచరించినప్పుడు వాటికి సార్థకత. అలాగే ఈ చర్యలు ప్రభావశీలంగా ఉండాలంటే భాగస్వాములందరి చర్యలూ, తోడ్పాటు అత్యవసరం.

ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వాతావరణ సంబంధిత వ్యాజ్యాలు దాఖలవుతున్నాయి. అంతర్జాతీయ కోర్టుల్లోనూ హై ప్రొఫైల్ కేసులు విచారణలో ఉన్నాయి. ఇదంతా బాధ్యత ఎవరిదన్న విషయంపైనే! దేశాలు, ఐక్యరాజ్య సమితి కూడా తాము చేసిన వాగ్దానాలు కచ్చితంగా, సంపూర్ణంగా అమలయ్యేలా చూడాలి. తద్వారా మానవాళిని పరిరక్షించాలి.

వ్యాసకర్త ప్రొఫెసర్, ఇంటర్నేషనల్ ఎన్విరాన్మెంటల్ లా, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

దొంగ ఓట్ల దొంగలెవరు?

అభిప్రాయం



డా॥ పూనూరు గౌతమ్ రెడ్డి

మరికొన్ని నెలల్లో రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగబోతోంది. ఈ క్రమంలో దొంగ ఓట్ల అంశం మళ్లీ తెరపైకి రావడంతో ఓటర్లలో గందరగోళ పరిస్థితులు నెలకొనే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే దొంగ ఓట్లకు సంబంధించి పోటాపోటీగా అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అసలు దొంగ ఓట్లను ఎవరు ప్రోత్సహిస్తున్నారన్న దానిపై పలు కోణాల్లో అనేక మంది విశ్లేషణలు చేశారు. అయితే, ఎవరైనా దొంగతనం చేసినప్పుడు భయపడటం పరిపాటి. అదే పరిస్థితి తెలుగుదేశం ఎదుర్కొంటోంది. టీడీపీ పాలన కాలం నుంచి తమకు తెలియకుండా తమ ఇంటి నెంబరుతో కొన్ని ఓట్లు చలామణిలో ఉండటాన్ని ఇప్పుడు తెలుసుకుని ఇంటి యజమానులు విస్తుపోతున్నారు. ఇదెలా సాధ్యమంటూ ముక్కున వేలేసుకుంటు న్నారు. 'ఓటర్ల జాబితాల్లో అక్రమాలు' అంటూ గావు కేకలు పెట్టిన తెలుగుదేశం పార్టీ నేతలు ఇప్పుడు మౌనం దాల్చడం అనుమానా లకు తావిస్తోంది.

కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు భారీ మెజారిటీతో గెలవడం కోసం పక్కనే ఉన్న తమిళనాడుకు చెందిన వందల మంది పేర్లను తన నియోజకవర్గంలో చేర్పించారన్న అపవాదు ఉండనే ఉంది. ఈ నేపథ్యంలోనే మళ్లీ నకిలీ ఓటర్ల అంశం తెరపైకి రావడం ఇప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది.

ఓటర్ల జాబితాలో అవకతవకలు చోటుచేసుకున్నాయనీ, వాటిని సరిదిద్దాలనీ, ఇది ప్రజాస్వామ్యానికి ఏమాత్రం మంచిది కాదనీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కలెక్టర్లను కలసి ఫిర్యాదు చేసింది. ఇందులో భాగంగా కృష్ణా జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో కలెక్టర్లకు వైసీపీ నుండి ఫిర్యాదులు అందాయి. ఓటర్ల జాబితాలో అవకతవకలు ఉన్నాయని తమకు తెలిసిందనీ, వీటిని సరిదిద్దాలనీ వైసీపీ కోరింది. 2019కు ముందు నుంచే ఒకే డోర్ నెంబర్‌లో 50 నుంచి 100 ఓట్ల వరకు ఉన్నాయని వైసీపీ ఫిర్యాదులో పేర్కొంది. అదే విధంగా ఒకే వ్యక్తి ఏపీలోనూ, తెలంగాణలోనూ రెండుచోట్లా ఓటుహక్కు కలిగి వున్నారని వివరించింది. ఒకే వ్యక్తికి మున్సిపల్ ఏరియాలోనూ, గ్రామంలోనూ, వేరు వేరు నియోజకవర్గాల్లో కూడా ఓటుహక్కు ఉందని పేర్కొంది. తమ పార్టీ కార్యకర్తలు పలు ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి పరిశీలన చేయగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయనీ, ఆ చిరునామాలలో ఉంటున్న వారిని అడగగా తమకు ఈ విషయం తెలియదని చెబుతున్నారనీ వైసీపీ తన ఫిర్యాదులో పేర్కొంది.

గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఈ విధంగా ఉద్దేశ్యపూర్వకంగా దొంగ ఓట్లను చేర్చారనీ, ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత ఇలాంటి ఓట్ల అవకతవకలు, బోగస్ ఓట్లపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి కూడా వైసీపీ ఫిర్యాదు చేసింది. ముఖ్యంగా తుదిజాబితా విడుదలకు ముందు ఇలాంటి బోగస్, అక్రమ ఓట్లపై విచారణ జరిపి ప్రజాస్వామ్యయుతంగా అర్హులైన ప్రతి ఓటరుకూ ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకునేందుకు ఈసీ ఉపక్రమించబోతోందని తెలుస్తోంది.

ఓటర్ల ఓట్లను ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తున్న టీడీపీ కార్యకర్తలు ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారని కూడా ఆరోపణలు ఉన్నాయి. ఇలా చేయడం చట్ట విరుద్ధం. వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడమే కాక టీడీపీ యాప్‌లో సేకరించిన సమాచారాన్ని ఎక్కించే మిషతో టెలిఫోన్ నెంబర్ తీసుకుని ఓటీపీ సైతం అడుగుతున్నారని అన్నమయ్య జిల్లాలో ప్రజలు వాపోతున్నారు. ఓటీపీ



కాని, వ్యక్తిగత సమాచారం కాని ఇవ్వని వారిపై టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని కూడా అనేక మంది చెబుతున్నట్లు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు అందుతున్నాయి.

రాజంపేట నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు ఓ ఇంట్లోకి వెళ్లి సమాచారం అడగటం... వారు ఇవ్వటానికి ఇష్టపడక పోవడంతో వారిపై దౌర్జన్యానికి దిగారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. బాబు భరోసా, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను ప్రచారం చేసుకోవడానికి సమాచారం అడిగారనీ, 2024లో టీడీపీ ప్రభుత్వం రానుందని ప్రజలను మభ్యపెడుతూ మోసగిస్తున్నారని అనేక చోట్ల ప్రజలు బహిరంగంగానే అంటున్నారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించకుండా చూడటంతో పాటు దౌర్జన్యాలను అరికట్టడం ఇప్పుడు ఎన్నికల సంఘం ముందున్న తక్షణ కర్తవ్యం. అలా చేసినప్పుడే ప్రజాస్వామ్యం మనగలుగుతుంది.

దొంగ ఓట్లను అరికట్టడానికి ఆధార్ కార్డును అనుసంధానం చేయడం ఉత్తమమైన మార్గం. ఈ విధానాన్ని ఇటీవలికాలంలో తెలంగాణ ఎన్నికల సంఘం ప్రారంభించింది. అయితే, మిగిలిన రాష్ట్రాల్లో ఎందుకో ఈ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. ప్రజాస్వామ్యం పరిపుష్టం కావడానికి, దొంగ ఓట్ల గోల పోవడానికి ఇది ఎంతో మేలు చేకూర్చే అంశం. వైసీపీపై ఇష్టారీతిన ఆరోపణలు చేస్తూ కాలం గడుపుతున్న తెలుగుదేశం పార్టీగానీ, ఆ పార్టీని భుజాన వేసుకుని మోసే మీడియా కానీ ఈ ప్రతిపాదనపై ఎందుకు స్పందించడం లేదో అర్థం కావట్లేదు. ఇలా కోరడానికి కూడా నిజంగా ధైర్యం ఉండాలి. తాము తప్పు చేయనప్పుడు భయమెందుకు అన్న రీతిలోనే వైసీపీ అధినేత జగన్ ఈ కార్యక్రమానికి తెరతీశారు. ఆ ధైర్యం మాత్రం తెలుగుదేశం పార్టీ అధి నేత చేయలేకపోతున్నారంటే ఏమనుకోవాలి. ఆయనే దొంగ ఓట్లను ప్రోత్సహిస్తున్నారనుకోవాల్సి వస్తోంది. తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో అటు తమిళనాడు, ఇటు కర్ణాటకల నుండి పెద్ద ఎత్తున (వేలల్లో) ప్రజల పేర్లను చేర్పించిన తాను తన కేడర్‌కు ఏం చెబుతారన్నది బహిరంగ రహస్యమే. 'ఆవు చేలో మేస్తే .. దూడ గట్టున మేస్తుందా' అన్న సామెత ఇందుకు అతికినట్లు సరిపోలుతుంది.


వివేకవంతులైన ఓటర్లు ఈ తంతు అంతా గమనిస్తూనే ఉన్నారు. ఇప్పటి నుండే వారి వారి ప్రాంతాల్లో నివాసం లేని అనేకానేక మంది పేర్లను గుర్తించి బహిరంగ పరుస్తున్నారు. ఇది నిజంగా ప్రజల్లో వచ్చిన చైతన్యం. ప్రజల్లో ఈ తరహా చైతన్యం రావడం స్వాగతించదగ్గ పరిణామం. గ్రామాలు, వార్డులు, పట్టణాలు ఇలా... అన్ని చోట్లా తమకు తెలియని ఓటర్లు ఉంటే వెంటనే గుర్తించి ఈసీకి ఫిర్యాదు చేయాల్సిన అవసరం ఉంది. తెలుగుదేశం పార్టీ చేస్తున్న ఈ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టేలా ప్రజలు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యాసకర్త వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు
మొబైల్: 98481 05455

పాపపుణ్యాలు

'ఈ ప్రపంచంలో ఎవరూ పాపిగా ఉండటాన్ని కోరుకోరు. కానీ పాపపు పనులే ఎక్కువ చేస్తుంటారు. మనమందరం పుణ్యఫలాన్ని పొందడానికి ఇష్టపడతాం. కానీ పుణ్యకార్యాలు చేయం. అలాగే పాపం చెయ్యడానికి ఎవరూ ఇష్టపడటం లేదు. కానీ కృష్ణా! పాపం చేయడానికి బలవంతంగా ప్రేరేపించేదేది?'' అని అర్జునుడు అడిగాడు.

'అదే అర్జునా, ఆశ! ఆశే చెయ్యకూడనివన్నీ చేయిస్తుంది. ఆశతో ఒకటి పొందడానికి ప్రయత్నిస్తాం. ఎలాగైనాసరే దానిని పొందడానికి ధర్మాధర్మాలను పక్కనపెట్టేస్తాం. ఆ ఆశ నెరవేరడంతోనే అక్కడితో తృప్తి పొందుతామా అంటే లేదు. అగ్నిలో నెయ్యి పోస్తే అది ఆరిపోతుందా... ఇంకా ఇంకా మండుతుంది. అలాగే ఒక ఆశ పూర్తయితే మనసులో ఇంకొక ఆశ పుట్టుకొస్తుంది.' అన్నాడు కృష్ణ పరమాత్మ.



సరే, అలాగైతే ఆశ నెరవేరకుంటే మంచిదని చెప్పుకోవచ్చా. అలాగూ చెప్పలేం. ఆశ నెరవేరకుంటే మనకు ఆక్రోశం వస్తుంది. గోడకు విసిరిన రబ్బరు బంతి తిరిగి వెనక్కు వచ్చినట్టుగా నెరవేరని ఆశ కోపంగా తిరిగొచ్చి మనల్ని పాపంలోకి నెడుతుంది. ఆశకు తర్వాతి దశ క్రోధమని భగవాన్ గీతలో చెప్పారు. అది కూడా ఆశ వల్ల కలిగే ఫలితమే! అలాగైతే పాపం చెయ్యకుండా ఉండటానికి ఉన్న ఏకైక మార్గం ఆశను అంతం చేయడమే! ఇది ఎలా చేయడం. మనం ఏ పనీ చెయ్యకుండా ఉండలేం కదా! శరీరం ఏ కార్యం చేయకున్నా మన మనసు ఏదో ఒకటి ఆలోచిస్తూనే ఉంటుంది. మన మనసు కోరిక చుట్టూ తిరుగుతూ ఉంటుంది. అందువల్లే కోరికలు మనల్ని ఇంకా ఇంకా పాపంలోకి నెడుతుంటాయి.

ఆశను తిన్నగా ఆపలేం. కార్యాన్ని ఆపలేం. అలాగైతే మనకు మోక్షమే లేదా... ఈ సమస్యకు పరిష్కారం లేదా అంటే ఉంది. అదేమిటంటే లౌకికంగా లాభమివ్వని కార్యాలు చేయాలి. లోకోపకారం ఎక్కువ చేయాలి. మనమందరం నాలుగు విధాలుగా పాపాలు చేస్తుంటాం. దేహంతో, నోటితో, మనసుతో, డబ్బుతో చేసే పాపాలకు అంతు లేదు. ఏ నాలుగింటితో పాపాలు చేస్తున్నామో వాటితోనే పుణ్యకార్యాలు చేయాలంటారు కంచి పరమాచార్య. పరోపకారం, భగవన్నామస్మరణ, మనసును పవిత్రంగా ఉంచుకుని డబ్బును సత్కార్యాలకు ఉపయోగిస్తే సరిపోతుంది. ధర్మం చేసి పుణ్యాన్ని సంపాదించాలి.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

ఇండోనేషియా వర్సిటీతో వైవీయూ ఒప్పందం



వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం, ఇండోనేషియా దేశంలోని ఉదయన విశ్వవిద్యాలయం మధ్య అంతర్జాతీయ ఒప్పందం (మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్) కుదిరింది. ఇండోనేషియాలోని ఉదయన విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో వైవీయూ జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ మునికుమారి పాల్గొని పరిశోధన పత్రం సమర్పించడంతో పాటు ఒప్పంద ప్రక్రియను పూర్తి చేశారు. ఉదయన విశ్వవిద్యాలయ రెక్టార్ డాక్టర్ ఐ.ఆర్.న్గాకస్ పుటుగేడి సుర్ధన సంతకాలతో కూడిన పత్రాలను శనివారం వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్యలకు ఆ శాఖ అధ్యాపకులు అందజేశారు.

980 గంజాయి చాక్లెట్లు స్వాధీనం



గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకుంటున్న సీఐ యశోధర ఎస్ఐ శ్రీనివాసరావు బృందం

మార్టూరు: గంజాయితో తయారు చేసిన 980 చాక్లెట్లను బాపట్ల జిల్లా మార్టూరులో శనివారం పర్చూరు ఎస్ఈబీ సీఐ యశోధరా దేవి బృందం స్వాధీనం చేసుకుంది. బాపట్ల ఎన్ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ నరసింహారావు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం పూరి జిల్లా కందసాహి గ్రామానికి చెందిన అరుపానంద మల్లిక్ మార్టూరు రహదారి పక్కన పూరి జగన్నాథ్ ఫ్యాన్సీ షాప్ నడుపుతున్నాడు. నిఘా పెట్టిన సీఐ యశోదరా దేవి మల్లిక్ షాపు నుంచి కొన్ని చాక్లెట్లు కొనుగోలు చేయించి ల్యాబ్‌లో పరీక్ష చేయించారు. ఈ చాక్లెట్లలో మత్తు పదార్థం కలిపారని నిర్ధారించుకున్న సీఐ శనివారం సాయంత్రం ఎస్ఐ శ్రీనివాసరావు ఇతర సిబ్బందితో కలిసి అరుపానంద మల్లిక్ షాపు వెనుక ఉన్న అతని నివాసంలో తనిఖీ చేశారు. దీంతో ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 980 మత్తు చాక్లెట్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు.

దివ్యాంగులను ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

- విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని దివ్యాంగులను సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుందని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్ తెలిపారు. 31వ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు ఆయన ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. సీఎం జగన్ రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిదని అన్నారు. గత ప్రభుత్వం 2016 దివ్యాంగుల చట్టాన్ని తుంగలోకి తొక్కితే, ఈ ప్రభుత్వం భరోసా కల్పించిందని పేర్కొన్నారు. దివ్యాంగులకు వైకల్య శాతంతో సంబంధం లేకుండా పెన్షన్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనేనని తెలిపారు. సంక్షేమ పథకాలతో పాటు జగనన్న ఇళ్లల్లో కూడా దివ్యాంగులకు అవకాశం కల్పిస్తున్న సీఎం జగన్‌ను మరోసారి సీఎంను చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ

కిసాన్ క్రెడిట్ కార్డులపై రుణాల పేరిట భారీ మోసం

సాక్షి, హైదరాబాద్: కిసాన్ క్రెడిట్ కార్డ్(కేసీసీ)లపై చేపల చెరువుల నిర్మాణానికి రుణాలు ఇచ్చినట్టు లెక్కల్లో చూపి కోట్ల రూపాయలు దారిమళ్లించిన కేసు దర్యాప్తును ఈడీ అధికారులు ముమ్మరం చేశారు. సీబీఐ విశాఖపట్నం బ్రాంచ్ ఏసీబీ విభాగం నమోదు చేసిన ఈ కేసులో మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా నవంబర్ 29న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కలిపి మొత్తం ఆరు ప్రాంతాల్లో సోదాలు చేసినట్టు ఈడీ అధికారులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ఈ సోదాలు ఏ ప్రాంతాల్లో చేశారన్న విషయాలు ఈడీ అధికారులు వెల్లడించలేదు. రాజమండ్రిలోని ఐడీబీఐ బ్యాంక్‌లో కిసాన్ క్రెడిట్‌కార్డులపై రుణాల పేరిట మొత్తం రూ. 311.05 కోట్లు దారిమళ్లించినట్టు ఈడీ అధికారుల దర్యాప్తులో తేలింది. నిందితులు వారి సంస్థలో పని చేసే ఉద్యోగులు పలువురి నుంచి కేవైసీ డాక్యుమెంట్లు, బ్లాంక్ చెక్కులు, మరికొందరు రైతుల నుంచి వారికి సంబంధించిన పత్రాలను సేకరించి వారి పేరిట రుణాలు మంజూరు చేసినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ సొమ్మును తర్వాత నిందితులు తమ కంపెనీల్లో పెట్టుబడులకు, కుటుంబసభ్యులు, బినామీల పేరిట ఆస్తుల కొనుగోలుకు వాడినట్టు ప్రాథమిక ఆధారాలు సేకరించినట్టు ఈడీ అధికారులు పేర్కొన్నారు. నిందితుల ఇళ్లలో జరిపిన సోదాల్లో కొన్ని కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలు స్వాధీనం చేసుకున్నామని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ అధికారులు పేర్కొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం తోడై..

ఆత్మ విశ్వాసం నీడై

సర్కారు వెన్నుదన్నుతో రాణిస్తున్న విభిన్న ప్రతిభావంతులు

- విద్యలో 5 శాతం రిజర్వేషన్‌తోపాటు అవాంతరాలు లేని చదువు
- మూడు చక్రాల మోటార్ సైకిళ్లు, పరికరాలు అందజేత
- ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్లు
- సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో దేశానికే ఆదర్శం
- ప్రభుత్వ ఉద్యోగులకు అదనంగా 7 రోజుల ప్రత్యేక సెలవులు
- నేడు విభిన్న ప్రతిభావంతుల అంతర్జాతీయ దినోత్సవం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ ప్రోత్సాహం తోడైంది. దానిని అందిపుచ్చుకుంటూ వారంతా ఆత్మ విశ్వాసంతో నిలబడుతున్నారు. నాలుగున్నరేళ్లలో విభిన్న ప్రతిభావంతుల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం.. రాష్ట్ర జనాభాలో 2.23 శాతం (సుమారు 11.04లక్షలు) మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారు. వివిధ వైకల్యాలతో బాధపడుతున్న 21 రకాల వారిని విభిన్న ప్రతిభావంతులుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వారంతా సమాజంలో నిలదొక్కుకునేలా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వీరంతా స్వయం ప్రతిపత్తి, సాధికారత సాధించేలా.. ప్రతిభావంతులుగా నిలబెట్టేందుకు కృషి చేస్తోంది. ప్రత్యేకంగా విద్య, ఉద్యోగం, ఉపాధి కల్పించేందుకు అనేక చర్యలు చేపట్టింది. వారి సమస్యలు గుర్తించి పరిష్కరించే దిశగా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, వయో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ మంత్రి అధ్యక్షతన రాష్ట్రస్థాయి సలహా మండలిని నియమించింది. కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీలను సైతం ఏర్పాటు చేసింది. విభిన్న ప్రతిభావంతుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేలా ప్రతి శాఖలోను ప్రత్యేక అధికారిని నియమించింది. ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో వారికి 4 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఏపీ స్టేట్, సబార్డినేట్ రూల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. వైకల్యం ఉందన్న కారణంతో వారికి పదోన్నతి నిరాకరించడం, ఉన్న పోస్టు నుంచి తగ్గించడం, తొలగించడం చేయకూడదని ప్రభుత్వం అన్ని శాఖలకూ స్పష్టమైన ఆదేశాలిచ్చింది. సదరం ద్వారా వైకల్యం ధ్రువీకరణ పత్రాలు అందించడాన్ని సైతం సులభతరం చేసింది. ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థల్లో వారికి 5 శాతం రిజర్వేషన్ కల్పించింది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రవేశానికి సైతం గరిష్టంగా ఐదేళ్ల వయోపరిమితిని సడలించింది. దీంతోపాటు విద్యాలయాలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలకు విభిన్న ప్రతిభావంతులు వెళ్లి వచ్చేందుకు ఎటువంటి అవాంతరాలు (అడ్డంకులు) లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు.



సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో దేశంలోనే ఏపీ ఆదర్శం

విభిన్న ప్రతిభావంతులు	లబ్ధిదారుల సంఖ్య	నెలకు (రూపాయల్లో)
దివ్యాంగులు	7,88,252	3 వేలు
తలసేమియా	1,565	10వేలు
సికిల్‌సెల్	2,146	10 వేలు
హిమోఫీలియా	1,152	10 వేలు
పక్షవాతం	7,924	5 వేలు
బోదకాలు	1,254	5 వేలు
రోడ్డు ప్రమాదాల్లో వైకల్యం, కండరాల సమస్య	7,924	5 వేలు
కుష్టు వ్యాధి	7,284	3 వేలు

పెద్ద మనసుతో ఎన్నో చర్యలు



రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతులకు విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పెద్ద మనసుతో అనేక చర్యలు చేపట్టారు. ఈ ఏడాది 1,750 మూడు చక్రాల మోటార్ సైకిళ్లు, అనేక సహాయక పరికరాలు అందించాం. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో వారికి సీట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవడంతో పాటు, బడికి వెళ్లేలా సౌకర్యాలు కల్పించాం. చెవిటి, మూగ వారికి, అంధ విద్యార్థులకు 640 మందికి ప్రత్యేకంగా ఆరు ప్రత్యేక విద్యాసంస్థల్ని నిర్వహిస్తున్నాం. జగనన్న వసతి దీవెన, స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నాం. ప్రత్యేక భర్తీతో 691 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం.

– కేవీ ఉషశ్రీ చరణ్, మహిళా, శిశు, వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ మంత్రి

ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది



విభిన్న ప్రతిభావంతులను అన్నివిధాల ఆదుకోవడంలో ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమంలో వారి పట్ల వైఎస్ జగన్ అభిమానం చాటుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సాధారణ సెలవులు 15 రోజులు ఉంటే.. విభిన్న ప్రతిభావంతులకు మరో 7 రోజులు అదనంగా స్పెషల్ క్యాజువల్ లీవ్స్ ఇస్తూ తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సామాజిక భద్రత పెన్షన్లు అందించడంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ఈ ఏడాది బడ్జెట్‌లో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం రూ.4,201.26 కోట్లు కేటాయించింది.

– బి.రవిప్రకాశ్‌రెడ్డి, సంచాలకుడు, వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ

సందేహాల నివృత్తికి గురువులను ఆశ్రయించాలి

- తెలుగు భాషను నిర్లక్ష్యం చేయడం తగదు
- ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యార్థులు తమలోని సందేహాలను నివృత్తి చేసుకోడానికి గురువులను ఆశ్రయించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు చెప్పారు. గురువులను అడగడం వల్ల గూగుల్‌లో లేని ఎన్నో విషయాలను వారు మీకు చెబుతారన్నారు. విజయవాడలోని పీబీ సిద్ధార్థ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో తెలుగు భాష అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. అతిథిగా జస్టిస్ మన్మథరావు హాజరై మాట్లాడారు. విద్యార్థులు తెలుగు భాషను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. మన భాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. పరీక్షలు తెలుగులో రాయడం వల్ల మార్కులు రావని, పరీక్ష సమయం చాలదనే భావనలను విద్యార్థులు విడనాడాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లలు తెలుగు భాషలో మాట్లాడే విధంగా చూడాలని చెప్పారు. కాగా, న్యాయమూర్తిగా నాలుగు వేలకుపైగానే తీర్పులను ఇంగ్లిషులో ఇచ్చానని తెలిపారు. కోర్టు తీర్పులను తెలుగులో ఎందుకు ఇవ్వకూడదనే విషయాన్ని ఆలోచించి మొదటి సారిగా తెలుగులో తీర్పు ఇచ్చానన్నారు. ఏదైనా ఆలోచన చేస్తేనే ఆచరణలోకి వస్తోందని, అదే విధంగా ప్రతి ఒక్కరూ తెలుగుకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఆలోచన చేయాలని కోరారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు ప్రసంగించారు. అనంతరం మన్మథరావును సత్కరించారు.



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి కె.మన్మథరావు

మూడు రాజధానులతోనే రాష్ట్రాభివృద్ధి

1,161వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, వర్గాల అభివృద్ధితోనే సామాజిక సాధికారత సాధ్యమని, అందుకే మూడు రాజధానులు తప్పనిసరిగా ఉండాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 1,161వ రోజుకు చేరుకున్నాయి. పలువురు మాట్లాడుతూ.. అధికారం అంటే ప్రజలకు అవసరమైన సంక్షేమం, అభివృద్ధిని చేరవేస్తూ తద్వారా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమని, కానీ ఆ విషయం మరచి గత ప్రభుత్వాలు ఓ ప్రాంతానికే అభివృద్ధిని పరిమితం చేసి దోచుకున్నందుకే తెలంగాణా నుంచి తరిమికొట్టారన్నారు. ఏపీలో 3.50 కోట్ల మంది బహుజనులు ఉంటే వారికి అభివృద్ధి ఫలాలను అందకుండా చేసి.. అమరావతి ముసుగులో చంద్రబాబు ఓ ప్రాంతం, ఓ సామాజికవర్గం అభివృద్ధికే పాటుపడ్డారని విమర్శించారు. కులవాదమే అజెండాగా రాష్ట్రంలో రాజకీయాలకు ఆజ్యం పోసిన చంద్రబాబు తన సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తూ ఇతర సామాజిక వర్గాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధిపొందాలని చూస్తున్నాడని చెప్పారు. చంద్రబాబు, ఆయన తోక పార్టీలను చిత్తుచిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. నాయకులు పులి దాసు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.





కుటుంబ సభ్యులతో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి, కేంద్ర సహాయ శాఖ మంత్రి నిశిత్ ప్రామాణిక్



క్యాట్ జస్టిస్ డాక్టర్ లత బసవరాజ్

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని కేంద్ర సహాయ శాఖ మంత్రి నిషిత్ ప్రామాణిక్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి, క్యాట్ జస్టిస్ డాక్టర్ లత బసవరాజ్ తదిరులు శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఈ–నామ్‌లో ఏపీ రికార్డు

రికార్డు స్థాయిలో వ్యాపార లావాదేవీలు, బిడ్డింగ్‌లు

- జాతీయ స్థాయిలో వాణిజ్య పరిమాణంలో గుంటూరు.. వేలంలో ఆదోని నంబర్–1
- 16 మార్కెట్ యార్డుల్లో అస్సేయింగ్ ల్యాబ్స్ ఏర్పాటు

సాక్షి, అమరావతి: ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ–నామ్)లో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతోంది. వ్యాపార లావాదేవీలలోనే కాదు.. బిడ్డింగులలో కూడా రికార్డులు తిరగరాస్తోంది. వ్యాపారంలో గుంటూరు మార్కెట్ యార్డు దేశంలోనే మొదటి స్థానంలో నిలవగా.. ఆదోని మార్కెట్ యార్డు ఐదో స్థానంలో నిలిచింది. ఆన్‌లైన్ బిడ్డింగ్ కేటగిరీలో కోటికి పైగా బిడ్డింగ్‌తో ఆదోని, అరకోటికి పైగా బిడ్డింగ్‌తో కర్నూలు యార్డులు మొదటి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహం, మౌలిక వసతుల కల్పన ఫలితంగా ఏపీతో పాటు తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రైతులు, జాతీయ స్థాయిలో వ్యాపారులు ఏపీ మార్కెట్ల ద్వారా క్రయవిక్రయాలకు పోటీ పడుతున్నారు.

14.51 లక్షల మంది రైతుల నమోదు

ఈ–నామ్ పరిధిలో జాతీయ స్థాయిలో వెయ్యి మార్కెట్లు ఉండగా.. రాష్ట్రంలో 33 మార్కెట్లు నమోదయ్యాయి. రాష్ట్రంలో 14.51 లక్షల మంది రైతులతో పాటు 3,730 మంది వ్యాపారులు, 2,324 మంది కమిషన్ ఏజెంట్లు, 250 ఎఫ్‌పీవో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వ్యాపార లావాదేవీలు ఎక్కువగా జరిగే 16 యార్డుల్లో అత్యాధునిక అస్సేయింగ్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిద్వారా యార్డులకు వచ్చే లాట్స్‌లో ర్యాండమ్‌గా ఇప్పటివరకు 11.24 లక్షల లాట్స్‌ను పరీక్షించారు. ఈ–నామ్ ద్వారా ఇప్పటివరకు రాష్ట్ర పరిధిలో రూ.44,631.13 కోట్ల విలువైన 69.74 లక్షల టన్నుల వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు జరిగాయి.

ముందంజలో గుంటూరు యార్డు

ఈ–నామ్ ద్వారా ఇప్పటివరకు జరిగిన వ్యాపారంలో రూ.32,029.47 కోట్ల విలువైన 28.49 లక్షల టన్నుల విలువైన ఉత్పత్తుల క్రయవిక్రయాలు గుంటూరు మార్కెట్ యార్డు పరిధిలో జరిగాయి. అత్యధిక మంది వ్యాపారులు పోటీ పడుతున్న మార్కెట్‌గా ఆదోని మొదటి స్థానంలో నిలిచింది. ఆదోని మార్కెట్ యార్డులో ఇప్పటివరకు రూ.4,080.42 కోట్ల విలువైన 7.47 లక్షల టన్నుల ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరిగాయి. కర్నూలు యార్డులో రూ.2,041.06 కోట్ల విలువైన 4.05 లక్షల టన్నుల క్రయవిక్రయాలు జరిగాయి. 1.10 కోట్ల బిడ్స్‌తో ఆదోని జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలవగా.. ఆ తరువాత అరకోటి బిడ్స్‌తో కర్నూలు యార్డు రెండో స్థానంలో నిలిచింది.

నేరాలు 15 శాతం తగ్గాయి

- డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి వెల్లడి
- విజయవాడ రాధా నగర్‌లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రారంభం



పోలీస్ స్టేషన్‌ని ప్రారంభిస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా

విజయవాడ రూరల్: రాష్ట్రంలో శాంతిభద్రతలు గతంతో పోలిస్తే బాగా మెరుగయ్యాయని రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి వెల్లడించారు. విజయవాడ రాధానగర్‌లో ఏర్పాటు చేసిన అజిత్‌సింగ్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. గతంతో పోలిస్తే నేరాల సంఖ్య 15 శాతం తగ్గుముఖం పట్టిందని చెప్పారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చేపట్టిన చర్యల కారణంగా రోడ్డు ప్రమాదాలు చాలా తగ్గాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలను కొనసాగించాలని పోలీస్ అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ యాప్ వల్ల రాష్ట్రంలో మహిళల వేధింపుల కేసులు, కట్నం కేసులు 15 శాతం తగ్గాయని వివరించారు.

నాలుగేళ్ల కల సాకారం: ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుతో నాలుగేళ్ల కల సాకారమైందన్నారు. మునిసిపల్, పోలీస్ అధికారులు సహకరించటం వల్లే ఇది సాధ్యమైందన్నారు. సిబ్బంది సంఖ్య పెంచాలని డీజీపీకి సూచించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతి రాణాటాటా, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, డీసీపీ విశాల్‌గున్నీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి పాల్గొన్నారు.

పగలు రెక్కీ.. రాత్రి చోరీ

- రూ. 10.50 లక్షలు విలువజేసే బంగారు, వెండి వస్తువులు స్వాధీనం
- మీడియాతో కడప డీఎస్పీ షరీఫ్



నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న కడప డీఎస్పీ షరీఫ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో వరుస దొంగతనాలకు పాల్పడిన దొంగను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని కడప డీఎస్పీ మహమ్మద్ షరీఫ్ తెలిపారు. శనివారం కడప నగరంలోని చిన్నచౌకు పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నిందితుడి అరెస్టు వివరాలను వెల్లడించారు. కడప శంకరాపురానికి చెందిన కృష్ణకుమార్ గత కొంతకాలంగా నగరంలో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని పగలు రెక్కీ నిర్వహిస్తూ రాత్రి సమయాల్లో ఆయా ఇళ్లల్లో చోరీలకు పాల్పడేవాడన్నారు. ఈ విషయంగా తమకు అందిన ఫిర్యాదుల మేరకు చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి, ఎస్ఐలు రవికుమార్, తులసి నాగప్రసాద్‌లు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఈ క్రమంలో నిందితుడిని చలమారెడ్డిపల్లె క్రాస్ వద్ద అరెస్టు చేసి తొమ్మిది లక్షలు విలువజేసే సుమారు 125 గ్రాముల బంగారు వస్తువులు, లక్షా 50 వేలు విలువజేసే 1.7 కిలోల వెండి వస్తువులు, దొంగతనాలకు ఉపయోగించిన హైడ్రాలిక్ కట్టర్, ఇనుపరాడ్డును స్వాధీనం చేసుకున్నామన్నారు. దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఇళ్లకు తాళాలు వేసేటప్పుడు విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. దొంగను అరెస్టు చేయడంలో కృషి చేసిన చిన్నచౌకు పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రశంసిస్తూ రివార్డు కోసం సిఫార్సు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సీఐ నరసింహా రెడ్డి, ఎస్ఐలు తులసి నాగ ప్రసాద్, రవికుమార్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఏఎస్ ప్రసాద్, ఎంవీ సుబ్బరాజు, హెడ్ కానిస్టేబుళ్లు ఎస్.వేణుగోపాల్, జె.రామసుబ్బారెడ్డి, సి.శివకుమార్, కానిస్టేబుళ్లు పీవీ శ్రీనివాసులు, పి.ఖాదర్‌హుసేన్, సి.సుధాకర్‌యాదవ్, ఎస్పీ రంతుబాషా, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజలు పోలీసులకు సహకరించాలి

ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి ఎక్కడికైనా వెళ్లాల్సి వచ్చినప్పుడు సంబంధిత పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని డీఎస్పీ తెలిపారు. ఇళ్లల్లో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు వారివారి వీధుల్లో కమిటీలు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపిస్తే ఆ సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ రూముకు తెలియజేయాలన్నారు. అలాగే 91211 00531, 91211 00542, 81868 81100, డయల్ 100కు కూడా సమాచారం ఇవ్వవచ్చని ఆయన వివరించారు. అలాగే కడప నగరంలో నాలుగు రక్షక్ వాహనాలు, 16 బ్లూ కోల్ట్స్‌ను పెంచామన్నారు. కడపను రాత్రి వేళల్లో రెండు విభాగాలుగా చేశామన్నారు. జోన్–1లో కడప టుటౌన్, తాలూకా, సీకే దిన్నె పోలీసు స్టేషన్లుగాను, జోన్–2లో కడప వన్‌టౌన్, చిన్నచౌకు, రిమ్స్ పోలీసుస్టేషన్లు ఉన్నాయన్నారు. ఒక్కొక్క జోన్‌కు ఒక సీఐ, ముగ్గురు ఎస్ఐలు రాత్రివేళల్లో నిర్విరామంగా తిరుగుతూ ప్రతి గంటకు వేర్వేరుచోట్ల వాహనాలను తనిఖీ చేస్తుంటారన్నారు. వీరందరిపై కమాండ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణ ఉంటుందన్నారు.

బీపీటీకి భలే గిరాకీ

- రికార్డుస్థాయిలో ధాన్యం ధర
- బస్తా రూ.1,820కు కొనుగోలు
- 2014–15లో రూ.950 మాత్రమే
- అప్పటితో పోలిస్తే రెట్టింపయిన వైనం
- వర్షాభావ పరిస్థితుల్లోనూ పెరిగిన దిగుబడులు
- దివిసీమ రైతుల్లో ఆనందం

అవనిగడ్డ: బీపీటీ ధాన్యానికి రికార్డు స్థాయిలో ధర పలుకుతుండడంతో 'దివిసీమ' రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల ఫలితంగా వర్షాభావ పరిస్థితుల్లో సైతం అధిక దిగుబడులు రావడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, మోపిదేవి, చల్లపల్లి మండలాల్లో ఈ ఏడాది 62,548 ఎకరాల్లో బీపీటీ–5204 వరి రకాన్ని సాగు చేశారు. ఈ సంవత్సరం సరిగా వర్షాలు పడకపోయినా ఇరిగేషన్‌శాఖ అధికారులు రైతులను సమన్వయ పరచి వంతుల వారీ విధానం ద్వారా సాగు నీరు అందించారు. దివిసీమలోని పలు ప్రాంతాల్లో నాలుగు రోజుల నుంచి యంత్రాలతో వరికోత పనులు ముమ్మరం చేశారు. గతేడాది కంటే ఈ సంవత్సరం ఎకరాకు ఐదు బస్తాల దిగుబడి పెరిగినట్లు కోడూరుకు చెందిన రైతులు తెలిపారు.



ధాన్యాన్ని చల్లపల్లిలో రహదారి పక్కన ఆరబోసుకుంటున్న రైతులు

2014తో పోలిస్తే రెట్టింపైన ధర..

2014–15 చంద్రబాబు పాలనలో సాధారణ వరి రకం క్వింటా రూ.1,360 ఉండగా, బస్తా ధాన్యం రూ.850కి కొనుగోలు చేశారు. ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.1,400 ఉండగా బస్తా ధాన్యం రూ.950కి కొన్నారు. 2022–23 నాటికి సాధారణ రకం రూ.2,040 ఉండగా, ఏ గ్రేడ్ రకం రూ.2,060 ఉంది. 2023–24లో సాధారణ రకం రూ.2,183 ఉండగా, ఏ గ్రేడ్ రకం రూ.2,203 ఉంది. అంటే 2014తో పోలిస్తే సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.823 ధర పెరగ్గా, ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.803 ధర పెరిగింది. 2014తో పోలిస్తే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బస్తాకు ధర రెట్టింపు స్థాయిలో పెరిగింది. కాగా, గతేడాది కోతల తరువాత నాలుగైదు నెలలకు బస్తా రూ.1,800 ధర పలకగా, నేడు యంత్రాలతో కోసిన ధాన్యాన్ని కల్లంలోనే రూ.1,820కు కొంటుండడంతో రైతులు పట్టరాని ఆనందంలో ఉన్నారు.

మిషన్‌కోత ధాన్యం ఇంత ధర పలకడం ఎప్పుడూ చూడలేదు..



ఆరున్నర ఎకరాల్లో వరిపంట సాగు చేశాం. మిషన్‌తో వరికోత కోశాం. ఎకరాకు 35 బస్తాల దిగుబడి వచ్చింది. బస్తా ధాన్యం రూ.1,820కి అమ్మేశాం. మిషన్‌కోత ధాన్యం ఇంత రేటు పలకడం నేను ఎప్పుడూ చూడలేదు.

–మాలే రాధాకృష్ణ, ఇస్మాయేల్‌బేగ్‌పేట, కోడూరు మండలం

ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు..



రెండెకరాలు కౌలుకు సాగు చేశాను. గతేడాదితో పోలిస్తే ఖర్చులు తగ్గి.. దిగుబడులు పెరిగాయి. యంత్రాలతో కోసిన ధాన్యంను ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తున్నారు. గతేడాది కంటే ఈ సంవత్సరం ఎక్కువ ధరకు కొంటున్నారు.

– జుజ్జువరపు రామస్వామి, కౌలురైతు, వెంకటాపురం, మోపిదేవి మండలం

క్లుప్తంగా...

చలి తీవ్రత ఈసారి తక్కువే

వాతావరణ శాఖ అంచనా

ఢిల్లీ: దేశవ్యాప్తంగా అత్యధిక ప్రాంతాల్లో ఈసారి డిసెంబర్ నెలలో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా కాస్తంత అధికంగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ''ఉత్తర, వాయవ్య, మధ్య, తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో చలి గాలుల తీవ్రత సాధారణ స్థాయి కన్నా తక్కువగా ఉండే అవకాశం ఉంది. అందుకే ఈసారి డిసెంబర్‌లో చలి తక్కువగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ డిసెంబర్‌-ఫిబ్రవరి సీజన్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణంగా కన్నా కాస్తంత ఎక్కువ నమోదవ్వొచ్చు. ఈసారి ఎల్‌నినో పరిస్థితులు ఉండటమూ ఇందుకు మరో ప్రధాన కారణం'' అని విశ్లేషించింది.

ఢిల్లీలో పొగమంచు.. విమానాలు మళ్లింపు

సాక్షి, న్యూఢిల్లీ: పొగ మంచు కమ్మేయడంతో దేశ రాజధాని ఢిల్లీకి రావాల్సిన పలు విమానాలు దారి మళ్లించారు. విజిబిలిటీ తగ్గిపోవడంతో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య హైదరాబాద్, బెంగళూరు, ముంబై, విశాఖపట్నం, భువనేశ్వర్, కోల్‌కతా నగరాల నుంచి ఢిల్లీకి వస్తున్న 20 విమానాలను జైపూర్, లక్నో, అహ్మదాబాద్, అమృత్‌సర్ ఎయిర్‌పోర్టులకు దారి మళ్లించారు. ఢిల్లీ నుంచి లక్నో, జైపూర్, భువనేశ్వర్, హైదరాబాద్, బెంగళూరు వెళ్లాల్సిన విమానాలను రన్‌వే పైనే నిలిపివేసినట్లు ఎయిర్‌పోర్ట్ వర్గాలు వెల్లడించాయి.

ఇమ్రాన్ స్థానంలో గోహర్ అలీ

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పాకిస్తాన్ తెహ్రీక్‌-ఇ-ఇన్సాఫ్(పీటీఐ) పార్టీ చీఫ్‌గా గోహర్ అలీ ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ ఎన్నికల గుర్తుగా 'బ్యాట్' కొనసాగాలంటే సంస్థాగత ఎన్నికలు జరపాల్సిందేనన్న ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఈ ఎన్నిక జరిగినట్లుగా భావిస్తున్నారు. గోహర్ పేరును ఇమ్రాన్ ప్రతిపాదించారు. శనివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో గోహర్(45) పార్టీ అధ్యక్ష పదవికి పోటీ లేకుండా ఎన్నికైనట్లు డాన్ పత్రిక తెలిపింది. తోషఖానా అవినీతి కేసు సహా పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న ఇమ్రాన్ సెప్టెంబర్ నుంచి జైలులో ఉన్నారు. అందుకే, సంస్థాగత ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేకపోయారు.

వామ్మో చైనా ఇన్ఫెక్షన్

అమెరికాలో తీవ్ర ఆందోళనలు

వాషింగ్టన్: చైనాలో నానాటికీ పెరుగుతున్న శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు ప్రపంచాన్ని కలవరపెడుతున్నాయి. తాజాగా గుర్తు తెలియని కొత్త రకం బ్యాక్టీరియల్ నిమోనియా దేశమంతటా శరవేగంగా వ్యాపిస్తుండటం మరింత భయోత్పాతానికి కారణమవుతోంది. ఈ నేపథ్యంలో తక్షణం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అమెరికాలో డిమాండ్లు పెరుగుతున్నాయి. చైనాకు రాకపోకలపై పూర్తిగా నిషేధం విధించాలని ఐదుగురు రిపబ్లికన్ సెనేటర్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు లేఖ రాశారు.

మహిళల మీద రేప్ కేసు?

సాధ్యాసాధ్యాల పరిశీలనకు సుప్రీంకోర్టు అంగీకారం

న్యూఢిల్లీ: అత్యాచార సంఘటనల్లో మహిళలే బాధితులుగా ఉంటారు. మరి వారి మీద రేప్ కేసు పెట్టొచ్చా? దీనిలో సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. రేప్ కేసులో ముందస్తు బెయిల్ కోసం ఒక 61 ఏళ్ల మహిళ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. సదరు మహిళపై కోడలు రేప్ కేసు పెట్టింది. కేసును జస్టిస్ హృషికేశ్, జస్టిస్ సంజయ్‌ల ధర్మాసనం విచారించింది. చట్టప్రకారం మహిళలపై ఇలా రేప్ కేసు పెట్టలేరని ఆమె తరఫు న్యాయవాది గుర్తుచేశారు. ఈ మేరకు గతంలో సుప్రీంకోర్టు ఒక తీర్పు వెలువర్చిందని గుర్తుచేశారు. దీంతో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా స్పందన తెలిపాలని ఆదేశించింది.

ఫిలిప్పీన్స్‌లో భూకంపం.. సునామీ హెచ్చరికలు జారీ

మనీలా: ఫిలిప్పీన్స్‌లోని మిండనావో దీవిని శనివారం శక్తివంతమైన భూకంపం కుదిపేసింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.6గా నమోదైంది. భూకంపం నేపథ్యంలో అధికారులు సునామీ హెచ్చరికలను జారీ చేశారు. భూమిలో 32 కిలోమీటర్ల లోతులో రాత్రి 10.37 గంటల సమయంలో ఇది సంభవించింది. దక్షిణ ఫిలిప్పీన్స్, ఇండోనేసియాలోని కొన్ని ప్రాంతాలు, మలేసియాలో సునామీ అలలు మీటరు ఎత్తున ఎగిసిపడే అవకాశముందని అంచనా వేసినట్లు పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్ తెలిపింది.


దక్షిణ గాజాపై ఇజ్రాయెల్ గురి

ఖాన్ యూనిస్: శనివారం దక్షిణ గాజాలోని నిర్దేశిత లక్ష్యాలపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడింది. ఇజ్రాయెల్ సైన్యం గాజా స్ట్రిప్‌లో హెలికాప్టర్ల ద్వారా మొట్టమొదటిసారిగా మ్యాప్ ముద్రించిన కరపత్రాలను విడిచిపెట్టింది. అందులో, దాడుల నుంచి రక్షణ పొందేందుకు తాముంటున్న చోటు నుంచి సురక్షిత ప్రాంతానికి ఎలా వెళ్లాలో తెలిపే వివరాలున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం వరకు దాడుల్లో కనీసం 200 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయినట్లు గాజాలోని ఆరోగ్య శాఖ తెలిపింది.

వాలుతున్న వెయ్యేళ్ల టవర్

ఏ క్షణమైనా కుప్పకూలొచ్చు!

ఇటలీ అనగానే అందరికీ టక్కున గుర్తొచ్చేది పీసా నగరంలోని ప్రపంచ ప్రఖ్యాత లీనింగ్ టవరే. నాలుగు డిగ్రీల కోణంలో ఒకవైపు వాలిపోయి అందరికీ ఆకట్టుకుంటూ కన్పిస్తుందా కట్టడం. అయితే ఇటలీలోనే మరో లీనింగ్ టవర్ కూడా ఉంది. అది కూడా కాస్త అటూ ఇటుగా పీసా టవర్ అంత ఎత్తు ఉంటుంది. అలాంటి టవర్ కాస్తా ఇప్పుడు ఏ క్షణమైనా కుప్పకూలేలా కన్పిస్తూ గుబులు రేపుతోంది....!



ఇటలీలో గుబులు రేపుతున్న మరో లీనింగ్ టవర్

- ఎలాగైనా కాపాడేందుకు ప్రభుత్వ ప్రయత్నాలు
- కూలినా పరిసరాలకు నష్టం జరగకుండా బారికేడ్ నిర్మాణం

ఇటలీలోని బొలోగ్నా నగరంలో గారిసెండా టవర్ ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. పీసా టవర్ మాదిరిగానే ఇది కూడా నానాటికీ ఓ పక్కకు వాలిపోతుండటమే ఇందుకు కారణం. అలా ఈ టవర్ ఇప్పటిదాకా 4 డిగ్రీల కోణంలో పక్కకు ఒరిగింది. దీనికి తోడు దాని పునాదులు కొంతకాలంగా బాగా బలహీనపడుతూ వస్తున్నట్టు అధికారులు తేల్చారు. దాంతో నగర కౌన్సిల్ హుటాహుటిన సమావేశమై దీని గురించి కూలంకషంగా చర్చించింది. టవర్ ఏ క్షణమైనా కుప్పకూలే ప్రమాదముందని ధ్రువీకరించింది. అదే జరిగితే శిథిలాల ధాటికి పరిసర చుట్టుపక్కల అతి సమీపంలో ఉన్న పలు నివాస, వాణిజ్య సముదాయాలు తీవ్రంగా దెబ్బ తినే ప్రమాదముంది. దీన్ని నివారించేందుకు ముందు జాగ్రత్త చర్యగా టవర్ చుట్టూ యుద్ధ ప్రాతిపదికన 5 మీటర్ల ఎత్తున బారియర్ నిర్మిస్తున్నారు. 2024 ఏప్రిల్ లోపు దాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దాంతోపాటు టవర్ చుట్టూ మెటల్ రాక్ ఫాల్ వలలను ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా అది కూలినా పరిసర నిర్మాణాలకు ఎలాంటి నష్టమూ లేకుండా చూసేందుకు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో అక్టోబర్ నుంచి టవర్, దాని గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్లాజాలోకి సందర్శకులకు అనుమతి నిరాకరించారు. సందర్శనపై నిషేధం మరికొన్నేళ్ల దాకా (టవర్ కూలని పక్షంలో) కొనసాగుతుందని ఇప్పటికే ప్రకటించారు. బారియర్ నిర్మాణ వ్యయం 37 లక్షల పౌండ్లు(దాదాపు రూ.39.10 కోట్లు)గా అంచనా వేశారు. దీని కోసం ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తుండటం విశేషం! ''నగరవాసులతో పాటు బొలోగ్నా నగరాన్ని, దాని ప్రఖ్యాత పర్యాటక చిహ్నాలను కాపాడాలని తపిస్తున్న ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రియులందరూ ఈ బృహత్తర యజ్ఞంలో భాగస్వాములు కావాలి'' అంటూ నగర కౌన్సిల్ పిలుపునిచ్చింది.



టవర్ చుట్టూ ఏర్పాటుచేసిన మెటల్ రాక్ ఫాల్ వల

దాదాపు వెయ్యేళ్ల నాటిది!

- గారిసెండా టవర్ ఇప్పటిది కాదు. మధ్య యుగానికి చెందినది.
- దీన్ని దాదాపు వెయ్యేళ్ల క్రితం, అంటే క్రీస్తు శకం 1,109 సంవత్సరంలో నిర్మించారు.
- టవర్ ప్రస్తుత ఎత్తు 47 మీటర్లు (154 అడుగులు).
- నిర్మించినప్పుడు ఇది చాలా ఎత్తుండేది.
- 200 ఏళ్లకే టవర్ ఒక పక్కకు ఒరగడం మొదలైంది.
- దాంతో 14వ శతాబ్దంలో దాని ఎత్తును బాగా తగ్గించారు.
- డాంటే 1321 సంవత్సరంలో ముగించిన అజరామర పద్య కావ్యం 'ది డివైన్ కామెడీ'లో కూడా గారిసెండా టవర్ ప్రస్తావన ఉంది.

నిలబెట్టేందుకు తీవ్ర యత్నాలు

గారిసెండా టవర్ కూలిపోకుండా కాపాడేందుకు ఇటలీ శాయశక్తులా ప్రయత్నిస్తోంది. పీసా టవర్ కూడా క్రమంగా మరింత పక్కకు వాలి త్వరలో కూలిపోవడం ఖాయమని కొన్నేళ్ల క్రితం వార్తలొచ్చాయి. కానీ ప్రభుత్వం ఏళ్ల తరబడి నానా ప్రయత్నాలూ చేసి దాని ఒంపును కొంతమేర సరిచేసింది. ప్రస్తుతానికి అది కుప్పకూలే ముప్పు లేదని తేల్చింది. అలా పీసా టవర్‌ను కాస్త సురక్షితంగా మార్చిన అనుభవాన్నంతా గారిసెండా విషయంలో రంగరిస్తున్నారు. ఇందుకోసం సివిల్ ప్రొటెక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. తొలి దశలో దీన్ని వీలైనంత సురక్షితంగా తీర్చిదిద్దే పనిలో పడ్డారు. సంబంధిత పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి.

రెట్టింపు ఎత్తైన జంట టవర్

గారిసెండా నిజానికి బొలోగ్నా నగరానికి ప్రధాన ఆకర్షణగా నిలిచిన జంట టవర్లలో ఒకటి మాత్రమే! పైగా చిన్నది. ఎందుకంటే, దీని పక్కనే ఉన్న అసినెల్లీ టవర్ దీనికంటే దాదాపు రెట్టింపు పొడవైంది! అంటే దాదాపు 90 మీటర్లన్నమాట. ప్రఖ్యాత పీసా టవర్ ఎత్తు 56 మీటర్లే. అంటే, ఇది పీసాను తలదన్నేంత ఎత్తుందన్నమాట! అసినెల్లీ టవర్ నిర్మాణం గారిసెండా తర్వాత పదేళ్లకే, అంటే 1,119లో జరిగింది. ఇది కూడా కాస్త పక్కకు ఒరిగే ఉండటం విశేషం. అయితే ఆ ఒంపు మరీ పీసా, గారిసెండా అంతగా లేదు గనుక ప్రస్తుతానికి దీనికి వచ్చిన ముప్పేమీ లేనట్టే! – సాక్షి, నేషనల్ డెస్క్

పని మొదలెట్టిన ఆదిత్య-ఎల్ 1

- సౌరగాలులను రికార్డ్‌చేసిన ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్
- వివరాలు షేర్ చేసిన ఇస్రో

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): సూర్యుడిని అధ్యయనం చేసేందుకు రోదసీలోకి దూసుకెళ్లిన ఆదిత్య-ఎల్ 1 తన ప్రయాణంలో మరో మైలు రాయిని అందుకుంది. ఈ ఉపగ్రహంలోని ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్ అనే పరికరం తన కార్యకలాపాలను మొదలుపెట్టిందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ప్రకటించింది. ఈ పరికరంలోని రెండు విభిన్న భాగాలు తమ పరిశోధనలను విజయవంతంగా కొనసాగిస్తున్నాయి. ఇవి సౌర గాలులను అధ్యయనం చేస్తున్నాయి' అని ఇస్రో వెల్లడించింది. సంబంధిత వివరాలను ఇస్రో తన 'ఎక్స్' ఖాతాలో ట్వీట్‌చేసింది. 'సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్'లో భాగమైన సూపర్‌థర్మల్ అండ్ ఎనర్జిటిక్ పార్టికల్ స్పెక్ట్రోమీటర్(స్టెప్స్)ను సెప్టెంబర్ పదో తేదీన, సోలార్ విండ్ అయాన్ స్పెక్ట్రోమీటర్(స్విస్)ను నవంబర్ రెండో తేదీన యాక్టివేట్ చేయడం తెల్సిందే. ఈ రెండు భాగాలు తమ కార్యకలాపాలను విజయవంతంగా కొనసాగిస్తున్నాయని ఇస్రో పేర్కొంది. స్విస్‌లో ఉన్న రెండు సెన్సార్లు 360 డిగ్రీలో చక్కర్లు కొడుతూ విధులు నిర్వర్తిస్తున్నాయి. నవంబర్ నెలలో సోలార్ విండ్ అయాన్లు, ప్రైమరీ ప్రోటాన్స్, ఆల్ఫా పార్టికల్స్‌లను 'స్విస్' విజయవంతంగా లెక్కగట్టి విశ్లేషించగలిగిందని ఇస్రో ప్రకటించింది. ఈ సెన్సర్ సేకరించిన ఎనర్జీ హిస్టోగామ్‌ను పరిశీలించారు. దీంతో ప్రోటాన్, అయనీకరణ చెందిన హీలియం, ఆల్ఫా పార్టికల్స్‌లో కొన్ని భిన్న లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ తాజా విశ్లేషణతో సౌర గాలుల విలక్షణతపై ఇన్నాళ్లూ నెలకొన్న ప్రశ్నలకు సమాధానాలు దొరికే అవకాశముందని ఇస్రో శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తంచేశారు. సౌర గాలుల్లోని అంతర్గత ప్రక్రియలు.. భూమిపై ఏ విధమైన ప్రభావం చూపుతాయనే విషయంపై సమగ్ర అధ్యయనం చేసేందుకు తాజా డేటా సహాయకారిగా ఉంటుందని ఇస్రో పేర్కొంది. లాగ్రాంజ్ పాయింట్ వద్ద చోటుచేసుకునే కరోనల్ మాస్ ఎజెక్షన్స్‌పై ఓ అవగాహనకు రావచ్చని వెల్లడించింది. సూర్యుడిపై అధ్యయనం కోసం ఈ ఏడాది సెప్టెంబరు 2న నింగిలోకి దూసుకెళ్లిన 'ఆదిత్య – ఎల్ 1' తన ప్రయాణంలో దాదాపు చివరి దశను చేరుకుంది. భూమి నుంచి 15 లక్షల కి.మీ దూరంలో ఉన్న లాగ్రాంజ్ పాయింట్-1 చేరాక దాని కక్ష్యలో పరిభ్రమిస్తూ ఆదిత్య – ఎల్ 1 సూర్యుడిని అధ్యయనం చేయనుంది.



---

4 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడే విడుదల

తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌ల్లో నేడే ఓట్ల లెక్కింపు

- ఏర్పాట్లన్నీ పూర్తి, కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత
- ఉదయం ఎనిమిది గంటలకు పోస్టల్ ఓట్ల లెక్కింపుతో మొదలు

- 11 గంటలకల్లా ఫలితాల సరళిపై స్పష్టత వచ్చే అవకాశం
- మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లో బీజేపీ నెగ్గవచ్చన్న ఎగ్జిట్ పోల్స్
- ఛత్తీస్‌గఢ్, తెలంగాణల్లో కాంగ్రెస్ గెలుస్తుందని అంచనాలు
- మిజోరంలో ఓట్ల లెక్కింపు, ఫలితాలు రేపు



న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల్లో హోరాహోరీగా సాగిన ఎన్నికల సమరం ముగిసింది. ఓటింగ్ యంత్రాల్లో నిక్షిప్తమైన నేతల భవితవ్యం ఆదివారం వెల్లడి కానుంది. తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఆదివారం ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు వెల్లడి కానున్నాయి. నెలన్నరకు పైగా ప్రచారంలో నిరంతరాయంగా చెమటోడ్చి విశ్రాంతి తీసుకుంటున్న అభ్యర్థులు, నేతల్లో ఫలితాలపై చెప్పలేనంత ఉత్కంఠ నెలకొంది. ఐదో రాష్ట్రమైన మిజోరంలో ఓట్ల లెక్కింపు సోమవారానికి వాయిదా పడింది. వీటిని కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికలకు సెమీఫైనల్స్‌గా భావిస్తున్న నేపథ్యంలో ఫలితాలపై దేశవ్యాప్తంగా అందరిలోనూ ఆసక్తి నెలకొంది.

మూడుచోట్ల ముఖాముఖి

మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య ముఖాముఖి పోరు సాగింది. మధ్యప్రదేశ్‌లో బీజేపీ, మిగతా రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్న విషయం తెలిసిందే. గత మేలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీని మట్టికరిపించిన కాంగ్రెస్, అదే ఊపులో తాజా ఎన్నికల్లో మరిన్ని రాష్ట్రాల్లో పాగా వేస్తానని ఆశాభావంతో ఉంది. ఈసారి రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లు తమ వశమవుతాయని బీజేపీ భావిస్తోంది. ఈసారి మధ్యప్రదేశ్‌లో బీజేపీకి బాగా మొగ్గుందని, రాజస్తాన్‌లో ఆ పార్టీ ముందంజలో ఉందని గురువారం వెలువడ్డ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు పేర్కొన్నాయి. ఛత్తీస్‌గఢ్‌తో పాటు తెలంగాణలో కాంగ్రెస్‌కే విజయావకాశాలున్నట్టు తేల్చాయి. హోరాహోరీ పోటీ నేపథ్యంలో హంగ్ వచ్చే చోట ఎమ్మెల్యేలను శిబిరాలకు తరలించేందుకు రెండు పార్టీలూ ప్రయత్నాలు చేసుకుంటున్నట్టు సమాచారం.

ఉదయం ఎనిమిదికి షురూ

- నాలుగు రాష్ట్రాల్లోనూ ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు మొదలు కానుంది.
- తొలుత పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు.
- అనంతరం 8.30గంటలకు నుంచి ఓటింగ్ యంత్రాల్లోని ఓట్ల లెక్కింపు మొదలవుతుంది.

మధ్యప్రదేశ్

రాష్ట్రంలో 52 జిల్లా కేంద్రాల్లో కౌంటింగ్ జరగనుంది. ఇందుకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఇక్కడ 2,533 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. గురువారం నాటి ఎగ్జిట్ పోల్స్‌లో మూడు బీజేపీకి ఘనవిజయం ఖాయమని పేర్కొన్నాయి. 2018 మాదిరిగా రెండు పార్టీలూ విజయానికి దగ్గరగా వస్తాయని మరికొన్ని అంచనా వేశాయి. ఒకట్రెండు కాంగ్రెస్ విజయాన్ని సూచించాయి. భారీ మెజారిటీతో బీజేపీ అధికారాన్ని నిలుపుకుని తీరుతుందని ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ శనివారం ధీమా వ్యక్తంచేశారు. ప్రజలు ఈసారి మార్పుకే ఓటేశారని పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ చెప్పుకొచ్చారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ 114 సీట్లు సాధించగా బీజేపీ 109 స్థానాలతో సరిపెట్టుకుంది.

రాష్ట్రంలో మొత్తం అసెంబ్లీ స్థానాలు	230
మెజారిటీ మార్కు	116

రాజస్తాన్

ఈ కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో ఎన్నికల పోరు హోరాహోరీగా సాగింది. ప్రతి ఐదేళ్లకూ ప్రభుత్వాన్ని మార్చేయడం రాజస్తాన్ ప్రజల అలవాటు. ఈ ఆనవాయితీ ఈసారీ కొనసాగుతుందని, మోదీ మేనియా తోడై తమకు అధికారం కట్టబెడుతుందని బీజేపీ నేతలు చెబుతున్నారు. సీఎం గెహ్లోత్ మాత్రం ఈసారి ఆనవాయితీ మారుతుందని నమ్మకం పెట్టుకున్నారు. తన సంక్షేమ పథకాలు ఖచ్చితంగా గట్టెక్కిస్తాయని చెబుతున్నారు. 2018 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన నాటినుంచీ గెహ్లోత్‌పై కారాలూ మిరియాలూ నూరుతూ వస్తున్న కాంగ్రెస్ యువ నేత సచిన్ పైలట్ ప్రచార పర్వంలో మాత్రం సంయమనం పాటించారు.

రాష్ట్రంలో మొత్తం అసెంబ్లీ స్థానాలు	200
మెజారిటీ మార్కు	101

ఛత్తీస్‌గఢ్

రాష్ట్రంలో 33 జిల్లా కేంద్రాల్లో కౌంటింగ్ జరగనుంది. ఇందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేలా చూసేందుకు 90 మంది రిటర్నింగ్ అధికారులు, 416 మంది సహాయ రిటర్నింగ్ అధికారులు, 1,698 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. రాష్ట్రంలో మొత్తం 1,181 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో కాంగ్రెస్ నుంచి సీఎం భూపేశ్ బఘేల్, ఉప ముఖ్యమంత్రి టీఎస్ సింగ్‌దేవ్, బీజేపీ నుంచి మాజీ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ తదితర ప్రముఖులున్నారు.

రాష్ట్రంలో మొత్తం అసెంబ్లీ స్థానాలు	90
మెజారిటీ మార్కు	46

'బహిష్కరణ'పై చర్చ జరగాల్సిందే

మొయిత్రా అంశంపై విపక్షాల పట్టు

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ మహిళా ఎంపీ మహువా మొయిత్రాను లోక్‌సభ నుంచి బహిష్కరించాలంటూ ఎథిక్స్ కమిటీ చేసిన సిఫార్సులు.. అఖిలపక్ష భేటీలో వేడిపుట్టించాయి. ఆ సిఫార్సులపై లోక్‌సభలో తుది నిర్ణయం తీసుకునేలోపే పార్లమెంట్‌లో వాటిపై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టాయి. సోమవారం నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం ఏర్పాటుచేసిన అఖిలపక్ష భేటీ వాడీవేడీగా జరిగింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీకి పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, కాంగ్రెస్ నేతలు జైరామ్ రమేశ్, గౌరవ్ గొగోయ్, ప్రమోద్ తివారీలతో పాటు తృణమూల్ కాంగ్రెస్ నేతలు సుదీప్ బంధోపాధ్యాయ్, డెరెక్ ఓబ్రియాన్, ఎన్సీపీ నేతలు ఫౌజియా ఖాన్ తదితరులు హాజరయ్యారు. 'నగదుకు ప్రశ్నలు' ఉదంతంలో మహువా మొయిత్రాను బహిష్కరించేందుకు వీలుగా లోక్‌సభ ఎథిక్స్ కమిటీ నివేదికపై పార్లమెంట్ తొలిరోజే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం యోస్తోంది. దీంతో ప్రభుత్వ వైఖరిని విపక్ష సభ్యులు ఆక్షేపించారు. బహిష్కరణపై తుది నిర్ణయం తీసుకునే ముందు నివేదికపై చర్చ చేపట్టాలని టీఎంసీ నేతలు డిమాండ్ చేశారు. సభలో చర్చ జరక్కుండానే ఎథిక్స్ కమిటీ నివేదిక బహిర్గతం కావడాన్ని వారు నిరసించారు.

మహువాపై బహిష్కరణ వేటు తీవ్ర శిక్ష: అధీర్ రంజన్

టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాను సభ నుంచి బహిష్కరించాలన్న యోచన అత్యంత తీవ్రమైనదని, దీని పర్యవసానాలు ఎన్నో రకాలుగా ఉంటాయని లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధురి ఆగ్రహంవ్యక్తంచేశారు. పార్లమెంటరీ కమిటీ నిబంధనలు, ప్రక్రియలపై పునఃసమీక్ష చేపట్టాలని కోరారు. ఈ మేరకు శనివారం ఆయన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు నాలుగు పేజీల లేఖ రాశారు.

అఖిలపక్షానికి హాజరుకాలేకపోయిన వైఎస్సార్‌సీపీ

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ నుంచి ఢిల్లీ వచ్చే ఎయిర్‌ఇండియా విమానం శనివారం దారి మళ్లింపు కారణంగా పార్లమెంటు అఖిలపక్ష సమావేశానికి వైఎస్సార్‌సీపీ హాజరుకాలేకపోయింది. ఉదయం 8.10 నిమిషాలకు ఢిల్లీ రావాల్సిన విమానాన్ని విజిబిలిటీ లేని కారణంగా జైపూర్ మళ్లించారు. ఇదే విమానంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రయాణించారు. విమానం దారి మళ్లింపు కారణంగా ఉదయం పార్లమెంటు లైబ్రరీ భవనంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ఎంపీ విజయసాయిరెడ్డి హాజరుకాలేకపోయారు. పార్లమెంటు సమావేశాలు సజావుగా సాగడానికి సహకరిస్తామని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది.



మెలోనీ 'మెలోడీ'కి మోదీ ఫిదా

- మోదీతో సెల్ఫీని ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఇటలీ ప్రధాని
- ఇంటర్నెట్లో వైరలైన పోస్టు, చూస్తుండగానే 2.2 కోట్ల వ్యూస్

న్యూఢిల్లీ: ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ చేసిన 'మెలోడీ'కి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు నెటిజన్లంతా ఫిదా అయ్యారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానులిద్దరి మధ్య నడిచిన పోస్టులు వైరల్‌గా మారాయి. శుక్రవారం దుబాయ్‌లో కాప్‌28 సదస్సు సందర్భంగా వారిద్దరూ భేటీ కావడం తెలిసిందే. ఈ సందర్భంగా మోదీతో తీసుకున్న సెల్ఫీని మెలోనీ శనివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'కాప్‌28 సదస్సులో మంచి మిత్రులు'అనే క్యాప్షన్‌తో పాటు, తామిద్దరి పేర్లనూ అందంగా కలుపుతూ 'మెలోడీ'అంటూ హాష్‌టాగ్ జత చేశారు. దాంతో ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. చూస్తుండగానే దానికి ఏకంగా 2.2 కోట్ల వ్యూస్ వచ్చాయి. దీనికి మోదీ కూడా సరదాగా స్పందించారు. 'మిత్రులతో కలయిక ఎప్పుడూ ఆహ్లాదకరమే' అనే క్యాప్షన్‌తో మెలోనీ సెల్ఫీని రీపోస్ట్ చేశారు. వారి పోస్టులు ఇప్పుడు ఇంటర్నెట్‌లో ట్రెండింగ్‌లో ఉన్నాయి.

జీ20 నుంచీ ట్రెండింగ్‌లోనే..

నిజానికి 'మెలోడీ' హాష్‌టాగ్ గత నెలలో భారత్ తొలిసారి ఆతిథ్యమిచ్చిన జీ20 శిఖరాగ్ర సదస్సు జరిగినప్పటి నుంచీ ఇంటర్నెట్లో వైరలైంది. సోషల్ సైట్లలో తెగ తిరుగుతోంది. ఆ సదస్సు ఆద్యంతం మోదీ, మెలోనీ పరస్పరం స్నేహపూర్వకంగా మెలిగిన తీరు అందరి దృష్టినీ బాగా ఆకర్షించింది. ఆతిథ్య దేశ సారథిగా మిగతా దేశాధినేతలతో పాటు మెలోనీని కూడా మోదీ సాదరంగా సదస్సుకు ఆహ్వానించారు. ఆ సందర్భంగా ఆమె మోదీతో కరచాలనం చేశారు. కాసేపు ముచ్చటించుకుని ఇరువురూ నవ్వుల్లో మునిగి తేలారు. ఇదే ఒరవడి తాజాగా కాప్‌28 సదస్సులోనూ కొనసాగింది.

వాట్సాప్ స్టేటస్‌గా గర్ల్ ఫ్రెండ్ డెడ్‌బాడీ ఫొటో!

చెన్నై: గర్ల్ ఫ్రెండ్‌ను గొంతు పిసికి చంపేసిన ఓ యువకుడు, ఆమె మృతదేహం ఫొటోను తీసి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నాడు. మృతురాలి స్నేహితులు గుర్తు పట్టి, పోలీసులను అప్రమత్తం చేయడంతో అతగాడు దొరికిపోయాడు. ఈ ఘటన చెన్నైలో చోటుచేసుకుంది. కేరళలోని కొల్లంకు చెందిన ఫౌసియా(20) చెన్నైలోని ఓ హాస్టల్‌లో ఉంటూ క్రోంపేట్‌లోని కాలేజీలో నర్సింగ్ చదువుతోంది. ఆషిక్(20)అనే యువకుడితో అయిదేళ్లుగా సన్నిహితంగా ఉంటోంది. మైనర్‌గా ఉన్నప్పుడే ఫౌసియా గర్భవతి అయింది. ఆషిక్‌పై పోక్సో కేసు నమోదు కావడంతో జైలుకు వెళ్లాడు. ఫౌసియా పుట్టిన బిడ్డను దత్తతకిచ్చింది. జైలు నుంచి విడుదలయ్యాక ఆషిక్, ఫౌసియా సంబంధం తిరిగి కొనసాగుతోంది. శుక్రవారం చెన్నై వచ్చిన ఆషిక్ హోటల్‌లో రూం బుక్ చేసి, ఫౌసియాను వెంట తీసుకెళ్లాడు. అదే రోజు సాయంత్రం, మృతదేహం ఫొటోను తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టాడు. ఫౌసియా స్నేహితులు ఆ ఫొటోను గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వెంటనే వెళ్లి హోటల్ రూంలో చూడగా ఫౌసియా మృతదేహం కనిపించింది. పరారీలో ఉన్న ఆషిక్‌ను సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పట్టుకున్నారు. తనకు మరో యువతితో సంబంధముందని అనుమానిస్తూ మాట్లాడటంతో కోపం పట్టలేక ఫౌసియాను టీ షర్టుతో గొంతుకు బిగించి, చంపేసినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు.

సాక్షి 24|7 కర్ణాటక
K A R N A T A K A
ఆదివారం : 3 : డిసెంబర్ : 2023



అగ్నిని ఆర్పేయాలి

మంటలను ఆర్పడం ఎలా.. అని మహిళలకు తర్ఫీదు. శనివారం బెంగళూరులో ఓ అపార్టుమెంటులో ఫైర్ శాఖ జాగృతి ప్రదర్శన

న్యూస్‌రీల్

ఆస్పత్రిలో పసికందును కుట్టిన బొద్దింకలు !



బెంగళూరు వాణి విలాస్ ఆస్పత్రి

బనశంకరి: బెంగళూరులోని ప్రముఖ వాణివిలాస్ ఆసుపత్రిలో బొద్దింకల బెడద సతమతం చేస్తోంది. దీనికి వైద్యసిబ్బంది నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండురోజుల కిందట చికిత్స పొందుతున్న ఓ పసికందును బొద్దింకలు కుట్టిన ఘటన వెలుగుచూసింది. ఆశారాణి అనే మహిళకు ప్రసవం కాగా, శిశువుకు అనారోగ్య సమస్య ఉండడంతో అక్కడే చికిత్స చేస్తున్నారు. ఈ సమయంలో బొద్దింకలు కుట్టినట్లు చెబుతున్నారు. ఆసుపత్రి డాక్టర్ సవిత మాట్లాడుతూ పసికందుకు స్వెట్టర్ వేయడంతో శరీరం పై గీతలు పడ్డాయని, బొద్దింకలు కుట్టలేదని చెప్పారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచుతామని, కానీ రోగుల వల్లే అపరిశుభ్రత ఏర్పడుతోంది, ఆహార పదార్థాలను తలదిండు కింద పెట్టడం, ఎక్కడపడితే అక్కడ పడేయడంతో దోమలు, బొద్దింకలు వస్తుంటాయన్నారు.

రోడ్డు పక్కన ఆడశిశువు

దొడ్డబళ్లాపురం: అమ్మ ఒడిలో హాయిగా ఉండాల్సిన పసికందు అనాథగా మారింది. రాష్ట్రంలో అబార్షన్ల బాగోతం, శిశు విక్రయాల స్కాం నేపథ్యంలో రోడ్డుపక్కన నవజాత శిశువును పారవేసిన సంఘటన నెలమంగల తాలూకా బేగూరు వద్ద కలకలం రేపింది. బేగూరు వద్ద జాతీయ రహదారి పక్కన కల్వర్టు కింద శిశువు ఏడుపు విన్న స్థానికులు వెళ్లి చూడడంతో 3 రోజుల వయసు గల ఆడ శిశువు కనిపించింది. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, పిల్లల సంరక్షణ అధికారులు వచ్చి శిశువును ఆస్పత్రికి తరలించారు. శిశువు లభించిన చోట ఒక పేపర్ నోట్ కూడా లభించింది. అందులో వాణివిలాస్ ఆస్పత్రి చిరునామాతో తల్లి పేరు సుప్రిత అని, ఆనేకల్ తాలూకా బెస్తర వీధి అని రాసి ఉంది. అది నిజమైనదో, కాదో నిర్ధారించాల్సి ఉంది. పోలీసులు శిశువు తల్లి కోసం గాలిస్తున్నారు.

కండల వీరులు



విజేతలుగా నిలిచిన బాడీ బిల్డర్లు

తుమకూరు: తుమకూరు జిల్లాలోని చిక్కనాయకనహళ్ళి తాలూకాలోని హులియూరులో కండలవీరుల పోటీలు ఆకట్టుకున్నాయి. కర్ణాటక రక్షణ వేదిక ఆధ్వర్యంలో దేహధారుడ్య పోటీలను నిర్వహించారు. జిల్లాలోని యువ బాడీబిల్డర్లు పాల్గొని కండల ప్రదర్శన చేశారు. హులియూరు సమీపంలో ఉన్న నందిహళ్ళివాసి ప్రజ్వల్ పోటీలో మొదటి బహుమానం అందుకున్నారు. హులియూరువాసి అజయ్, తిపటూరువాసి జమీర్ తరువాతి స్థానాల్లో నిలిచారు.

జీఎస్టీలో కోతపై సీఎం గుర్రు

శివాజీనగర: కరువు, గ్యారంటీ పథకాలతో ఆర్థికంగా అధిక భారాన్ని ఎదుర్కొంటున్న రాష్ట్రా ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పన్నులో వాటా తగ్గించడంపై సీఎం సిద్దరామయ్యకు ఆక్రోశం వ్యక్తం చేశారు. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి రావాల్సిన జీఎస్టీ పన్నుల వాటాలో రూ. 798 కోట్లను తగ్గించారు. నవంబర్‌లో నెలలో వసూలు చేసిన పన్నుల్లో కోత పడిందని తెలిపారు. నవంబర్‌లో రాష్ట్రానికి రూ. 3,600 కోట్ల పన్నుల వాటాను కేంద్రం ఇవ్వాలని, ఆకస్మిక కోతకు కారణమేమిటో చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు.

శీతల సభా సమరం

- రేపటి నుంచి బెళగావిలో అసెంబ్లీ సమావేశాలు
- మూకుమ్మడి దాడికి బీజేపీ, జేడీఎస్ సిద్ధం
- కరువు, గ్యారంటీ లోపాలే అస్త్రాలు
- తెలంగాణ యాత్రలో డీకేశి
- సీఎం, మంత్రులపై అధిక భారం



సువర్ణసౌధ ఆవరణలో పనులు



సువర్ణసౌధలో విధానసభ

సాక్షి, బళ్లారి: రాష్ట్రంలో ఈ వేసవిలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బెళగావి సువర్ణ విధానసౌధలో అసెంబ్లీ తొలి శీతాకాల భేటీ జరిపేందుకు సిద్ధమైంది. తొలి అసెంబ్లీ సమావేశాలు బెంగళూరు విధానసౌధలో జరగడం తెలిసిందే. డిసెంబరు 4.. సోమవారం నుంచి బెళగావిలో జరగనున్న శీతాకాల సమావేశాల కోసం పాలక కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్‌లు అస్త్రాలతో సిద్ధంగా ఉన్నాయి. సువర్ణసౌధ భవనం కూడా ముస్తాబవుతోంది. ఇందుకోసం బెళగావి జిల్లా యంత్రాంగం నెలరోజుల నుంచి ఏర్పాట్లలో నిమగ్నమైంది.

చర్చకు అంశాలు అనేకం

శీతాకాల సమావేశాలు వాడీవేడిగా జరుగుతాయనడంలో ఏమాత్రం సందేహం లేదు. ముఖ్యమంత్రి విపక్షాల నుంచి గట్టి సవాళ్లను ఎదుర్కోనున్నారు. రాష్ట్రంలో 5 గ్యారంటీ పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని, యువతకు చెప్పిన నిరుద్యోగ భృతి హామీని అటకెక్కించారని, కరెంట్ కోతలు, తీవ్రమైన దుర్భిక్షం, రైతుల ఆత్మహత్యలు, కరెంటు, బస్ చార్జీల పెంపు, ఎమ్మెల్యేలకు అభివృద్ధి నిధులు కేటాయించక పోవడం తదితర అంశాలు సిద్దరామయ్య సర్కారుకు పరీక్షగా మారనున్నాయి. ఈ అంశాల ద్వారా సీఎంని, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు బీజేపీ నూతన సభాపక్ష నేత ఆర్.అశోక్, పార్టీ నూతన అధ్యక్షుడు బీవై విజయేంద్ర సిద్ధమయ్యారు. పదవులు లభించాక వారికి ఇవే తొలి అసెంబ్లీ సమావేశాలు కావడంతో సత్తా చాటుకోవాలని తహతహతో ఉండొచ్చు. బీజేపీతో పొత్తు కుదరడంతో జేడీఎస్ అధినేత హెచ్‌డీ కుమారస్వామి కూడా విమర్శలతో దాడిచేసే అవకాశముంది. ఇటీవల డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌పై సీబీఐ విచారణ సిఫార్సును రాష్ట్రప్రభుత్వం వెనక్కు తీసుకోవడం కూడా చర్చనీయాంశం కావచ్చు. ఉత్తర కర్ణాటకకు ఉపయోగపడే చర్చలు ఈ సమావేశాల్లో జరుగుతాయని సభాపతులు, మంత్రులు చెబుతూ ఉన్నారు.



పెద్దల సభ విధాన పరిషత్

తెలంగాణలో డిప్యూటీ సీఎం

ప్రతిపక్షాలకు ప్రభుత్వం దీటుగా సమాధానం ఇచ్చేందుకు ముఖ్యమంత్రి, ట్రబుల్ షూటర్ డీకేశి ప్రయత్నాల్లో ఉన్నారు. అయితే తెలంగాణలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో క్యాంపు రాజకీయాలకు డీకే హైదరాబాద్‌కు వెళ్లడం వల్ల అసెంబ్లీకి హాజరు అనుమానంగా ఉంది. దీంతో సీఎం, మంత్రులే ఎక్కువగా పనిచేయాల్సి రావచ్చు.

నేడు సీఎం, మంత్రుల రాక

ఆదివారం సాయంత్రం లోపు ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, అన్ని శాఖల ఉన్నతాధికారులు బెళగావి నగరానికి చేరుకోనున్నారు. ఒకరకంగా పాలనా యంత్రాంగం సరిహద్దు నగరానికి తరలివస్తుంది. ఫలితంగా బెళగావి, చుట్టుపక్కల అతిథి గృహాలు, ప్రముఖ హోటళ్లు మొత్తం రద్దీగా మారాయి.

ఉత్తర కర్ణాటక రుచులు

సమావేశాలకు వచ్చే సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులకు జిల్లా యంత్రాంగం భోజన ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో ఉత్తర కర్ణాటకకు ప్రత్యేకమైన వంటకాలు నోరూరించబోతున్నాయి. వందలాది వంట పనివాళ్లతో పాకశాల సిద్ధమైంది. ఇక 5 వేలకు పైగా పోలీసులు సువర్ణసౌధ సమీపంలోని అలారవాడ గ్రామంలో తాత్కాలిక టౌన్‌షిప్‌లో మకాం వేశారు. అక్కడే ఎమ్మెల్యేలు, మంత్రులు ఉండటానికి ప్రత్యేక వసతి ఏర్పాట్లు ఉన్నాయి. 10 రోజుల పాటు జరిగే సమావేశాల్లో ప్రజా సమస్యలపై సమగ్ర చర్చ సాగాలని అందరూ ఆశిస్తున్నారు.

శునకము.. మురిపెము





బెంగళూరు హెబ్బాళలోని వెటర్నరీ కాలేజీ ఆవరణలో శనివారం ఆకట్టుకున్న శునకాల ప్రదర్శన. 128వ జాతీయ శునకాల చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. వందలాదిమంది తమ శునకాలతో పాల్గొన్నారు. ముద్దొచ్చేలా వాటిని సింగారించారు.

తేనెటీగల దాడి.. చెరువులోకి దూకిన రైతు

మైసూరు: ఇటీవలి కాలంలో జిల్లాలో తేనెటీగల దాడులు దడ పుట్టిస్తున్నాయి. రైతుపైన దాడి చేసిన సంఘటనలో తీవ్ర అస్వస్థత పాలయ్యాడు. జిల్లాలోని హుణసూరు తాలూకాలోని గొడగెరె దగ్గర హిరిక్యాతనహళ్ళిలో ఈ సంఘటన శనివారం జరిగింది. రైతు జగదీష్ తేనెటీగల దాడి నుంచి తప్పించుకోవడానికి ఏకంగా చెరువులోకి దూకాడు. ఆయన పశువులను కాస్తున్న సమయంలో దగ్గర్లో ఉన్న తేనె పుట్ట నుంచి తేనెటీగలు వచ్చి తీవ్రంగా దాడి చేశాయి. చెరువులోకి పడిన జగదీష్‌ను స్థానికులు బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ప్రభుత్వ వైద్యాధికారి ఆత్మహత్య

బనశంకరి: ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు చెందిన వైద్యాధికారి ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలో మహాలక్ష్మీ లేఔట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. నటరాజ్ (48) గతంలో మండ్య జిల్లాలో ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా పనిచేసేవారు. ఒకనెల పాటు సెలవులో ఉన్న నటరాజ్ మూడునెలల క్రితం తుమకూరు జిల్లాలోని కుణిగల్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారిగా బదిలీ అయ్యారు. ఆరోగ్య సమస్యల వల్ల సెలవులో ఉన్నారు. శనివారం విధులకు వెళ్లాల్సి ఉంది. ఇంతలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. నటరాజ్ మానసికంగా, అలాగే కుటుంబ సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం. 2017లో చేయి కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించారు. మహాలక్ష్మీ లేఔట్ పోలీసులు చేరుకుని మృతదేహాన్ని విక్టోరియా ఆసుపత్రికి తరలించి విచారణ చేపట్టారు.

అబార్షన్ చేసి.. కావేరి నదిలో పడేసి

- మైసూరు నర్సు విచారణలో దారుణ విషయాలు వెల్లడి



నర్సుమంజుల



బనశంకరి: నెలకు 70 మందికి గర్భవిచ్ఛిత్తి చేస్తాం, గర్భిణికి అబార్షన్‌కు సమయం మించిపోయి ఉంటే గర్భస్థ పిండాలను బయటకు తీసి పడేస్తామని భ్రూణహత్యలు, లింగ నిర్ధారణ కుంభకోణంలో అరెస్టయిన నర్సు పోలీసులు విచారణలో నోరువిప్పింది. మైసూరులోని డాక్టర్ చందన్‌బల్లాళ్ మాతా ఆసుపత్రిలో హెడ్ నర్సుగా ఉన్న మంజుల పట్టుబడగా విచారణ చేపట్టారు.

అబార్షన్ వీలుకాకుంటే ఆపరేషన్

విచారణలో ఒళ్లు గగుర్పొడిచే విషయాలను ఆమె వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అబార్షన్లకు వీలుకానంతగా నెలలు నిండినప్పుడు ఆపరేషన్ చేసి గర్భస్థ పిండాలను బయటకు తీస్తారు. ఇలాంటివి నెలకు కనీసం 6 ఆపరేషన్లు జరుగుతాయని తెలిపింది. ఆ పిండాలకు ప్రాణం ఉంటుంది, కాళ్లు చేతులు ఆడిస్తారని చెప్పింది. కానీ ఏడవలేరని, బయటకు తీసిన 5 నుంచి 10 నిమిషాల్లో ఆ శిశువు కన్నుమూస్తుందని, ఆపై పేపర్‌లో చుట్టి తీసుకెళ్లి కావేరి నదిలో పడేస్తామని వివరించింది. 12 వారాల గర్భిణులకు అబార్షన్ చేసి పిండాన్ని మెడికల్ వేస్ట్‌లో వేస్తామని, 4 రోజుల కల్లా మెడికల్ వేస్ట్‌లో ఏమీ కనిపించకుండా కుళ్లిపోతుందని తెలిపింది. గత ఏడాది నుంచి చందన్‌బల్లాల్ ఆసుపత్రిలో పనిచేస్తున్నానని నెలకు 70 మందికి గర్భవిచ్ఛిత్తి చేస్తామని మంజుల తెలిపింది. రిస్మా, నిసార్ అనేవారు కూడా అబార్షన్లలో తనకు సహకరిస్తారని తెలిపింది. చందన్ బల్లాల్ ఎంబీబీఎస్ పూర్తి చేయలేదు, ఆయుర్వేద చికిత్స మాత్రమే చేస్తారు. నర్సింగ్‌హోం తెరవడానికి ఇతనికి విద్యార్హత లేకున్నా నర్సింగ్‌హోం నడుపుతూ అబార్షన్ల అడ్డాగా మార్చాడని విచారణలో తేలింది.

నకిలీ నోట్ల కేసులో ఎన్ఐఏ సోదాలు

బనశంకరి: దేశంలో వివిధ ప్రాంతాల్లో నకిలీ భారతీయ కరెన్సీ దందా ఆరోపణల నేపథ్యంలో శనివారం బెంగళూరు, బళ్లారితో పాటు నాలుగు రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్ఐఏ అధికారులు దాడులు నిర్వహించారు. పలువురు నిందితుల నివాసాల్లో నకిలీ నోట్ల ముద్రణకు వాడే కాగితాలు, కంప్యూటర్లు, ప్రింటర్లు తదితర ఉపకరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర , కర్ణాటకలో ఏకకాలంలో ఈ సోదాలు జరిగాయి. నవంబరు 24న నకిలీ నోట్లపై ఈ కేసు నమోదైంది.

విద్యార్థినులపై వేధింపులు

- క్లర్కు సస్పెండ్, హెచ్ఎంకు నోటీసులు



మైసూరు: కామంతో కళ్లు మూసుకుపోయిన పాఠశాల సిబ్బంది బాలికలపై వేధింపులకు పాల్పడిన ఉదంతమిది. పాఠశాల నుంచి పిక్నిక్‌కి వెళ్ళిన సమయంలో ఒక విద్యార్థిని పైన లైంగిక దాడి చేసినట్లు ఆరోపణలు రావడంతో మైసూరు జిల్లాలోని సరగూరు తాలూకాలో ఉన్న బీచనహళ్ళి ప్రభుత్వ పాఠశాలకు చెందిన డి-గ్రూప్ ఉద్యోగి రమేష్‌ను సస్పెండ్ చేశారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగన్నకు నోటీసులను జారీ చేశారు.

విహారయాత్రలో అకృత్యం

బీచనహళ్ళి ప్రభుత్వ పాఠశాల నుంచి నవంబర్ నెల 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు సుమారు 50 మంది విద్యార్థినీ విద్యార్థులను బేళూరు, హళెబీడు, ధర్మస్థల, కుక్కె సుబ్రమణ్య, శృంగేరి తదితర ప్రాంతాల టూర్‌కి తీసుకెళ్లారు. ఈ సమయంలో ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురి చేసి, లైంగిక దాడికి కూడా పాల్పడ్డారని విద్యార్థులు ఇళ్లకు వచ్చిన తరువాత తల్లిదండ్రులకు చెప్పారు. వారు విద్యాశాఖ అధికారి మారయ్యకు ఫిర్యాదు చేయడంతో ఆయన బాధిత విద్యార్థులను కలిసి వివరాలు సేకరించి డిడిపికి అందజేశారు. పాఠశాల క్లర్కు రమేష్‌ను సస్పెండ్ చేసి, హెచ్ఎంకు సంజాయిషీ నోటీసులను జారీచేశారు.

లంచం అంటే ఫిర్యాదు చేయండి

- ప్రజలకు డిప్యూటీ సీఎం సూచన



దొడ్డబళ్లాపురం: ప్రజలు తమ పనులు చేయించుకోవడానికి ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వనవసరం ఏమాత్రం లేదని, లంచం అడిగే అధికారులపై ఫిర్యాదు చేయడానికి అన్ని ప్రభుత్వ కార్యాలయాల ముందు ఫోన్ నంబర్లు రాసి పెట్టాలని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు. కనకపుర పట్టణంలో శనివారంనాడు ఏర్పాటు చేసిన జనస్పందన సభలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, పంచాయతీ అధికారులతో పాటు ఏ ప్రభుత్వ అధికారులు లంచం అడిగినా నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల సమస్యలకు అధికారులు స్పందించాలన్నారు. కనకపుర తాలూకాలో పాలన ప్రజారంజకంగా ఉండాలన్నారు. కనకపుర, రామనగర జిల్లా ప్రజలకు వారి భూములకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు అధికారులు ఆలస్యం లేకుండా ఇవ్వాలన్నారు. రామనగర జిల్లాలో డ్రోన్ టెక్నాలజీతో భూముల సర్వే జరుగుతోందని, ఆన్‌లైన్‌లో భూముల వివరాలు లభిస్తాయని తెలిపారు.

రాష్ట్ర విద్యా విధానానికే ప్రాధాన్యత

- మంత్రి మధు బంగారప్ప

శివాజీనగర: రాష్ట్రానికి ప్రత్యేక విద్యా విధానం రూపొందిస్తామని మేనిఫెస్టోలో ప్రజలకు వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చామని, ఇచ్చిన హామీని నెరవేరుస్తామని పాఠశాల విద్య, సాక్షరత మంత్రి మధు బంగారప్ప అన్నారు. శనివారం ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడుతూ...బీజేపీవారు చెప్పారని విద్యా విధానంలో మార్పుల చేయడానికి సాధ్యం కాదని, అధికారంలోకి వచ్చిన తరువాత హామీలు నెరవేర్చడమే తమ కర్తవ్యమన్నారు. ఐదు గ్యారెంటీల తరహాలోనే రాష్ట్ర విద్యా విధానాన్ని రూపొందించటం తమ ప్రాధాన్యత అన్నారు. ఇటీవల బెంగళూరు టెక్ సమ్మేళనంలో ఇన్ఫోసిస్ ఫౌండర్ నారాయణమూర్తి మాట్లాడుతూ.. కొత్త జాతీయ విద్యా విధానం మంచిదని అభిప్రాయపడ్డారు. దీంతో రాష్ట్రంలో ఎన్ఈపీని కొనసాగించాలని బీజేపీ పట్టుబట్టింది. ఈ విషయంపై మధు బంగారప్ప స్పందిస్తూ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని, బీజేపీ కోసం విద్యా విధానంలో మార్పులు చేయలేమన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు బాంబు బెదిరింపును భద్రత లోపమని బీజేపీ ఆరోపణ చేయటం సరికాదు. బీజేపీ అధ్యక్షుడిని, శాసన సభా ప్రతిపక్ష నాయకుడిని ఎంపిక చేసేందుకు ఆరు నెలలు తీసుకొన్నవారిచే ఇటువంటి మాటలను ఊహించటం సాధ్యమేనని దుయ్యబట్టారు.

ప్రకృతి చిత్ర సొగసులు

- పరిషత్‌లో పెయింటింగ్స్ షో



పెయింటింగ్స్ ప్రదర్శన తిలకిస్తున్న సందర్శకులు

బనశంకరి: ఉద్యాననగరిలో చిత్రకళా పరిషత్‌లో పేపర్ బోట్ పేరుతో ఏర్పాటు చేసిన సోలో చిత్రలేఖన ప్రదర్శన కళాప్రియులకు కనువిందు చేస్తోంది. పరిషత్‌లోని గ్యాలరీ-4 లో కేరళ త్రిసూర్ కు చెందిన వర్ధమాన చిత్రకారిణి బి.షాలిని మీనన్ తాను గీసిన చిత్రాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రకృతి, పర్యావరణం, పల్లె బతుకులు, వనితలు తదితరాలను ఇతివృత్తంగా చేసుకుని మదిలోని భావాలను కుంచె ద్వారా హృద్యంగా గీశారు. కేరళ గ్రామీణ నేపథ్యం ఎక్కువగా చిత్రాల్లో కనిపిస్తుంది. కేరళ కళలు, కొబ్బరి తోటలు, తోటల మధ్య ఇళ్లు, నదుల పెయింటింగ్స్ ఎంతో సహజంగా ఉంటూ ముగ్ధుల్ని చేస్తాయని చిత్రకారిణి చెప్పారు. ఈ ప్రదర్శన ఈ నెల 7వ తేదీ వరకు జరుగుతుంది.



పెయింటింగ్స్‌తో చిత్రకారిణి షాలిని



అందమైన ఓ చిత్రలేఖనం

బడులకు బాంబు బెదిరింపు కేసులో దర్యాప్తు ముమ్మరం

బనశంకరి: బెంగళూరు నగరంలో 60కిపైగా ప్రైవేట్ పాఠశాలలకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్ సందేశాలు పంపిన దుండగుని కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. పశ్చిమ విభాగ అదనపు పోలీస్ కమిషనర్ సతీశ్‌కుమార్ నేతృత్వంలో పలు కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నారు. గతంలో వచ్చిన నకిలీ బాంబు మెయిల్స్ ఆధారంగా ఈ బృందం దర్యాప్తు చేపట్టింది. ఈ చర్యకు పాల్పడిన వారు ఎవరై ఉంటారు, దీనికి వెనుక అసలు కారణం ఏమిటీ, ప్రతిష్టాత్మకమైన ప్రైవేట్ పాఠశాలలను లక్ష్యంగా చేసుకుని ఈ-మెయిల్ పంపడం వెనుక కుట్ర ఏమైంటుందనే అనే కోణాల్లో విచారణ చేస్తున్నారు. అల్లరిమూకలు దూరదేశం నుంచి నెట్‌వర్క్ వినియోగించారని పోలీసులు చెబుతున్నారు.

చిన్నారుల్లో భయం భయం

బాంబు బెదిరింపు ఘటన తరువాత విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాడానికి భయపడుతున్నారు. శనివారం సెలవు పట్ల గందరగోళం ఏర్పడింది. కొన్ని పాఠశాలలు సెలవు ఇస్తూ మెయిల్ చేశారు. కొన్ని పాఠశాలల్లో మెయిల్ ఆలస్యంగా రావడంతో విద్యార్థులు పాఠశాలలకు వచ్చారు. ప్రతి శనివారం కొన్ని పాఠశాలలకు సెలవు ఉండగా మరికొన్ని పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. క్లాసులు ఉన్న విద్యార్థులు పాఠశాలకు వస్తారని పాఠశాలల సిబ్బంది తెలిపారు.

క్లుప్తంగా

పింజార్ నదాఫ్ కార్యవర్గం ఎంపిక



పదాధికారులను సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: నగరంలోని కన్నడ భవన్‌లో శనివారం రాష్ట్ర నదాఫ్ పింజార్ సంఘం జిల్లా పదాధికారులను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు సంఘం అధ్యక్షులు జీపీ నబీసాబ్ తెలిపారు. సమాజ అభివృద్ధి, ఐకమత్యంతో మంచి పనులను చేసేందుకు పాటు పడాలన్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కాసింబీ, ప్రధాన కార్యదర్శి అల్లా బకాష్, సహకార్యదర్శి టిప్పు, జిల్లా ప్రతినిధులు హెచ్‌ఈ దాదా ఖలందర్, నజీర్‌పాషా, షాషాబ్, మౌలాలి, గోపి, నూర్‌బాషా, అమీన, తబస్సుమ్, అస్మా నూర్, సమాజ ప్రముఖులు, పదాధికారులు సభ్యులు పాల్గొన్నారు.

మహిళపై యాసిడ్ దాడి నిందితులకు జైలు శిక్ష

హుబ్లీ: నగరంలో జరిగిన యాసిడ్ దాడి కేసులో ఇద్దరు నిందితులకు ఒకటో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు శుక్రవారం జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.10 లక్షల జరిమానా విధిస్తూ ఆదేశాలను వెల్లడించింది. వివరాలు.. 2013లో నిందితుడు అబ్దుల్ గని ఓ మహిళను ప్రేమించాడు. అయితే ఆ మహిళకు ఇతరులతో నిశ్చితార్థం జరిగిన నేపథ్యంలో తన స్నేహితుడు గుడాసాబ్‌తో కలిసి ఆ మహిళపై యాసిడ్ దాడి చేశాడు. దీనిపై కమరిపేట పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు. దర్యాప్తు చేపట్టిన అధికారి శివానంద చలవాది కోర్టులో చార్జిషీట్ సమర్పించారు. వాదోపవాదాలను ఆలకించిన సదరు కోర్టు న్యాయమూర్తి బీ.పరమేశ్వర ప్రసన్న నిందితులు అబ్దుల్ గని బాగవాలె, గుడాసాబ్ ముల్లాలకు పైమేరకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కాగా ఈ కేసులో ప్రభుత్వం తరపున న్యాయవాది గిరిజ తమ్మినాళ కేసు వాదించారు.

ఎయిడ్స్‌పై అవగాహన జాతా



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

హొసపేటె: నగరంలో శనివారం ఎయిడ్స్‌పై అవగాహన జాతాను నిర్వహించారు. విజయనగర జిల్లా ప్రిన్సిపల్ సివిల్ మేజిస్ట్రేట్ బి.కిషన్ జాతాను ప్రారంభించి మాట్లాడారు. దశాబ్దాలుగా వేధిస్తున్న హెచ్‌ఐవీ, ఎయిడ్స్ మహమ్మారి నిర్మూలనకు ప్రజలకు అవగాహన కల్పించడమే మార్గమన్నారు. ఆ దిశలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, వివిధ స్వచ్ఛంద సంస్థలు ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ ఎల్ ఆర్ శంకర్‌నాయక్, విజయనగర న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కేవీ బసవరాజు, జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ జంబయ్య పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి



జ్యోతి వెలిగిస్తున్న మంత్రి బోసురాజు

రాయచూరు రూరల్: నేడు ప్రతి ఒక్కరూ కళలు, కళాకారులను ప్రోత్సహించాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖా మంత్రి బోసురాజు పేర్కొన్నారు. శనివారం కన్నడ భవనంలో జ్ఞాన గంగా జూనియర్ కళాశాల, కన్నడ సంస్కృతి శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సామాజిక, విద్యా, సంగీత రంగానికి చేసిన సేవలు గుర్తించాలన్నారు. బలిష్ట సమాజ నిర్మాణానికి యువతకు స్వార్థం అడ్డు వస్తుందని, మానవుడు స్వార్థం విడనాడాలన్నారు. సమావేశంలో కిల్లే బృహన్మఠాధిపతి శాంత మల్ల శివాచార్య, అధికారులు సోమశేఖరప్ప, సుధ, అధ్యాపకులు బూదెప్ప, ప్రేమలత, బసవరాజ్, నరసప్ప, శ్రీనివాస్, సుధామలున్నారు.

గెస్ట్ లెక్చరర్లను పర్మినెంట్ చేయరూ..



వినతిపత్రం సమర్పిస్తున్న అధ్యాపకులు

రాయచూరు రూరల్: ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల అతిథి అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పీఎఫ్, జీపీఎఫ్, సేవా భద్రత కల్పించలేదన్నారు. రాష్ట్రంలో 14 ఇంజినీరింగ్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న 300 మంది అతిథి అధ్యాపకులకు న్యాయం చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో శివానంద, అర్చన, ప్రియాంకలున్నారు.

మహిమాన్వితం..ముగళఖోడ మఠం

- కోరిన కోర్కెలను తీర్చే సిద్ధరామేశ్వర మహా స్వామీజీ దివ్యసమాధి
- కన్నుల పండువగా మురుఘ రాజేంద్ర మహా స్వామీజీ గురువందనం

సాక్షి బళ్లారి: కోరిన కోర్కెలను తీర్చే మహిమాన్విత మఠంగా గుర్తింపు పొందిన సుక్షేత్ర ముగళఖోడ జిడగ మఠంలో భక్తిశ్రద్ధలతో గురువందన కార్యక్రమం జరిగింది. పీఠాధిపతి మురుఘ రాజేంద్ర మహాస్వామీజీ జన్మదినాన్ని పురస్కరించుకొని రెండు రోజుల నుంచి వేలాది మంది భక్తులతో మఠం కిటకిటలాడుతోంది. కలబుర్గి జిల్లా ఆళంద తాలూకాలోని సుక్షేత్ర ముగళఖోడ జిడగా మఠంలో శనివారం గురువందన కార్యక్రమానికి లక్షలాది మంది జనం తరలివచ్చారు. దీంతో మఠంలో ఎటుచూసినా భారీ భక్త జనసందోహం కనిపించింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చిన భక్తులు రెండు రోజులుగా మఠంలో భక్తిపారవశ్యంతో నిండిన పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మఠంలోని సమాధి అయిన సిద్ధరామేశ్వర మహాస్వామీజీ దివ్య సమాధిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు బారులు తీరి తమ మొక్కులను తీర్చుకొన్నారు. వేలాది మంది భక్తులకు నిరంతరంగా అన్నప్రసాదాల పంపిణీని కూడా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మఠం నిర్వాహకులు అన్ని చర్యలు చేపట్టారు.



స్వామీజీ మహా సమాధిని దర్శించుకొంటున్న భక్తులు



ముగళఖోడలో సిద్ధరామేశ్వర సుక్షేత్ర మఠంలో భక్తుల సందడి ,(ఇన్‌సెట్‌లో) ప్రస్తుత పీఠాధిపతి మురుఘ రాజేంద్ర స్వామీజీ

శ్రీమఠం చరిత్ర...

పరమ పవిత్రమైన ఈ భరత భూమిలో అనేక యుగాలుగా మహానుభావులు జన్మించి భక్తులను సన్మార్గంలోకి తీసుకెళ్లే ముఖ్య భూమికను పోషిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగానే కలబుర్గి జిల్లాలో వెలసిన ముగళఖోడ జిడగా మఠంలో వంశపారంపర్యంగా గురువులు జన్మించి నాలుగు రాష్ట్రాల్లో దాదాపు 365 మఠాలకు పైగా స్థాపించి కోట్లాది మంది భక్తులను కూడగట్టుకొని సన్మార్గంలో నడిపిస్తున్నారు, సుక్షేత్ర మొదటి ఆది గురువు యల్లాలింగ మహాస్వామీజీ 1885లో జన్మించారు. ఆయన చిన్నప్పటి నుంచి ఎలాంటి ఆర్భాటం లేకుండా పెరగడంతో పాటు గొర్రెలను మేపుతూ దైనందిన కార్యక్రమాలను చేపట్టి ఎన్నో మహిమలు చూపి భక్తులను ఆకట్టుకొన్నారు. యల్లాలింగ ప్రభు స్వామీజీ చూపిన మహిమలు నేటికీ భక్తుల నోళ్లలో నానుతున్నాయి.

సిద్ధరామేశ్వర స్వామీజీ మహిమలెన్నో..

మఠం రెండవ పీఠాధికారి సిద్ధరామేశ్వర స్వామీజీ తన గురువు చూపిన మార్గంలో పయనించి ఎన్నో మహిమలను చూపడంతో పాటు భక్తుల కోర్కెలను తీరుస్తూ ఈయన బసవతత్వ, శివతత్వాన్ని ప్రచారం చేస్తూ కోట్లాది మంది భక్తులను కూడగట్టుకొన్నారు. తల్లిదండ్రులను అప్పా, అమ్మ అనని వారు ఎందరో ఉన్నా కోట్లాది మంది భక్తులు మఠంలో సిద్ధరామేశ్వర స్వామీజీని అప్పాజీగా సంబోధిస్తూ తల్లిదండ్రి, గురువు దైవం మీరేనని ప్రార్థిస్తున్నారు. ప్రతి అమావాస్య, పౌర్ణమి, సోమ, గురువారాల్లో ఇక్కడికి వేలాది మంది భక్తులు వచ్చి పూజలు చేస్తుంటారు. సిద్ధరామేశ్వర స్వామీజీ 2004లో లింగైక్యం చెందిన తర్వాత షడక్షరి శివయోగి డాక్టర్ మురుఘ రాజేంద్ర స్వామీజీ పీఠాధిపతిగా కొనసాగుతూ మఠంలో పలు సేవా, భక్తి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈయన కూడా తమ ఆదిగురువుల తరహాలోనే మహిమలను చూపుతూ భక్తులను ఆకట్టుకొంటున్నారు.

చీకట్లో కరువు పరిశీలన

- ఉన్న పంటను తొక్కిన బీజేపీ నేతలు



కార్యకర్తలు తొక్కడంతో నాశనమైన పంట

దొడ్డబళ్లాపురం: ప్రతిపక్ష నేత ఆర్ అశోక్ దొడ్డ తాలూకాలో శుక్రవారం రాత్రి మొబైల్ లైట్ వెలుగులో కరువు పరిశీలన జరపడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కరువు పరిశీలన జరిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. గత నెలలో మాజీ మంత్రి శ్రీనివాస కోటా పూజారి ఆధ్వర్యంలో బీజేపీ నేతల బృందం దొడ్డ తాలూకాలో పర్యటించి కరువు పరిశీలన జరిపారు. శుక్రవారం రాత్రి ప్రతిపక్ష నేత అశోక్ స్థానిక బీజేపీ ఎమ్మెల్యే ధీరజ్‌తో కలిసి కోడిహళ్లిలో రైతుల పంటలను పరిశీలించారు. అయితే ఆలస్యంగా వచ్చి మొబైల్ టార్చ్ వెలుగులో పంటలను పరిశీలించడం కాస్త హాస్యాస్పదంగా కనిపించింది. అంతేకాకుండా ఆర్ అశోక్‌తోపాటు బీజేపీ కార్యకర్తలు ఎక్కువ సంఖ్యలో వచ్చి ఉన్న పంట కూడా తొక్కి నాశనం చేయడంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని, పాల ధర తగ్గించడం, పథకాలు సక్రమంగా అందపోవడం పట్ల విన్నవించుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడిన ఆర్ అశోక్ గతంలో తమ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వం నుండే కరువు పరిహారం అందజేసామన్నారు. కేంద్రం సాయం చేయాలని వేచి చూడలేదన్నారు.

తుపాను కారణంగా పలు రైళ్ల రద్దు

గుంతకల్లు: మిచాంగ్ తుపాను ప్రభావం కారణంగా గుంతకల్లు డివిజన్ మీదుగా నడుస్తున్న పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు శనివారం తెలిపారు.

- రద్దు ఎక్స్‌ప్రెస్ రైళ్ల వివరాలు.. 3, 4, 5వ తేదీల్లో తిరుపతి–లింగంపల్లి (నంబరు 12733), 4, 5, 6వ తేదీల్లో లింగంపల్లి–తిరుపతి (12734), 3, 4వ తేదీల్లో రద్దు.
- తిరుపతి– సికింద్రాబాద్ (12763), 5, 6వ తేదీల్లో సికింద్రాబాద్– తిరుపతి (12764), ఇక నర్సాపూర్– ధర్మవరం ఎక్స్‌ప్రెస్ (17247) రైలు 3,4,5వ తేదీల్లో రద్దు
- ధర్మవరం–నర్సాపూర్ (17248)4,5,6వతేదీల్లో రద్దు చేసినట్లు తెలిపారు.
- తిరుపతి– ఆదిలాబాద్– తిరుపతి (17405/06) ఎక్స్‌ప్రెస్ రైళ్లను 5వ తేదీన రద్దు చేశారు.
- విశాఖపట్నం– కడప (17488) రైలును 3, 4, 5వ తేదీల్లో, కడప–విశాఖపట్నం (17487)ను 4,5,6వ తేదీల్లో రద్దు
- సికింద్రాబాద్–తిరుపతి–సికింద్రాబాద్ (20701/02) ఎక్స్‌ప్రెస్ రైళ్లను 3,4వ తేదీల్లో రద్దు చేశారు. ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బైకిస్టు దుర్మరణం



మృతి చెందిన ముహిద్ (ఫైల్)

మండ్య: మండ్య జిల్లా మళవళ్లి తాలూకా హలగూరు సమీపంలోని బెనమనహళ్లి రోడ్డులో బైక్ అదుపుతప్పి యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడిని హలగూరులోని ముస్లింబ్లాక్‌లో నివాసం ఉంటున్న ముహిద్ పాషా (25)గా గుర్తించారు. ముహిద్ బైక్‌పై హలగూరు వైపు వస్తుండగా వాహనానికి అడవి జంతువు అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పి కిందపడి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత

తుమకూరు: బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి తుమకూరు జిల్లా శిర తాలూకా జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. మృతులను అనంతపురం జిల్లా రాయదుర్గం భూపసంద్ర గ్రామానికి చెందిన ఎర్రిస్వామి (30), చందు (22)గా గుర్తించారు. గొర్రెల ఎరువు నింపుకుని ఓ లారీ గుబ్బి వైపు వెళ్తుండగా ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. శిర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అయోధ్య రామాలయం నమూనా



ప్రదర్శించిన రామమందిర నమూనా

మైసూరు : మైసూరు నగరంలోని కృష్ణమూర్తి పురం శారదా విలాస్ విద్యాసంస్థలో శనివారం అయోధ్య రామ మందిరం తరహాలో నమూనా ఏర్పాటు చేశారు. మాదిరి ప్రదర్శనను బీజేపీ ఎమ్మెల్యే టీఎస్ శ్రీవత్స జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సనాతన హిందూ ధర్మాన్ని మనం కాపాడుకోవాలని, శ్రీరాముడి వ్యక్తిత్వాన్ని, ఆదర్శాలను అలవాటు చేసుకోవాలన్నారు. మరికొన్ని రోజుల్లో అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభం కానుందని అన్నారు. అయోధ్యను చూడటానికి వీలుకాని వారు ఇక్కడ ఏర్పాటు చేసిన నమూనా అయోధ్యను చూసి తరించవచ్చన్నారు.

మద్యం, డ్రగ్స్ విక్రయాలపై కన్నెర్ర



మాట్లాడుతున్న ఎంపీ మునిస్వామి

కోలారు: జిల్లాలో అక్రమ మద్యం, మాదక ద్రవ్యాల(డ్రగ్స్) విక్రయాలపై ఎంపీ ఎస్.మునిస్వామి అధికారులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శనివారం నగరంలోని జెడ్పీ భవనంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, ఇన్‌చార్జ్ సమితి(దిశా) సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన కొన్ని నేరాల కేసులను పరిశీలిస్తే జిల్లాలో అక్రమ మద్యం, మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు కలిగించే మందులను విక్రయించే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ బాలురు అతిగా మద్యం తాగిన నేపథ్యంలో హత్య చేశారన్నారు. కోలారు జిల్లాను మత్తు రహిత ప్రాంతంగా మార్చడానికి, గంజాయి విక్రయించే వారిపై అన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఈఓ పద్మా బసవంతప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోండి



శేషాద్రిపురం కాలేజీలో ఓటరు అభియాన్‌లో మాట్లాడుతున్న కమిషనర్ తుషార్ గిరినాథ్

బనశంకరి: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని బెంగళూరు నగర జిల్లా ఎన్నికల అధికారి, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఓటరు ప్రత్యేక నమోదు అభియాన్‌లో భాగంగా యలహంక, శేషాద్రిపురం కాలేజీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కమిషనర్ విద్యార్థులతో మాట్లాడారు. యువ ఓటర్లు తమ పేర్లు ఓటర్లు జాబితాలో నమోదు చేసుకోవాలని, ఓటింగ్‌లో యువ ఓటర్లు కీలకపాత్ర పోషిస్తారని, దీంతో 18 ఏళ్ల నిండిన యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో స్వీయ నమోదు చేసుకోవచ్చన్నారు. నగర యువ ఓటర్లతో పాటు విభిన్న ప్రతిభావంతులు, మురికివాడ ప్రాంతాల్లో నివసించేవారిని ఓటర్లు జాబితాలో పేర్లు చేరుస్తామన్నారు. దేశంలో 55 శాతం యువ ఓటర్లు ఉన్నారని తెలిపారు.

నూతన స్కూల్ ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న నరేంద్ర తదితరులు

సాక్షి, బెంగళూరు: నాణ్యమైన బోధనతో పాటు విలువలతో కూడిన విధానాలను విద్యార్థులకు నేర్పించడమే తమ తొలి ప్రాధాన్యత అని ఆంబిటస్ వరల్డ్ స్కూల్ వ్యవస్థాపక అధ్యక్షుడు నరేంద్ర తెలిపారు. బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని అళిబొమ్మసంద్ర వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన ఆంబిటస్ స్కూల్‌లో నరేంద్ర మాట్లాడారు. హైదరాబాద్, విజయవాడల్లో తమ సేవలను అందిస్తుండగా తాజాగా బెంగళూరులో ప్రపంచ స్థాయి స్కూల్‌ను విస్తరించడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ ఐదు ఎకరాల విశాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ పాఠశాలలో కేంబ్రిడ్జ్, సీబీఎస్‌ఈలను కలిపి ద్వంద్వ పాఠ్యాంశాలను అందిస్తున్నట్లు తెలిపారు. పోటీతత్వాన్ని ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించినట్లు చెప్పారు. ప్రస్తుతం 2024–25 విద్యా ఏడాదికి సంబంధించి అడ్మిషన్లు జరుగుతున్నట్లు తెలిపారు.

కోలారు వార్తలు...

బెస్కాంలో అక్రమాలపై తనిఖీకి డిమాండ్



అంబేడ్కర్ విగ్రహం ముందు ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: బెస్కాంలో అవినీతి అక్రమాలపై తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రైతు సంఘం సంస్థాపక అధ్యక్షుడు ఐతాండహళ్లి మంజునాథ్ డిమాండ్ చేశారు. ఆయన పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు ధర్నాకు బైఠాయించి మాట్లాడారు. అక్రమాలపై తనిఖీ నిర్వహించి దోషులను శిక్షించే వరకు తన ఆందోళన కొనసాగుతుందన్నారు. అవినీతి అధికారులపై ఇప్పటికే బెస్కాం ప్రధాన కార్యాలయంలో దాఖలాలతో సహా ఫిర్యాదు చేశానన్నారు. దీంతో పలువురు సిబ్బంది తనపై దాడి చేశారన్నారు.

పోలీస్ క్రీడా పోటీలు షురూ



క్రీడా పోటీల్లో పాల్గొన్న పోలీసులు

కేజీఎఫ్: నగరంలోని డీఏఆర్ పోలీస్ కవాతు మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించే క్రీడా పోటీలు ప్రారంభం అయ్యాయి. జిల్లాధికారి అక్రంపాషా పావురాన్ని ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. శాంతి భద్రతల రక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులు ఒత్తిడి నుంచి దూరం కావడానికి తరచుగా క్రీడా పోటీల్లో పాల్గొనాలన్నారు. కేజీఎఫ్ పోలీస్ పరిధిలోని సిబ్బంది అందరూ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి సహకార మనోభావంతో సేవలందించాలన్నారు. ఎస్పీ కెఎం శాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

12న సిద్దారూఢ సన్నిధిలో లక్ష దీపోత్సవం

హుబ్లీ: కార్తీకమాసం పురస్కరించుకుని సిద్దారూఢ మఠంలో ఈనెల 12న లక్ష దీపోత్సవం నిర్వహించనున్నారు. కలఘటిగి తాలూకాలో తయారు చేసిన 70 వేలు, మఠంలోని 30 వేల మట్టి ప్రమిదలతో ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు మఠం ట్రస్ట్ కమిటీ చైర్మన్ బసవరాజ కళ్యాణ శెట్టర్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు మఠం పాలన అధికారి, జిల్లా న్యాయమూర్తి కేజీ. శాంత ఈ ఉత్సవానికి శ్రీకారం చుడతారని తెలిపారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది భక్తులు దీపోత్సవంలో పాల్గొననున్నారని, దీని కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

9న గండి నరసింహ క్షేత్రంలో కార్తీక దీపోత్సవం

కంప్లి: సండూరు తాలూకా ధర్మాపురలోని గండి నరసింహ స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఈనెల 9న వైభవంగా దీపోత్సవం జరగనుంది. ప్రతి ఏటా మాదిరిగా జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పునీతులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

అలరించిన నాటక ప్రదర్శన

కంప్లి: గౌరమ్మ పండగ మరుసటి రోజు రామసాగర గ్రామంలో కొంతి రొట్టి పేరిట పండగ జరుపుతారు. ఈ పండగకు గ్రామస్తులు మిద్దెలపై వంటా వార్పు చేసి, స్నేహితులను, బంధువులను ఆహ్వానించి విందు ఆరగిస్తారు. ఇక అదే రాత్రి గ్రామంలో లాళగొండ వంశీకులతో వీరాభిమన్య బయలు నాటక ప్రదర్శన జరిగింది. భోజనాల అనంతరం అందరూ ఈ నాటకాన్ని తిలకించారు.

త్వరలో కాంతరాజు నివేదిక

యశవంతపుర: వెనుకబడిన వర్గాల ప్రగతికి కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు సీఎం సిద్ధరామయ్య తెలిపారు. శనివారం బెంగళూరులో అఖిల కర్ణాటక గాణిగర సంఘం వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్వకర్మ యోజన ద్వారా గాణిగర సమాజానికి మోసం జరిగిందని తెలిసి వెంటనే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లు తెలిపారు. విశ్వకర్మ యోజనలో గాణిగర సముదాయాన్ని చేర్చడానికి ప్రయత్నిస్తామని సీఎం హామీనిచ్చారు. కాంతరాజు కమిషన్ సిద్ధం చేసిన కులగణన నివేదికను రెండు నెలల్లో పూర్తి చేసి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

ఎయిడ్స్ డేపై కొవ్వొత్తుల ర్యాలీ

కోలారు: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ అధికారులు, సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ప్రసన్నకుమార్ ర్యాలీని ప్రారంభించారు. గాంధీవనం నుంచి ప్రారంభమైన ర్యాలీ నగరంలోని ప్రముఖ వీధుల గుండా సాగింది. బస్టాండ్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై జాగృతి కల్పించారు. కొవ్వొత్తుల ర్యాలీలో రాష్ట్ర ఎయిడ్స్ ప్రివెన్షన్ సొసైటీ, జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, జిల్లా న్యాయ సేవల ప్రాధికార సభ్యులు, జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సభ్యులు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి కోసం ధర్నా



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కోలారు: నగరంలో అన్ని వార్డుల్లోని ప్రజలకు రక్షిత తాగునీటిని అందించాలని డిమాండ్ చేస్తూ శాశ్వత నీటిపారుదల పోరాట సమితి సభ్యులు శనివారం ఎమ్మెల్యే కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఉన్న జిల్లాలో ఎలాంటి నదీ మూలాలు లేక రైతులు కేవలం వర్షంపైనే ఆధారపడి ఉన్నారన్నారు. వానలు సరిగా కురవక పోవడంతో నీరు లేక తాగు, సాగునీటికి ఇబ్బంది కలుగుతోందన్నారు. వచ్చే బెళగావి అసెంబ్లీ సమావేశాల్లో జిల్లాలోని నీటి సమస్యపై చర్చించి శాశ్వత తాగునీరు, సాగునీటి సౌకర్యాలను అందించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం స్వీకరించి మాట్లాడిన ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ జిల్లాలోని నీటి సమస్యపై తనతో పాటు అందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. పోరాట సమితి ప్రముఖులు ప్రకాష్, రాజేష్, కల్వమంజలి రాము, శివణ్ణ, అబ్బణి శివప్ప పాల్గొన్నారు.

సహకార రత్నకు సన్మానం



నంజేగౌడ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

మాలూరు: కోలారు చిక్కబళ్లాపుర పాల సమాఖ్య అధ్యక్షుడు కెవై నంజేగౌడకు ప్రభుత్వం సహకార రత్న అవార్డును అందించిన నేపథ్యంలో శనివారం పట్టణంలోని ప్రైవేటు కళ్యాణ మందిరంలో తాలూకా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం నంజేగౌడ మాట్లాడుతూ కోచిముల్ సంస్థ అన్ని రంగాల్లో ఆర్థికంగా ప్రగతి సాధిస్తోందన్నారు. పాల సమాఖ్యలో డిపాజిట్ల రూపంలో రూ.200 కోట్లు, సంఘం లాభం రూ.220 కోట్లు కలిపి మొత్తం రూ.420 కోట్లను కలిగి ఉందన్నారు. ఈ నిధులతో ఊహించని రీతిలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించి రాష్ట్రంలోనే ఆదర్శ సమాఖ్యగా మారుస్తామన్నారు. కోచిముల్ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు తేవడానికి ప్రయత్నిస్తామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధికి పాటుపడతానన్నారు. కేఎంఎఫ్ మేనేజర్ ఎంకే జగదీష్, జెడ్పీ మాజీ అధ్యక్షురాలు రత్నమ్మ నంజేగౌడ, కోచిముల్ డైరెక్టర్ కేఎన్ నాగరాజ్, డీవీ హరీష్ పాల్గొన్నారు.

ప్రతి నీటి బొట్టు అమూల్యం



మాట్లాడుతున్న మహేష్‌బాబు

కోలారు: ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనదని వ్యవసాయ శాఖ ఏడీ మహేష్‌బాబు అన్నారు. శనివారం తాలూకాలోని అరాభికొత్తనూరులో వాటర్‌షెడ్ కార్యవర్గ సమితి సభ్యులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీటి సంరక్షణతో పాటు వానల వల్ల మట్టిని కొట్టుకు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పైమట్టి కొట్టుకు పోతే వ్యవసాయానికి ఇబ్బంది కలుగుతుందన్నారు. వాటర్‌షెడ్(జలానయన) పథకం లబ్ధిని రైతులు పొంది ఆర్థికంగా స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. ప్రజలు రసాయనిక ఎరువుల వాడకం నుంచి బయటకు వచ్చి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. నేడు అత్యధికంగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమి సారాన్ని కోల్పోతోందన్నారు. మొక్కలు బాగా పెరిగినా దిగుబడి తక్కువగా ఉంటోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యత నివ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సునీల్, జిల్లా సంయోజకుడు అశ్వత్థనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన కార్తీక దీపోత్సవం


కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

గౌరిబిదనూరు: నగరంలోని వీవీ పురం శంకర మఠంలో బ్రాహ్మణ క్షేమాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఉదయం లోక కల్యాణార్థమై ధాత్రి హోమం, రాత్రి కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రధాన పురోహితులు అశ్వత్థనారాయణశర్మ ఆధ్వర్యంలో ఈ ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. రాత్రి సౌందర్య లహరి పారాయణం, ఆదిశంకరాచార్యుల స్తోత్ర పారాయణం జరిగింది. కార్యక్రమంలో శివప్రసాద శర్మ, జగదీశ్ వాచస్పతి, రాజేశ్, దశిక శ్రీనివాసరావ్, శశిధర శర్మ, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానిపై ఎంపీ సురేశ్ విసుర్లు

దొడ్డబళ్లాపురం: కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్.. ప్రధాని నరేంద్ర మోదీపై ఏకవచనంతో మాట్లాడుతూ విమర్శలు చేశారు. మాగడిలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. నువ్వు ఎంత ట్యాక్స్ కడుతున్నావు? నువ్వు పన్ను కట్టేది లేదు. ట్యాక్స్ కట్టని వారికి ఎందుకు ఉచితంగా ఇవ్వాలని ప్రశ్నిస్తావు? నువ్వు ఎవరితోనూ మాట్లాడవు. నువ్వు చెప్పిందే అందరూ వినిపించుకోవాలి. ఇదే మోదీ వ్యవహార శైలి, ఏం బాగోలేదని దుయ్యబట్టారు. అందరికీ కోరికలు ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగులు, ఎమ్మెల్యేలు ఎవరూ సంతృప్తిగా లేరన్నారు. ఉదయం లేచి కష్టపడి పనిచేసే వాళ్లు మాత్రమే సంతృప్తిగా ఉన్నారన్నారు.

మట్టితోనే జీవరాశులకు జీవం


పురస్కారం అందుకున్న దృశ్యం

తుమకూరు: భూమిపై మట్టి లేకపోతే జీవులు, మొక్కలు జీవించడం అసాధ్యమని తుమకూరు సిద్దగంగ మఠాధ్యక్షుడు శ్రీ సిద్దలింగ స్వామీజీ అన్నారు. తుమకూరు నగరంలో ఉన్న సిద్దగంగ మఠంలో ఇన్షియేటివ్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ అండ్ ఎనర్జీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాంపియన్ ఆఫ్ సాయిల్–2023 అవార్డు ప్రదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులను ఆశీర్వదించి మాట్లాడారు. మట్టి అత్యంత అమూల్యమైనదని, మట్టిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చాంపియన్ ఆఫ్ సాయిల్ అవార్డును న్యాయవాది రమేశ్ నాయక్ అందించారు. భూమిని నమ్ముకుని కోట్ల జీవరాసులు జీవనం సాగిస్తున్నాయని అన్నారు.

సఫారీ ఆరంభం

మైసూరు: అడవులకు నిలయమైన చామరాజనగర జిల్లాలో వన్యజీవుల సఫారీ ప్రారంభమైంది. హనూరు తాలూకాలోని మలె మహదేశ్వర వన్య జీవులధామం పరిధిలో పిజి పాళ్య వద్ద సఫారీని ఆరంభించారు. దీంతో జిల్లాలో సఫారీల సంఖ్య నాలుగుకు పెరిగింది. పీజీ పాళ్య వైపు సఫారీలో వెళ్తే పులులు, చిరుతలు, ఏనుగులు, అడవి గేదెలు, జింకలు, వైవిధ్య ప్రాణులను వీక్షించవచ్చు. రుసుము పిల్లలకు రూ.200, పెద్దలకు రూ.400 చెల్లించాలి.

సైన్స్ వస్తు ప్రదర్శన


వస్తు ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే

కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా పరిధి హోసకోటె గౌతమ్ కాలనీలో ఉన్న క్రోట్ మెమోరియల్ పాఠశాల, పీయూ కళాశాలల్లో ఏర్పాటు చేసిన సైన్స్ వస్తు ప్రదర్శనను శనివారం ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ ప్రారంభించారు. అనంతరం అక్కడ విద్యార్థులు తయారు చేసి వస్తువులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు.

సమాజాభివృద్ధే వారి లక్ష్యం



గౌరిబిదనూరు : ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ సమాజంలోని వివిధ రంగాలను అభివృద్ధి పరిచే దిశలో శ్రమిస్తూ వుందని కెహెచ్‌పీ ఫౌండేషన్ మేనేజర్ శ్రీనివాసగౌడ తెలిపారు. శనివారం ఉదయం నగర సమీపంలో వున్న కల్లూడి చెరువును అభివృద్ధి పరచి ప్రజలకు హస్తాంతరం చేసే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సంస్థ వికలాంగులు, వృద్ధులు, మహిళలకు ఇతోదిక సాయం చేస్తూ అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ప్రాజెక్ట్ అధికారి నాగరాజ నాయక్ మాట్లాడుతూ... ఇప్పటికే రాష్ట్రంలో కల్లూడి చెరువుతో పాటు 600 చెరువులను అభివృద్ధి పరచామని అన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్, వెంకటప్ప, కెప్టెన్ సతీశ్, టి గోపాల్, ఆనందప్ప తదితరులు పాల్గొన్నారు.

వేరుశనక్కాయల పరుష చూసొద్దాం రండి

- కాడు మల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు
- నంది విగ్రహానికి వేరుశనగ అలంకరణ
- ఆలయంలో ఘనంగా కార్తీక ఉత్సవం


ఆలయం వద్ద శనక్కాయలు కొనుగోలు చేస్తున్న నగర వాసులు



కాడు మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద జన సందడి

యశవంతపుర: కార్తీక మాసంలో భాగంగా బెంగళూరు మల్లేశ్వరంలోని కాడు మల్లేశ్వరం ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే వేరుశనక్కాయల పరుష శనివారం ప్రారంభమైంది. కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నాడోజీ డాక్టర్ మహేశ్ జోషి, ఎమ్మెల్యే మునిరత్నలు ప్రారంభించారు. పరుషకు తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణ, బెంగళూరు గ్రామాంతర, కోలార, తుమకూరు, కనకపుర నుంచి పెద్ద ఎత్తున రైతులు శనక్కాయలు తీసుకువచ్చారు. రైతులు పండించిన పంటలను అమ్ముకోవడానికి ఉచితంగా మూడు వందల దుకాణాలు ఏర్పాటు చేశారు. తినుబండారాలను కూడా ఇక్కడ ఉంచారు. బెంగళూరు వాసులకు గ్రామీణ సంస్కృతి, జీవన పద్ధతులు తెలుసుకోవటానికి కార్తీక మాసంలో మూడు రోజుల పాటు శనక్కాయల పరుషను నిర్వహిస్తున్నట్లు కాడుమల్లేశ్వర గెళెయర బళగ అధ్యక్షుడు బీకే శివరాం తెలిపారు. అనంతరం ఎద్దుల బండిపై ప్రముఖులు ఊరేగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు అనూప్ అయ్యంగార్, అర్చకులు గంగాధర దీక్షిత్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

నందికి 800 కేజీల శనక్కాయలు :

20 అడుగుల నందికి 800 కేజీల శనక్కాయలతో అలంకరించారు. దీంతో నంది విగ్రహం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. యక్షగాన ప్రదర్శన జీత్సావన మహిళా యక్షగాన మండలిచే మొదటి రోజు కృష్ణలీలె, కంసవధే యక్షగాన ప్రదర్శన జరిగింది. ఆదివారం ఎక్కువ మంది సందర్శలు వచ్చే అవకాశం ఉన్నందున సంగీత కార్యక్రమం, మూడో రోజు కార్తీక సోమవారం రోజున వెయ్యి కేజీల శనక్కాయలతో కాడు మల్లేశ్వరస్వామికి అలంకరించి అభిషేకం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు శివరాం తెలిపారు.

రకరకాల శనక్కాయలు

వివిధ రకాలకు చెందిన నాటి, మరలు, బెళ్లికాయి, గడంగ్, కెమపుగడలె, కప్పుకడలె, పెద్దగుత్తి కాయలను రైతులు దేవస్థానం ముందు రాశులుగా పోసి అమ్ముతున్నారు. ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణ వ్యాపారులు లారీలలో శనక్కాయలను తెచ్చి విక్రయిస్తున్నారు. తొలి రోజే పెద్ద ఎత్తున నగర వాసులు తరలివచ్చారు.

అరటి తోటలు ధ్వంసం

మైసూరు: మైసూరు జిల్లా నంజనగూడు తాలూకాలో అడవి ఏనుగులు లక్షల విలువ చేసే అరటి తోటలను ధ్వంసం చేసిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. తాలూకాలోని ఈరెగౌడనగుండి గ్రామానికి చెందిన రైతులు రాజేష్, రాజు అనే రైతులకు చెందిన అరటి తోటల్లోకి చొరబడిన ఏనుగులు లక్షల విలువ చేసే తోటలను నాశనం చేశాయి. నీటిసాగు కోసం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ కూడా తొక్కివేశాయి. బండిపుర జాతీయ ఉద్యానవనం హడియాల అటవీ ప్రాంతంలోని కల్లహర కట్టెలో రైల్వే కంబిని తీయడంతో ప్రతిరోజు అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు ఇక్కడికి వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హత్య కేసు నిందితుడికి బెయిల్

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లాకు చెందిన బీజేపీ యువమోర్చ నాయకుడు ప్రవీణ్ నెట్టార్ హత్య కేసులో నిందితుడు ఇబ్రహీం షూరుకు రెండు రోజుల పాటు దక్షిణ కన్నడ ఎన్ఐఏ కోర్టు బెయిల్‌ను మంజూరు చేసింది. సుళ్యలో నిందితుడి చెల్లెలి వివాహం ఉన్న కారణంగా కోర్టు రెండు రోజుల బెయిల్ ఇచ్చింది. 2022 జులై 26న బెళ్లారెకి చెందిన బీజేపీ యువనాయకుడు ప్రవీణ్ నెట్టారును హత్య చేసిన కేసులో 5వ ముద్దాయి. మైసూరు జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఇబ్రహీంషా బెయిల్ ముగియగానే మళ్లీ మైసూరు జైలుకు చేరుకోవాలి.

మరణంలోనూ మానవత్వం

మైసూరు: కుమారుడి మరణంలోనూ మానవత్వం చాటుకున్నారు ఆ తల్లిదండ్రులు. వివరాలు... చామరాజనగర జిల్లా హనూరు పట్టణానికి చెందిన శశి, సుశీల దంపతుల కుమారుడు దర్శన్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం మైసూరు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా గుర్తించి అవయవదానం చేయాలని దర్శన్ తల్లిదండ్రులను కోరారు. వెంటనే వారు అంగీకరించడంతో కార్పొరేట్ ఆస్పత్రి వైద్యులు గుండె, శ్వాసకోశాలు, లివర్, మూత్రపిండాలు అవసరమైన చోటకు తరలించారు.

అగ్ని ప్రమాదంలో ఆవులు మృతి

బనశంకరి: పశువులు పాకలో అగ్ని ప్రమాదం జరగడంతో తొమ్మిది ఆవులు మృతి చెందగా మరో ఐదు గాయపడ్డాయి. ఈ ఘటన ఆనేకల్ సమీపంలోని హులిమంగల గ్రామంలో చోటుచేసుకుంది. గాయపడిన ఐదు ఆవులు పరిస్థితి విషంగా ఉంది. పశువుల పాకలో 15 ఆవులు కట్టి వేయగా ఇందులో రెండు బైకులు కూడా ఉంచారు. శనివారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు ఏర్పడ్డాయి. ఆవులతో పాటు బైక్‌లు కూడా కాలిపోయాయి. ఘటన స్థలాన్ని పశువైద్యుల బృందం, జిగిణి పోలీసులు చేరుకుని పరిశీలిస్తున్నారు.

ముఖాముఖి ఢీకొన్న వాహనాలు


నుజ్జునుజ్జయిన వాహనాలు



- ఒకరి మృతి

దొడ్డబళ్లాపురం: టాటాఏస్, ఓమ్ని వ్యాన్ ముఖాముఖి ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డ సంఘటన దొడ్డ తాలూకా గొల్లహళ్లి వద్ద బెంగళూరు–హిందూపురం రహదారి మార్గంలో చోటుచేసుకుంది. బెంగళూరు బాగలగుంటె నివాసి శివకుమార్ (32) మృతి చెందగా, అనంతరామ్ (37) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో రెండు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. దొడ్డ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మెట్రో స్టేషన్ పేరు మార్పుపై సీఎంకు లేఖ


డిజిటల్ నేమ్ బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీష్ రెడ్డి, ఎంపీ తేజస్వీసూర్య తదితరులు

బొమ్మనహళ్లి: బెంగళూరు నగరంలోని బన్నేరుఘట్ట రోడ్డు బిళ్లెకహళ్లిలో ఉన్న నమ్మ మెట్రో స్టేషన్‌కు సమీపంలో ఐఐబీఎం విద్యాసంస్థ ఉండటంతో దానికి ఐఐబీఎం మెట్రో స్టేషన్ అని నామకరణం చేయడం జరిగిందని, అయితే స్థానిక బిళ్లెకహళ్లి ప్రజల కోరిక మేరకు ఐఐబీఎం బిళ్లెకహళ్లి స్టేషన్‌గా మార్చాలని తాము ఇప్పటికే నమ్మ మెట్రో, ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు లేఖ రాశామని బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వీ సూర్య అన్నారు. శుక్రవారం రాత్రి బొమ్మనహళ్లి పరిధి బిళ్లెకహళ్లి బస్టాండు సమీపంలో స్థానిక బీజేపీ నాయకుడు బీ.వై రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నమ్మ ప్రీతియ బిళ్లెకహళ్లి అనే కన్నడ డిజిటల్ బోర్డుతో పాటు అక్కడ ఏర్పాటు చేసిన దివంగత కన్నడ నటులు రాజ్‌కుమార్, డాక్టర్. విష్ణు వర్ధన్, రెబల్‌స్టార్ అంబరీష్, ఆటో రాజా శంకర్ నాగ్, పవర్ స్టార్ పునీత్ రాజ్, ఎస్.పి బాల సుబ్రమణ్యం, చిరంజీవి సర్జాల ఫొటోలను ఏర్పాటు చేశారు. వాటిని ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మొదటిసారిగా కన్నడ డిజిటల్ బోర్డు అది కూడా కన్నడ జెండా రంగులో ఏర్పాటు చేయడంపై రమేశ్‌ను అభినందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రూపా రమేష్, సమాజ సేవకుడు బీవై రమేష్‌తో పాటు స్థానిక యువకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ బావ కిడ్నాప్


మహదేవయ్య, తెరచి ఉన్న బీరువా

దొడ్డబళ్లాపురం: మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ బావ మహదేవయ్య (62) కిడ్నాప్‌నకు గురయ్యారు. చెన్నపట్టణ తాలూకా చక్కెర గ్రామంలోని మహదేవయ్యకు చెందిన తోటలో ఉన్న ఆయన కనబడకుండా పోయారు. తోటలో ఉన్న ఇంట్లో బీరువా తెరచి ఉంది. మహదేశ్వర కొండ మీద మహదేవయ్య మొబైల్ టవర్ లొకేషన్ చూపిస్తోంది. మహదేవయ్య కనబడకుండా పోయాడని ఆయన కుటుంబ సభ్యులు చెన్నపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసారు. మహదేవయ్య మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్‌కు బావ కావడంతో ఈ వార్త చర్చనీయాంశంగా మారింది.

చిత్రం.. అద్వితీయం


మాట్లాడుతున్న ఫొటో ఆర్టిస్ట్ జర్మని బార్బారా

బనశంకరి: యూత్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ బెంగళూరు, అంతర్జాతీయ సలాన్–2023 ఛాయాచిత్ర ప్రదర్శన నగరవాసులను అబ్బురపరుస్తోంది. కుమార కృపరోడ్డు చిత్రకళా పరిషత్‌లో దేవరాజ అరస్ గ్యాలరీలో శనివారం అంతర్జాతీయ సలాన్– 2023 ఇటీవల నిర్వహించిన చిత్ర ప్రదర్శన విజేతలకు పురస్కారాలు ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జర్మనీకి చెందిన బార్బారాస్కిమిడ్ట్ సభికులను ఉద్దేశించి మాట్లాడారు. ఫొటోగ్రఫీ అనేది కళ ఈ కళను ఛాయాగ్రహకులు తమ కెమెరాతో బంధించిన చిత్రాలతో తమ ప్రతిభను వెలుగులోకి తీసుకురావాలని అన్నారు. దేశవ్యాప్తంగా 279 మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొని 3504 చిత్రాలను పోటీలకు పంపారు. ప్రకృతి, అందాలు, అడవులు, మానవ జీవితంతో సహా అనేక అంశాలతో కూడిన చిత్రాలు ఇందులో ఉన్నాయి. అందులో న్యాయనిర్ణేతలు 104 చిత్రాలను ఎంపికచేసి విజేతలుగా నిర్ణయించి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శనకు విచ్చేసిన నగరవాసులు విభిన్నరకాల చిత్రాలు వీక్షిస్తూ సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఆదివారం సాయంత్రం వరకు ప్రదర్శన కొనసాగుతుంది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి గిరీష్ అనంతమూర్తి, కార్యదర్శి అనితా పాల్గొన్నారు.


చిత్రాలను తిలకిస్తున్న సందర్శకులు



హోసూరు వార్తలు..

చైన్‌స్నాచర్లు అరెస్ట్

హోసూరు: మహిళ వద్ద చైన్ తెంచుకెళ్లిన యువకులను పట్టణ పోలీసులు గంటలోపే అరెస్ట్ చేశారు. వివరాల మేరకు పట్టణంలోని ఓంశక్తి నగర్ ప్రాంతానికి చెందిన శారదాబాయి (70) పశువులను పోషిస్తూ పాల వ్యాపారం చేస్తుంది. శుక్రవారం సాయంత్రం ఇద్దరు యువకులు ఆమె ఇంటి వద్దకెళ్లి పాల కోసం వచ్చినట్లు నటిస్తూ ఆమె మెడలోని 6 పౌన్ల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు గాలింపు చేపట్టారు. యశ్వంత్ (21), అలెక్స్ (24) అనే ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

బడి ముందు తల్లిదండ్రుల ధర్నా


ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

కెలమంగలం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని పిల్లల తల్లిదండ్రులు ధర్నా చేశారు. డెంకణీకోట తాలూకా కోట్టై ఉలిమంగలం గ్రామంలో ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల ఉంది. ఇందులో 90 మందికి పైగా చదువుకుంటున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు లేక, తాగునీరు దొరక్క పిల్లలు అవస్థలు పడుతున్నారని పిటిఏ సభ్యులు విద్యాశాఖాధికార్ల దృష్టికి తీసుకెళ్లారు. అధికార్లు స్పందించకపోవడంతో శుక్రవారం సాయంత్రం విద్యార్థులతో కలిసి పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. అధికారులు వచ్చి వసతులు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు.

పాఠశాలలో క్రిస్‌మస్ వేడుకలు


కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

హోసూరు: హోసూరు పట్టణంలోని జాన్‌బాస్కో ఉన్నతోన్నత పాఠశాలలో శనివారం క్రిస్‌మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రిస్‌మస్ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి హోసూరు మేయర్ ఎస్.ఏ సత్య, మాజీ ఎమ్మెల్యే కే.ఏ. మనోహరన్, బీజేపీ క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షులు ఎం.నాగరాజ్, డీఎంకే నాయకుడు విజయ్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసు చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరింపజేసింది. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇంద్రాణి, జార్జ్, అర్పుతరాజ్, అలెక్స్, సిఫ్‌కాట్ అరిమా సంఘ అధ్యక్షులు మల్లేష్, అలిషాంతి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాంను ధ్వంసం చేసి కబ్జా


చెక్‌డ్యాంను ఆక్రమించుకొంటున్న దృశ్యం

కెలమంగలం: కెలమంగలం పట్టణ పంచాయతీ పరిధిలో గత కొద్ది సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన చెక్‌డ్యాంను ఓ వ్యక్తి జేసీబీ యంత్రంతో చదును చేసి ఆక్రమించుకొన్నాడని స్థానిక ప్రజలు ఆరోపించారు. కెలమంగలం పట్టణ పంచాయతీలోని జీవానగర్ ప్రాంతంలో గత 1988 ప్రాంతంలో అప్పటి ప్రభుత్వం రూ. 6 లక్షల ఖర్చుతో చెక్‌డ్యాంను ఏర్పాటు చేసింది. ఈ డ్యాం నీటిని పశుపోషకులు, మేకలు, గొర్రెల కాపర్లు తాగునీటి కోసం వినియోగిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఓ వ్యక్తి చెక్‌డ్యాం మరువను తొలగించి ఆక్రమించుకొన్నాడు. చెక్‌డ్యాం మరువను తొలగించడంతో గట్టి వర్షాలు కురిసే సమయంలో వరదనీరు ఇళ్లలోకి చొరబడి ప్రమాదాలు చోటుచేసుకొనే అవకాశం ఉందని వాపోయారు.

ఆరోగ్య కార్డుల పంపిణీ

హోసూరు: ముఖ్యమంత్రి ఆరోగ్య బీమా పథకంలో లబ్ధిదారులకు ఉచిత బీమాకార్డులు అందజేసే ప్రత్యేక శిబిరం శనివారం పట్టణంలోని కోటమారియమ్మ ఆలయం వద్ద జరిగింది. ఎమ్మెల్యే వై.ప్రకాష్, హోసూరు మేయర్ ఎస్.ఏ.సత్య ముఖ్య అతిథులుగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపమేయర్ ఆనందయ్య, ఎన్.ఎస్.మాదేశ్వరన్, డీఎంకే నాయకులు, ఆరోగ్యశాఖాధికార్లు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై జాగృతి

హోసూరు: రైతులు చిరుధాన్యాల ఉత్పత్తితో అధిక లాభాలను పొందడంపై హోసూరు వ్యవసాయ శాఖ రైతులకు ఒక్క రోజు శిక్షణ శిబిరం నిర్వహించింది. పూనపల్లి పంచాయతీలోని చిన్నబేళగొండపల్లిలో ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఉపడైరక్టర్ భువనేశ్వరి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను అందజేసే పంటల్లో చిరుధాన్యాల ఉత్పత్తి ప్రధాన పాత్ర వహిస్తుందని సూచించారు. రైతులు సేంద్రియ పద్ధతిలో ఎరువులు తయారీ, మట్టి పరీక్షలు, మోతాదు మేరకు ఎరువుల వాడకం మెళకువలను బోధించారు. అధికారులు గోవిందరాజ్, రేణుక, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

టన్నెల్ మరమ్మతులు, పలు రైళ్లు రద్దు

- మరికొన్ని దారి మళ్లింపు


మరమ్మతు పనులు జరగనున్న సొరంగ మార్గం


సిద్ధంగా ఉన్న యంత్రాలు

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు మండలంలోని రైల్వే సొరంగంలో టన్నెల్ మరమ్మతుల కారణంగా ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్‌లో నడుస్తున్న పలు రైళ్లు రద్దు, మరికొన్ని వాటిని దారి మళ్లిస్తున్నట్లు మేనేజర్ సతీష్ రెడ్డి పేర్కొన్నారు. ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్– కొత్తచెరువు మధ్యలో నల్లకొండలో 234 మీటర్ల పొడవైన ఏకైక రైల్వే సొరంగ మార్గం ఉంది. సొరంగంలో పైనుంచి రాళ్లు మట్టి పట్టాల పైకి పడుతుండడంతో ప్రమాదాన్ని గుర్తించి రైల్వే అధికారులు పరిశీలించి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించారు. సొరంగం పైకప్పులో వదులుగా ఉన్న రాళ్లు, మట్టి తొలగించి ఇనుప మెష్ ఏర్పాటు చేయాలని, పనులు 63 రోజులు చేయాలని ప్రతిపాదనలు రావడంలో ఈనెల 8 నుంచి ఫిబ్రవరి 8 వరకు ఈ మార్గంలో నడిచే చెన్నై–షిరిడి, బెంగుళూరు– పుట్టపర్తి, బెంగుళూరు– ధర్మవరం, కొండవీడు, గరీబ్‌రథ్, కర్ణాటక, రాజధాని, ఉద్యాన్, ప్రశాంతి, జసవ రైళ్లు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్‌కు సాయంత్రం వస్తున్న హౌరా, కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లు ధర్మవరం వరకు మాత్రమే నడుస్తాయన్నారు. ప్రతి శనివారం వచ్చే చెన్నై ఎక్స్‌ప్రెస్ బెంగుళూరు వరకు మాత్రమే నడుస్తుందన్నారు. దీంతో పూర్తిగా 22 రైళ్లు రద్దు కానున్నాయి. మరో 33 రైళ్లు ధర్మవరం నుంచి ఎస్ఎస్ గేట్ మీదుగా పెనుకొండ వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 8న పనులు ప్రారంభంకానున్నాయి. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకొంటున్నారు. ప్రయాణికులు గమనించాలన్నారు. ఫిబ్రవరి 9న తిరిగి సర్వీసులు పునరుద్ధరిస్తామన్నారు. టన్నెల్ మరమ్మతులు దృష్టిలో ఉంచుకుని పుట్టపర్తి నుంచి ధర్మవరం రైల్వే స్టేషన్ వరకు బస్సు సర్వీసులు పెంచుతున్నట్లు డిపో మేనేజర్ ఇనాయతుల్లా పేర్కొన్నారు.

ఉద్రిక్తంగా ప్లాస్టిక్ తనిఖీలు

- ముగ్గురు వ్యాపారుల అరెస్టు


అధికార్లపై వాగ్వివాదానికి దిగిన వ్యాపారులు

హోసూరు: ప్లాస్టిక్ కవర్ల నిషేధంలో భాగంగా శనివారం నిర్వహించిన దాడుల్లో పారిశుధ్య శాఖాధికార్లపై తిరగబడిన ముగ్గురు వ్యాపారులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు హోసూరు కార్పొరేషన్ కమిషనర్ స్నేహ ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా పారిశుధ్య శాఖాధికార్లు పట్టణంలో ఆకస్మిక దాడులు నిర్వహించి వ్యాపారులు వినియోగిస్తున్న నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనపరుచుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తున్నారు. రైతు బజారు, పూలమార్కెట్‌లలో శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పూల మార్కెట్‌లో నిర్వహించిన తనిఖీలలో వ్యాపారులు అధికారులపై తిరగబడడంతో రభస మొదలైంది. విషయం తెలుసుకొన్న పోలీసులు వెంటనే మార్కెట్‌కు చేరుకొని ముగ్గురు వ్యాపారులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో సుమారు 18 కిలోల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనపరుచుకొని రూ. 18 వేలు జరిమానా వసూలు చేశారు. ఈ సంఘటన పట్టణంలోని వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశమైంది.

అప్రమత్తంగా ఉండండి

- సహాయక చర్యల్లో ఎలాంటి లోటూ రాకూడదు
- అధికారులకు సీఎం జగన్ ఆదేశం
- ఎనిమిది జిల్లాలకు ముందస్తుగా నిధులు విడుదల



సాక్షి, అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర వాయుగుండం తుపానుగా మారుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తుపాను పరిస్థితులపై ముఖ్యమంత్రి శనివారం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 4న ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశముందని, అది ఉత్తర దిశగా ప్రయాణించే సూచనలు ఉన్నాయని అధికారులు సీఎంకు తెలిపారు. ఈ నేపథ్యంలో అన్నిరకాల చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ వారిని ఆదేశించారు. సహాయ పునరావాస కార్యక్రమాలు చేపట్టడానికి ప్రభావిత జిల్లాల కలెక్టర్లు సర్వసన్నద్ధంగా ఉండాలన్నారు. కరెంటు, రవాణా వ్యవస్థలకు అంతరాయాలు ఏర్పడితే వెంటనే వాటిని పునరుద్ధరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తుపాను ప్రభావం అధికంగా ఉన్న తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట సహాయ శిబిరాలు ఏర్పాటుచేయాలన్నారు. ఈ శిబిరాల్లో రక్షిత తాగునీరు, ఆహారం, పాలతోపాటు ఆరోగ్య శిబిరాలను కూడా ఏర్పాటుచేసుకోవాలన్నారు. మరోవైపు.. సీఎం జగన్ ఆదేశాల మేరకు ఎనిమిది జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా నిధులు విడుదల చేసింది. తిరుపతి జిల్లాకు రూ.2 కోట్లు, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలకు రూ.కోటి చొప్పున విడుదల చేశారు.

కలెక్టర్లు సిద్ధంగా ఉండాలి

- సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం

సాక్షి, అమరావతి: బంగాళాఖాతంలో తుపాను కారణంగా ఎలాంటి పరిస్థితులు తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సన్నద్ధంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. తుపాను ముందు జాగ్రత్త చర్యలపై శనివారం సీఎస్ తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయన ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ తుపాను ప్రభావం తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ, అనకాపల్లి జిల్లాలపై ఉంటుందని చెప్పారు. మిగతా జిల్లాల్లోను ఒక మాదిరి వర్షాలు పడే అవకాశముందన్నారు. కావున అధికారులు అంతా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని సీఎస్ ఆదేశించారు. రైతులు పండించిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి మిల్లులకు చేర్చేలా చూడాలని సీఎస్ చెప్పారు. కోతకోసి వనలపై ఉన్నవారి పంటను ఏ విధంగా కాపాడుకోవాలో కూడా రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను సీఎస్ ఆదేశించారు. వివిధ నిత్యావసర సరుకులను జిల్లాల్లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని.. ఎక్కడైనా చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగి రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగితే వెంటనే వాటిని తొలగించి ట్రాఫిక్ పునరుద్ధరణకు అవసరమైన యంత్రాలు, ఇతర పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆర్ అండ్ బీ, విద్యుత్, టెలికం తదితర శాఖలను ఆయన ఆదేశించారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ జి.సాయిప్రసాద్ మాట్లాడుతూ తీర ప్రాంత జిల్లాల కలెక్టర్లు పూర్తి సన్నద్ధంగా ఉండాలన్నారు. ఆర్థిక, వ్యవసాయ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఎస్ఎస్ రావత్, గోపాలకృష్ణ ద్వివేది, పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, భారత వాతావరణ శాఖ అమరావతి డైరెక్టర్ స్టెల్లా, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ హైఅలర్ట్

మరోవైపు.. మిచాంగ్ తుపానుపై విద్యుత్ శాఖ హైఅలర్ట్ ప్రకటించింది. తుపాను ప్రభావం చూపే జిల్లాల్లో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధమవుతోంది. విద్యుత్ వ్యవస్థ దెబ్బతింటే యుద్ధప్రాతిపదికన సరఫరాను పునరుద్ధరించేందుకు ముందస్తు చర్యలు చేపట్టింది. తుపాను పీడిత ప్రాంతాల్లోని మండలాల్లో 11కేవీ స్తంభాలు, లైన్లు, డీటీఆర్‌లు దెబ్బతింటే వాటిని పునరుద్ధరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసింది. ఇక తుపాను సమయంలో లైన్‌మెన్ నుంచి చైర్మన్ వరకు ఎవరికీ సెలవులు ఉండవని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ స్పష్టంచేశారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు ఐ. పృథ్వీతేజ్, జె. పద్మజనార్దనరెడ్డి, కె. సంతోషరావు, ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబుతో మిచాంగ్ తుపాను సంసిద్ధతపై శనివారం ఆయన సమీక్ష జరిపారు.

ముంచుకొస్తున్న 'మిచాంగ్'

- బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం
- నేడు తుపానుగా బలపడే అవకాశం
- దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ నుంచి అతిభారీ వర్షాలు!





ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా కోడూరు వద్ద సముద్రపు అలల ఉధృతి, కోట మండలంలో కోతకు గురైన తీరం

సాక్షి, అమరావతి/తిరుపతి అర్బన్/సాక్షి, అమలాపురం/భీమవరం/సాక్షి ప్రతినిధి, నెల్లూరు/రేపల్లె/సాక్షి, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఆదివారానికి తుపాను (మిచాంగ్)గా బలపడనుంది. ఇది ప్రస్తుతం పశ్చిమ వాయవ్య దిశగా గంటకు 17 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ఈ వేగం శనివారం రాత్రికి ఏడు కిలోమీటర్లకు తగ్గింది. తుపానుగా మారాక పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరింత శక్తిని పుంజుకునే అవకాశముంది. ఈ తుపాను పుదుచ్చేరికి 440 కి.మీ., చెన్నైకి 420 కి.మీ., నెల్లూరుకు 520 కి.మీ., బాపట్లకు 620 కి.మీ., మచిలీపట్నానికి 620 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఆదివారం రాత్రికి ఇది తుపానుగా మారే అవకాశమున్నట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. 4వ తేదీకి ఇది దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు తీర ప్రాంతాలకు విస్తరించనుంది. ఆ తర్వాత దక్షిణాంధ్ర తీర ప్రాంతానికి సమాంతరంగా ప్రయాణిస్తూ 5వ తేదీ ఉదయం బాపట్ల–మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మచిలీపట్నం సమీపంలో తీరం దాటేందుకు ఎక్కువ అవకాశాలున్నాయి. మరోవైపు తుపాను తీరం దాటుతుందా.. లేకపోతే మచిలీపట్నం సమీపంలోనే తీరం వరకు వచ్చి మళ్లీ సముద్రంలోనే దిశ మార్చుకుంటుందా.. అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. సముద్రంలో ఉష్ణోగ్రతలు, భూమి మీద ప్రస్తుతమున్న ఉష్ణోగ్రతలను బట్టి ఈ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ తీరం దాటితే తుపాను బలహీనపడి మళ్లీ కోనసీమ ప్రాంతంలో తిరిగి సముద్రంలోకి వెళ్లే అవకాశాలున్నాయి. దీనిపై పూర్తి స్పష్టత ఆదివారానికి వచ్చే అవకాశముంది. దీని ప్రభావం దక్షిణ కోస్తా జిల్లాలపై ఎక్కువగా ఉండనుంది. కోస్తా జిల్లాల్లో 4, 5 తేదీల్లో రెడ్ అలెర్ట్ ప్రకటించే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

నాలుగు రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు..

తుపాను ప్రభావంతో ఆదివారం నుంచి నాలుగు రోజులపాటు కోస్తాంధ్ర, రాయలసీమల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. గంటకు 75 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. తుపాను తీరాన్ని దాటే సమయంలో గంటకు 80–90, గరిష్టంగా 100 కి.మీ.ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయి. ఇక ఆదివారం నుంచి ఆరో తేదీ వరకు కోస్తాంధ్ర, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ఆదివారం కృష్ణా, బాపట్ల, ప్రకాశం, ఎస్పీఎస్సార్ నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు.. కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, వైఎస్సార్, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. 4న కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, ఎస్పీఎస్సార్ నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల అత్యంత భారీ వర్షాలు.. అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే, 5న కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఒకటి, రెండుచోట్ల అత్యంత భారీ వర్షాలు.. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్, ఎస్పీఎస్సార్ నెల్లూరు, నంద్యాల జిల్లాల్లో ఒకటి, రెండుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం, విజయనగరం, వైఎస్సార్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురవొచ్చని ఐఎండీ తెలిపింది. 6న శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాల్లో ఒకటి, రెండుచోట్ల భారీ వర్షాలకు ఆస్కారం ఉందని వివరించింది.

స్టేట్ ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

తుపాను నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో స్టేట్ ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. తుపాను ప్రభావిత జిల్లా కలెక్టరేట్లు, ఆయా రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లోనూ కంట్రోల్ రూములు ఏర్పాటుచేశారు. తుపాను సమాచారం, హెచ్చరికలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సమాచారం అందిస్తోంది. బాపట్ల జిల్లా నిజాంపట్నం హార్బర్‌లో 1వ నంబర్ ప్రమాద హెచ్చరిక జారీచేసినట్లు పోర్టు కన్జర్వేటర్ మోకా వెంకట రామారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే సముద్రంలోకి వేటకు వెళ్లిన బోట్లు తిరిగి ఒడ్డుకు చేరాయన్నారు.

తిరుపతి జిల్లాలో వర్షాలు.. కోనసీమలో బలమైన గాలులు..

మిచాంగ్ తుపాను ప్రభావంతో తిరుపతి జిల్లాలో ఇప్పటికే విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ అప్రమత్తం చేశారు. మత్స్య కారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా ఆదేశించారు. అవసరమైన చోట్ల పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేయిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఈదురుగాలులు బలంగా వీస్తున్నాయి. పలు ప్రాంతాల్లో సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. కొన్నిచోట్ల సముద్రం ముందుకు చొచ్చుకు వస్తుండడంతో తీరం కోతకు గురవుతోంది. సముద్రంలో కలిసే మొగల ద్వారా నీరు డ్రెయిన్లలోకి వస్తోంది. ఖరీఫ్ కోతలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో భారీ వర్షాలు కురిస్తే నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో 37 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో అలలు ఎగిసిపడుతున్నాయి. తుపానుతో పశ్చిమ గోదావరి జిల్లాలో కూడా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మత్స్యకారులు సముద్రంలోనికి వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. సార్వా మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నందున ధాన్యాన్ని మెరక ప్రాంతంలో భద్రపర్చుకోవాలని రైతులకు సూచించారు. లోతట్టు గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రచారం చేస్తున్నారు.

నెల్లూరులో సముద్రం అల్లకల్లోలం

తుపాను తీరం వైపు దూసుకొస్తుండడంతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. చాలాచోట్ల దాదాపు యాభై మీటర్ల మేర సముద్రం ముందుకొచ్చింది. తీరప్రాంత మండలాలైన కావలి, అల్లూరు, ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు, ముత్తుకూరులలో శనివారం ఉదయం నుంచి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. జన జీవనం దాదాపు స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు ముంపునకు గురయ్యాయి. మరో 48 గంటల్లో బాపట్ల, నెల్లూరు మధ్య తుపాన్ తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేయడంతో జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణన్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ప్రత్యేక సూచనలు జారీచేశారు. జిల్లా అంతటా ఉదయం నుంచి ముసురుతో ఓ మోస్తరు వర్షాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించడంతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 24 గంటలు పని చేసేలా ఏర్పాటు చేశారు. మత్స్యకారులను చేపల వేటకు వెళ్లరాదని సూచించారు.

144 రైళ్లు రద్దు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ)/హైదరాబాద్: మిచాంగ్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా ప్రాంతాల్లో ముప్పు పొంచి ఉండటంతో రైల్వే అధికారులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. రైళ్ల కార్యకలాపాలు, ట్రాక్‌ల పటిష్టత, ప్రయాణికుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేయాలని డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కలిసి సమన్వయంతో పని చేయాలని సూచించారు. మరోవైపు ముందుజాగ్రత్తగా ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మీదుగా నడిచే 144 ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. అన్ని ముఖ్యమైన రైల్వేస్టేషన్‌లలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

హైదరాబాద్ నుంచి మరికొన్ని రైళ్లు రద్దు

తుపాను నేపథ్యంలో వివిధ ప్రాంతాల మధ్య నడిచే రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి బయల్దేరే రైళ్లలో హైదరాబాద్–తాంబరం(చెన్నై), సికింద్రాబాద్–కొల్లాం, సికింద్రాబాద్–తిరుపతి, లింగంపల్లి–తిరుపతి, సికింద్రాబాద్–రేపల్లె, కాచిగూడ–రేపల్లె, చెన్నై–హైదరాబాద్, సికింద్రాబాద్–గూడూరు, సికింద్రాబాద్–త్రివేండ్రం తదితర ప్రాంతాల మధ్య నడిచే రైళ్లు రద్దు కానున్నాయి.

తెలంగాణ

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు షురూ



ఓయూలోని కౌంటింగ్ కేంద్రంలో అధికారులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ ఎన్నికల ఫలితాల వెల్లడికి మరో కొద్ది గంటల సమయం మాత్రమే ఉంది. నవంబర్ 30న ఎన్నికలు జరగ్గా నేడు (ఆదివారం) ఫలితాలు వెల్లడి కానున్నాయి. దాదాపు మెజార్టీ ఎగ్జిట్‌పోల్స్ కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగిస్తాయని తేల్చిన సంగతి తెలిసిందే. అయితే బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఎన్నికల ఫలితాలు తమకే అనుకూలంగా ఉంటాయనే నమ్మకంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే ఎన్నికల సంఘం కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసింది. ఆదివారం ఉదయం 8 గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. అరగంట తర్వాత అంటే 8.30 గంటలకు ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపు మొదలుపెడతారు. చాలా నియోజకవర్గాల్లో ఉదయం 10.30 గంటలకల్లా ఏ అభ్యర్థి ఆధిక్యతలో ఉన్నదీ దాదాపు స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకల్లా పార్టీల గెలుపోటములపై స్పష్టత రావొచ్చని పేర్కొంటున్నారు. ఓట్ల లెక్కింపు సరళిని కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ https://results.eci.gov.in ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

119 నియోజకవర్గాల్లో 2,290 మంది..

మొత్తం 119 శాసనసభ నియోజకవర్గాల్లో 2,290 మంది పోటీ చేశారు. కాగా, హైదరాబాద్ నగర పరిధిలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అత్యధికంగా 26 రౌండ్లలో, భద్రాచలం నియోజకవర్గంలో అతి తక్కువగా 13 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగనుంది. అంటే భద్రాచలం ఫలితం తొలుత వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో మళ్లీ గెలిచి హ్యాట్రిక్ కొడతామని బీఆర్ఎస్.. తెలంగాణలో తొలిసారి అధికారం చేపడతామని కాంగ్రెస్ అంటున్నాయి. హంగ్ ఏర్పడితే ప్రభుత్వంలో భాగస్వామ్యం లభిస్తుందని బీజేపీ, ఎంఐఎం ఆశలు పెట్టుకున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ సీట్లలో బీఆర్ఎస్ పోటీ చేయగా.. కాంగ్రెస్ 118 చోట్ల, పొత్తులో సీపీఐ ఒక స్థానంలో బరిలో ఉన్నాయి. మరో కూటమిలో బీజేపీ 111, జనసేన 8 స్థానాల్లో పోటీ చేశాయి. బీఎస్పీ 107, ఎంఐఎం 9, సీపీఎం 19, సీపీఐఎల్ (న్యూడెమోక్రసీ) ఒక స్థానంలో బరిలో దిగాయి.

ఈ స్థానాలపైనే అందరి దృష్టి

సీఎం కేసీఆర్ ఈసారి గజ్వేల్, కామారెడ్డి స్థానాల నుంచి పోటీలో ఉండగా.. ఆయనపై గజ్వేల్‌లో బీజేపీ తరఫున ఈటల రాజేందర్, కామారెడ్డిలో కాంగ్రెస్ తరఫున పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బరిలోకి దిగారు. దీనితో రాష్ట్రవ్యాప్తంగా ఈ రెండు నియోజకవర్గాల ఫలితం ఎలా ఉంటుందన్నది ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు కేసీఆర్ తనయుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (సిరిసిల్ల), మంత్రులు హరీశ్‌రావు (సిద్దిపేట), ఎర్రబెల్లి దయాకర్‌రావు (పాలకుర్తి), సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి (వనపర్తి), ఇంద్రకరణ్‌రెడ్డి (నిర్మల్), సబితా ఇంద్రారెడ్డి (మహేశ్వరం), స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ) పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి (కొడంగల్), భట్టి విక్రమార్క (మధిర), ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (హుజూర్‌నగర్), దామోదర రాజనర్సింహ (ఆందోల్), కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (నల్లగొండ), జీవన్‌రెడ్డి (జగిత్యాల), దుద్దిళ్ల శ్రీధర్ బాబు (మంథని), సీతక్క (ములుగు), తుమ్మల నాగేశ్వరరావు (ఖమ్మం), పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి (పాలేరు) స్థానాలపైనా ఆసక్తి నెలకొంది. అలాగే బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ (కరీంనగర్), ఈటల రాజేందర్ (హుజూరాబాద్), బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ (సిర్పూర్ కాగజ్ నగర్) పోటీ చేస్తున్న స్థానాలపైనా ఉత్కంఠ ఉంది. ఇక నిరుద్యోగుల ప్రతినిధిగా కొల్లాపూర్ నుంచి పోటీచేస్తున్న బర్రెలక్క గెలుస్తుందా..? ఓడిపోతుందా..? అనేదానిపైనా ఆసక్తికర చర్చ నడుస్తోంది.

ఊరూవాడా.. రిజల్ట్‌పై అటెన్షన్!

- తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జనంలో ఉత్కంఠ
- పార్టీలు, అభ్యర్థుల గెలుపోటములపై పందేలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మొదలవుతున్న నేపథ్యంలో తెలంగాణలో జనం దృష్టి అంతా ఫలితాలపైనే పడింది. ఊరూవాడా పల్లెపట్నం ఎక్కడ చూసినా.. చిన్నాపెద్దా ఎవరిని కదిలించినా ఉత్కంఠ కనిపిస్తోంది. ఎవరెవరు గెలుస్తారు? ఏ పార్టీ గెలుస్తుంది? ప్రభుత్వం ఏర్పాటు చేసేదెవరు? కేసీఆర్, కేటీఆర్, రేవంత్, ఈటల వంటి ప్రముఖ నేతల్లో ఎవరెవరికి ఎలాంటి ఫలితం ఎదురవుతుందన్న చర్చ కూడా సాగుతోంది. పొలాల్లో పనిచేసుకుంటున్న రైతులు, కూలీల నుంచి హోటళ్లలో, బస్టాండ్లలో పిచ్చాపాటీ దాకా ఎక్కడ నలుగురు కలసినా ఇదే తీరు. చివరికి ఆలయాలు, ఇతర ప్రార్థనా స్థలాల్లో పరిచయస్తులు కనిపించినా ఎలక్షన్ల ప్రస్తావన రాకుండా ఉండటం లేదు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న పోస్టులపై విస్తృత విశ్లేషణలు చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ఫలితాల హీట్ కనిపిస్తోంది. పల్లె, పట్నం తేడా లేకుండా ఎక్కడ చూసినా ఫలితాలపై చర్చలు సాగుతుంటే.. వివిధ పార్టీల అభిమానుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు కనిపిస్తున్నాయి. మేం గెలుస్తామంటే, మేం గెలుస్తామంటూ అభ్యర్థులు, పార్టీల తరఫున సరదా పందేలూ జరుగుతున్నాయి. మరోవైపు అసెంబ్లీ ఫలితాలపై జోరుగా బెట్టింగ్‌లు కూడా జరుగుతున్నాయని, ఇప్పటికే రంగ ప్రవేశం చేసిన బుకీలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్‌మీడియా గ్రూపుల్లో హడావుడి చేస్తున్నారని తెలిసింది. సీఎం ఎవరవుతారు, ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయనే అంశంపై రూ.లక్షల్లోనే బెట్టింగులు సాగుతున్నాయి. కర్ణాటక, ఏపీ వంటి పొరుగు రాష్ట్రాల్లోనూ తెలంగాణ ఫలితాలపై ఆసక్తి కనిపిస్తోంది. అక్కడి వారూ బెట్టింగ్‌లు కడుతున్నట్టు సమాచారం.

సోషల్ మీడియాలో జోరుజోరుగా..

వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఎన్నికల ఫలితాల అంచనాలు, విశ్లేషణలు పోటెత్తుతున్నాయి. ఎక్కడ ఫలితాలు ఎలా ఉంటాయనే అంచనాలు, ఊహాగానాలు క్షణం తీరిక లేకుండా పోస్టు అవుతున్నాయి. ఫోన్‌లో నోటిఫికేషన్ సౌండ్ వచ్చిందంటే చాలు చేతిలోకి తీసుకుని చెక్‌చేసుకుంటున్నారు. రాజకీయ పోస్టులను చదవడమే కాదు.. వాటిపై తమ అభిప్రాయాలు, అంచనాలనూ రిప్లైలో ఇస్తున్నారు. తమకు నచ్చినవాటిని ఆయా ప్లాట్‌ఫామ్‌లపై, గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు. దీంతో ఎవరు గెలుస్తారన్నది, ఎవరు ఓడుతారన్నది గందరగోళంగా మారిపోయింది.

మొత్తం రూ.241.52 కోట్ల నగదు స్వాధీనం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. రాష్ట్రంలో అక్టోబర్ 9న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి డిసెంబర్ 1 వరకు పోలీసు బృందాల తనిఖీల్లో మొత్తం రూ.241.52 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.103 కోట్ల నగదు పట్టుబడగా ఈసారి ఎన్నికల నగదు స్వాధీనంలో 248 శాతం పెరుగుదల నమోదైంది. ఈ మేరకు శనివారం డీజీపీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై మొత్తం 11,859 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సీఎల్పీ సమావేశానికి ఏఐసీసీ పరిశీలకులు

సాక్షి, న్యూఢిల్లీ: నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నేడు(ఆదివారం) జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ శాసనసభా పక్ష(సీఎల్పీ) సమావేశాల సమన్వయానికి తెలంగాణసహా నాలుగు రాష్ట్రాలకు శనివారం ఏఐసీసీ పరిశీలకులను నియమించింది. తెలంగాణకు నియమించిన ఐదుగురు ఏఐసీసీ పరిశీలకుల్లో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, దీపాదాస్ మున్షీ, డాక్టర్ అజోయ్ కుమార్, కె.మురళీధరన్, కె.జె.జార్జి ఉన్నారు.

బీఆర్ఎస్‌లో ఎడతెగని మథనం!

- ప్రగతిభవన్‌లో కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్, ఇతర కీలక నేతల భేటీ
- సొంతంగానే మేజిక్ ఫిగర్ సాధిస్తామని బీఆర్ఎస్ అధినేత ధీమా
- హంగ్ వస్తే ఎంఐఎం మద్దతుతో సర్కారు ఏర్పాటుపై చర్చ?
- బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు గెలిచే అవకాశమున్నచోట అప్రమత్తం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు కొద్దిగంటల్లో వెలువడనుండగా బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించారు. ప్రగతిభవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మంత్రి హరీశ్‌రావు, పార్టీ పార్లమెంటరీ నేత కె.కేశవరావు, ఇతర నేతలతో రెండో రోజూ ఎడతెగని మంతనాలు జరిపారు. పార్టీ వార్‌రూమ్ నివేదికలతోపాటు ఎగ్జిట్ పోల్స్, వివిధ సంస్థలు, నిఘా వర్గాలు, పార్టీ అభ్యర్థులు, ఇన్‌చార్జులు అందించిన నివేదికలను లోతుగా విశ్లేషించారు. ఆదివారం వెలువడే ఫలితాలు బీఆర్ఎస్‌కు సానుకూలంగా ఉంటాయని గట్టిగా విశ్వసిస్తున్న కేసీఆర్.. మళ్లీ మన ప్రభుత్వమే ఏర్పడుతుందంటూ పార్టీ నేతలకు భరోసా కల్పిస్తున్నారు. సొంతంగానే మేజిక్ ఫిగర్‌ను అందుకుంటామని చెప్తున్నారు.

అవసరమైతే ఎంఐఎంతో కలసి..

కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ మేజిక్ ఫిగర్ అయిన 60 సీట్లు దక్కించుకునే అవకాశం లేదని బీఆర్ఎస్ శిబిరం లెక్కలు వేస్తోంది. ఒకవేళ హంగ్ ఫలితాలు వస్తే, అవసరమైతే మిత్రపక్షం ఎంఐఎం సహకారంతో ప్రభుత్వం ఏర్పడుతుందని కేసీఆర్ సంకేతాలు ఇస్తున్నట్టు తెలిసింది. మరోవైపు కాంగ్రెస్ శిబిరంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను కూడా కేసీఆర్ నిశితంగా గమనిస్తున్నారని బీఆర్ఎస్ వర్గాలు చెప్పాయి. ఫలితాలు వెలువడిన వెంటనే గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా హైదరాబాద్‌కు చేరుకోవాలని ఆదేశించారని తెలిపాయి. ఇక ఓట్ల లెక్కింపు ప్రక్రియను పార్టీపరంగా సమన్వయం చేసే బాధ్యతను కేటీఆర్ ఆధ్వర్యంలోని వార్‌రూమ్‌కు.. పార్టీ ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కు చేరుకునేలా చూడాల్సిన బాధ్యతను కేటీఆర్, హరీశ్‌రావులకు అప్పగించారు.

గెలిచే చాన్స్ ఉన్నవారి జాబితా సిద్ధం చేసి..

వివిధ వర్గాల నుంచి అందిన నివేదికల ఆధారంగా గెలుపు అవకాశాలున్న నియోజకవర్గాలు, అభ్యర్థులతో బీఆర్ఎస్ ఓ ప్రాథమిక జాబితాను సిద్ధం చేసుకుంది. మరోవైపు స్వల్ప మెజారిటీతో గెలిచే అవకాశమున్న(ఉత్కంఠ పోటీతో) నియోజకవర్గాల పరిస్థితిని మదింపు చేసి మరో జాబితాను రూపొందించుకున్నట్టు సమాచారం. బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు గెలిచే అవకాశమున్న స్థానాలపైనా బీఆర్ఎస్ ఇప్పటికే ఓ అంచనాకు వచ్చింది. ప్రభుత్వ ఏర్పాటులో వారి మద్దతు అవసరమయ్యే పక్షంలో సంప్రదింపులకు సిద్ధంగా ఉండాలని పార్టీ కీలక నేతలను ఆదేశించినట్టు తెలిసింది. ఉమ్మడి నల్గొండ మినహా ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలో గణనీయంగా సీట్లు సాధిస్తామని... ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పైచేయి బీఆర్ఎస్‌దే ఉంటుందని కేసీఆర్ భావిస్తున్నట్టు తెలుస్తోంది.

కాంగ్రెస్.. 'మిషన్ తెలంగాణ'

- నేడు కౌంటింగ్ ప్రక్రియ ముగిసేదాకా అనుసరించాల్సిన వ్యూహాలకు పదును
- ఇప్పటికే హైదరాబాద్‌కు డీకే సహా పలువురు కర్ణాటక మంత్రులు, పరిశీలకులు



సాక్షి, హైదరాబాద్/సాక్షి, బెంగళూరు: తెలంగాణలో అధికారాన్ని దక్కించుకోవాలన్న కృతనిశ్చయంతో ఉన్న కాంగ్రెస్ హైకమాండ్ తన ఆపరేషన్‌ను ప్రారంభించింది. 'మిషన్ తెలంగాణ'పేరుతో నేటి కౌంటింగ్ ప్రక్రియ మొదలై ముగిసేదాకా అనుసరించాల్సిన వ్యూహాలకు పదునుపెట్టింది. ఈ బాధ్యతను కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, 'ట్రబుల్ షూటర్' డి.కె. శివకుమార్‌కు అప్పగించింది. ఆయనకు తోడుగా పలువురు కర్ణాటక మంత్రులు, కొందరు ఏఐసీసీ కీలక నేతలు ఆపరేషన్‌లో పాలుపంచుకోనున్నారు. కర్ణాటక మంత్రులు జార్జి, బోసురాజు శనివారం మధ్యాహ్నానికే హైదరాబాద్ చేరుకోగా డి.కె.శివకుమార్ రాత్రికి వచ్చారు.

కీలక నేతలతో రాహుల్ మీటింగ్

ఎన్నికల కౌంటింగ్ ఆదివారం ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ వర్చువల్ మీటింగ్ నిర్వహించారు. ఈ భేటీలో టీపీసీసీ ముఖ్య నేతలు రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు కర్ణాటక మంత్రులు జార్జి, బోసురాజు, పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, పరిశీలకులు పాల్గొన్నారు. ఫలితాలు వచ్చాక అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. పార్టీ అభ్యర్థులను ముందే హైదరాబాద్ పిలిపించాలన్న కొందరి సూచనలను రాహుల్ తిరస్కరించినట్లు తెలిసింది. కౌంటింగ్ కేంద్రాల్లో అభ్యర్థులు లేకుంటే నష్టం జరుగుతుందని, ప్రజల్లోకి కూడా తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఆయన చెప్పినట్లు సమాచారం. కౌంటింగ్ ముగిసే వరకు అభ్యర్థులను అక్కడే ఉంచాలని, ఫలితాలను బట్టి అభ్యర్థుల తరలింపుపై నిర్ణయం తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. ఏఐసీసీ పరిశీలకులతోపాటు జిల్లాల్లోని ముఖ్య నాయకులు సమన్వయంతో వ్యవహరించాలని.. జిల్లాలవారీగా బాధ్యులను నియమించుకొని కౌంటింగ్ సమయంలో అనుసరించాల్సిన వ్యూహాలపై నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించారు.

ద్విముఖ వ్యూహంతో ముందుకు..

ఈసారి అధికారం దక్కించుకునేందుకు రెండు వ్యూహాలను కాంగ్రెస్ సిద్ధం చేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ వస్తే ప్లాన్–ఏ, కొన్ని స్థానాలు తక్కువ పడే సందర్భంలో ప్లాన్–బీని అమలు చేయాలని నిర్ణయించింది. సంపూర్ణ మెజారిటీ సాధిస్తే అభ్యర్థులందరినీ హైదరాబాద్ పిలిపించి డి.కె.శివకుమార్ సమక్షంలో తొలుత సమావేశం ఏర్పాటు చేయనుంది. అనంతరం ఆయనతోపాటు టీపీసీసీ ముఖ్యులంతా కలసి ఢిల్లీ వెళ్లి హైకమాండ్‌తో సీఎల్పీ సమావేశం తేదీని నిర్ణయించాలని, ఆ తర్వాత సీఎల్పీ నేత ఎంపిక బాధ్యతను హైకమాండ్‌కు అప్పగించాలని పార్టీ యోచిస్తోంది. ఒకవేళ హంగ్ పరిస్థితులు ఏర్పడి మెజారిటీకి కొన్ని స్థానాలు తక్కువగా వస్తే ప్లాన్–బీని అమలు చేయాలని, అప్పుడు వీలైనంత త్వరగా అభ్యర్థులందరినీ హైదరాబాద్‌కు పిలిపించి టీపీసీసీ ముఖ్య నేతలతో సహా అందరినీ బెంగళూరుకు తరలించాలని భావిస్తోంది. ఒకవేళ అతిపెద్ద పార్టీగా అవతరించి ఎంఐఎంతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అంశంపైనా చర్చిస్తోంది.





పంట చేలో పాల కంకి పల్లకిలో పిల్ల ఎంకి నవ్వినంత అందంగా...

చీర గురించి ఎన్ని పాటలు రాసినా రాయాల్సినవి ఎన్నో మిగిలే ఉంటాయి. అందమైన చీరకట్టును చూస్తే పంటచేలో పాలకంకి, పల్లకిలో పిల్ల ఎంకీ నవ్వినంత అందంగా, అద్భుతంగా ఉంటుంది. డిజైనర్ నివేదిత సంజయ్ ప్రభు వినూత్నంగా డిజైన్ చేసిన చీరల ఛాయాచిత్రాలు నెటిజనులను ఆకట్టుకుంటున్నాయి. కేరళ కసువు శారీ (వైట్ కాటన్ శారీ విత్ గోల్డెన్ జరి బార్డర్) రకరకాల వేడుకలకు క్లాసిక్ ఫేవరేట్‌గా పేరు పొందింది. డిజైనర్ నివేదిత సంజయ్ ప్రభు ఈ చీరకు సంబంధించి పురాతన టెక్నిక్‌లను మాన్యువల్ స్క్రీన్ ప్రింటింగ్ ద్వారా తిరిగి తీసుకువచ్చింది. ప్రతి ప్రింట్ ఒక అందమైన కథ చెబుతుంది. అరటిఆకుల నుంచి ఇంగ్లీజ్ రోజ్, చెంబూర్ ఫ్లవర్ వరకు ప్రకృతిలోని ఎన్నో అందాలు కసువు చీరెలో కనిపించి కనువిందు చేస్తాయి.

వైరల్

ఈ రైల్వే స్టేషన్ పేరు సచిన్!

స్టేడియంల సంగతి ఏమిటోగానీ రైల్వేస్టేషన్‌లకు క్రికెటర్‌ల పేర్లు ఊహించలేము. అయితే గుజరాత్‌లోని సూరత్ సమీపంలోని ఒక రైల్వేస్టేషన్ పేరు సచిన్. మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఈ రైల్వేస్టేషన్ ముందు దిగిన ఫోటో వైరల్‌గా మారింది.

'ఈ రైల్వేస్టేషన్‌కు మన ఆల్‌టైమ్ గ్రేట్ క్రికెటర్‌లలో ఒకరైన నా ఫేవరెట్ క్రికెటర్, నా అభిమాన వ్యక్తి పేరు పెట్టారు. గత శతాబ్దానికి చెందిన పెద్దల ముందు చూపు అబ్బుర పరుస్తుంది' అని ఇన్‌స్టాగ్రామ్‌లో రాశాడు సునీల్ గవాస్కర్.

ఇది చూసి 'సచిన్‌లో సన్నీని చూడడం ఆనందంగా ఉంది' అంటూ స్పందించాడు సచిన్ తెండూల్కర్.



నిజానికి ఈ రైల్వేస్టేషన్‌కి 'సచిన్' అనే పేరు సచిన్ తెండూల్కర్ తాత ముత్తాల కాలంలోనే ఉంది. సచిన్ తెండూల్కర్ పేరుకు, ఈ రైల్వేస్టేషన్ పేరుకు ఎలాంటి సంబంధం లేకపోయినా సరదా కోసం 'పూర్వీకుల ముందుచూపు అబ్బురపరిచింది' అని రాశాడు గవాస్కర్.



రైల్లో సీటు కింద... విమానంలో నెత్తి మీద

'కౌన్ బనేగా కరోడ్‌పతి' తాజా సీజన్‌లో కోల్‌కతాకు చెందిన ఒక గృహిణి తాను నవ్వడమే కాక అమితాబ్‌ను విపరీతంగా నవ్వించింది. కేబీసీ వల్ల మొదటిసారి విమానం ఎక్కిన ఆమె రైల్లోలాగా చీటికి మాటికి సీటు కింద చూసుకుంటూ లగేజీ ఉందా లేదానే హైరానా విమానంలో లేకపోవడం తనకు నచ్చిందని చెప్పింది. ఇంకా సరదా కబుర్లు చెప్పి అమితాబ్‌ను నవ్వించిన అలోకిక భట్టాచార్య వైరల్ వీడియో గురించి....

సోనీ టీవీలో ప్రసారమవుతున్న 'కౌన్ బనేగా కరోడ్‌పతి' తాజా సిరీస్ తాజా ఎపిసోడ్‌లో కోల్‌కటాకు చెందిన అలోకిక భట్టాచార్య అనే గృహిణి అమితాబ్‌నే కాక ప్రేక్షకులను చాలా నవ్వించింది. ఆమె క్లిప్పింగ్‌ను అమితాబ్‌తో పాటు ఇతరులు 'ఎక్స్'లో షేర్ చేయడంతో నెటిజన్లు ముచ్చటపడుతున్నారు. గత 17 ఏళ్లుగా ప్రయత్నిస్తే ఇప్పటికి కేబీసీలో పాల్గొనే అవకాశం దొరికిన అలోకిక 'జై కేబీసీ' నినాదంతో హాట్‌సీట్‌లో కూచుంది. 'మీ ప్రయాణం ఎలా సాగింది?' అని అమితాబ్ అడిగితే 'కేబీసీ పుణ్యమా అని మొదటిసారి విమానం ఎక్కాను. మాలాంటి వాళ్లం రైలెక్కి ప్రతి పది నిమిషాలకూ ఒకసారి సీటు కింద లగేజ్ ఉందా లేదా చూసుకుంటాం. అర్ధరాత్రి మెలకువ వచ్చినా మొదట సీటు కిందే చూస్తాం. విమానంలో ఆ బాధ లేదు. లగేజ్ నెత్తి మీద పెట్టారు. పోతుందనే భయం వేయలేదు' అనేసరికి అమితాబ్ చాలా నవ్వాడు. 'కేబీసీ వాళ్లు ఎలాంటి ప్రశ్నలు వెతికి ఇస్తున్నారంటే నేనసలు ఏమైనా చదువుకున్నానా అని సందేహం వస్తోంది' అని నవ్వించిందామె. 'నువ్విలా నువ్వుతుంటే మీ అత్తగారు ఏమీ అనదా?' అంటే 'అంటుంది. కాని నేను నా జీవితంలో జరిగిన మంచి విషయాలు గుర్తు తెచ్చుకుని ఎప్పుడూ నవ్వుతుంటాను. అదే నా ఆరోగ్య రహస్యం. మూడు పూటలా అన్నం, పప్పు, చేపలు తింటూ కూడా సన్నగా ఎలా ఉన్నానో చూడండి. ఫ్రీగా. కొంతమంది ఇలా ఉండటానికి డబ్బు కట్టి జిమ్ చేస్తుంటారు' అని నవ్వించిందామె. అలోకిక ఈ ఆటలో పన్నెండున్నర లక్షలు గెలిచి ఆట నుంచి విరమించుకుంది. ఆ మొత్తం ఆమెకు చాలా ముఖ్యమైనదే. కాని అమితాబ్‌తో నవ్వులు చిందించడం అంతకంటే ముఖ్యంగా ఆమె భావించింది.

లవ్ యూ బామ్మా



85 సంవత్సరాల వయసులో కంటెంట్ క్రియేటర్‌గా మారింది విజయ నిశ్చల్. ఫ్రెంచ్ ఫ్రై, సమోస. గులాబ్ జామూన్, పొటాటో బాల్స్...ఒక్కటా రెండా ఎన్నెన్నో పసందైన వంటలను ఎలా చేయాలో తన చానల్ ద్వారా నేర్పుతుంది నిశ్చల్. వంటలు చేస్తూ ఆ వంటకు తగినట్లుగా హుషారుగా పాటలు పాడుతుంటుంది. ఈ బామ్మ చానల్‌కు 8.41 లక్షల ఫాలోవర్‌లు ఉన్నారు. తాజాగా నిశ్చల్ బామ్మ చేసిన 'ఎగ్‌లెస్ కేక్' వీడియో వైరల్‌గా మారింది. ఈ వీడియో 1.1 మిలియన్‌ల వ్యూస్ దక్కించుకుంది.

'ఎగ్‌లెస్ కోసం ఎన్నో చోట్ల ప్రయత్నించాను. మీ వీడియో చూసిన తరువాత నేను స్వయంగా చేశాను. ఇదంతా మీ చలవే. లవ్ యూ బామ్మా'

'వంటల్లో ఓనమాలు కూడా తెలియని నేను మీ వల్ల ఇప్పుడు ఎన్నో వంటలు చేయగలుగుతున్నాను. నా టాలెంట్‌ను చూసి ఫ్రెండ్స్ ప్రశంసిస్తున్నారు'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో కనబడుతున్నాయి.

శశిథరూర్‌లాగా ఇంగ్లీష్ గిట్ల మాట్లాడాలే...

కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అరుదైన, పలకడానికి కష్టంగా ఉన్న ఇంగ్లీష్ పదాలు వాడుతుంటాడు అనేది తెలిసిన విషయమే. అతడి ఖరీదైన ఇంగ్లీష్‌కు చాలా మంది అభిమానులు ఉన్నారు. తాజాగా ఆస్ట్రేలియాకు చెందిన జే అనే టీచర్ 'శశి థరూర్స్ ఇంగ్లీష్ యాక్సెంట్ ఈజ్ బ్యూటీఫుల్' అనడమే కాదు అతడిలా చక్కని ఇంగ్లీష్ మాట్లాడాలంటే అంటూ కొన్ని టిప్స్ చెప్పాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో జే పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది. శశి థరూర్ ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్న వీడియోలను ప్లే చేస్తూ....



'చూడండి ఈ పదాన్ని ఎలా పలికాడో. ఆ పదాన్ని ఎలా స్ట్రెస్ చేశాడో' అంటూ చెబుతూ పోతాడు జే.

రైలే కళ్యాణ వేదిక!

కళ్యాణం వచ్చినా, కక్కొచ్చినా ఆగదు...అంటారు. కళ్యాణ ఘడియ ముంచుకొచ్చింది...అనుకున్నారేమో ఒక ప్రేమ జంట బెంగాల్-జార్ఖండ్ మూవింగ్ ట్రైన్‌లోనే దండలు మార్చుకున్నారు. ఆ తరువాత వరుడు వధువు మెడలో తాళి కట్టాడు. వధువు భావోద్వేగానికి గురై ఏడ్చింది. ఈ 'రైలు పెళ్లి' వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. బోగీలో ఉన్న ప్రయాణికులు ఈ పెళ్లి తంతు చూసి మొదట



షాక్ తిన్నా ఆ తరువాత మాత్రం ఆశీర్వదించారు.

'మల్టీ పర్పస్ ఇండియన్ రైల్వేస్'

'విమానంలో జరిగే పెళ్లి కంటే ఇది నయం. తక్కువ ఖర్చు కదా'... ఇలాంటి కామెంట్స్ నెటిజనుల నుంచి వచ్చాయి. ఇక మరో పెళ్లి విషయానికి వస్తే... ఢిల్లీకి చెందిన 27 సంవత్సరాల అవినాష్ కుమార్ డెంగ్యూ బారిన పడ్డాడు. బెడ్ మీద నుంచి లేవలేని పరిస్థితి. ఈలోపు పెళ్లిరోజు రానే వచ్చింది. దీంతో హాస్పిటల్‌లోనే వధువు మెడలో తాళి కట్టించి పెళ్లి చేశారు.

హెల్త్

కాపాడే కన్నీరు పొడిబారితే..!

కన్ను ఎప్పుడూ తడిగా ఉంటుంది. ఏదైనా కాస్త తగలగానే కళ్లల్లోంచి నీళ్లు కారిపోతుంటాయి. కన్ను పొడిబారితే ప్రమాదమని ప్రకృతి ఈ కన్నీళ్లను ఏర్పాటు చేసింది. నిత్యం ఏసీ గదుల్లో ఉండటం, కంప్యూటర్‌దో, ల్యాప్‌టాప్‌లదో, ఆఖరికి మొబైల్ స్క్రీన్‌నో ఎప్పుడూ చూస్తూ ఉండటంతో పాటు... కొన్ని ఇతర ఆరోగ్య సమస్యలు, జబ్బులు ఉన్నప్పుడు కూడా కన్నుపొడిబారుతుంది. ఇలా పొడిబారడం వల్ల కంటి ఇన్ఫెక్షన్లు వచ్చేందుకూ, ఒక్కోసారి చూపు కోల్పోయేందుకూ అవకాశముంది. కన్ను పొడిబారే సమస్యను వైద్య పరిభాషలో 'కెరటో కంజంక్టివైటిస్ సిక్కా'(డ్రై ఐ) అని చెబుతారు. ఈ కండిషన్ అవగాహన పెంచుకుని, కంటిని ఎలా కాపాడుకోవాలో తెలుసుకోవడానికి ఉపయోగపడేదే ఈ కథనం.



డ్రై ఐ

కంటిని తడిగా ఉంచడానికి లాక్రిమల్ గ్లాండ్స్ అనే ప్రధాన కన్నీటి గ్రంథితో పాటు మ్యూసిన్ గ్లాండ్స్, మొబిమియన్ గ్లాండ్స్ అనే మరో రెండు రకాల గ్రంథులూ తోడ్పడతాయి. ఇందులో లాక్రిమల్ గ్లాండ్స్ నీటి మోతాదులెక్కువగా ఉండే కన్నీటినీ, మ్యూసిన్ గ్లాండ్స్ కాస్త జిగురుగా ఉండే పదార్థాన్నీ, ఇక మెబొమియాన్ గ్లాండ్స్ అనేవి కాస్త నూనెలా ఉండే పదార్థాన్ని (ల్యూబ్రికెంట్‌గా ఉపయోగపడేందుకు) స్రవిస్తాయి. ఈ మూడూ కలిసి పూర్తి కన్నీటి స్రావాలకు కారణమవుతాయి.

గ్రంథుల పనితీరు మారుతుండే లోపాలు...

ఈ మూడు గ్రంథుల పనితీరుల్లో, దేనిలో లోపం వచ్చినా... కన్నీటి నాణ్యత దెబ్బతింటుంది. ఏయే గ్రంథుల్లో లోపాలుంటాయో, దాన్ని బట్టి కన్నుపొడిబారడమనే ప్రక్రియలోనూ తేడాలొస్తాయి.

ఉదాహరణకు...

● లాక్రిమల్ గ్లాండ్ కన్నీటిలోని నీళ్లను స్రవిస్తుంది. కాబట్టి దీనిలో లోపంతో కన్నీటిలోని నీరు మోతాదులు తగ్గుతాయి. ● మ్యూసిన్ తగ్గితే 'టియర్ బ్రేకింగ్ టైమ్' తగ్గుతుంది. అంటే కన్నీరు స్రవించాక అది ఓ పొర (ఫిల్మ్)లా ఏర్పడి... కొంతసేపు కన్ను ఉపరితలం మీద ఉంటుంది. ఏర్పడ్డ తర్వాత ఆ ఫిల్మ్ ఎంతసేపు ఉంటే... కంటికి అంత రక్షణ. ● ఇక కన్ను త్వరగా పొడిబారుతుందంటే... (అంటే నీరు త్వరత్వరగా ఆవిరై పోతుందంటే) మెబోమియన్ గ్లాండ్స్ పనితీరు తగ్గిందని అర్థం. బయట గాలివేగం ఎక్కువగా ఉన్నప్పుడు (విసురుగా గాలి వీస్తున్నప్పుడు), టూవీలర్ డ్రైవింగ్‌లో కన్నీరు ఎక్కువగా ఆవిరవుతుంది.

లక్షణాలు

కళ్లలో మంట : కళ్లలో తగినంతగా నీరు స్రవించనప్పుడు కళ్ల మంటలు వస్తాయి. కానీ కళ్లు ఎర్రబారవు. **మసక బారడం :** కొందరిలో చూపు కాస్తంత మసకబారవచ్చు. **వెలుగును చూడలేకపోవడం :** ఎక్కువ వెలుగును చూడలేకపోవడం, ప్రకాశవంతమైన కాంతిని భరించలేకపోవడం. **కాంటాక్ట్ లెన్స్‌లు పెట్టుకునేవారిలో:** కాంటాక్ట్‌లెన్స్‌లు వాడటంలో ఇబ్బందిగా ఉండటం.

కన్ను పొడిబారడానికి అనేక కారణాలు ఉంటాయి. అవి...

● **వయసు పైబడటం:** వయసు పెరుగుతున్న కొద్దీ కన్ను పొడిబారడమూ పెరుగుతుంటుంది. మహిళల్లో మెనోపాజ్ తర్వాత ఇది ఎక్కువ. ● **కొన్ని వైద్య సమస్యలు:** థైరాయిడ్, రుమటాయిడ్ ఆర్థ్రైటిస్, సాధారణ ఆటోఇమ్యూన్ సమస్యలు, కొలాజన్ వాస్క్యులార్ డిసీజ్, దీర్ఘకాలిక డయాబెటిస్, సిస్టమిక్ లూపస్ అరిథమటోసిస్ వంటి రుగ్మతలు ఉన్నవారిలో, కీళ్ల నొప్పులతో బాధపడేవారిలో ఈ సమస్య ఎక్కువ. ● **కొన్ని రకాల మందులు :** యాంటీ డిప్రెసెంట్స్, యాంగ్జైటీని తగ్గించే మందులు, శరీరంలో నీటిని బయటకు పంపించే డైయూరెటిక్స్, మహిళల్లో గర్భనిరోధక మందులు, స్టెరాయిడ్స్, దీర్ఘకాలం పాటు గ్లకోమాకు మందులు వాడేవారిలో... ఇలా అనేక మందులతో ఈ సమస్య పెరుగుతుంది.

● **జీవనశైలి మార్పులతో:** ● ఏసీ గదుల్లో ఎక్కువసేపు ఉండటం ● కనురెప్పలను తక్కువగా కదిలించడం... కంప్యూటర్ పైనా లేదా ల్యాప్‌టాప్, టీవీ, మొబైల్ వరకూ ఏదైనా స్క్రీన్‌ను ఎక్కువగా సేపు చూస్తుండటం, మైక్రోస్కోప్ వంటి ఉపకరణాలపై ఎక్కువగా పనిచేయడం. ● కనురెప్పలను పూర్తిగా మూయలేకపోవడం. ● కంటికి గాయం కావడం వల్ల కనురెప్పలను తగినంత కదిలించలేనప్పుడు. ● కనురెప్ప అంచుల్లో ఇన్ఫెక్షన్ (బ్లెఫరైటిస్) ఉన్నవారిలో కన్ను పొడిబారడం ఎక్కువ. ● కంటికి లేజర్ చికిత్స చేయించుకున్నవారిలో మొదటి మూడునెలల్లో మాత్రం కన్నుపొడిబారే సమస్య వచ్చేందుకు అవకాశం ఉంది.

కానీ జీవనశైలి మార్పులతో అంటే ఏసీలు, స్క్రీన్‌ను చాలాసేపు చూడటం, పొగతాగడం వంటి అలవాట్లతో ఆవిరి కావడం పెరుగుతుంది. దీన్నే 'ఎవాపరేటివ్ డ్రై ఐ' అంటారు.

కన్ను పొడిబారడానికి మరికొన్ని కారణాలు...

ఇక కొందరిలో కారణాలేవీ కనిపించకుండానే ఈ సమస్య రావచ్చు.



డా॥ రవికుమార్ రెడ్డి, సీనియర్ కంటి వైద్య నిపుణులు

నిర్ధారణ ఇలా...

● లక్షణాలను బట్టి కంటి డాక్టర్‌లు సమస్యను నిర్ధారణ చేస్తారు. అయితే కొందరిలో కొన్ని రకాల ఇతర వ్యాధుల వల్ల (జోగ్రెన్స్ సిండ్రోమ్ వంటి వాటి కారణంగా) ఇలా జరుగుతుందేమో అని చూస్తారు. అందుకే కన్ను పొడిబారిన లక్షణాలు ఉండేవారికి వ్యాధి నిర్ధారణ చేసే సమయంలో అనేక ఇతర లక్షణాలను కూడా డాక్టర్లు అడిగి తెలుసుకుంటూ ఉంటారు.



● **షిర్మర్ టియర్ టెస్ట్:** కొన్ని సందర్భాల్లో షిర్మర్ పరీక్షతో దీన్ని నిర్ధారణ చేస్తారు. ఈ పరీక్షలో ఒక రకం ఫిల్టర్ పేపర్‌ను కంటి కిందివైపు రెప్ప కింద ఐదు నిమిషాల పాటు ఉంచుతారు. ఆ వ్యవధిలో ఆ పేపర్ ఎంత తడి అవుతుందో పరిశీలించడం ద్వారా లాక్రిమల్ గ్లాండ్ లోపాల్ని పరీక్షిస్తారు.

● **టియర్ బ్రేకప్ టైమింగ్ :** కంటి ఉపరితలంపై ఏర్పడే టియర్ ఫిల్మ్ ఎంతసేపటికి బ్రేక్ అవుతుందో తెలుసుకునే ఈ పరీక్షతో మ్యూసిన్ గ్రంథి లోపాలను తెలుసుకుంటారు.

● **మెబోమియోగ్రఫీ:** ఈ టెస్ట్‌తో మెబోమియన్ గ్రంథి లోపం తెలుస్తుంది.

● **ఓసీటీ :** ఆప్టికల్ కొహెరెన్స్ టోమోగ్రఫీ (ఓసీటీ) అనే పరీక్ష ద్వారా టియర్ ఫిల్మ్ మందం ఎంత ఉందో తెలుసుకుంటారు.

ఇబ్బందులివీ...

కన్ను పొడిబారడం వల్ల వచ్చే సమస్యలు అందరిలో ఒకేలా ఉండవు. ఈ కింద పేర్కొన్న వాటిలో కొన్ని కనిపించవచ్చు. ● కొందరిలో కంటిపైన ఉండే కంజెక్టివా పొరలో ఇన్ఫెక్షన్ రావచ్చు. (కంజంక్టివైటిస్). ● కొందరిలో కార్నియల్ ఇన్ఫెక్షన్ రావచ్చు. ● సమస్య తీవ్రతను బట్టి కొందరి కళ్లలో చిన్న చిన్న పుండ్లు రావచ్చు. ● చాలా అరుదుగా కొందరిలో కార్నియా దెబ్బతినే ప్రమాదంకూడా ఉండవచ్చు.

చికిత్స... గతంలో కన్నీటిని స్రవించే చుక్కల మందులు, జెల్స్‌తో చేసే చికిత్స స్థానంలో ఇప్పుడు ఏయే గ్రంథి లోపాలు ఏమిటో తెలుసుకుని, వాటికి అనుగుణంగా చేసే చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ఉదాహరణకు...

కృత్రిమ కన్నీటి మందులు: కృత్రిమంగా కన్నీళ్లను పెంచే చుక్కల మందులు, జెల్ రూపంలో లభ్యమయ్యే మందుల్ని వాడటం ద్వారా డాక్టర్లు లాక్రిమల్ గ్లాండ్ పనితీరును చక్కదిద్దుతారు. 'సైక్లో ఇమ్యూన్ ఐ డ్రాప్స్' కూడా డ్రై ఐ చికిత్సకు ఉపయోగపడతాయి. అలాగే లాక్రిమల్ ప్లగ్స్‌ను వాడతారు. వీటివల్ల కన్నీళ్లు ముక్కులోకి జారిపోవు. దాంతో అవి కళ్లలోనే ఎక్కువసేపు ఉండి కళ్లను తడిగా ఉంచుతాయి. ● ఇక మ్యూసిన్ గ్రంథి పనితీరు మెరుగుపరచడానికి 'సెక్రిటోగ్యాగ్స్' అనే ఉపకరణాలు ఉపయోగిస్తారు. ● మొబోమియన్ గ్లాండ్స్ పనితీరును మెరుగుపరచడానికి కొన్ని రకాల మసాజ్‌లు, థెర్మో థెరపీలతో పాటు కొన్ని రకాల యాంటీబయాటిక్స్ వాడతారు. ● డ్రై ఐ తీవ్రత చాలా ఎక్కువగా ఉన్న వారిలో సంప్రదాయ చికిత్సలతో తగ్గనప్పుడు బాధితుని నుంచి సీరమ్ (ఆటోలాగస్ సీరమ్) సేకరించి, చుక్కల రూపంలో వాడతారు. ● **శస్త్రచికిత్స :** ఈ చికిత్సలో భాగంగా నోటిలోని అతి మృదువైన పొరలను తీసి, కంటిలో అమర్చి... పరిస్థితిని చక్కబరుస్తారు.

ఇవేకాకుండా... పని ప్రదేశాల్లో ఏ జాగ్రత్తలు తీసుకోవాలో, కంప్యూటర్ ముందు కంటిని హాని తక్కువగా ఉండేలా ఎలా కూర్చోవాలో, తగిన వ్యాయామాలేమిటో, బరువు తగ్గించుకోవడం, అవసరాన్ని బట్టి పనిచేసే గదిలో తేమ (హ్యుమిడిటీ) పెంచుకోవడం... ఇవన్నీ బాధితులకు కౌన్సెలింగ్‌లో డాక్టర్లు చెబుతారు.

కన్నుపొడిబారిపోవడం వల్ల ఒక్కోసారి చూపుకోల్పోవడం లాంటి పెను ముప్పు ఉండే అవకాశాలు ఎక్కువ. అందుకే కన్నుపొడిబారుతుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి తగిన మందులు వాడాలి.

ప్యాచుల లాంటి ఖాళీలతో కనిపించే పేనుకొరుకుడు!

కొందరిలో ఒత్తైన తలకట్టు కనిపిస్తూనే... మధ్య మధ్యలో నున్నటి ఖాళీలు (గ్యాప్‌లు) కనిపిస్తూ ఉంటాయి. ఆ ప్యాచ్‌లు న్యూనతకు గురిచేస్తాయి. ఈ సమస్యను 'పేనుకొరుకుడు' అనీ, వైద్య పరిభాషలో 'అలోపేషియా ఏరేటా' అని అంటారు. 'అలోపేషియా ఏరేటా' సమస్య ఉన్నప్పుడు అది తలకే పరిమితం కాకుండా... ఒక్కోసారి శరీరంలోని ఇతర భాగాల్లోనూ జుట్టు రాలేలా చేయవచ్చు. ఇక పురుషుల్లో గడ్డంలోనూ కనిపిస్తూ, కాస్మటిక్ పరంగా చూసినప్పుడు ఇబ్బందిగా పరిణమిస్తుంది.



కారణాలు...

ఈ సమస్యకు నిర్దిష్టమైన కారణం చెప్పడం కష్టం. ఒకరకంగా చెప్పాలంటే ఇది ఆటో ఇమ్యూన్ సమస్య. అంటే మన వ్యాధి నిరోధక శక్తి, మన దేహం పట్ల వ్యతిరేకంగా పనిచేయడం వల్ల ఉత్పన్నమయ్యే సమస్య. ఈ సమస్య కనిపించిన వారిలో అలర్జీ తాలూకు లక్షణాలూ కనిపించే అవకాశాలు ఎక్కువ. ఇక పిల్లల్లో ఈ సమస్య వస్తే... వారిలో థైరాయిడ్ సమస్యలూ (ప్రధానంగా హైపోథైరాయిడిజమ్), కళ్ల సమస్యలూ, కడుపులో ఇబ్బందులు... ఆటో ఇమ్యూనిటీ వల్ల కలిగే ఇతర సమస్యలూ కనిపించవచ్చు. ఇక కుటుంబ చరిత్రలో ఈ సమస్య ఉన్నప్పుడు అనువంశికంగా కూడా ఈ సమస్య రావచ్చు.

లక్షణాలు...

తలకట్టులో లేదా గడ్డంలో లేదా శరీరంలోని ఇతర భాగాల్లో ఉన్న జుట్టులో ప్యాచ్‌లు ప్యాచ్‌లుగా ఖాళీలు (గ్యాప్‌లు) కనిపిస్తుండటం. వాటితో పాటు బాధితుల్లో (ప్రధానంగా పిల్లల్లో) అలర్జీకి సంబంధించిన లక్షణాలు కనిపిస్తూ, జుట్టు కూడా వేగంగా రాలిపోతూ ఉండవచ్చు.

చికిత్స ఇలా..

వెంట్రుకలు రాలిపోయిన ప్రాంతాల్లో పైపూతగా రాసే స్టెరాయిడ్ క్రీమ్స్ (టాపికల్ స్టెరాయిడ్స్)ను డాక్టర్లు సూచిస్తుంటారు. కొన్ని సందర్భాల్లో జుట్టు రాలిన చోట చర్మానికి ఇంజెక్షన్లు ఇస్తారు. దీంతోపాటు కొందరిలో అల్ట్రా వయొలెట్ థెరపీ వంటి వాటితో కొంత వరకు ప్రయోజనం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో హెయిర్ గ్రోత్ ప్రమోటింగ్ ఏజెంట్స్ మందుల్ని వాడాల్సి ఉంటుంది. ఇక టాపికల్ స్టెరాయిడ్స్‌తో పాటు స్టెరాయిడ్ మోతాదులు ఉండే మందులన్నీ బాధితులను చాలా అంశాలలో పరీక్షించి, పరిశీలించి, నిర్దిష్టమైన మోతాదుల్లో మాత్రమే ఇవ్వాల్సి ఉంటుంది. కాబట్టి వాటిని తప్పనిసరిగా డర్మటాలజిస్ట్‌ల పర్యవేక్షణలో మాత్రమే వాడాల్సి ఉంటుంది.

కొన్ని సందర్భాల్లో ఈ సమస్య మానసికంగా న్యూనతను పెంచే అవకాశం ఉన్నందున కొంత మందిలో ఇది కుంగుబాటు వంటి మానసిక సమస్యలకూ దారి తీయవచ్చు. ముఖ్యంగా పిల్లలు, టీనేజ్ యువతుల్లో ఈ సమస్య ఎక్కువ. బాధితులతో కౌన్సెలింగ్‌తో డాక్టర్లు ఏ కారణంగా ఈ మానసిక సమస్యలు వస్తున్నాయో తెలుసుకుని, ప్రధాన సమస్యకు చికిత్స అందిస్తే... మానసిక సమస్యలనూ తగ్గించడం సాధ్యమవుతుంది.



డా॥ స్వప్నప్రియ, సీనియర్ డర్మటాలజిస్ట్.



మెడి టిప్ – నిమోనియా నివారణకు...

నిమోనియా ఊపిరితిత్తులను ప్రభావితం చేసే శ్వాససమస్య. అనేక రకాల ఇన్ఫెక్షన్లు నిమోనియాకు దారితీస్తాయి. ఇలా సెకండరీ ఇన్ఫెక్షన్స్‌తో వచ్చే నిమోనియా ఒక్కోసారి ప్రాణాంతకం కూడా కావచ్చు. దీని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి...

నివారణ ఇలా... ● కొద్ది ప్రదేశంలోనే ఎక్కువమంది ఉండటం అనే ఓవర్ క్రౌడింగ్ పరిస్థితికి దూరంగా ఉండాలి. గుంపుల్లోకి వెళ్లకూడదు. ● ఆస్తమా, బ్రాంకైటిస్ బాధితులు వాటిని నియంత్రణలో ఉంచుకోవాలి. ● పొగ వాతావరణానికి ఎక్స్‌పోజ్ కాకుండా చూసుకోవాలి. అలాగే పొగతాగే అలవాటును తక్షణం మానేయాలి. ● ఆల్కహాల్ అలవాటుకూ దూరంగా ఉండాలి. మద్యం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. అంతేకాదు... మత్తులో దగ్గడం కూడా తక్కువే. దాంతో ఊపిరితిత్తుల్లో ఉన్న మనకు సరిపడని పదార్థాలు అక్కడే ఉండిపోవడం వల్ల కూడా నిమోనియా తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. ● అన్ని పోషకాలు ఉండే సమతులాహారం తీసుకోవాలి. ● క్రమం తప్పకుండా తేలికపాటి వ్యాయామం చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెంపొందుతుంది. ఫలితంగా నిమోనియా మాత్రమే కాకుండా ఇతర ఇన్ఫెక్షన్లూ నివారితమవుతాయి. ● చిన్నపిల్లలకు, పెద్దవయసు వారికి నిమోనియాను నివారించే వ్యాక్సిన్ ఇవ్వడం మంచిది.

మళ్లీ ఓడిన భారత మహిళలు

మహిళల జూనియర్ హాకీ వరల్డ్ కప్‌లో భారత జట్టుకు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. శనివారం జరిగిన పూల్ 'సి' మ్యాచ్‌లో బెల్జియం 3-2 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించింది. భారత్ తరఫున అన్ను 47వ, 51వ నిమిషాల్లో గోల్స్ సాధించింది. బెల్జియం తరఫున నోవా ఫ్రూయెర్స్ (5వ నిమిషం), ఫ్రాన్స్ డి మాట్ (42వ ని.), అస్ట్రిడ్ బొనామి (52వ ని.) గోల్స్ నమోదు చేశారు. తొలి, మూడో క్వార్టర్‌లో ఒక్కో గోల్ సాధించి ముందుగా బెల్జియం 2-0తో ఆధిక్యంలో నిలిచింది. అయితే నాలుగు నిమిషాల వ్యవధిలో అన్ను రెండు గోల్స్ సాధించి స్కోరును సమం చేసింది. అయితే చివర్లో లభించిన పెనాల్టీ స్ట్రోక్‌ను సమర్థంగా ఉపయోగించుకున్న బెల్జియం మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. మరో వైపు మంగళవారం మలేసియాలోని కౌలాలంపూర్‌లో జూనియర్ పురుషుల హాకీ ప్రపంచ కప్ ప్రారంభం కానుంది. అదే రోజు జరిగే తొలి మ్యాచ్‌లో కొరియాతో భారత్ తలపడుతుంది.



టైటాన్స్ ఓటమితో మొదలు

ప్రొ కబడ్డీ లీగ్

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) తాజా సీజన్‌ను తెలుగు టైటాన్స్ పరాజయంతో ప్రారంభించింది. శనివారం జరిగిన లీగ్ తొలి మ్యాచ్‌లో టైటాన్స్ 32-38తో గుజరాత్ జెయింట్స్ చేతిలో ఓడింది. టైటాన్స్ కెప్టెన్, స్టార్ రైడర్ పవన్ సెహ్రావత్ (11 పాయింట్లు) చక్కని ఆటతీరు కనబరిచినప్పటికీ ఫలితం మాత్రం దక్కలేదు. 21 సార్లు కూతకు వెళ్లిన పవన్ 10 సార్లు పాయింట్లు తెచ్చిపెట్టాడు. ప్రత్యర్థి రైడింగ్‌కు వచ్చినపుడు నిలువరించి మరో టాకిల్ పాయింట్ సాధించాడు. మిగతావారిలో రైడర్ రజనీశ్, ఆల్‌రౌండర్ సంజీవి చెరో 5 పాయింట్లు సాధించారు. గుజరాత్ జట్టులో రైడర్ సోను అదరగొట్టాడు. తొలి అర్ధ భాగంలో 16-13తో జోరుమీదున్న తెలుగు జట్టును అతనే ద్వితీయార్ధంలో దెబ్బకొట్టాడు. 22వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్ అయిన సోను 14 సార్లు రైడింగ్‌కు వెళ్లి 11 పాయింట్లు తెచ్చాడు. ఆల్‌రౌండర్లు రోహిత్ గులియా, మొహమ్మద్ నబిబక్ష్ చెరో 4 పాయింట్లు సాధించగా, రైడర్ రాకేశ్ 5 పాయింట్లు చేశాడు.



టైటాన్స్, జెయింట్స్ మధ్య మ్యాచ్ దృశ్యం

అనంతరం ఇక్కడే జరిగిన రెండో మ్యాచ్‌లో మాజీ చాంపియన్ (2015) యు ముంబా 34-31తో యూపీ యోధాస్‌పై గెలిచింది. ముంబా ఆల్‌రౌండర్ అమీర్ మొహమ్మద్ (12 పాయింట్లు) రాణించాడు. రింకూ 6, గుమన్ సింగ్ 5 పాయింట్లు చేశారు. యూపీ తరఫున సురేందర్ గిల్, అనిల్ కుమార్ చెరో 7 పాయింట్లు సాధించారు.

జాతీయ టీటీ విజేత శ్రీజ



సాక్షి, విజయవాడ: జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్‌లో తెలంగాణ ప్లేయర్ ఆకుల శ్రీజ విజేతగా నిలిచింది. టోర్నీలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ప్రాతినిధ్యం వహించిన శ్రీజ శనివారం జరిగిన ఫైనల్లో 6-11, 9-11, 11-4, 9-11, 11-7, 12-10, 12-10 (4-3) స్కోరుతో అర్చనా కామత్ (పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్)పై విజయం సాధించింది. తొలి నాలుగు గేమ్‌లలో మూడు ఓడి 1-3తో వెనుకబడిన శ్రీజ...ఆ తర్వాత చెలరేగి వరుసగా మూడు గేమ్‌లను గెలుచుకోగలిగింది. 3-3తో సమంగా నిలిచిన తర్వాతి చివరి గేమ్‌లో ఒక దశలో 10-8తో అర్చన విజయానికి చేరువైంది. అయితే వరుసగా నాలుగు పాయింట్లు సాధించి శ్రీజ మ్యాచ్‌ను ముగించింది. పురుషుల సింగిల్స్‌లో మానవ్ ఠక్కర్ (పీఎస్‌పీబీ)కి టైటిల్ దక్కింది. ఫైనల్లో జి.సత్యన్ (పీఎస్‌పీబీ)ని ఠక్కర్ గెలుపొందాడు. ఐదు గేమ్‌ల తర్వాత 2-3తో వెనుకబడిన తర్వాత ఆరో గేమ్‌లో 0-2 స్కోరు వద్ద వెన్నునొప్పితో సత్యన్ మ్యాచ్‌నుంచి వైదొలిగాడు.

బంగ్లాదేశ్ ఘన విజయం

సిల్హెట్: న్యూజిలాండ్‌తో శుక్రవారం ముగిసిన తొలి టెస్టులో బంగ్లాదేశ్ 150 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 332 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 113/7తో ఆట కొనసాగించిన న్యూజిలాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు ఆలౌటైంది. చివరి రోజు 22.1 ఓవర్ల పాటు క్రీజ్‌లో నిలిచిన కివీస్ మరో 68 పరుగులు జోడించగలిగింది. డరైల్ మిచెల్ (58), కెప్టెన్ సౌతీ (34) కొద్దిసేపు పోరాడారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ తైజుల్ ఇస్లామ్ (10/184) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

ఫైనల్లో అశ్విని పొన్నప్ప జోడీ

లక్నో: సయ్యద్ మోడి అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంట టైటిల్ పోరుకు అర్హత సాధించింది. శనివారం జరిగిన మహిళల డబుల్స్ సెమీఫైనల్లో పొన్నప్ప జోడీ తొలి గేమ్‌లో 10-11తో జపాన్ టాప్‌సీడ్ యుకి ఫుకుషిమా-సయాక హిరోత ద్వయంతో పోటాపోటీగా తలపడుతుండగా... జపాన్ జంట గాయంతో మ్యాచ్ మధ్యలోనే వైదొలగింది. పురుషుల సింగిల్స్‌లో సెమీఫైనల్లో ప్రియాన్షు రజావత్ 21-18, 14-21, 17-21తో చి యు జెన్ (చైనీస్ తైపీ) చేతిలో పోరాడి ఓడాడు.

విజయంతో ముగించేందుకు



- నేడు భారత్, ఆస్ట్రేలియా చివరి టి20 మ్యాచ్
- రా.గం.7 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో ప్రసారం

బెంగళూరు: భారత్, ఆస్ట్రేలియా టి20 సిరీస్ ఆఖరి మజిలీకి చేరింది. మరో గెలుపుతో సిరీస్ ఆధిక్యాన్ని 4-1కు చేర్చుకోవాలిన టీమిండియా చూస్తుంటే... సిరీస్ ఎలాగూ చేజారింది కాబట్టి విజయంతోనైనా ముగింపు పలికి తిరుగుముఖం పట్టాలని కంగారూ సేన భావిస్తోంది. అయితే జట్ల బలాబలాల విషయానికొస్తే మాత్రం సూర్యకుమార్ సేనే పటిష్టంగా కనిపిస్తోంది. సిరీస్ ఇదివరకే సాధించడం, బౌలర్లు ఫామ్‌లోకి రావడం ఆతిథ్య భారత్‌ను దుర్భేద్యంగా మార్చింది. వన్డే ప్రపంచకప్ సాధించిన ఆసీస్ జట్టు సభ్యుల్లో ఒక్క ట్రవిస్ హెడ్ తప్ప మిగిలిన 10 మంది ఆటగాళ్లంతా కొత్తవారే కావడం, నిలకడ లోపించడం కంగారూను మరింత కలవరపెడుతోన్న అంశం.

బౌలింగ్ బలగం

గత నాలుగు మ్యాచ్‌ల్ని నిశితంగా గమనిస్తే భారత్ బ్యాటింగ్ జోరుతో తొలి మూడు టి20ల్లో అవలీలగా 200 పైచిలుకు పరుగులు చేసింది. యశస్వి, రుతురాజ్, కెప్టెన్ సూర్యకుమార్, రింకూ సింగ్ ఇలా వీరంతా మెరిపించినవారే! కానీ బౌలింగ్ వైఫల్యంతో భారీ స్కోరు చేశాక కూడా మూడో టి20లో భారత్ ఓడింది. అయితే నాలుగో మ్యాచ్‌లో మాత్రం గత మ్యాచ్‌లకు భిన్నంగా తక్కువ స్కోరు చేసినా టీమిండియా సిరీస్ విజయాన్ని అందుకుంది. దీనికి బౌలింగ్ పదును పెరగడమే కారణం. అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్‌ల స్పిన్, దీపక్ చహర్ పేస్‌లతో భారత్ బౌలింగ్ బలం పెరిగింది. ఇప్పుడు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఏమాత్రం ఒత్తిడి లేని ఆఖరి మ్యాచ్‌లో గెలవడం కష్టం కానేకాదు. గత మ్యాచ్‌లో హిట్టర్ జితేశ్ శర్మ కూడా ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. చివరి రెండు మ్యాచ్‌ల కోసం వచ్చిన శ్రేయస్ అయ్యర్ గత మ్యాచ్ వైఫల్యాన్ని అధిగమించే పనిలో పడితే మాత్రం భారత్ మరో 200 పరుగుల్ని చేయడం ఇంకాస్త సులువవుతుంది.

పిచ్-వాతావరణం

ఇక్కడి చిన్నస్వామి స్టేడియం బ్యాటింగ్‌కు బాగా కలిసొచ్చే గ్రౌండ్. ప్రతీసారి కూడా బౌండరీలు, సిక్సర్ల మజాను పంచుతోంది. కాబట్టి టాస్ గెలిస్తే ఏ జట్టయినా ఛేదనకే మొగ్గు చూపుతుంది. ఆటకు వాన ముప్పు లేదు.

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, రుతురాజ్, శ్రేయస్ అయ్యర్, జితేశ్ శర్మ, రింకూ సింగ్, అక్షర్ పటేల్, దీపక్ చహర్, రవి బిష్ణోయ్, అవేశ్‌ఖాన్, ముకేశ్.

ఆస్ట్రేలియా: మాథ్యూ వేడ్ (కెప్టెన్), ఫిలిప్, హెడ్, మెక్‌డెర్మాట్, ఆరోన్ హార్డీ, టిమ్ డేవిడ్, షార్ట్, డ్వార్‌షుయిస్, క్రిస్ గ్రీన్, బెహ్రెన్‌డార్ఫ్, తన్వీర్ సంఘా/నాథన్ ఎలిస్.

ఒత్తిడిలో ఆసీస్

నాలుగో టి20లో టాస్ నెగ్గినప్పటికీ ఆస్ట్రేలియా తమ బ్యాటింగ్ ఆర్డర్‌పై నమ్మకంతో చేజింగ్ ఎంచుకొని భంగపడింది. దీంతోనే సిరీస్‌నూ కోల్పోయింది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియాపైనే సిరీస్ ఆధిక్యాన్ని తగ్గించాలన్న ఒత్తిడి భారంగా మారింది. హెడ్ మెరిపిస్తున్నా... ఫిలిప్, హార్డీ, టిమ్ డేవిడ్‌ల నుంచి ఆశించినంత సహకారం లభించకపోవడం బ్యాటింగ్ ఆర్డర్‌ను ఆందోళన పరుస్తోంది. ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా వన్డే జట్టు విజయంతో ఇంటికెళ్లినట్లే... టి20 జట్టు సిరీస్‌తో కాకపోయినా... ఆఖరి ఫలితంతో సంతృప్తిగా స్వదేశం వెళ్లాలంటే ఆటగాళ్లంతా మరింత బాధ్యత కనబరచాల్సి వుంటుంది.

'గ్రాండ్‌మాస్టర్' వైశాలి

- ఈ ఘనత సాధించిన మూడో భారత మహిళా క్రీడాకారిణి
- భారత 84వ జీఎంగా గుర్తింపు
- జీఎం ప్రజ్ఞానందకు వైశాలి సోదరి



చెన్నై: భారత చెస్ క్రీడాకారిణి వైశాలి రమేశ్‌బాబు తన కెరీర్‌లో కీలక మైలురాయిని అందుకుంది. తమిళనాడుకు చెందిన 22 ఏళ్ల వైశాలి శుక్రవారం 'గ్రాండ్‌మాస్టర్' హోదాను అందుకుంది. స్పెయిన్‌లో జరుగుతున్న ఎలోబ్రిగాట్ ఓపెన్ సందర్భంగా జీఎం గుర్తింపును దక్కించుకుంది. టోర్నీ తొలి రెండు రౌండ్‌లలో విజయం సాధించిన వైశాలి ఈ క్రమంలో 2500 ఎలో రేటింగ్‌ను దాటడంతో గ్రాండ్‌మాస్టర్ ఖాయమైంది. భారత్ తరఫున ఈ ఘనత సాధించిన 84వ ప్లేయర్‌గా వైశాలి గుర్తింపు పొందగా...భారత్‌నుంచి జీఎంగా మారిన మూడో మహిళా ప్లేయర్ మాత్రమే కావడం విశేషం. ఇప్పటికే చెస్ ప్రపంచంలో సంచలన విజయాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జీఎం ప్రజ్ఞానందకు వైశాలి స్వయంగా అక్క కావడం విశేషం. వైశాలికంటే నాలుగేళ్ల చిన్నవాడైన ప్రజ్ఞానంద 2018లోనే గ్రాండ్‌మాస్టర్ హోదా అందుకోగా... ఐదేళ్ల తర్వాతి వైశాలి ఈ జాబితాలో చేరింది. పురుషుల విభాగంలో ఇదే టోర్నీకి ప్రజ్ఞానంద కూడా క్వాలిఫై అయ్యాడు. దాంతో 'క్యాండిడేట్స్' బరిలో నిలిచిన తొలి సోదర, సోదరి జోడీగా కూడా వీరు గుర్తింపు దక్కించుకున్నారు. భారత్‌నుంచి గ్రాండ్‌మాస్టర్ హోదా అందుకున్న తొలి మహిళగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కోనేరు హంపి (2002లో) గుర్తింపు పొందగా...2011లో ఆంధ్రప్రదేశ్‌కే చెందిన ద్రోణవల్లి హారిక కూడా ఈ హోదాను సాధించింది. చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ ఈ సందర్భంగా వైశాలికి అభినందనలు తెలియజేశాడు. తద్వారా ప్రపంచ చెస్‌లో గ్రాండ్‌మాస్టర్లుగా నిలిచిన తొలి సోదర, సోదరి ద్వయంగా వీరిద్దరు నిలవడం చెప్పుకోదగ్గ మరో విశేషం.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో...

చదరంగంపై ఆసక్తితోనే చిన్న వయసులోనే ఎత్తుకు పైఎత్తులు వేయడం ప్రారంభించిన వైశాలిని తల్లిదండ్రులు రమేశ్‌బాబు, నాగలక్ష్మి ప్రోత్సహించి ప్రొఫెషనల్ చెస్ వైపు మళ్లించారు. ఆ తర్వాత వరుస విజయాలతో ఆమె దూసుకుపోయింది. వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్‌లో వైశాలి అండర్-12, అండర్-14 విభాగాల్లో విజేతగా నిలిచింది. 2020 చెస్ ఒలింపియాడ్‌లో తొలిసారి స్వర్ణపతకం గెలిచిన భారత జట్టులో వైశాలి సభ్యురాలిగా ఉంది. 2018లో ఆమె ఉమన్ గ్రాండ్‌మాస్టర్ హోదాను అందుకుంది. ఆ తర్వాత 2019 ఎక్స్‌ట్రాకాన్ ఓపెన్‌లో తొలి జీఎం నార్మ్, 2022లో ఫిషర్ మెమోరియల్ టోర్నీలో రెండో జీఎం నార్మ్ సాధించిన వైశాలి ఈ ఏడాది ఖతర్ మాస్టర్స్‌లో మూడో జీఎం నార్మ్‌ను సొంతం చేసుకుంది. వరల్డ్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌కు క్వాలిఫయింగ్‌గా పరిగణించే క్యాండిడేట్స్ టోర్నీకి వైశాలి అర్హత సాధించింది.



తల్లి నాగలక్ష్మి, తమ్ముడు ప్రజ్ఞానందతో వైశాలి

సినిమా



• 'కన్నప్ప'లో మంచు విష్ణు
• 'ఊరు పేరు భైరవకోన'లో సందీప్ కిషన్
• 'మహేంద్రగిరి వారాహి'లో సుమంత్
• 'పుష్ప-2'లో అల్లు అర్జున్
• 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'లో విశ్వక్ సేన్

ఆలయాన వెలసిన కథ

పూనకాలు తెప్పించే, భక్తి పారవశ్యంలో ముంచే భక్తి రసాత్మక చిత్రాల నిర్మాణం తగ్గింది. పూర్తి స్థాయి భక్తి చిత్రాలంటే కమర్షియల్‌గా వర్కవుట్ అవుతాయా? అనే సందేహం ఉన్న నేపథ్యంలో ఆ తరహా చిత్రాలు నిర్మించడానికి నిర్మాతలు దాదాపు ముందుకు రావడంలేదు. అయితే కమర్షియల్ కథల్లో భక్తి జోడించి, సేఫ్ గేమ్ ఆడుతున్నారు. ఇలా ఆలయాన వెలసిన కథలతో రూపొందుతున్న కొన్ని చిత్రాల గురించి తెలుసుకుందాం.

● శివ భక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా రూపొందుతున్న సినిమా 'కన్నప్ప'. మంచు విష్ణు టైటిల్ రోల్ చేస్తున్నారు. మోహన్‌బాబు, మోహన్‌లాల్, ప్రభాస్, శరత్‌కుమార్, శివ రాజ్‌కుమార్, బ్రహ్మానందం ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. నాస్తికుడైన ఓ యోధుడు శివ భక్తునిగా ఎలా పరివర్తన చెందాడు? అనే కోణంలో ఈ సినిమా కథనం ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ సినిమాలోని ప్రధాన సన్నివేశాలు శివాలయం నేపథ్యంలో ఉంటాయి. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ ఈ సినిమాను నిర్మిస్తున్నాయి.

* * *

● మహేంద్రగిరిలో కొలువు దీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగే కథతో 'మహేంద్రగిరి వారాహి' సినిమా తెరకెక్కుతోంది. సుమంత్, మీనాక్షీ గోసామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు జాగర్లపూడి సంతోష్ దర్శకుడు. కాలిపు మధు, ఎం. సుబ్బారెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతదర్శకుడు. ఈ సంగతి ఇలా ఉంచితే... హీరో సుమంత్, దర్శకుడు జాగర్లపూడి సంతోష్ కాంబినేషన్‌లో 2018లో వచ్చిన హిట్ ఫిల్మ్ 'సుబ్రహ్మణ్యపురం'లో లైట్‌గా భక్తి టచ్ ఉంది. తాజా చిత్రం 'మహేంద్రగిరి వారాహి'లో కాస్త ఎక్కువ ఉంటుంది.

* * *

● హీరో సందీప్ కిషన్, దర్శకుడు వీఐ ఆనంద్ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. ఇందులో కావ్యా థాపర్, వర్షా బొల్లమ్మ హీరోయిన్లు. భైరవకోన అనే ఊరిలో ఉండే ఓ దేవాలయం నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా షూటింగ్ ఎప్పుడో పూర్తయింది. అయితే గ్రాఫిక్స్ ఎక్కువగా ఉన్నందువల్ల పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌కి ఎక్కువ సమయం పడుతోందట. త్వరలో రిలీజ్ గురించిన అప్‌డేట్ రానుందని సమాచారం.

* * *

● ఇటీవల విడుదలై, హిట్‌గా నిలిచిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. 'మా ఊరి పొలిమేర' (2021)కు ఈ చిత్రం సీక్వెల్. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, గెటప్ శీను, రాకేందు మౌళి ప్రధాన పాత్రలు పోషించారు. గౌరీ శ్రీను నిర్మించారు. ఈ సినిమాలో బ్లాక్ మ్యాజిక్ అంశాన్ని దర్శకుడు అనిల్ విశ్వనాథన్ ప్రస్తావించినప్పటికీ ప్రధానాంశం ఓ ఊరి పొలిమేరలో ఉన్న దేవాలయం చుట్టూ తిరుగుతుంది. ఆ దేవాలయంలో ఏదో నిధి ఉందని ఆ నిధిని సాధించే ప్రయత్నాలు చేస్తుంటారు ప్రధాన తారలు. కాగా 'మా ఊరి పొలిమేర 3' కూడా ఉంటుంది. సో.. మూడో భాగం కూడా నిధి నిక్షిప్తం చేయబడి ఉందని భావిస్తున్న ఆ ఊరి పొలిమేరలోని గుడి చుట్టూ తిరుగుతుందని ఊహించవచ్చు.



• 'మా ఊరి పొలిమేర-2'లో 'సత్యం' రాజేశ్

* * *

● ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం మహాకాళేశ్వర ఆలయం విశిష్టత నేపథ్యంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమాకు నటి పవిత్రా లోకేశ్ డైరెక్టర్. నటుడు వీకే నరేశ్ సమర్పణలో విజయకృష్ణ స్టూడియోస్ పై ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమా గురించి గత ఏడాది మేలో వివరాలు వెల్లడించారు మేకర్స్. మరో అప్‌డేట్ రావాల్సి ఉంది.

మాస్ జాతర

హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన 'పుష్ప: ది రైజ్' బ్లాక్‌బస్టర్ అయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మలి భాగం 'పుష్ప: ది రూల్'తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్, సుకుమార్. ఈ సినిమాలో గంగమ్మ జాతర నేపథ్యంలో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించారు. ఇంట్రవెల్ టైమ్‌లో వచ్చే ఈ జాతర ఓ పెద్ద హైలైట్‌గా ఉంటుందట. ఈ చిత్రంలో పుష్పరాజ్‌గా అల్లు అర్జున్, శ్రీ వల్లిగా రష్మికా మందన్నా నటిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'పుష్ప: ది రూల్' ఆగస్టు 15న విడుదల కానుంది. మరోవైపు విశ్వక్ సేన్, నేహా శెట్టి జంటగా అంజలి ఓ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. చీకటి ప్రపంచంలో సాధారణ స్థాయి నుంచి ధనవంతుడిగా ఎదిగిన ఓ వ్యక్తి నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. ఈ చిత్రదర్శకుడు కృష్ణ చైతన్య గంగానమ్మ జాతర నేపథ్యంలో ఓ యాక్షన్ సీక్వెన్స్ ప్లాన్ చేశారట. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, వెంకట్ ఉప్పుటూరి, ఇన్నమూరి గోపీచంద్ నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 8న రిలీజ్ కానుంది.

ఎక్స్‌ట్రా వినోదం ఉంటుంది - నితిన్



• నితిన్, వక్కంతం వంశీ

నితిన్, శ్రీలీల జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఎక్స్‌ట్రా'. 'ఆర్డినరీ మ్యాన్' అనేది ఉపశీర్షిక. సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'ఒలే ఒలే పాపాయి పలాసకే వచ్చేయ్..' అనే మాస్ సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. సంగీత దర్శకుడు హ్యారిస్ జైరాజ్ స్వరపరచిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా రామ్ మిరియాల, ప్రియ హేమెస్ పాడారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో నితిన్ మాట్లాడుతూ– ''నా కెరీర్‌లోనే బెస్ట్ క్యారెక్టర్‌ను ఈ సినిమాలో చేశాను. సినిమా ఎక్స్‌ట్రా ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఉంటుంది'' అన్నారు. ''ట్రైలర్‌కు పదింతల వినోదం మా సినిమాలో ఉంటుంది. ఈ సినిమా విషయంలో నాకు సపోర్ట్ చేసిన నితిన్‌గారికి థ్యాంక్స్. ఇంట్రవెల్ సన్నివేశంలో ఓ మంచి ట్విస్ట్ ఉంది'' అన్నారు వక్కంతం వంశీ. ''టైటిల్‌కి తగ్గట్టు ఈ సినిమా ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది'' అన్నారు సుధాకర్ రెడ్డి.

ఈ ఏడాది కలిసొచ్చింది



• 'దిల్' రాజు

రణబీర్ కపూర్, రష్మికా మందన్నా జంటగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'యానిమల్'. భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, మురాద్ ఖేతని, క్రిషణ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 1న రిలీజైంది. తెలుగు రాష్ట్రాల్లో 'యానిమల్' చిత్రాన్ని పంపిణీ చేసిన 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యింది. తెలుగు రాష్ట్రాల్లో తొలి రోజు రూ. 15 కోట్ల మేరకు గ్రాస్ కలెక్షన్స్ వచ్చాయి. తొలి వారాంతంలోనే 'యానిమల్' రూ. 35 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను రాబడుతుందని అంచనా వేస్తున్నాం. ఈ ఏడాది మాకు బాగా కలిసొచ్చింది. నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా చేసిన సినిమాలు మంచి విజయాలు సాధించాయి. మా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో నాలుగు, 'దిల్' రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌లో మూడు సినిమాలు.. ఇలా మొత్తంగా ఏడు సినిమాలు చేస్తున్నాం. రామ్‌చరణ్‌గారి 'గేమ్ చేంజర్' సినిమా చిత్రీకరణ 80 శాతానికి పైగా చిత్రీకరణ పూర్తయింది. విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీ మేన్'ను మార్చిలో రిలీజ్ చేస్తాం'' అని చెప్పుకొచ్చారు.

దర్శకుడిగా నా బలం అదే



• శౌర్యువ్

''ఓ దర్శకుడిగా యాక్షన్ చిత్రాల కథలు కూడా రాయగలను. కానీ ప్రేమ కథలు, కుటుంబ కథా చిత్రాలైతే కొత్త దర్శకులకు అవకాశాలు వస్తాయనే నమ్మకంతో 'హాయ్ నాన్న' కథ రాశాను. నాకు నానీగారు చాన్స్ ఇచ్చారు. నాలానే మిగతా దర్శకులకూ ప్రేమకథలు, కుటుంబ కథలతోనే అవకాశాలు వస్తాయని చెప్పలేను. నా విషయంలో జరిగిందని చెబుతున్నాను. అయితే ఏ జానర్ ఫిల్మ్ అయినా ఆ సినిమాతో ప్రేక్షకులు కనెక్ట్ అయ్యేది అందులోని భావోద్వేగాలతోనే. భావోద్వేగాలతో ప్రేక్షకులను కనెక్ట్ చేయడం నా బలం అని నా నమ్మకం'' అన్నారు శౌర్యువ్. నాని, మృణాల్ ఠాకూర్ హీరో హీరోయిన్లుగా బాల నటి కియారా ఖన్నా, హీరోయిన్ శ్రుతీహాసన్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. శౌర్యువ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకర్ల సమావేశంలో శౌర్యువ్ మాట్లాడుతూ– ''మాది వైజాగ్. మెడిసిన్ పూర్తి చేశాను. సినిమాలపై ఆసక్తితో ఇండస్ట్రీకి వచ్చాను. తండ్రీ కూతురి అనుబంధం, వీరికి మృణాల్ పాత్రతో ఉన్న సంబంధం.. ఈ అంశాల తాలూకు ఎమోషన్స్‌తో 'హాయ్ నాన్న' కథనం ఉంటుంది. నానీగారు కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చారు. కథ రీత్యా ఏడ్చినా అందంగా ఉండాలని మృణాల్‌ను తీసుకున్నాం. శ్రుతీహాసన్‌గారి పాత్ర బాగుంటుంది. బేబీ కియారాకి యాక్టింగ్ ప్రతిభ ఉంది. హేషమ్‌గారు మంచి మ్యూజిక్ ఇచ్చారు. నేపథ్య సంగీతం ఇంకా బాగుంటుంది. సాను మంచి విజువల్స్ ఇచ్చారు'' అని చెప్పుకొచ్చారు.

తెరపైకి సిల్క్ స్మిత జీవితం



• చంద్రికా రవి

అలనాటి గ్లామరస్ తార సిల్క్ స్మిత జీవితం 'సిల్క్ స్మిత: ది అన్‌టోల్డ్ స్టోరీ'గా వెండితెరపైకి రానుంది. సిల్క్ స్మితలా చంద్రికా రవి నటించనున్నారు. వి. మహాస్తీ అమృతరాజ్ సమర్పణలో జయరామ్ దర్శకత్వంలో ఎస్‌బీ విజయ్ ఈ సినిమాను నిర్మించనున్నారు. శనివారం (డిసెంబరు 2) సిల్క్ స్మిత జయంతిని పురస్కరించుకుని ఈ చిత్రాన్ని ప్రకటించారు. ''సిల్క్ స్మిత అసలు పేరు వడ్లపాటి విజయలక్ష్మి. 1980, 1990వ దశకాల్లో గ్లామరస్ తారగా వెలుగొందారామె. స్మిత కుటుంబ సభ్యుల ఆశీర్వాదంతో 'సిల్క్ స్మిత: ది అన్‌టోల్డ్ స్టోరీ'ని ప్రపంచానికి చెప్పనున్నాం. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను వచ్చే ఏడాది విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ముప్పైకి పైగా భయపడే సీన్లు ఉన్నాయి



• యశ్వంత్ దగ్గుమాటి

''నా 30 ఏళ్ల వయసులోనే ఐటీ కంపెనీలను సక్సెస్‌ఫుల్‌గా రన్ చేశాను. దాంతో సినిమా తీయడం సులభం అనుకున్నాను. కానీ వంద కాదు.. వెయ్యి కోట్లు ఉన్నా సినిమా చేయడం అంత సులభం కాదని తెలుసుకున్నాను. వందల మంది కలిసి పని చేస్తూ, అన్నీ కలిసి వస్తేనే ఓ సినిమా పూర్తవుతుంది. లేదంటే ఎన్ని కోట్లు డబ్బులున్నా ఇబ్బందులు పడాల్సి ఉంటుంది'' అన్నారు యశ్వంత్ దగ్గుమాటి. శ్రీరామ్, ఖుషీ జంటగా ఈశ్వరీ రావు, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రల్లో నటించిన హారర్ ఫిల్మ్ 'పిండం'. యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా యశ్వంత్ దగ్గుమాటి మాట్లాడుతూ– ''నాకు యూఎస్‌లో ఐటీ కంపెనీలున్నాయి. సాయికిరణ్‌కు సినిమాలపై ఆసక్తి. ఓ సినిమా చేద్దామని ఇండియా వచ్చాం. సిద్ధు జొన్నలగడ్డతో మేం చేయాల్సిన 'డల్లాస్ దేశీ దొంగలు' సినిమా లాక్‌డౌన్ వల్ల ఆగిపోయింది. ఆ తర్వాత మరో కథ అనుకున్నాం. అది కూడా కుదర్లేదు. ఆ నెక్ట్స్ 'పిండం' కథను రెడీ చేశారు సాయికిరణ్. ఓ సందర్భంలో సాయికిరణ్ వాళ్ల నాన్నమ్మ ఓ భవంతిని చూపించి, ఓ కథ చెప్పారట. ఆ కథకు కొన్ని కల్పిత అంశాలు జోడించి 'పిండం' కథ రాశారు. ఈ సినిమాలో ముప్పైకి పైగా భయపడే సన్నివేశాలు ఉన్నాయి. 1930, 1990, 2023.. ఇలా మూడు కాలమానాల్లో స్క్రీన్‌ప్లే ఉంటుంది. ఇక మా సంస్థలో మొదలైన తొలి చిత్రం 'డల్లాస్‌లో దేశీ దొంగలు' ఉంటుంది. మరికొన్ని కథలు ఉన్నాయి'' అన్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



రెడ్డి/33y/5'10" / Doctor / 3 లక్షలు నెలకు / 80 Cr ప్రాపర్టీ కల్గిన వరుడికి వధువు కావలెను. Only Reddys డైరెక్ట్, No Brokers. Ph: 8897213126 [H-793440]

SC మాల & క్రిస్టియన్/M.Tech(IT)/C.Govt.Asst. మేనేజర్/HPCL/18 Lakhs PA/5'8" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-13891]

యాదవ/కట్నం ప్రసక్తి లేదు/M.Tech (JNTU)/C.Govt.Sr. ఇంజినీర్/రైల్వే/14 Lakhs PA/5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-13891]

క్రిస్టియన్/2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/ M.Tech /Govt.ఇంజినీర్/65000/-PM/ 5'8"ఎత్తు/40 సం॥ల పిల్లలు లేని వరునికి వధువు కావలెను. Ph: 9550650024 [HA-13891]

క్రిస్టియన్ మాల/32/5'8" / M.Tech / C. Govt.Asst.మేనేజర్/HPCL/1 Laskh PM / అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-13891]

కుల ప్రసక్తి లేని, 37 సం॥ల బిజినెస్ చేస్తున్న వరుడికి రెండవ విడో పిల్లలు ఉన్న వారైనా వధువు కావలెను. Ph: 6301055248, 7396730091 [HA-13891]

రజక/B.Tech/C.Govt.ట్యాక్స్ ఆఫీసర్ /ఇన్‌కమ్ ట్యాక్స్ Dept / 85000/-PM/ 5'10"ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-13891]

వైశ్య(డైరెక్ట్) 52/5'3 లేట్ మ్యారేజ్ B.A.,B.L. బిజినెస్ చేస్తున్న వెల్‌సెటిల్డ్ వరునికి వధువు కావలెను. (1లేదా 2వ మ్యారేజి) A.P., W.G.Dist., తణుకు. సంప్ర: 93812 12746. [P-1871]

రాజులు, గవర్నమెంట్ ఉద్యోగం, సొంత ఇల్లు, 46 సం. 2వ పెళ్ళి వరుడుకి మంచి గుణం, సాంప్రదాయం కలిగిన కులప్రసక్తి లేని వధువు కావలెను. 9573428169. [B-190868]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్/30y/నెలకు లక్ష రూపాయల ఆదాయం. HYD లో సొంత ఇల్లు కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ఒట్టి తెలంగాణ వధువు కావలెను. డైవర్స్ /విడో Ok కుల, కట్నం ప్రసక్తి లేదు డైరెక్ట్. ఫోన్: 7989079290 [H-793432]

వైశ్య వరుడు RMP డాక్టర్ వరునికి వధువు కావలెను. కుల పట్టింపులేదు మరియు రెండో పెండ్లి వారు కూడ సంప్రదించవచ్చును. ఇది డైరెక్ట్‌గా ఇచ్చినాము. సంప్ర॥ 8790197318 [Y-784403]

★★

తిరుపతి, కులపట్టింపు లేదు, బి.సి, 53 సం., 43,000/-, ఎలాంటి బాధరబందీలేని పెన్షన్ దారునికి,ఎలాంటి ఆదరణ లేని(విడో, డైవర్స్) వధువు అర్జెంటుగా కావలెను.డైరెక్ట్: 9059570558. [T-1261151]

డైరెక్ట్/40/M.Com /B.Ed /5.5 own shop ఉన్న వరుడికి కుల, వయసు ప్రసక్తి లేని వధువు పెళ్ళి లేదా తోడు కొరకు కావలెను. ఇల్లరికం అయిన ok. డైరెక్ట్-8519934926. [L-806262]

కాపు/ 5'5"/ 55Yrs / డైరెక్ట్. కుల పట్టింపులేదు. నెలకు రూ. నలభై వేల ఆదాయం, అర కోటి స్థిరాస్తి గల వ్యక్తికి మంచి మనసున్న వధువు కావలెను. డబ్బులు అడిగే వారు సంప్రదించవద్దు. సెల్ 83414 82731 [K-1187265]

అగ్నికుల క్షత్రియులు - 2nd మ్యారేజ్, వయస్సు 50, గవర్నమెంట్ ఎంప్లాయి, (హైజాగ్) జీతం లక్ష, వరుడు డిప్లొమా, BA, MA., వరుడికి వధువు కావలెను. (OC, BC) వయస్సు 38 నుండి 45 సం॥లలోపు పిల్లలు లేని వధువు కావలెను. ✆ : 96769 82230 [R-1151832]

వరుడు కావలెను



రెడ్డి/46y/5'3"/G.Employee/60 వేలు నెలకు / సొంత ఇల్లు, Well Settled వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. మైత్రి మ్యారేజ్ బ్యూరో. Ph: 8019484384, 7396608019 [H-793440]

వైశ్య/53y/5'4"/ బిజినెస్/80 వేలు నెలకు/ విడో /బాగా స్థిరపడిన వధువుకు వరుడు కావలెను. పిల్లలున్నా Ok, కుల ప్రసక్తిలేదు. మైత్రి మ్యారేజ్ బ్యూరో. Ph: 7396608019, 8019484384 [H-793440]

కమ్మ/40y/5'5"/ Late Marriage / 75K pm, 10 Cr ప్రాపర్టీ కల్గిన Only Duaghter కి వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 8019468462 [H-793440]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Business, BS, 28, 5' 10", Rich Family, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 11", Engineer, 150 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, MS, 30, 5' 8", 40 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 11", Deloitte, 170 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి USA, Residency Doctor, MBBS, MD, 28, 5' 2", Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 27, 5' 3", Analyst, 12 L P/A, 20 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBBS, 30, 5' 2", 75 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 27, 5' 4", SWE, 20 L P/A, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
(రెడ్డిలకు మాత్రమే)
690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad
D.V. Koti Reddy
98480 11818, 93933 11818

రెడ్డి BE, MS, 28, 6' 1", SWE, 200 K, 80 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 29, 5' 8", Sr Analyst, 31 L P/A, Hyd, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BS (Australia), 32, 6', Manager, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, CFA, 49, 5' 6", Sr Consultant, 18 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 5", Sr SWE, 120 K, 4 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 4", Amazon, 200 K, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 24, 5' 4", Software Developer, 11 L P/A, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, 33, 5' 7", Hyderabad, Rich, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

రెడ్డి/27y/5'5"/ M.Tech/ 1 Lakh pm/ 40 Cr ప్రాపర్టీ కల్గిన వధువుకు వరుడు కావలెను. LOCAL/ABROAD డైరెక్ట్ No Brokers, Only Reddys. Ph: 8897213126 [H-793440]

రెడ్డి/విడో/60y/5'4"/ Very Fair/ రిటైర్డ్ పెన్షనర్/ సొంత ఇల్లు & రెంట్స్/ ఆంధ్రాలో పొలాలు ఏబాదరబందీలేని వెల్‌సెటిల్డ్ సాంప్రదాయ వధువుకు స్నేహస్వభావం గల వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph : 7095845789 [H-793390]

కమ్మ/విడో/58/5'5"/ V.Fair/ Govt.(H.M)/ సొంత ఇల్లు & రెంట్స్/ బిజినెస్/ 25 ఎకరాల మాగాణి/ 2L pm, ఏబాదరబందీలేని వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తిలేదు. Ph: 7093717220 [H-793390]

FC/విడో/58y/ ప్రభుత్వ రిటైర్డ్/ సొంత ఇల్లు/ కొంచెం పొలం గల వెల్‌సెటిల్డ్ ఒంటరి వధువుకు మధ్యతరగతి వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 8977079749 [H-793390]

FC/55y/ విడో/5'3"/ Fair/ చిన్న ఉద్యోగం/ 60,000/- pm/ సొంత ఇల్లు గల సాంప్రదాయమైన వధువుకి వరుడు కావలెను. Ph: 8019324258 [H-793390]

హిందూ మాల/ 55y / విడో / రైల్వే డిపార్ట్‌మెంట్‌లో జాబ్ / 80,000/- pm/ ఆంధ్రాలో పొలాలు కలిగిన వధువుకు ధన ప్రసక్తిలేని వరుడు కావలెను. Ph: 9030870523 [H-793390]

కాపు/2nd మ్యారేజ్/ 28y/ 5'4"/ V.Fair/ B.Tech, SWE/ 16L p/m డైవర్స్ పిల్లలులేని వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6309344166 [H-793543]

కుల పట్టింపులేదు/విడో/49y/ Economics & Statistics (Dept.)/ 1L pm/ Own House/ 30 ఎ॥ తోటలు/ కోట్ల ప్రాపర్టీ గల వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. Ph: 7207586729 [H-793543]

రెడ్డి/డైవర్స్/31y/5'5"/ Very Fair/ MBA/ Business/ Own House/ కోట్ల ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. (3 సం॥ బాబు). Ph: 9848226983 [H-793543]

కుల ప్రసక్తిలేదు/విడో/55y/ విజయవాడ/Hyd Own House Rents/ Lands/ Well Settled పిల్లలులేని ఏబాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. (సపోర్ట్ ఉండును). Ph: 7997175138 [H-793543]

రెడ్డి/25y/ BE/ SWE (Zenpact)/ 10 Lakhs P/A / 3 Acers ఫాం ల్యాండ్, కోట్ల ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. Ph: 9553652167 [H-793543]

SC మాదిగ హిందూ & క్రిస్టియన్/ B.Tech(EEE)/Govt.A.E.E./ఇరిగేషన్ Dept/65000/-PM/5'4" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093, 9912280929 [HA-13891]

వడ్డెర/ B.Tech / C.Govt. క్లర్క్ & క్యాషియర్/ SBI/45000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-13891]

క్రిస్టియన్ మాల/25 / 5'4" / B.Tech/ C. Govt.Asst. మేనేజర్ / కెనరా బ్యాంక్ /60,000/-PM / అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-13891]

డైవర్స్ 2వ పెళ్లి 38yrs Govt ఎంప్లాయ్ 2,50,000/-(PM) వెల్ సెటిల్డ్, కులపట్టింపు లేని అందమైన వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్నా & ఇల్లరికం Ok) ఫోన్: 9959815362. [H-783627]

రెడ్డి 40yrs/5'4"/కుల పట్టింపు లేదు/ఫెయిర్/MBA/ Govt ఎంప్లాయ్/70k (PM) వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ బిజినెస్ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం Ok) ఫోన్: 8008474869. [H-783627]

కాపు 35yrs/కుల పట్టింపు లేదు/Govt ఎంప్లాయ్/60k (PM) వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ & 3 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం 1st & 2nd మ్యాచ్ Ok) ఫోన్: 7095282404. [H-783627]

OC/29yrs/5'3"/Govt ఎంప్లాయ్/70k (PM) MD/ ఫెయిర్, అందమైన వధువుకి Any OC & BC గవర్నమెంట్ OR ప్రైవేట్ జాబ్ వరుడు కావలెను. ఫోన్: 8688671906. [H-783627]

బ్రాహ్మణ/24/5'3"/B.Sc "27/5'4"/MBA "30/5'3"/ B.Sc "27/5'2"/ఇంటర్ "32/5'2"/ ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్ / పురోహితులకు త్వరగా కుదుర్చబడును. Ph: 7842635086 [HA-13891]

రెడ్డి విడో: కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు /Age: 29, Qly: డిగ్రీ/సొంత వ్యాపారం కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. 1st (or) 2nd (ఇల్లరికము Ok). ఫోన్: 8143011223. [HA-13888]

మాల క్రిస్టియన్ వధువు 26 సం॥ 5'4" ఎత్తు, V. Fair, B.Tech, SWE, Banglore, 80k PM, Only Daughter, వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8247888908. [HA-13888]

SC మాల హిందు/B.Tech 25yrs/ 5'4" సాఫ్ట్‌వేర్ ఇన్ఫోసిస్ (HYD) 60k Per Month /చాలా అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 9705960270. [HA-13888]

బ్రాహ్మణ/33 yrs/5'2"/ఇంటర్/29yrs/5'4" /డిగ్రీ/అందమైన వధువులకు వరులు కావలెను/రిక్రైర్‌మెంట్/Pvt.Govt జాబ్ & పురోహితం అయిన OK. ఫోన్: 9959725419. [HA-13888]

కుల పట్టింపు లేదు 21y&24y&26y&28y&30y &32y &34y&36y&38y&39y&40y&42y&43y&45y&47y &49y&51y&53y&55y&57y&59y&61y&62y&63y/ "మా సేవ" (Since1998): PH/WA: 9291503949. [HA-13888]

వేదికలు



గౌడ మ్యారేజ్ బ్యూరో HYD 20 సం॥ అనుభవం గౌడ, శెట్టిబలిజ, ఈడిగ కులస్తులకు ఇంజినీరింగ్, డాక్టర్స్, NRI, బిజినెస్ 1వ, 2వ దేశ విదేశీ పెళ్లిలకే. ఫోన్: 9440454842 [H-783627]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13890]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13890]

Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13890]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13890]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13890]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.నారాగౌడ్, Ph: 8790690809 [H-793387]

మాల, మాదిగ స్పెషల్. IAS, IPS, IFS, IRS, గ్రూప్ I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-14131]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-793556]

Fast Settelment-పెళ్లి సంబంధాలు-అన్ని కులాలు-అన్ని ప్రాంతాలు. సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్ VPవారికిPersonal Service చేస్తాము. పూర్ణ మ్యాట్రిమోని,తిరుపతి, Cont: 7093722724. [T-1969]

ఫ్రీ రిజిస్ట్రేషన్ యాప్‌ని డౌన్లోడ్ చేసుకొని మీకు నచ్చిన పెళ్ళి సంబంధం మీరే చూసుకోండి. www.rohinimarriagelines.com ✆ 94418 29644, 98490 58673, 94407 85888 (W) [B-950]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-663]

కాపు వధూవరుల స్వయంవరం (Online) 17 Dec. 2023, Free Registration Bhavani Matrimony, ECIL, HYD. Ph: 9704656103/ 9533608887 [HA-679]

★★

Kalyani Matrimony: గౌడ, కాపు మరియు అన్ని కులాల వారి ఉన్నతమైన సాంప్రదాయబద్ధమైన పెండ్లి సంబంధాల కొరకు వెంటనే సంప్ర: 8500747535/ 9533133969. kalyanimatrimony.in [H-793389]

Reddys-Naidus Matrimony- రెడ్లు- నాయుడులకు మాత్రమే-ఫ్రీ రిజిస్ట్రేషన్ & క్విక్ రెస్పాన్స్, వాట్సప్: 7337355435, చిత్తూరు. [T-4793]

వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా ముంగర



సీఎం వైఎస్ జగన్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంజీవ్‌కుమార్

దెందులూరు: ఆంధ్రప్రదేశ్ వడ్డీలు సంక్షేమ, అభివృద్ధి సంస్థ (కార్పొరేషన్) చైర్మన్‌గా ఏలూరు జిల్లా, దెందులూరు నియోజకవర్గం, కొల్లేరు ప్రాంతానికి చెందిన ముంగర సంజీవ్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ పదవిలో ఆయన రెండేళ్లపాటు కొనసాగేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సంజీవ్ కుమార్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ముంగర నియామకంపై దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ తదితరులు అభినందనలు తెలిపారు.

● తెలంగాణ

హైదరాబాద్ నుంచి గోండియాకు విమానం

శంషాబాద్ (హైదరాబాద్): శంషాబాద్ విమానాశ్రయం నుంచి మహారాష్ట్రలోని గోండియాకు ఇండిగో విమాన సర్వీసును ప్రారంభించింది. శనివారం ఉదయం 10.35 గంటలకు 6ఈ7534 విమాన సర్వీసు ఇక్కడి నుంచి బయల్దేరింది. రోజూ ఈ విమాన సర్వీసు 10.35 గంటలకు బయల్దేరి 12.35 గంటలకు గోండియాకు చేరుకుంటుంది.

కిషన్‌రెడ్డికి 'గోల్డ్ మెడాలియన్' పురస్కారం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డికి అరుదైన గౌరవం లభించింది. అమెరికా అధ్యక్షుడి 'గోల్డ్ మెడాలియన్'పురస్కారం ఆయనను వరించింది. ఈ మేరకు యూఎస్ అధ్యక్షుడు జో బైడెన్ ఈ పురస్కారానికి కిషన్‌రెడ్డిని ఎంపిక చేశారు. భారత్‌కు సంబంధించిన పర్యాటక, సాంస్కృతిక, ఇతర అంశాలను అమెరికాతోపాటు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం నిర్వహించినందుకు గుర్తింపుగా ఈ పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు. ఇందులో భాగంగా దేశంలోని ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, ఇతర అంశాలపై ఆయన సాగించిన కృషికి కూడా ఈ గుర్తింపు లభించింది. ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ లీడర్లుగా ఎదిగి వివిధ అంశాలపై కృషి చేసినవారికి అమెరికా అధ్యక్షుడి మెడాలియన్‌ను అందజేస్తున్న విషయం తెలిసిందే. భారత్‌కు చెందిన నాయకుడికి తొలిసారిగా ఈ గౌరవం దక్కడం విశేషం.

తమిళ జాలర్ల ఆగడాలకు అడ్డుకట్ట

- రాష్ట్ర మత్స్యకారుల ప్రయోజనాలు కాపాడడమే లక్ష్యం
- సముద్ర జలాల్లో అత్యాధునిక గస్తీ బోటుతో ప్రత్యేక నిఘా
- సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ప్రభుత్వం



గస్తీ కోసం సిద్ధం చేసిన బోటు

సాక్షి, అమరావతి: రాష్ట్ర మత్స్యకారుల ప్రయోజనాలను కాపాడేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్ర జలాల్లో తమిళనాడు జాలర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీర్ఘకాలంగా ఉన్న ఈ సమస్య పరిష్కారం కోసం తమిళనాడు ప్రభుత్వంతో పలు దఫాలు చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో.. తమిళనాడు బోట్లపై నిఘా పెట్టేందుకు అత్యాధునిక గస్తీ బోటును రంగంలోకి దింపింది.

నిబంధనలను తుంగలో తొక్కి..

సముద్ర తీరం వెంబడి ఉన్న రాష్ట్రాలు సరిహద్దులు మీరకుండా ఉండేందుకు కేంద్ర మత్స్యశాఖ స్పష్టమైన నిబంధనలు జారీ చేసింది. తెప్పలు, సాంప్రదాయ బోట్లతో తీరం నుంచి 8 కిలో మీటర్ల (5 నాటికల్ మైళ్లు), వరకు, అదే ఇంజిన్ బోట్లయితే 23 కిలోమీటర్ల (12 నాటికల్ మైళ్లు) అవతలే వేట చేసుకోవాలి. తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల మత్స్యకారులు ఆంధ్రా తీరంలో సంప్రదాయ వలలతోనే వేట సాగిస్తుంటారు. అయితే తమిళజాలర్లు అత్యాధునిక మెకనైజ్డ్, మోటరైజ్డ్, సోనా బోట్లు, వలలతో తిరుపతి జిల్లా తడ నుంచి ప్రకాశం జిల్లా కొత్తపట్నం వరకు దూసుకొస్తూ.. కోట్లాది రూపాయల విలువైన మత్స్య సంపదను కొల్లగొడుతున్నారు. చివరికి నిషేధ సమయంలోనూ వేట సాగిస్తున్నారు. దీంతో నిత్యం సరిహద్దు జిల్లాల్లో శాంతిభద్రతల సమస్యలు నెలకొంటున్నాయి. ఈ మేరకు నెల్లూరులో 63, ప్రకాశంలో 54 కేసులు నమోదయ్యాయి.

సీఎం జగన్ ఆదేశాలతోనే..

దీర్ఘకాలంగా ఉన్న ఈ సమస్య పరిష్కారం కోసం గత ప్రభుత్వం కనీస చర్యలు కూడా చేపట్టిన దాఖలాలు లేవు. పాదయాత్ర సమయంలోనే ఈ సమస్యను స్థానిక మత్స్యకారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. అధికారంలోకి వచ్చింది మొదలు అవకాశం దొరికినప్పుడల్లా తమిళనాడు ప్రభుత్వంతో చర్చలు జరుపుతూనే వచ్చింది. 2021 నవంబర్ 14న జరిగిన 29వ దక్షిణ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామని, ఉమ్మడి సమావేశం నిర్వహిస్తామని తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. ఇలా 2019–2022 మధ్య పలు దఫాలు ఇరు రాష్ట్రాల మత్స్యశాఖామంత్రులు, రాష్ట్రస్థాయి మత్స్యశాఖాధికారులు చర్చలు జరిపినా ఉమ్మడి సమావేశం ఏర్పాటు దిశగా తమిళనాడు ప్రభుత్వం చొరవ చూపలేదు.

15 మంది సిబ్బందితో గస్తీ బోటు

ఈ నేపథ్యంలో రాష్ట్ర మత్స్యకారుల ప్రయోజనాలను కాపాడడమే ప్రధాన లక్ష్యంగా తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాలను కవర్ చేసేలా సముద్ర జలాల్లో పెట్రోలింగ్ నిర్వహించేందుకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన మెకనైజ్డ్ బోట్‌ను ప్రభుత్వం నవంబర్ 20వ తేదీన రంగంలోకి దింపింది. 15 మంది సిబ్బందితో గంటకు 8 నాటికల్ మైళ్ల స్పీడ్‌తో ఈ బోటు సాయంతో తిరుపతి జిల్లా నుంచి బాపట్ల జిల్లా వరకు 4 జిల్లాల పరిధిలో తీరం వెంబడి ఈ బోటుతో గస్తీ ఏర్పాటు చేశారు.

శాంతిభద్రతల సమస్యలు..

నిబంధనలకు విరుద్ధంగా తమిళ జాలర్లు మన ప్రాదేశిక జలాల్లోకి చొరబడడంతో సరిహద్దు జిల్లాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి. అక్రమ చొరబాట్లను అడ్డుకునేందుకు శివ సురేష్–1 అనే అత్యాధునిక గస్తీ బోటును ఏర్పాటు చేశాం.
– కూనపురెడ్డి కన్నబాబు, కమిషనర్, మత్స్యశాఖ

సీఎం జగన్ చొరవతోనే..

తమిళనాడు జాలర్ల ఆగడాల వల్ల ఆంధ్ర జాలర్లకు అపార నష్టం వాటిల్లుతున్నది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలు దఫాలు జరిపిన చర్చలు ఫలించలేదు. దీంతో మన మత్స్యకారుల ప్రయోజనాలను కాపాడేందుకు తీరం వెంబడి గస్తీని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.
– డాక్టర్ సీదిరి అప్పలరాజు, మత్స్యశాఖమంత్రి

5న పోలవరంపై ఉన్నతస్థాయి సమావేశం

- ప్రస్తుత సీజన్‌లో పూర్తి చేయాల్సిన పనుల యాక్షన్ ప్లాన్ ఖరారే అజెండా
- కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి అధ్యక్షతన సమావేశం



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టును గడువులోగా పూర్తి చేయడానికి ప్రస్తుత సీజన్(2023–24)లో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక(యాక్షన్ ప్లాన్), సవరించిన అంచనా వ్యయం(తొలి దశ పూర్తి) ఖరారే అజెండాగా ఈ నెల 5న ఢిల్లీలో కేంద్రం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనుంది. కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన జరిగే సమావేశంలో కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వేందర్‌సింగ్ వోరా, జల్ శక్తి శాఖ సలహాదారు శ్రీరాం వెదిరె, పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) సీఈవో శివ్‌నందన్‌కుమార్, సభ్య కార్యదర్శి రఘురాం, రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, పోలవరం సీఈ సుధాకర్‌బాబులు పాల్గొంటారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై పీపీఏ సభ్య కార్యదర్శి సమావేశానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల సీపేజీకి అడ్డుకట్ట వేయడం, దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ స్థానంలో కొత్తది నిర్మించాలా? లేదంటే పాత దానికే మరమ్మతు చేయాలా? వంటి అంశాలపై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయడానికి వీలుగా ప్రస్తుత సీజన్‌లో చేపట్టాల్సిన పనులను.. వాటిని పూర్తి చేయడానికి వీలుగా యాక్షన్ ప్లాన్‌ను ఖరారు చేస్తారు. ఇక పోలవరం ప్రాజెక్టు తొలి దశ సవరించిన అంచనా వ్యయాన్ని రూ.31,625.38 కోట్లుగా సీడబ్ల్యూసీ ఖరారు చేసింది. ఇందులో ఇప్పటికే రూ.16,119.57 కోట్ల పనులు పూర్తయ్యాయి.. మిగతా పనులకు రూ.15,505.81 కోట్లు అవసరమని తేల్చుతూ కేంద్ర జల్ శక్తి శాఖకు నివేదిక ఇచ్చింది. సవరించిన అంచనా వ్యయాన్ని ఖరారు చేసేందుకు కేంద్ర ఆర్థిక శాఖ ఆర్‌సీసీ(రివైజ్డ్ కాస్ట్ కమిటీ)ని నియమించింది. ఆ కమిటీ అడిగిన వివరాలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పంపింది. ఈ నెల 5న జరిగే సమావేశంలో తొలి దశ సవరించిన అంచనా వ్యయంపై చర్చించనున్నారు.

వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తాం

ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ సెంట్రల్ జోన్ నూతన చైర్మన్ శిద్దా సుధీర్‌కుమార్




ప్రమాణ స్వీకారం చేస్తున్న శిద్దా సుధీర్‌కుమార్

ఒంగోలు: వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తామని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ సెంట్రల్ జోన్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన శిద్దా వీర వెంకటసుధీర్‌కుమార్ చెప్పారు. ఒంగోలులో శనివారం ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ సెంట్రల్ జోన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, వ్యాపార వర్గాలకు వారధిగా ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ పనిచేస్తోందని తెలిపారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు మాట్లాడుతూ సుధీర్‌కుమార్‌కు సెంట్రల్ జోన్ కమిటీ బాధ్యతలు అప్పగించడం ద్వారా పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని వ్యవసాయ, రొయ్యలు, ఆహార ఉత్పత్తుల ప్రాసెసింగ్, గ్రానైట్, టెక్స్‌టైల్స్, హాస్పిటాలిటీ, టూరిజం వంటి అనేక వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ప్రసంగించారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ వైస్ చైర్మన్‌లుగా బెనర్జీ బి.బత్తినేని, వి.సతీష్‌బాబులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఎల్.రఘురామరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, కోశాధికారి ఎస్.అక్కయ్యనాయుడు, రాయలసీమ జోన్ చైర్మన్ కేవీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఒక వ్యక్తికి ఒక ఓటే ఉండాలి

- తెలంగాణలో ఓటున్న వారు ఇక్కడా ఓటు వేయడానికి చూస్తున్నారు
- రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

పల్లెకోన (భట్టిప్రోలు): భారత రాజ్యాంగం ప్రకారం పేదవాడికైనా, కోటీశ్వరుడికైనా ఒక్క ఓటు మాత్రమే ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున అన్నారు. భట్టిప్రోలు మండలం పల్లెకోనలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి ఓటు ఉండాలని కానీ ఓట్లు కాదన్నారు. తెలంగాణలో ఓటు వేసిన వారు కూడా ఆంధ్రాలో ఓటు వేయడానికి ప్రయత్నిస్తున్నారని, అది కరెక్టు కాదన్నారు. ఓటుకు నోటుతో వైఎస్సార్ సీపీని ఓడించాలని కొన్ని పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు 60 లక్షలకుపైగా దొంగ ఓట్లను చేర్పించారని, దీనిపై ఎన్నికల కమిషనర్‌ని కూడా కలసి ఫిర్యాదు చేశామని తెలిపారు. పక్క రాష్ట్రాల నుంచి కూలీ పనులకు వచ్చిన వారి ఓట్లు చేర్చి కుప్పం నియోజకవర్గంలో ఇప్పటి వరకు చంద్రబాబు గెలుస్తున్నాడని, దీనిపై ఎన్నికల కమిషన్ రియాక్ట్ అవ్వాల్సిందేనన్నారు. వైఎస్సార్ సీపీ త్రికరణ శుద్ధితో ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తున్నట్లు చెప్పారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టులో చట్టబద్ధంగా రావాల్సిన వాటా మాత్రమే తీసుకున్నామని మంత్రి నాగార్జున తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ధైర్యవంతుడు కాబట్టి వెంటనే స్పందించారన్నారు. నీటి వాటాల విషయంలో అవసరమైతే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని తెలిపారు. మీడియా సమావేశంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, పల్లెకోన, రాచూరు, ఆళ్లమూడి సర్పంచులు బొల్లెద్దు రాజమ్మ, జయవరపు రాధాకృష్ణమూర్తి, పెద్దిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ

'హెచ్‌సీయూకు పేటెంట్' హక్కులు మంజూరు

మల్టీఫంక్షనల్ బోమన్–బిర్క్ అండ్ ఇన్హిబిటర్స్, శుద్ధీకరణ పద్ధతిపై ప్రయోగాలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి కొత్త పేటెంట్‌ను మంజూరు చేశారు. 'మల్టిఫంక్షనల్ బోమన్–బిర్క్ అండ్ కునిట్జ్ ఇన్హిబిటర్లను వేరు చేయడం, శుద్ధి చేయడం కోసం నూతనంగా ఆవిష్కరించిన పద్ధతి'కి పేటెంట్ మంజూరు కావడం విశేషం. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ నుంచి ఇద్దరు పరిశోధనా శాస్త్రవేత్తలు ప్రయోగశాలలో దీనిని అభివృద్ధి చేశారు. బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ కె.పద్మశ్రీ, డాక్టర్ ఎంకే అరుణశ్రీ, మరియమ్మ గుజ్జర్లపూడి, భారతి కోటర్య మార్గదర్శకత్వంలో ఈ ప్రయోగాలు నిర్వహించారు. మొక్కలలో ఉండే బోమన్–బిర్క్, కునిట్జ్ ఇన్హిబిటర్లు రెండూ కూడా ఆక్రమించే తెగుళ్లు, వ్యాధికారక క్రిములకు వ్యతిరేకంగా రక్షణ పాత్రతో సహా అనేక జీవసంబంధమైన విధులను కలిగి ఉన్నాయని ప్రొఫెసర్ పద్మశ్రీ వివరించారు. ఈ ప్రోటీజ్ ఇన్హిబిటర్లు రైతుకు అనుకూలమైనవిగా ఆమె అభిప్రాయపడ్డారు.

క్లుప్తంగా...

రెండు రోజుల్లో అవ్వాతాతల చేతికి రూ.1,654.61 కోట్లు

- 91.89% మందికి పింఛన్ల పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వివిధ చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ డబ్బులు పంపిణీ రెండో రోజు శనివారం కూడా ముమ్మరంగా కొనసాగింది. వలంటీర్లు శనివారం సాయంత్రం వరకు 60,03,709 మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రూ.1,654.61 కోట్లు పింఛన్ డబ్బులు పంపిణీ చేశారు. డిసెంబరు నెలలో మొత్తం 65,33,781 మందికి పింఛన్ల పంపిణీ కోసం రూ.1,800.96 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. మొత్తం లబ్ధిదారుల్లో 91.89శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తిచేశారు. ఈ నెల 5వ తేదీ వరకు మిగిలిన లబ్ధిదారుల ఇళ్లకు వలంటీర్లు వెళ్లి పింఛన్లు అందజేస్తారని అధికారులు తెలిపారు.

8న విశాఖలో ఆర్గానిక్ మేళా

- 11వ తేదీ వరకు నిర్వహణ
- భారత కిసాన్ సంఘ్ జాతీయ నేత కుమార్ స్వామి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయకులు జలగం కుమార్‌స్వామి

సీతంపేట(విశాఖ ఉత్తర): గో ఆధారిత ప్రకృతి రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఏయూ మద్దిలపాలెం మైదానంలో ఆర్గానిక్ మేళా నిర్వహిస్తున్నట్లు భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయకుడు జలగం కుమార్ స్వామి తెలిపారు. దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్లు శనివారం స్థానిక బీవీకే కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటలు విస్తారంగా పండించడం ద్వారా జల, వాయు, భూమి కాలుష్యం నివారించవచ్చన్నారు. ఆర్గానిక్ మేళాలో 8న ఉత్తరాంధ్ర రైతుల సమావేశం, 9న గ్రాడ్యుయేట్ రైతుల సమావేశం, 10న మిద్దెతోట రైతుల సమావేశం, 11న ఆర్గానిక్ వ్యాపారం చేసే వారితో సమావేశం నిర్వహిస్తామన్నారు. 9వ తేదీ మధ్యాహ్నం ఫుడ్ ప్రాసెసింగ్ శిక్షణ కార్యక్రమం, 11వ తేదీ మధ్యాహ్నం డాక్టర్ రవివర్మ ఆరోగ్య సలహాలు, సూచనలు ఉంటాయన్నారు. సిటీ టెర్రస్ గార్డెన్ సభ్యులు అరుణ, సరితలు మిద్దె తోట పెంపకంపై అవగాహన కల్పిస్తారని వివరించారు.

సరుకు రవాణాలో 'వాల్తేరు' రికార్డు

- నవంబర్‌లో అత్యధికంగా 1,791 రైల్ రేక్‌ల లోడింగ్



తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): సరుకు రవాణాలో వాల్తేరు రైల్వే డివిజన్ సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ సంవత్సరం నవంబర్‌లో వాల్తేర్ డివిజన్ 6.51 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసింది. ఇది గతేడాది కంటే 16.25 శాతం అధికం. గతేడాది నవంబర్‌లో కేవలం 5.60 మిలియన్ టన్నులు మాత్రమే. నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి ఈ ఏడాది నవంబర్‌లో 2.04 మిలియన్ టన్నుల ఐరన్‌ఓర్ (ముడి ఇనుము)ను, గంగవరం పోర్టు నుంచి 1.52 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేయడం ద్వారా కూడా గత రికార్డులను వాల్తేర్ డివిజన్ అధిగమించింది. ఇప్పటి వరకు నవంబర్ నెలలో 1,700 రేక్‌లను లోడింగ్ చేయగా, ఈ ఏడాది నవంబర్‌లో 1,791 రేక్‌లను లోడింగ్ చేసి కొత్త రికార్డును నెలకొల్పింది. కొత్తవలస-కిరండూల్ లైన్‌లో ఇప్పటివరకు నవంబర్ నెలలో కేవలం 350 రేక్‌లకు మాత్రమే లోడింగ్ రికార్డు ఉండగా, ఇది ఈ నవంబర్‌లో 484 రేక్‌లుగా చరిత్ర సృష్టించింది. ఈ మార్గంలో కొండచరియలు, బండరాళ్లు విరిగిపడి, సుమారు 17 రోజులు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగినా కూడా వాల్తేర్ డివిజన్ సిబ్బంది అంకితభావంతో, నిబద్ధతతో, సమన్వయంతో ఈ రికార్డులను సాధించారు. ఈ సందర్భంగా ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్ ప్రసాద్ సంబంధిత అధికారులు, సిబ్బందిని అభినందించారు.

నన్ను చంపాలని చూశారు

టీడీపీ నేత బీటెక్ రవి ఆరోపణ

కడప రూరల్: అధికార పార్టీ నేతలు పోలీసుల ద్వారా తనను కిడ్నాప్ చేయించి చంపేందుకు ప్రయత్నించారని టీడీపీ పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి ఆరోపించారు. కడపలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతనెల 14వ తేదీన పోలీసులను అడ్డుపెట్టుకుని తనను కిడ్నాప్ చేయించి అంతమొందించేందుకు ప్రయత్నం చేశారన్నారు. కిడ్నాప్ విషయం వెలుగు చూడటంతో వల్లూరు మండలంలో జరిగిన కేసును తెరపైకి తెచ్చారన్నారు. పోలీసులు తనపై తప్పుడు కేసులు బనాయించడమే కాకుండా పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో తుపాకీ గురిపెట్టి చంపుతామని తీవ్రస్థాయిలో బెదిరించారన్నారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ పేపరు మీద మాత్రమే ఎస్పీగా చలామణి అవుతున్నారని, వాస్తవానికి సీఐ అశోక్‌రెడ్డి ఎస్పీగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తనను అరెస్ట్ చేసిన తర్వాత నేరుగా వల్లూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్టు జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ అబద్ధం చెప్పారన్నారు.



తూర్పు గోదావరి జిల్లా అనంతపల్లికి చెందిన మరిదయ్యకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ గణేష్



శ్రీకాకుళం జిల్లా కేతుపురంలో రఘునాథమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సంజుక్త



ఒంగోలు బృందావన్ నగర్‌లో సుశీలమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అనూష



పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన కుమారికి రిమ్స్‌లో పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణ



ఏలూరులో బదిపట్ల అనంతలక్ష్మికి వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ దివ్య



గుంటూరు యాదవ బజార్‌కు చెందిన ధనలక్ష్మికి దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జ్యోతి



తిరుపతి ఆసుపత్రిలో తోట మునిరత్నంరెడ్డికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు ఓంకార్



ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో ఎల్.వెంకమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నాగ ప్రియాంక



వైఎస్సార్ జిల్లా మోరగుడి-2లో రంగప్పకు పెన్షన్‌ను అందిస్తున్న వలంటీర్ ఉమాదేవి



ఆటకు సిద్ధం..

- 'ఆడుదాం ఆంధ్ర' క్రీడాకారుల కోసం రూ.41.43 కోట్ల విలువైన 5 లక్షల స్పోర్ట్స్ కిట్లు
- వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పరికరాలు సిద్ధం
- ఇప్పటికే ఆయా జిల్లాల క్రీడా ప్రాధికార సంస్థలకు తరలింపు
- అక్కడి నుంచి గ్రామ, వార్డు సచివాలయాలకు పంపించేలా కార్యాచరణ.. పోటీలను ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు కసరత్తు

సాక్షి, అమరావతి: రాష్ట్రమంతటా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల సందడి నెలకొంది. క్రీడాకారుల రిజిస్ట్రేషన్‌తో పాటు క్రీడా పరికరాల పంపిణీ ఊపందుకుంది. సుమారు 50 రోజుల పాటు నిర్విరామంగా సాగే ఈ అతిపెద్ద మెగా టోర్నీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.41.43 కోట్ల విలువైన దాదాపు 5.09 లక్షల స్పోర్ట్స్ కిట్లను సిద్ధం చేసింది. ఇప్పటికే వీటిని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్ఏ)లకు తరలించింది. డిసెంబర్ తొలివారం నాటికి గ్రామ, వార్డు సచివాలయాలకు ఈ కిట్లను అందించేలా ప్రత్యేక దృష్టి సారించింది. వీటితో పాటు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో విజేతలకు 'ఆడుదాం ఆంధ్ర' లోగోతో టీషర్టు, టోపీని ఇవ్వనున్నారు.

ప్రత్యక్ష ప్రసారానికి సన్నాహాలు

'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో వెబ్‌సైట్‌ను రూపొందించింది. ఇందులో గ్రామ, వార్డు సచివాలయాల్లో జరిగే మ్యాచ్‌ల వివరాలు, స్కోర్‌ను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయనుంది. దీనికోసం గ్రామ, వార్డు సచివాలయాల నుంచి 10 మంది చొప్పున వలంటీర్లను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. నియోజకవర్గస్థాయి పోటీలను యూట్యూబ్ చానెల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేసేలా ప్రణాళికలు రచిస్తోంది.

కిట్ల నాణ్యత పక్కాగా పరిశీలన..

ప్రతి గ్రామ, వార్డు సచివాలయానికి మూడు వాలీబాల్‌లు, నెట్, మూడు బ్యాడ్మింటన్ రాకెట్లు, షటిల్స్, మూడు బేసిక్ క్రికెట్ కిట్లు, రెండు టెన్నీకాయిట్ రింగ్‌లను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఇక నియోజకవర్గ పోటీల్లో భాగంగా ఖోఖో, కబడ్డీ క్రీడాకారులకు యాంక్లెట్స్, నీక్యాప్స్ అందిస్తోంది. మండల స్థాయిలో ఆరు వాలీబాల్‌లు, రెండు ప్రొఫెషనల్ క్రికెట్ కిట్లను సమకూరుస్తోంది. వీటితో పాటు 6 వేల ట్రోఫీలు, 84 వేల పతకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేయనుంది. క్రీడా పరికరాల తయారీలో మంచి పేరున్న సంస్థల నుంచి టెండర్లను ఆహ్వానించి స్పోర్ట్స్ కిట్లను కొనుగోలు చేసింది. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థకు చెందిన అధికారులు, కోచ్‌లు స్వయంగా స్పోర్ట్స్ కిట్ల తయారీ పరిశ్రమలకు వెళ్లి వాటి నాణ్యతను పరిశీలించారు. ఆయా సంస్థలు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలకు సరఫరా చేసిన పరికరాలను ప్రత్యేక కమిటీ ద్వారా మరోసారి పరిశీలించిన తర్వాతే క్షేత్రస్థాయికి తరలిస్తున్నారు.

క్రీడా పరికరాలు	పంపిణీ చేయనున్న కిట్లు
టెన్నీకాయిట్	30,005
బేసిక్ క్రికెట్ కిట్(ఉమెన్)	15,004
బేసిక్ క్రికెట్ కిట్ (మెన్)	30,008
ప్రొఫెషనల్ క్రికెట్ కిట్(మెన్)	2,040
ప్రొఫెషనల్ క్రికెట్ కిట్(ఉమెన్)	1,020
బ్యాడ్మింటన్ నెట్స్	15,004
వాలీబాల్స్	49,092
బ్యాడ్మింటన్ రాకెట్స్	1,79,184
బ్యాడ్మింటన్ షటిల్	54,515
వాలీబాల్ నెట్స్	15,004
కబడ్డీ నీక్యాప్స్	26,430
ఖోఖో యాంక్లెట్స్	26,430

వెలుగులోకి ప్రతిభావంతులు



'ఆడుదాం ఆంధ్ర' ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. ప్రతి క్రీడాకారుడు పోటీల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. క్రీడాకారులకు అవసరమైన స్పోర్ట్స్ కిట్లను ప్రభుత్వమే సమకూరుస్తోంది. జిల్లా క్రీడాప్రాధికార సంస్థలకు చేరిన కిట్లను మరోసారి పరిశీలించి క్షేత్రస్థాయికి వేగంగా పంపించేలా ఆదేశించాం. ఈ మెగా టోర్నీని ప్రజలందరూ వీక్షించేలా ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు వీలుగా వెబ్‌సైట్‌ను, సిబ్బందిని సమకూర్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

– ధ్యాన్‌చంద్ర, ఎండీ, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ

దక్షిణ మధ్య రైల్వేకు రికార్డు స్థాయి ఆదాయం

నవంబర్‌లో రూ.1,600 కోట్ల ఆర్జన



సాక్షి, హైదరాబాద్: గత కొన్నేళ్లుగా గరిష్ట స్థాయి ఆదాయాన్ని ఆర్జిస్తూ తన పాత రికార్డులు అధిగమిస్తున్న దక్షిణ మధ్య రైల్వే ఇప్పుడు మరో ఘనతను సాధించింది. నవంబర్ నెలకు సంబంధించి రైల్వే శాఖ ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ఇటు ప్రయాణికుల రైళ్ల ద్వారా, అటు సరుకు రవాణా రైళ్ల ద్వారా నవంబర్‌లో రూ.1,600.53 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. గత ఏడాది నవంబర్‌లో గరిష్ట ఆదాయం రూ.1,454 కోట్లు మాత్రమే కాగా, ప్రయాణికుల రైళ్ల ద్వారా రైల్వే ఈ సంవత్సరం నవంబర్‌లో 469.40 కోట్ల ఆదాయాన్ని సాధించింది. ప్రయాణికుల అవసరాల మేరకు 342 అదనపు ట్రిప్పులను నడిపింది. ఇది 64 రైళ్లకు సమానం. వీటిల్లో 3.39 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణించారు. అలాగే రైల్వే శాఖ ఈ నవంబర్‌లో 11.57 మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేసింది. దీని ద్వారా రూ.1,131.13 కోట్ల ఆదాయాన్ని సంపాదించింది. ఇది గతేడాది నవంబర్ ఆదాయం కంటే పది శాతం ఎక్కువ. కొత్త క్లైంట్‌లతో ఒప్పందాలు చేసుకోవటం, సరుకు రవాణా చేసే కొత్త గమ్యస్థానాలను జోడించటం, కొత్త ట్రాక్‌ను అందుబాటులోకి తేవటం వంటి చర్యల ద్వారా ఇది సాధ్యమైందని రైల్వే శాఖ వర్గాలు వెల్లడించాయి. ఆదాయాన్ని భారీగా పెంచడానికి కృషి చేసిన ఉద్యోగులు, ఇతర సిబ్బందిని జోన్ జీఎం అరుణ్‌కుమార్ జైన్ అభినందించారు. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి సంబంధించి కూడా ఇదే తరహా రికార్డును సాధించాలని ఆయన సూచించారు.

సీఎం జగన్ సాహసి.. చంద్రబాబు ఆంధ్రా ద్రోహి

- సాగర్‌లో పోలీస్ యాక్షన్ దండయాత్ర కాదు.. రాష్ట్ర హక్కుల సాధన
- చంద్రబాబు అలసత్వం, నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి
- మానసిక రోగిలా ప్రవర్తిస్తున్న పవన్.. రాజకీయాలకు పనికిరాడు
- హక్కుల సాధనను హర్షించకపోతే ఆంధ్రా ద్రోహులే
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లి: మన రాష్ట్ర భూభాగంలో మన వాటా ప్రకారం నీటిని తీసుకోవడానికి పోలీసు యాక్షన్ చేస్తే అది దండయాత్ర ఎలా అవుతుందని, ఓట్ల రాజకీయమని ఎలా అంటారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రతిపక్షాలను ప్రశ్నించారు. ఇది మన రాష్ట్ర హక్కుల సాధన అని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అలసత్వం, నిర్లక్ష్యం వల్లే మన హక్కులను కోల్పోయి, ఈ దుస్థితి వచ్చిందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసి అని, ఓటుకు నోట్లు కేసులో భయపడి నీటి వినియోగాన్ని, మన హక్కులను తెలంగాణకు తాకట్టు పెట్టిన చంద్రబాబు ఆంధ్రా దోహి అని అన్నారు. మంత్రి అంబటి శనివారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పచ్చ పత్రికలు ఇష్టానుసారం రోత రాతలు రాస్తున్నాయని మండిపడ్డారు. కృష్ణా జలాల్లో మన వాటా నీటిని పొందడంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నష్టపోతున్నామన్నారు. శ్రీశైలం డ్యామ్ నుంచి విద్యుత్ ఉత్పత్తి కోసం తెలంగాణ విచ్చలవిడిగా నీటిని వాడుకుంటోందని చెప్పారు. 30 టీఎంసీల వరకు మనకు అవకాశం ఉన్నా ప్రస్తుతం 13 టీఎంసీల వరకే ఉపయోగించుకునే దుస్థితి నెలకొందన్నారు. చంద్రబాబు సీఎంగా ఉండగా నీటి యాజమాన్యాన్ని తెలంగాణకు అప్పజెప్పడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని తెలిపారు. ఇప్పుడు వ్యూహాత్మకంగా అడుగులు వేశామని, మన హక్కులను కాపాడుకున్నామని, ఇందులో ఎలాంటి రాజకీయం లేదని స్పష్టంచేశారు. తెలంగాణలో గెలుపోటములతో తమకు సంబంధం లేదని, మన రాష్ట్ర ప్రయోజనాల కోసమే వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని అన్నారు. హక్కుల సాధనను హర్షించని వారు ఆంధ్రప్రదేశ్ ద్రోహులేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ గెలిస్తే చంకలు గుద్దుకునేందుకు సిద్ధంగా ఉండటం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. తెలంగాణలో టీడీపీ అదృశ్యం అవుతుందన్నారు. పవన్ మానసిక రోగిలా ప్రవర్తిస్తున్నాడని, పూర్తి కాలపు రాజకీయాలకు పనికి రాడని తెలిపారు. తెలంగాణలో పోటీ చేసిన జనసేన పార్టీ ఓడిపోయేందుకు కాంగ్రెస్ పార్టీకి టీడీపీ సహకరించిందని, ఏపీలో అదే టీడీపీకి పవన్ ఎలా సహకరిస్తున్నాడని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి దుష్టచతుష్టయంతో కలిసిపోయారని విమర్శించారు.

ఇకపై 'స్మార్ట్'గా సంస్కృత, వేద పాఠశాలలు

- ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యార్థులకు బోధన

సాక్షి, న్యూఢిల్లీ: వేదం, సంస్కృతం నేర్చుకునే విద్యార్థులు ఇకపై ఆధునిక పద్ధతుల్లో, హైటెక్ విద్యను అభ్యసించబోతున్నారు. నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)లో భాగంగా ఇప్పటికే ఒక ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. తెలుగు రాష్ట్రాల్లోని యాభైకిపైగా వేద, సంస్కృత పాఠశాలలు సహా దేశవ్యాప్తంగా ఉన్న సంస్కృత, వేద పాఠశాలలను 'స్మార్ట్' ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దాలని కేంద్ర విద్యా శాఖ నిర్ణయించింది. ఇందులోభాగంగా ముందుగా వేద మరియు సంస్కృత పాఠశాలలను అనుసంధానం చేయాలని యోచిస్తోంది. ఈ బాధ్యతను సాందీపని జాతీయ సంస్కృత విద్యా బోర్డుకు అప్పగించింది. ఈ మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖను సాందీపని బోర్డు సంప్రదించింది. సంస్కృతం, వేద పాఠశాలల్లో నైపుణ్యాభివృద్ధి కోసం ప్రత్యేకంగా కోర్సులను రూపొందించాలని అభ్యర్థించింది. తాజాగా, బోర్డుతో విద్యా మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. ఇతర పాఠశాలలతో సమానంగా వేద, సంస్కృత పాఠశాలలను తీర్చిదిద్దడంపై సుదీర్ఘంగా చర్చించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా దాదాపు 500 సంస్కృత, వేద పాఠశాలలు కేంద్ర ప్రభుత్వ సహకారంతో నడుస్తున్నాయి. ప్రైవేటు సంస్థలు, ట్రస్టులు కూడా పెద్ద సంఖ్యలో ఈ పాఠశాలలను నిర్వహిస్తున్నాయి. వీటన్నింటినీ బోర్డు పరిధిలోకి తీసుకొచ్చే దిశగా బోర్డు చర్యలు చేపట్టింది. ఇన్నాళ్లు వేద, సంస్కృత పాఠశాలల్లో వేదాలు, అర్చక, పూజా విధాలు నేర్చుకున్న విద్యార్థులు కంప్యూటర్‌లోనూ చక్కని ప్రావీణ్యం సంపాదించాలనేదే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

కరెంట్ పేరుతో శ్రీశైలం ఖాళీ

▶ మొదటి పేజీ తరువాయి

తెలంగాణ సర్కార్ స్వేచ్ఛగా నిర్వహిస్తూ, అక్రమంగా నీటిని తరలిస్తోందని గణాంకాలతో సహా వివరించారు. తన భూభాగంలోని నాగార్జునసాగర్ స్పిల్ వేలో సగం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను గురువారం ఏపీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో రెండు రాష్ట్రాల మధ్య ఉత్పన్నమైన వివాదంతోపాటు కృష్ణా జలాల పంపకాలు, ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్‌లను కృష్ణా బోర్డుకు అప్పగింతపై చర్చించడానికి కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ శనివారం రెండు రాష్ట్రాల సీఎస్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు విజయవాడలో క్యాంపు కార్యాలయం నుంచి ఏపీ సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి, జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డిలు హాజరయ్యారు. తెలంగాణ సీఎస్ శాంతికుమారి, ఆ రాష్ట్ర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌కు గైర్హాజరయ్యారు. దాంతో వీడియో కాన్ఫరెన్స్‌లోనే తెలంగాణ సీఎస్ శాంతికుమారికి కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఫోన్ చేశారు. తెలంగాణ శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఆదివారం చేపట్టనుండటం వల్ల.. ఆ ఏర్పాట్లలో నిమగ్నమయ్యామని, దాని వల్లే వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరుకాలేకపోతున్నామని ఆ రాష్ట్ర సీఎస్ శాంతికుమారి తెలిపారు. సమావేశాన్ని 5కు వాయిదా వేస్తే హాజరవుతామన్నారు. దీనిపై కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ స్పందిస్తూ.. ఈనెల 6న ఢిల్లీలో నిర్వహించే సమావేశానికి రెండు రాష్ట్రాల సీఎస్‌లు, జల వనరుల శాఖ అధికారులు హాజరుకావాలని కోరారు. ఇందుకు రెండు రాష్ట్రాల సీఎస్‌లు అంగీకరించారు. తెలంగాణ సీఎస్ హాజరుకాలేని నేపథ్యంలో ఏపీ సీఎస్, అధికారులతో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ తాజా పరిస్థితిని సమీక్షించారు.

మా హక్కులను కాపాడుకోవడానికే..

'తెలంగాణ సర్కార్ ఎప్పటికప్పుడు నిర్ణయాలు మార్చుతూ ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించడం లేదు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావం నెలకొందని.. శ్రీశైలం, సాగర్‌లలో లభ్యతగా ఉన్న నీటిని తాగునీటి కోసమే వాడుకోవాలని అక్టోబర్ 6న జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో నిర్ణయించారు. ఆ కమిటీ చేసిన సిఫార్సు మేరకు శ్రీశైలంలో 30 టీఎంసీలు, సాగర్‌లో 15 టీఎంసీలు ఏపీకి.. రెండు ప్రాజెక్టుల నుంచి తెలంగాణకు 35 టీఎంసీలు కేటాయిస్తూ అక్టోబర్ 9న కృష్ణా బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను తుంగలో తొక్కుతూ ఎడమ గట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ శ్రీశైలాన్ని ఖాళీ చేస్తూ.. సాగర్‌కు తెలంగాణ నీటిని తరలించింది' అని ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి స్పష్టం చేశారు. శ్రీశైలంలో నీటి మట్టం తగ్గిపోవడం వల్ల.. కృష్ణా బోర్డు కేటాయించిన 30 టీఎంసీల్లో కేవలం 13 టీఎంసీలు మాత్రమే వాడుకోగలమని, మిగతా 17 టీఎంసీలు కోల్పోవాల్సి వచ్చిందని.. దీనికి తెలంగాణ సర్కార్ దుందుడుకు వైఖరి, కృష్ణా బోర్డు ప్రేక్షక పాత్ర వహించడమే కారణమని తెలిపారు. సాగర్‌లో కుడి కాలువకు కేటాయించిన 15 టీఎంసీలను ఇదే రీతిలో తెలంగాణ దక్కకుండా చేస్తుందేమోననే ఆందోళన ప్రజల్లో మొదలైందని.. ఇది శాంతిభద్రతల సమస్యకు దారితీస్తుండటంతో.. మా హక్కులను కాపాడుకోవడం ద్వారా దాన్ని నివారించడానికే మా భూభాగంలో ఉన్న సాగర్ స్పిల్ వేలో సగం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల గుంటూరు, పల్నాడు, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో వర్షాభావం నెలకొనడంతో తాగునీటి అవసరాల కోసం కుడి కాలువకు నీటిని విడుదల చేశామని ఏపీ సీఎస్ స్పష్టం చేశారు.



నాగార్జునసాగర్ డ్యాంను పరిశీలిస్తున్న కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సభ్యులు

ఏపీ ఆధీనంలో స్పిల్ వేలో సగం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్

సీఆర్పీఎఫ్ బలగాల పహారాలో సాగర్ నిర్వహణ బాధ్యతను కృష్ణా బోర్డుకు అప్పగించాం కాబట్టి.. ఇక అలాంటి పరిస్థితులు ఉత్పన్నం కావని ఏపీ సీఎస్‌కు కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే సాగర్‌లో సీఆర్పీఎఫ్ బలగాల మోహరింపుపై ఆ విభాగం అడిషనల్ డీజీ చారుసిన్హాను ఆరా తీశారు. సాగర్ స్పిల్ వే, ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ నుంచి తెలంగాణ పోలీసులు వెనక్కి వెళ్లారని, అక్కడ సీఆర్పీఎఫ్ బలగాలు మోహరించామని చారుసిన్హా చెప్పారు. ఏపీ పోలీసులు ఆ రాష్ట్ర భూభాగంలోని స్పిల్ వే, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద ఉన్నారని.. పరిస్థితి శాంతియుతంగా ఉందన్నారు. ఏపీ వైపు స్పిల్ వే, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను సీఆర్పీఎఫ్‌కు అప్పగించాలని కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి చేసిన సూచనను ఏపీ సీఎస్ సున్నితంగా తోసిపుచ్చారు. కుడి కాలువ కింద తమ రాష్ట్ర ప్రయోజనాలు మాత్రమే ముడిపడి ఉన్నాయని.. ఈ నేపథ్యంలో వాటిని తమ స్వాధీనంలో ఉంచుకుంటామని స్పష్టం చేశారు. ఏపీ సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి లేవనెత్తిన అంశాలపై కృష్ణా బోర్డు ఛైర్మన్‌ను కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ వివరణ కోరారు. సాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేయాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదన పంపకుండానే.. నీటిని విడుదల చేసుకున్నారని కృష్ణా బోర్డు ఛైర్మన్ చెప్పారు. కుడి కాలువకు 5 టీఎంసీలను విడుదల చేయాలని ప్రతిపాదన పంపామని ఏపీ సీఎస్ చెప్పారు. ఆ ప్రతిపాదనను పరిశీలించి.. ఈనెల 4లోగా నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని కృష్ణా బోర్డు ఛైర్మన్‌ను కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి ఆదేశించారు. కృష్ణా బోర్డు నీటి విడుదలపై నిర్ణయం తీసుకునే వరకూ అంటే 4వ తేదీ వరకు కుడి కాలువకు నీటి విడుదలను ఆపాలని ఆమె చేసిన సూచనకు ఏపీ సీఎస్ అంగీకరించారు. కృష్ణా జలాల వివాదంపై ఈనెల 6న ఢిల్లీలో రెండు రాష్ట్రాల ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శుల(సీఎస్)తో సమావేశం నిర్వహిస్తామని.. అప్పటిదాకా సంయమనం పాటించాలని రెండు రాష్ట్రాలకు ముఖర్జీ సూచించారు. విభజన చట్టం మేరకు కృష్ణా జలాల వివాదాన్ని పరిష్కరించి.. రెండు రాష్ట్రాల హక్కులను పరిరక్షించడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఈ సమీక్షలో సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్, కృష్ణా బోర్డు ఛైర్మన్ శివ్‌నందన్‌కుమార్, సీడబ్ల్యూసీ ఛైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరాలు పాల్గొన్నారు.

రెండు గేట్ల ద్వారా కొనసాగిన నీటి విడుదల

మాచర్ల/విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన 13 క్రస్ట్ గేట్లు, హెడ్ రెగ్యులేటర్ స్వాధీన పర్చుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటి హక్కు కోసం పోరాటం కొనసాగుతూనే ఉంది. అందులో భాగంగా శనివారం సాగర్ కుడికాలువ రెండు గేట్ల ద్వారా 3,300 క్యూసెక్కులు విడుదల కొనసాగించారు. మూడు రోజులుగా ప్రజల తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ కుడికాలువ ద్వారా 5వ గేటు నుంచి 2వేల క్యూసెక్కులు, 2వ గేటు నుంచి 1300 మొత్తం 3300 క్యూసెక్కుల నీటిని బుగ్గవాగు రిజర్వాయర్‌కు పంపుతున్నారు. తద్వారా పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల ప్రజల తాగునీటి అవసరాలు తీరుస్తున్నారు. జలవనరుల శాఖ అధికారులు, గుంటూరు రేంజి ఐజీ పాల్‌రాజ్, పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. తుపాను నేపథ్యంలో సాయంత్రం నుంచి నీటి విడుదలను 2,550 క్యూసెక్కులకు తగ్గించారు. నాగార్జునసాగర్ డ్యాం ప్రధాన ముఖద్వారం వద్ద ఉన్న తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీస్ గార్డ్ రూమ్ పేరును తొలగించి, ఆంధ్రప్రదేశ్ పోలీస్‌గార్డ్ రూమ్‌గా మార్చారు. కాగా, వివాదం నేపథ్యంలో శనివారం కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సభ్యులు ఎస్‌ఈ అశోక్‌కుమార్, ఈఈ రఘునాథ్, సెంట్రల్ వాటర్ కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ వీఎస్‌రావు డ్యామ్‌ను సందర్శించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

మహిమాన్వితం..ముగళఖోడ మఠం

- కోరిన కోర్కెలను తీర్చే సిద్ధరామేశ్వర మహా స్వామీజీ దివ్యసమాధి
- కన్నుల పండువగా మురుఘ రాజేంద్ర మహా స్వామీజీ గురువందనం


స్వామీజీ మహా సమాధిని దర్శించుకొంటున్న భక్తులు


ముగళఖోడలో సిద్ధరామేశ్వర సుక్షేత్ర మఠంలో భక్తుల సందడి .(ఇన్‌సెట్‌లో) ప్రస్తుత పీఠాధిపతి మురుఘ రాజేంద్ర స్వామీజీ

సాక్షి బళ్లారి: కోరిన కోర్కెలను తీర్చే మహిమాన్విత మఠంగా గుర్తింపు పొందిన సుక్షేత్ర ముగళఖోడ జిడగ మఠంలో భక్తిశ్రద్ధలతో గురువందన కార్యక్రమం జరిగింది. పీఠాధిపతి మురుఘ రాజేంద్ర మహాస్వామీజీ జన్మదినాన్ని పురస్కరించుకొని రెండు రోజుల నుంచి వేలాది మంది భక్తులతో మఠం కిటకిటలాడుతోంది. కలబుర్గి జిల్లా ఆళంద తాలూకాలోని సుక్షేత్ర ముగళఖోడ జిడగా మఠంలో శనివారం గురువందన కార్యక్రమానికి లక్షలాది మంది జనం తరలివచ్చారు. దీంతో మఠంలో ఎటుచూసినా భారీ భక్త జనసందోహం కనిపించింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చిన భక్తులు రెండు రోజులుగా మఠంలో భక్తిపారవశ్యంతో నిండిన పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మఠంలోని సమాధి అయిన సిద్ధరామేశ్వర మహాస్వామీజీ దివ్య సమాధిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు బారులు తీరి తమ మొక్కులను తీర్చుకొన్నారు. వేలాది మంది భక్తులకు నిరంతరంగా అన్నప్రసాదాల పంపిణీని కూడా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మఠం నిర్వాహకులు అన్ని చర్యలు చేపట్టారు.

శ్రీమఠం చరిత్ర...

పరమ పవిత్రమైన ఈ భరత భూమిలో అనేక యుగాలుగా మహానుభావులు జన్మించి భక్తులను సన్మార్గంలోకి తీసుకెళ్లే ముఖ్య భూమికను పోషిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగానే కలబుర్గి జిల్లాలో వెలసిన ముగళఖోడ జిడగా మఠంలో వంశపారంపర్యంగా గురువులు జన్మించి నాలుగు రాష్ట్రాల్లో దాదాపు 365 మఠాలకు పైగా స్థాపించి కోట్లాది మంది భక్తులను కూడగట్టుకొని సన్మార్గంలో నడిపిస్తున్నారు, సుక్షేత్ర మొదటి ఆది గురువు యల్లాలింగ మహాస్వామీజీ 1885లో జన్మించారు. ఆయన చిన్నప్పటి నుంచి ఎలాంటి ఆర్భాటం లేకుండా పెరగడంతో పాటు గొర్రెలను మేపుతూ దైనందిన కార్యక్రమాలను చేపట్టి ఎన్నో మహిమలు చూపి భక్తులను ఆకట్టుకొన్నారు. యల్లాలింగ ప్రభు స్వామీజీ చూపిన మహిమలు నేటికీ భక్తుల నోళ్లలో నానుతున్నాయి.

సిద్ధరామేశ్వర స్వామీజీ మహిమలెన్నో..

మఠం రెండవ పీఠాధికారి సిద్ధరామేశ్వర స్వామీజీ తన గురువు చూపిన మార్గంలో పయనించి ఎన్నో మహిమలను చూపడంతో పాటు భక్తుల కోర్కెలను తీరుస్తూ ఈయన బసవతత్వ, శివతత్వాన్ని ప్రచారం చేస్తూ కోట్లాది మంది భక్తులను కూడగట్టుకొన్నారు. తల్లిదండ్రులను అప్పా, అమ్మ అనని వారు ఎందరో ఉన్నా కోట్లాది మంది భక్తులు మఠంలో సిద్ధరామేశ్వర స్వామీజీని అప్పాజీగా సంబోధిస్తూ తల్లిదండ్రి, గురువు దైవం మీరేనని ప్రార్థిస్తున్నారు. ప్రతి అమావాస్య, పౌర్ణమి, సోమ, గురువారాల్లో ఇక్కడికి వేలాది మంది భక్తులు వచ్చి పూజలు చేస్తుంటారు. సిద్ధరామేశ్వర స్వామీజీ 2004లో లింగైక్యం చెందిన తర్వాత షడక్షరి శివయోగి డాక్టర్ మురుఘ రాజేంద్ర స్వామీజీ పీఠాధిపతిగా కొనసాగుతూ మఠంలో పలు సేవా, భక్తి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈయన కూడా తమ ఆదిగురువుల తరహాలోనే మహిమలను చూపుతూ భక్తులను ఆకట్టుకొంటున్నారు.

క్లుప్తంగా

పింజార్ నదాఫ్ కార్యవర్గం ఎంపిక


పదాధికారులను సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: నగరంలోని కన్నడ భవన్‌లో శనివారం రాష్ట్ర నదాఫ్ పింజార్ సంఘం జిల్లా పదాధికారులను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు సంఘం అధ్యక్షులు జీపీ నబీసాబ్ తెలిపారు. సమాజ అభివృద్ధి, ఐకమత్యంతో మంచి పనులను చేసేందుకు పాటు పడాలన్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కాసింబీ, ప్రధాన కార్యదర్శి అల్లా బకాష్, సహకార్యదర్శి టిప్పు, జిల్లా ప్రతినిధులు హెచ్‌ఈ దాదా ఖలందర్, నజీర్‌పాషా, షాషాబ్, మౌలాలి, గోపి, నూర్‌బాషా, అమీన, తబస్సుమ్, అస్మా నూర్, సమాజ ప్రముఖులు, పదాధికారులు సభ్యులు పాల్గొన్నారు.

మహిళపై యాసిడ్ దాడి నిందితులకు జైలు శిక్ష

హుబ్లీ: నగరంలో జరిగిన యాసిడ్ దాడి కేసులో ఇద్దరు నిందితులకు ఒకటో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు శుక్రవారం జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.10 లక్షల జరిమానా విధిస్తూ ఆదేశాలను వెల్లడించింది. వివరాలు.. 2013లో నిందితుడు అబ్దుల్ గని ఓ మహిళను ప్రేమించాడు. అయితే ఆ మహిళకు ఇతరులతో నిశ్చితార్థం జరిగిన నేపథ్యంలో తన స్నేహితుడు గుడాసాబ్‌తో కలిసి ఆ మహిళపై యాసిడ్ దాడి చేశాడు. దీనిపై కమరిపేట పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు. దర్యాప్తు చేపట్టిన అధికారి శివానంద చలవాది కోర్టులో చార్జిషీట్ సమర్పించారు. వాదోపవాదాలను ఆలకించిన సదరు కోర్టు న్యాయమూర్తి బీ.పరమేశ్వర ప్రసన్న నిందితులు అబ్దుల్ గని బాగవాళె, గుడాసాబ్ ముల్లాలకు పైమేరకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కాగా ఈ కేసులో ప్రభుత్వం తరపున న్యాయవాది గిరిజ తమ్మినాళ కేసు వాదించారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు


హొసపేటె: నగరంలో శనివారం ఎయిడ్స్‌పై అవగాహన జాతాను నిర్వహించారు. విజయనగర జిల్లా ప్రిన్సిపల్ సివిల్ మేజిస్ట్రేట్ బీ.కిషన్ జాతాను ప్రారంభించి మాట్లాడారు. దశాబ్దాలుగా వేధిస్తున్న హెచ్ఐవీ, ఎయిడ్స్ మహమ్మారి నిర్మూలనకు ప్రజలకు అవగాహన కల్పించడమే మార్గమన్నారు. ఆ దిశలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, వివిధ స్వచ్ఛంద సంస్థలు ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ ఎల్ ఆర్ శంకర్‌నాయక్, విజయనగర న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కేవీ బసవరాజు, జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ జంబయ్య పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి


జ్యోతి వెలిగిస్తున్న మంత్రి బోసురాజు

రాయచూరు రూరల్: నేడు ప్రతి ఒక్కరూ కళలు, కళాకారులను ప్రోత్సహించాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖా మంత్రి బోసురాజు పేర్కొన్నారు. శనివారం కన్నడ భవనంలో జ్ఞాన గంగా జూనియర్ కళాశాల, కన్నడ సంస్కృతి శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సామాజిక, విద్యా, సంగీత రంగానికి చేసిన సేవలు గుర్తించాలన్నారు. బలిష్ట సమాజ నిర్మాణానికి యువతకు స్వార్థం అడ్డు వస్తుందని, మానవుడు స్వార్థం విడనాడాలన్నారు. సమావేశంలో కిల్లే బృహన్మఠాధిపతి శాంత మల్ల శివాచార్య, అధికారులు సోమశేఖరప్ప, సుధ, అధ్యాపకులు బూదెప్ప, ప్రేమలత, బసవరాజ్, నరసప్ప, శ్రీనివాస్, సుధామలున్నారు.

గెస్ట్ లెక్చరర్లను పర్మినెంట్ చేయరూ..


వినతిపత్రం సమర్పిస్తున్న అధ్యాపకులు

రాయచూరు రూరల్: ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల అతిథి అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పీఎఫ్, జీపీఎఫ్, సేవా భద్రత కల్పించలేదన్నారు. రాష్ట్రంలో 14 ఇంజినీరింగ్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న 300 మంది అతిథి అధ్యాపకులకు న్యాయం చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో శివానంద, అర్చన, ప్రియాంకలున్నారు.

అధికారులూ.. బాధ్యతగా పని చేయండి

- ఏవైనా ఫిర్యాదులు వస్తే తగిన చర్యలు
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర సూచన


మాట్లాడుతున్న మంత్రి నాగేంద్ర, చిత్రంలో ఎమ్మెల్యేలు, అధికారులు

బళ్లారిటౌన్: జిల్లాలో అధికారులు బాధ్యతగా పని చేయాలని, ప్రజల నుంచి ఏవైనా ఫిర్యాదులు అందితే తగిన చర్యలు తప్పవని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్ర సూచించారు. శనివారం ఆయన నగరంలోని జెడ్పీ నజీర్ సభాంగణంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ప్రగతి పరిశీలన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఆయుష్ శాఖలో మందుల పంపిణీ, చికిత్సలపై ప్రజల నుంచి చాలా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆ శాఖ అధికారిని ప్రశ్నించారు. జిల్లాలో శిశు మరణాల శాతాన్ని తగ్గించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. భ్రూణ హత్యలను నియంత్రించాలన్నారు. అన్ని ఆస్పత్రుల్లో డబ్బులు తీసుకొని భ్రూణ పరీక్షలు జరుపుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.

రాత్రివేళల్లో వైద్యసిబ్బంది గైర్హాజరు

ఈ సందర్భంగా కంప్లి ఎమ్మెల్యే జేఎన్.గణేష్ మాట్లాడుతూ రాత్రి సమయంలో ఆస్పత్రుల్లో అత్యవసర సేవలు, కాన్పులకు సక్రమంగా వైద్యులు అందుబాటులో ఉంటడం లేదని, ఎమ్మెల్యేలు ఫోన్ కాల్ చేసినా స్వీకరించడం లేదని ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వైద్యాధికారుల తీరుపై మంత్రి మండిపడ్డారు. హరగినడోణి, జానెకుంటె, బెళగల్ తదితర గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సిరుగుప్ప ఎమ్మెల్యే బీఎం నాగరాజ్, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జెడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప సంకనూరు, ఎస్పీ రంజిత్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మంత్రికి వినతి

బళ్లారిఅర్బన్: అఖిల భారత మహిళా సాంస్కృతిక సంఘం(ఏఐఎంఎస్ఎస్) ఆధ్వర్యంలో మహిళల సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్రకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆ సంఘం నేతలు కలిసి మహిళల సమస్యల గురించి ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. విద్యార్థినుల్లో పౌష్టికాహార లోపం నివారణ, మధ్యాహ్న భోజన పథకాన్ని కళాశాలలకు విస్తరించాలని కోరారు. యువతులకు జూడో, కరాటే వంటి ఆత్మరక్షణ విద్యలను తప్పనిసరిగా బోధించాలని, యువతుల్లో శాస్త్రీయ, ప్రజాస్వామ్య మనోభావాలను రూపొందించే దిశలో తగు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

కళాశాలకు సొంత భవనం నిర్మించరూ

ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ మహిళా కళాశాలకు సొంత భవనం, ఇతర కనీస వసతులతో పాటు బస్సు సౌకర్యం కల్పించాలని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు సామూహిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, ఎక్కువ సంఖ్యలో మహిళలు ఉన్న చోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించాలని, ముఖ్యంగా సమాజంలో పెరుగుతున్న బాల్య వివాహాలను అరికట్టాలని మనవి చేశారు. ఈ సందర్భంగా ఏఐఎంఎస్ఎస్ పదాధికారులు మంజుల, కేఎం.ఈశ్వరి, విజయలక్ష్మి, పద్మ, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

కరువు నిధుల విడుదలలో కేంద్రం వివక్ష


భీమణ్ణ ఖండ్రేను సన్మానిస్తున్న ముఖ్యమంత్రి, స్వామీజీలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం సిద్ధరామయ్య

- బీదర్‌లో సీఎం సిద్ధరామయ్య వెల్లడి

రాయచూరు రూరల్: కేంద్రం కరువు పరిహార నిధుల విడుదలలో వివక్ష చూపుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించారు. ఆయన శనివారం బీదర్‌లో వీరశైవ లింగాయత మహాసభ ఏర్పాటు చేసిన భీమణ్ణ ఖండ్రే శతాబ్ది ఉత్సవ సంబరాలను ప్రారంభించి, లోకనాయక పుస్తకాన్ని విడుదల చేసి మాట్లాడారు, కేంద్ర ప్రభుత్వం కరువు నిధులు విడుదల చేసినా, చేయక పోయినా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతి రైతుకు ఎకరాకు రూ.2 వేలు చొప్పున తాము పరిహారం అందిస్తామన్నారు. ప్రతిపక్ష నేతలు ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం కన్నా కేంద్రం నుంచి రాష్ట్రానికి కరువు నిధులను విడుదల చేయించడంపై దృష్టి సారించాలన్నారు. బీదర్ కర్ణాటకలో కొనసాగేందుకు నాడు భీమణ్ణ ఖండ్రే చేసిన సేవలు అమోఘం అని అభిప్రాయపడ్డారు. వందేళ్లు పూర్తి చేసుకున్న మంత్రి ఈశ్వర్ ఖండ్రె తండ్రి, మాజీ మంత్రి భీమణ్ణ ఖండ్రే సమాజానికి, రాష్ట్రానికి అపార సేవలు అందించారన్నారు. గాంధీజీ అడుగు జాడల్లో నడిచి స్వాతంత్ర్య పోరాటంలో నడుం బిగించిన మహానుభావుడిగా అభివర్ణించారు. కార్యక్రమంలో శతమానోత్సవ సమితి అధ్యక్షుడు శ్యామనూరు శివశంకరప్ప, తరళబాళు శివమూర్తి మహాస్వామీజీ, సుత్తూరు శివరాత్రి దేశికేంద్ర స్వామి, శ్రీశైల పీఠాధిపతి జగద్గురు చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహా స్వామీజీ, న్యాయ శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్, అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే, విద్యుత్ శాఖ మంత్రి జార్జ్, భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్‌లున్నారు.

పంటల రక్షణలో చొరవపై హర్షం


మంత్రులను కలిసిన తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తంగౌడ

సాక్షి బళ్లారి: ఈఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మిరప, పత్తి, మొక్కజొన్న, వరి తదితర పంటలు ఎండిపోతుండగా కర్ణాటక కోటా ముగిసినా డ్యాం నుంచి నీరందించి రైతుల పంటలను కాపాడేందుకు ప్రయత్నించిన ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖా మంత్రి గుమ్మనూరు జయరాం, బళ్లారి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్రలకు తుంగభద్ర రైతు సంఘ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సంఘం అధ్యక్షుడు పురుషోత్తంగౌడ నేతృత్వంలో మంత్రులు జయరాం, నాగేంద్రలను కలిసి హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ ఆయకట్టు రైతులు తమ సమస్యలను వివరించారు. దామాషా ప్రకారం తుంగభద్ర డ్యాంలో ఉన్న నీటి నిల్వలో హెచ్ఎల్‌సీకి కర్ణాటక కోటా నవంబర్ 16న ముగిసినా 28 వరకు, ఎల్ఎల్‌సీకి డిసెంబర్ 1కి ముగిసినా ఆంధ్రా కోటా ప్రకారం 10 వరకు కాలువకు నీరు వదిలేందుకు అంగీకరించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

12న సిద్ధారూఢ సన్నిధిలో లక్ష దీపోత్సవం

హుబ్లీ: కార్తీకమాసం పురస్కరించుకుని సిద్ధారూఢ మఠంలో ఈనెల 12న లక్ష దీపోత్సవం నిర్వహించనున్నారు. కలఘటిగి తాలూకాలో తయారు చేసిన 70 వేలు, మఠంలోని 30 వేల మట్టి ప్రమిదలతో ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు మఠం ట్రస్ట్ కమిటీ చైర్మన్ బసవరాజ కళ్యాణశెట్టర్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు మఠం పాలన అధికారి, జిల్లా న్యాయమూర్తి కేజీ.శాంత ఈ ఉత్సవానికి శ్రీకారం చుడతారని తెలిపారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది భక్తులు దీపోత్సవంలో పాల్గొననున్నారని, దీని కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

9న గండి నరసింహ క్షేత్రంలో కార్తీక దీపోత్సవం

కంప్లి: సండూరు తాలూకా ధర్మాపురలోని గండి నరసింహ స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఈనెల 9న వైభవంగా దీపోత్సవం జరగనుంది. ప్రతి ఏటా మాదిరిగా జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పునీతులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

అలరించిన నాటక ప్రదర్శన

కంప్లి: గౌరమ్మ పండగ మరుసటి రోజు రామసాగర గ్రామంలో కొంతి రొట్టె పేరిట పండగ జరుపుతారు. ఈ పండగకు గ్రామస్తులు మిద్దెలపై వంటా వార్పు చేసి, స్నేహితులను, బంధువులను ఆహ్వానించి విందు ఆరగిస్తారు. ఇక అదే రాత్రి గ్రామంలో లాళగొండ వంశీకులతో వీరాభిమన్య బయలు నాటక ప్రదర్శన జరిగింది. భోజనాల అనంతరం అందరూ ఈ నాటకాన్ని తిలకించారు.

సదాశివ నివేదికను ఆమోదించాలి


మాట్లాడుతున్న మారెప్ప

రాయచూరు రూరల్: డిసెంబర్ 4 నుంచి బెళగావిలో జరిగే శీతా కాల అసెంబ్లీ సమావేశాల్లో జస్టిస్ సదాశివ కమిషన్‌ను ఆమోదించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మారెప్ప డిమాండ్ చేశారు. శనివారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2011లో ప్రభుత్వానికి న్యాయమూర్తి సదాశివ, అనంతరం కాంతరాజ్, నాగ మోహన్‌దాస్ నివేదికలను సమర్పించినా ఆమోదించి జారీ చేయలేదన్నారు. ఈ విషయంపై ఈనెల 11న బెళగావిలో జరిగే అసెంబ్లీ, 13, 14 తేదీల్లో న్యూఢిల్లీ జరిగే లోక్‌సభ సమావేశాల్లో ఆమోదించాలని కోరుతూ పెద్ద ఎత్తున సమావేశాలు చేపడుతున్నట్లు తెలిపారు.

దాడి నిందితులను పట్టుకోండి


జిల్లా ఎస్పీ యశోదకు వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

గంగావతి: ఓ దివ్యాంగుడైన వృద్ధుడిపై గుర్తు తెలియని దుండగులు గత నెల 25వ తేదీ రాత్రి మతపరమైన ఒత్తిడితో దాడి చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నగరంలోని మెహబూబ్ నగర్‌కు చెందిన హుస్సేన్ సాబ్ అనే దివ్యాంగ వృద్ధుడిని పలువురు దుండగులు ద్విచక్ర వాహనాలపై రైల్వే గేట్ వద్దకు తీసుకెళ్లి జై శ్రీరామ్ అని పలకాలని ఒత్తిడి చేసి దాడి చేసినట్లు పలు సంఘాలు ఆరోపించాయి. ఈ ఘటనలో దుండగులను తక్షణం బంధించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా ధర్నా చేశారు. దుండగులను బంధించని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని రెండు పార్టీల నేతలు హెచ్చరించారు. సీపీఎం తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నిరుపాది, బాలప్ప హులిహైదర్ తదితరులు నేతృత్వం వహించగా, సీపీఐ తరఫున బసవంత శీలవంతర, గఫార్, ఏ.హులుగప్ప తదితరులు నేతృత్వం వహించారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం


కరాటే విద్యను ప్రదర్శిస్తున్న చిన్నారులు

బళ్లారిఅర్బన్: కరాటే పోటీలు ప్రతి ఒక్కరికి ఆత్మరక్షణకు అవసరమని చైతన్య కళాశాల చైర్మన్ రాధాకృష్ణ పేర్కొన్నారు. శనివారం వాల్మీకి భవనంలో కరాటే ఫెస్ట్-2023 పేరిట ఏర్పాటు చేసిన 4వ నేషనల్ ఇన్విటేషనల్ కరాటే ఛాంపియన్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలోనే కరాటే శిక్షణ పొందాలన్నారు. కరాటే ఆత్మరక్షణతో పాటు దృఢసంకల్పానికి, ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం అన్నారు. ఆడపిల్లలకు ఆ కరాటే శిక్షణ అత్యవసరమన్నారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని పెంపొందించేందుకు కరాటే పోటీలు స్ఫూర్తినిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ డీఎల్.రమేష్ గోపాల్, మాజీ కార్పొరేటర్ గాజుల శ్రీనివాసులు, పంచాక్షరి మార్షల్ ఆర్ట్స్ ట్రస్ట్ కరాటే మాస్టర్, లాయర్ బంద్రాళ్ ఎం.మృత్యుంజయ స్వామి, జేకే డెవలపర్స్ జీకే స్వామి(విజ్జి), వీవీ సంఘం హెచ్.ఎం.కిరణ్, శబరి రవిచంద్రన్, విక్రమ్ మహిపాల్, కరాటే మాస్టర్లు అన్నప్ప మార్కన్ హుబ్బళ్లి, కృష్ణగోకులే గుల్బర్గా, కరాటే విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య


సురేష్(ఫైల్)

చెళ్లకెరె రూరల్: అప్పుల బాధతో ప్రముఖ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలో జరిగింది. ఎంఆర్ఎఫ్ టైర్స్ షోరూం యజమాని సురేష్(50) బళ్లారి రోడ్డులోని శ్మశాన వాటికలో తన తల్లిదండ్రుల సమాధి వద్ద విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అనేక వ్యాపారాల్లో పేరొందిన సురేష్ ఆధ్యాత్మికంగా దైవ భక్తుడు. విషయం తెలుసుకున్న నగర ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఘటనా స్థలానికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ దేశాయి, సబ్ ఇన్‌స్పెక్టర్ శివరాజ్ వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

కుస్తీ పోటీల్లో కాంస్య పతకాలు


తాము సాధించిన పతకాలతో విద్యార్థులు

బళ్లారిఅర్బన్: దక్షిణ, పశ్చిమ జోనల్ విశ్వవిద్యాలయాల పురుష, మహిళా కుస్తీ పోటీల్లో బళ్లారి విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం(వీఎస్కేయూ) కుస్తీయోధులు కాంస్య పతకాలు సాధించారు. పురుషులకు, మహిళలకు రెజ్లింగ్ టోర్నమెంట్, గ్రీకో-రోమన్ 87 కేజీల పోటీల్లో యూనివర్సిటీ తరపున ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకాన్ని సాధించి యూనివర్సిటీకి మరింత కీర్తిని గడించారు. క్రీడాకారులను టీమ్ మేనేజర్ డాక్టర్ ఎంఎస్ కవిత, కోచ్ మల్లికార్జున తదితరులు అభినందించారు.

షాపింగ్ కాంప్లెక్స్‌లో ఘోర అగ్నిప్రమాదం


దుకాణాలకు నిప్పంటుకుని ఎగసిన మంటలు


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

- జ్యువెలర్స్, బట్టల దుకాణాలు బుగ్గి
- రూ.కోటికి పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా

గంగావతి: నగరంలోని గణేష్ సర్కిల్ వద్ద సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో పలు దుకాణాలు కాలిబూడిదైన ఘటన శుక్రవారం అర్ధ రాత్రి జరిగింది. కేజీపీ జ్యువెలర్స్, బట్టల షాపులకు ఆకస్మికంగా నిప్పంటుకొని భారీ స్థాయిలో బంగారు, పట్టుబీరలు, ఇతర బట్టలు 6 గంటల పాటు కాలిపోయి దాదాపు రూ.కోటికి పైగా నష్టం వాటిల్లింది. ఈ షాపులకు అంటుకొన్న మంటలు ఉవ్వెత్తున ఎగసిపడగా అగ్నిమాపక దళం వారు రంగప్రవేశం చేసి సుమారు 6 గంటల పాటు శ్రమించి ఎట్టకేలకు మంటలను ఆర్పివేశారు. దీంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. షాపు యజమాని గణేష్ తీవ్ర శోకంలో మునిగి పోయారు. ఘటనపై టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం


మాట్లాడుతున్న జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా


మహిళల పరుగు పందెం పోటీల్లో పాల్గొన్న మహిళా పోలీసులు


పురుషుల పరుగు పందెం పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

- విధుల్లో క్రియాశీలకంగా పాల్గొనవచ్చు
- జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి అర్బన్: క్రీడలతో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం సాధ్యమని, ఒత్తిడి దూరమవుతుందని జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. ఆయన జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం డీఏఆర్ పోలీస్ మైదానంలో ఏర్పాటు చేసిన పోలీస్ వార్షిక క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల సమన్వయ మనస్తత్వం అలవడుతుందన్నారు. తద్వారా ప్రతి రోజు క్రియాశీలకంగా విధి నిర్వహణలో పాల్గొనడానికి వీలవుతుందన్నారు. ఈనేపథ్యంలో ప్రతిఒక్కరూ క్రీడల్లో తప్పకుండా పాల్గొనాలని పోలీస్ సిబ్బందికి పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ విధుల నిర్వహణతో ఒత్తిడికి గురవుతుంటామన్నారు. ఈ నేపథ్యంలో ఒక రోజును క్రీడా పోటీలకు కేటాయించడం వల్ల మనోల్లాసం పెరుగుతుందన్నారు. అందువల్ల స్వేచ్ఛగా క్రీడల్లో పాల్గొంటే ఒత్తిళ్ల నుంచి ఊరట లభిస్తుందన్నారు. ఏడాది ఒక్కసారి బదులుగా నెలకు ఒక్కసారి క్రీడా పోటీల్లో పాల్గొంటే క్రీడలపై ఆసక్తి పెంపొంది, క్రీడా స్ఫూర్తి అలవడుతుందన్నారు. జెడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప మాట్లాడుతూ క్రీడలు అనగానే చిన్నప్పటి జ్ఞాపకాలు గుర్తుకొస్తాయన్నారు. క్రీడా మనోభావంతో ఆడాలన్నారు. క్రీడలను పోటీ తత్వంతో స్వీకరిస్తే గెలుపు ఓటములను సమానంగా చూడవచ్చనన్నారు.

విజేతల వివరాలివే

మహిళల 100 మీటర్ల పరుగు పందెంలో పవిత్ర ప్రథమ స్థానం, బసవజ్యోతి ద్వితీయ స్థానం, విద్యాభారతి తృతీయ స్థానం పొందారు. పురుషుల 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం ఎస్ఐ కాళింగప్ప, ద్వితీయ స్థానం విఠల పూజారి, తృతీయ స్థానం రేవణ సిద్దప్ప సాధించారు. పురుషుల 200 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ప్రథమ స్థానం కృష్ణనాయక్, ద్వితీయ స్థానం ఎర్రిస్వామి, తృతీయ స్థానం నెణికప్ప సాధించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, ఏఎస్పీ రవికుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.